
శ్రీవారి చరణ సన్నిధి

(రెండవ భాగం)



బ్రహ్మాండం వసుంధర




వసుంధర తల్లి శ్రీమతి వెంకాయమ్మ

తండ్రి శ్రీ కోన వెంకట సుబ్బారావు

శ్రీవారి చరణ సన్నిధి

(రెండవ భాగము)



రచన :

బ్రహ్మాండం వసుంధర

ఫోన్ : 08643-227312

ప్రచురణలు

శ్రీమాత ప్రచురణలు

జిల్లెళ్ళమూడి - 522 113.

గుంటూరుజిల్లా.

SRIVARI CHARANA SANNIDHI - II
By Brahmandam Vasundhara

First Edition October 2012
Vijaya Dasimi
Second Edition Feb, 2016

For Copies :
SREE VISWAJANANI PARISHAT
JILLELLAMUDI 522113
Bapatla Mandal, Guntur Dist.,
Ph : 08643 227492



అంకితం

శ్రీ చరణదాసి జీవితం మాతృశ్రీ సేవకే అంకితం
'శ్రీవారి చరణ సన్నిధి' రెండవ భాగము
మా శ్రీవారికే అంకితం

Price : Rs. 50/-

Printed at :
Lakshmi Ganapathi Art Printers
2/4 Brodipet, Guntur-522 002.
Ph : 2235036.



His Holiness - Jagadguru
SRI SIDDHESWARANANDA BHARATISWAMY
Siddheswari Peethadhipati - Courtallam

Mounaswamy Mutt,
Courtallam - 627 802
(Via Tenkasi),
Thirunelveli (Dt.)
TAMILNADU
Ph:04633-283707

పరమహంస, పరివ్రాజకాచార్య, జగద్గురు
శ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి
సిద్ధేశ్వరీ పీఠాధిపతి - కుర్తాళం

Camp Office :
B1-C40,
Kaalipeetham Street,
4th Line,
Ravindra Nagar,
GUNTUR-522 006
Ph : 0862-2231625
2256666

ఆశీర్వాద శ్రీముఖము

'న స్త్రీ పుమాన్ నో తవ సత్యదేహం
వ్యోమైవ లోకేశ్వరి! కల్పనీయం '

పరమేశ్వరి తత్వాన్ని వర్ణిస్తూ "అమ్మా! నీవు స్త్రీవికావు. పురుషుడవు కావు. చిద్గగన దేహం నీది" అన్నారు ఋషులు. అందరూ మాతృశ్రీ అనసూయాదేవిని కాంతగా భావిస్తుంటే సౌ॥ వసుంధర శ్రీవారుగా భావించింది. అమ్మతో ఏర్పడిన దివ్యప్రేమానుబంధం ఆమె భావోద్యానంలో మల్లికా చంపకాది సుగంధసుమాలను ఉదయింపచేసింది. అవే ఈ గ్రంథంలోని వివిధ విభాగాలు.

అమ్మకు సంబంధించి ఎన్నో గ్రంథాలు వచ్చినవి. వస్తున్నవి. రచయితలు కానివారు రచయితలైనారు. కవులు కానివారు కవులైనారు. దివ్యచైతన్యావతరణ ఒక చిన్న కిరణరూపంలోనైనా ఎవరి హృదయంలోకి వస్తే వారు ఏమైనా అవుతారు. చిత్రమేమిటంటే ప్రతి రచనలోను ఏదో కొంత కొత్తదనం కనిపిస్తూనే ఉంది. నిజమే ఎవరి అనుభూతి వారిది. అంతేకాదు. ఇతరుల అనుభవాలలో కూడా ఎవరి విశ్లేషణ వారిది. ఇంతకూ ఈ గ్రంథం చదవటం మొదలు పెడితే విడవకుండా చదివిస్తుంది. అమ్మజీవితము బోధలు - వీటిని గూర్చి కొత్త కోణంలోకి మన దృష్టిని తీసుకెళుతుంది. వీటికి మూలమైన హృదాకాశ చిదాదిత్య తేజోలహరి అర్కపురి అంబికను స్మరించిన వారందరికి ప్రాప్తించును గాక! రచయిత్రి వసుంధరా యోగినికి అభీష్ట సిద్ధి లభించుగాక!

నారాయణ స్మరణతో

సిద్ధేశ్వరానంద భారతీస్వామి

క్యాంప్ : వారణాసి
గణేశ చతుర్థి 19-9-12

వసుంధరక్కయ్య

శ్రీవారిచరణసన్నిధి - రెండవభాగం

శ్రీ బ్రహ్మాండం రవీంద్రరావు



వసుంధర అక్కయ్య కలం నుండి జాలు వారిన మరో దృశ్య కావ్యం అనిపిస్తుందీ గ్రంథం. అమ్మ సేవ చేస్తూ అక్కడ జరిగే కార్యక్రమాలకు ప్రత్యక్ష సాక్షిగా ఉండేది. అక్కడ జరిగే సంభాషణలను, సంఘటనలను నిత్యం యదాతథంగా ఒక డైరీలో వ్రాసేది. "శ్రీవారి చరణసన్నిధి మొదటిభాగంలో అమ్మతో తన బంధాన్నీ, అనుబంధాన్నీ, తన తల్లిదండ్రుల పట్ల, సోదరీసోదరుల పట్ల అమ్మ అందించిన ఆదరాణాభిమానాల్ని సులభశైలిలో అందించింది.

గడచిన నాలుగు దశాబ్దాల కాలంలో జరిగిన విశేషాలను భావితరాలకు అందించే పరమ పవిత్రమైన కార్యక్రమం చేపట్టింది. లక్షలాది మందికి అమ్మ అందించిన ఆదరణకు వసుంధర అక్కయ్య ఒక ఉపకరణంగా తోడుపడ్డది. అందుకే ఈనాటికీ ఎంతమందికో ఆదరణీయురాలైంది.

ఆనాటి సంఘటనలను మన కళ్ళ ముందుంచి మనందరి హృదయాలలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పదిలపరచుకున్నది వసుంధరక్కయ్య.



చెప్పదగిన కొన్ని సంగతులు

డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావు

ప్రభువుకు బంధువు కావడమే ఒక హోదా. మిగతాహోదాలు ఎన్ని ఉన్నప్పటికీ ప్రభుబాంధవ్యానికి ఉండే ప్రత్యేకతకు ఒక ప్రత్యేకత ఉండనే ఉంటుంది. నాకు అలాంటి ప్రత్యేకత ఒకటి ఉంది. అది వసుంధరవల్ల లభించింది. మా పినతండ్రి దౌహిత్రి అంటే నాకు మేన కోడలు. ప్రత్యేకత అందువల్ల మాత్రమే రాలేదు. ఆమె మనం ఆరాధించుకొనే అమ్మకు జీవితాన్ని అర్పించుకొన్నది. అమ్మకు అత్యంత సన్నిహితంగా దీర్ఘకాలం గడపగలిగిన అదృష్టవంతురాలు ఆమె. అలా నాకు ఒక ప్రత్యేకత కలిగించింది. అమ్మకూడా ఈవాస్తవాన్ని గుర్తించినదని అనుభవజన్యవిశ్వాసం. హైమ కూడా ఒకప్పుడు వసుంధరతో అక్కయ్యా ! నీవు అమ్మకు దగ్గరగా ఉంటావు, అమ్మకబుర్లు చెప్పవూ! అని పదే పదే అడిగేదట. అది అమ్మ హైమకు దైవత్వాన్ని ఇవ్వకపూర్వం సంగతి. ఇక్కడ నా ప్రత్యేకత గురించి ఎందుకు ప్రస్తవిస్తున్నానంటే నేను ఈ పుస్తకం గురించి అభిప్రాయం వ్రాస్తున్నాను కాబట్టి, వ్రాయదగిన వాడినే అని ఆంతర్యం.


వసుంధరకు అమ్మను గురించి నా లాంటి వాళ్ళు చాలామందికి తెలిసే అవకాశంలేని చాలా విషయాలు తెలిసి ఉంటాయి. బహుశా అందులో కొన్నింటినే వసుంధర చెప్పుతుండవచ్చు.

"శ్రీవారి చరణసన్నిధి" మొదటి భాగంలోగాని, ఇప్పుడు మీ చేతులలో ఉన్న రెండవభాగంలోగాని కేంద్రబిందువు అమ్మే. 'వసుంధర తనను గురించిగాని, తన సాహిత్యాన్ని గురించిగాని అతిగా చెప్పకుండా, అమ్మను సాధకులు మరింతగా అర్థం చేసుకునేరీతిలో వ్రాయటమే ఈరచన ప్రత్యేకత. వసుంధర వ్రాసిన కొన్ని సంఘటనలను చదువుతున్నప్పుడు మనకు అక్కడక్కడ ప్రత్యక్షంగా ఉన్న అనుభూతి కలుగుతుంది. అలాంటి అనుభూతి ఇచ్చే ఆనందానికి వెలకట్టలేము. చదివి ఆనందించి అనుభవించవలసిందే.

కొన్ని సంఘటనలు అమ్మతత్వాన్ని అవగాహన చేసుకొనడానికి ఉపయోగిస్తాయి. పాప పుణ్యాలను నిర్వచించడానికి అమ్మ ఏలాంటి సందర్భాలను ఎలా ఉపయోగించుకొనేదో గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. వేదాంతాన్ని గురించిగాని, భక్తి గురించిగాని పెద్దగా అవగాహనలేని ఒక సుబ్బమ్మకు అమ్మ చెప్పిన ఒక నిర్వచనంచూడండి. సుబ్బమ్మ అప్పుడు అమ్మ పాదాలు పిసుకుతున్నది. ఆమెతో అమ్మ అంటుంది " పిసుకుతున్నావుగా పాదాలన వాటినే కొట్టు - వాటినే పిసుకు- దేనివల్లనైతే పుణ్యం వస్తుందో దానివల్లనే పాపం...".

అమ్మ చెప్పిన నిర్వచనాన్ని అమ్మతో సంభాషణలలో ఒక స్వామీజీ చెప్పిన వాక్యంతో పోల్చి చూడండి. సామ్మీజీ "శాస్త్రరీత్యా మంచిపనులు చెడ్డపనులు అనేవి ఇది ధర్మం ఇది అధర్మం అని చెప్పేది ఉన్నవి కదా!. ఈ ద్వంద్వమూ పాపపుణ్యాలూ అన్నారు, అమ్మ తక్షణం చేసిన వ్యాఖ్య ఇది. ఇవి నిర్వచనాలు కావు. సందేహాలుకాని సందేశాలు కావు. పూర్తినిర్వచనాలు కాదు. ఇలాంటి వెన్నో ఈ పుస్తకంలో తారసపడతాయి. అమ్మతో బాల్యంనుంచి ఎందరో పారమార్థిక విషయాలను చర్చించారు. వసుంధర అమ్మదగ్గరైన తరువాత చాలా సంభాషణలను విన్నది. కొందరు అమ్మతో వాదించడానికి ప్రయత్నించి పల్టీలు కొట్టిన సందర్భాలున్నాయి. వసుంధర అలాంటి కొన్నిటికి ప్రత్యక్షసాక్షి. పల్టీలు కొడుతున్నామని తెలియకుండానే పల్టీలు కొట్టిన వారున్నారు. పాపం శమించుగాక. అలాంటివారిలో నాన్నగారు కూడా ఉన్నారు. పుస్తకం చదువుతుంటే ఇలా ఎన్నో విశేషాలు మనకు తెలుస్తాయి.

అమ్మ వసుంధరచేత మరెప్పుడు ఎన్నివిశేషాలు చెప్పిస్తుందో అని ఆశ కలిగింది నామటుకు నాకు ఇందులో కొంత చదువగానే--





ఇల్లాలి ముచ్చట్లు

శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

"తే స్వాదు సఖ్యం స్వాద్వీ ప్రణీతిః" అని వేద దర్శనం పొందిన మహర్షుల మాట. భగవంతుడితో స్నేహం, ప్రణయం మధురంగా, ఆస్వాదయోగ్యంగా ఉంటాయని ఆ మహర్షులు పొందిన అనుభవం ఆ మాటలో కనిపిస్తుంది.

ఆ దైవమే ఈ 'అమ్మగా' దిగివచ్చిందో, 'అమ్మే' తన కల్యాణ గుణవైభవం వల్ల దైవంగా దర్శనమిస్తోందో మనకు తెలియదు. కాని, అమ్మ సన్నిధిలో పరమప్రశాంతత, అనిర్వచనీయమైన ఆనందం, గుండె బరువంతా దిగిపోయి తేలికపడిన అనుభూతి 'అమ్మ' ను దర్శించిన వారందరికీ ప్రత్యక్షానుభవమే. జిల్లెళ్ళమూడి వచ్చి 'అమ్మ' సన్నిధిలో ఏ కొద్ది నిమిషాలో గడిపిన వారికే ఇంతటి ఆనందం సొంతమైతే, సర్వస్వాన్నీ అమ్మకే సమర్పించి, అమ్మచరణ సన్నిధిలో జీవితమంతా గడిపిన వారికి అంతులేని ఆనందం, అవధులు లేని ఆధ్యాత్మిక పరిజ్ఞానం కలగడంలో ఆశ్చర్యమేమున్నది? అమ్మను 'పురుషోత్తముడి' గా దర్శించి, అమ్మ అనురాగానికి పాత్రురాలై, అమ్మనే వరుడుగా పొందిన భాగ్యశాలిని శ్రీమతి బ్రహ్మాండం వసుంధర అక్కయ్య. అసలు 'బ్రహ్మాండం' 'వసుంధర' అనే పేర్లు వింటేనే చిత్రమైన అనుభూతి కలుగుతుంది ఎవరికైనా. 'వసుంధర'– 'బ్రహ్మాండం' లో అంతర్భాగమే కదా!

'అమ్మకు ఇల్లాలై 'ఆత్మనివేదనం' చేసుకున్న వసుంధర అక్కయ్య అమ్మసన్నిధికి వచ్చే అతిథులను అభ్యాగతులను, ఆదరిస్తూ అన్నయ్యలకు అక్కయ్యలకు ఆత్మీయురాలైంది. 'అందరింటి గృహస్థు' అయిన అమ్మకు. అర్ధాంగిగా, ఇల్లాలి బాధ్యతలసు నిర్వర్తించడంలో కృతకృత్యురాలైంది. ఇటు సోదరీ సోదరుల అభిమానాన్ని, అటు 'అమ్మ' అనురాగాన్ని చూరగొన్నది. 'అమ్మకు' 'తలలోనాలుక' కాగలిగింది. ఆ నాలుక మాటలాడితే, ఆ మాటలు రచనగా రూపు దిద్దుకుంటే, ఆ రచనలో ఏమని ఉంటుంది? అమ్మ తలలోని తలపులు, అంటే అమ్మ తత్త్వమే కదా! అలా అమ్మతత్త్వం లోని అమృతతత్వాన్ని తనలో నింపుకుని వెలువడిన రచన

'శ్రీవారి చరణ సన్నిధి'. 'శ్రీవారి శ్రీచరణాల' మ్రోల అంకిత భక్తురాలు పొందిన అనుభూతులు కోకొల్లలుగా ఉంటాయి కదా! ఇదిగో, ఇప్పుడు ఆ అనుభూతుల వెల్లువలో 'రెండవ భాగం' మనను పునీతులను చేయడానికి అక్షర రూపంలో ఇలా అవతరిస్తుంది.

భర్తను దైవంగా భావించి ఆరాధిస్తుంది భారతీయ గృహిణి. దైవాన్నే భర్తగా పొంది ఆరాధించిన ఇల్లాలు వసుంధర అక్కయ్య. భర్తను ఆరాధించే ఇల్లాలు ఏం చేస్తుంది? భర్త ప్రతి కదలికనూ అర్థం చేసుకుంటుంది. భర్త చేసే ప్రతి పనినీ అందిపుచ్చుకుంటుంది. భర్తనోట వెలువడే ప్రతి మాటనూ ఒక మహామంత్రంగా స్వీకరిస్తుంది. చెక్కు చెదరని నమ్మకంతో, అవగాహనతో భర్తను అనుసరిస్తుంది. అంతటి మహోన్నత మూర్తి తనకు భర్తగా లభించినందుకు మురిసిపోతుంది. తన పతిదేవుని మహనీయతను పది మందికీ వెల్లడిస్తుంది. ఆ పారవశ్యం పలుకులుగా మారితే, ఆ "ఇల్లాలి ముచ్చట్లు" 'శ్రీ వారి చరణ సన్నిధిగా' వెలువడుతాయి. ఆ సన్నిధే ఒక పెన్నిధిగా మారి, అమ్మ అశేష సంతానానికి ఆలోచనామృతమై, మార్గదర్శక సూత్రమై, వెలుగుదారి చూపుతుంది.

అలాంటి దివ్యగ్రంథాన్ని మనకు అందిస్తున్న అక్కయ్య ఋణం ఎలా తీర్చుకోగలం ?

ఆ గ్రంథాన్ని భక్తితో అధ్యయనం చేయడం ఒక్కటే మనం చేయగలిగింది. ఆ అక్షరాలలో నుంచి అవతరిస్తున్న "మాతృకావర్ణరూపిణి" అయిన అమ్మకు అంజలి ఘటిస్తూ....





దయామణి

- శ్రీ పి.యస్.ఆర్.ఆంజనేయప్రసాద్

జిల్లెళ్ళమూడి అమ్మ అందరింటిని ఏర్పాటు చేసింది. అందులో అన్నపూర్ణాలయాన్ని నెలకొల్పింది. అమ్మవద్దకు వచ్చిన ఎవరైనా అమ్మ ఆప్యాయతకు వాత్సల్యానికి లొంగిపోయేవారు. అన్నపూర్ణాలయంలో ఆదరంగా, ఆప్యాయంగా వచ్చినవారికి ప్రేమతో పలకరింపులతో అన్నం పెట్టాలని అమ్మ కోరుకునేది. ఏం పెట్టారని కాదు పచ్చడి, చారు వేసి పెట్టినా ఆ ఆదరణలో తృప్తి ఉండేది. జీవితంలో ఆనాటి రోజులు ఎవరూ మరచిపోయేవారు కాదు.

ఈనాడూ అన్నపూర్ణాలయం ఉన్నది. అప్పటికన్నా కొన్ని వందల వేల మంది తింటున్నారు. ఆదరణ, ఆప్యాయత ప్రేమలతో ఎంతమంది పెడుతున్నారు? ఇప్పటికీ అలా కనుక్కుని పెట్టేవారు లేకపోలేదు. వారిలో ప్రధానంగా వసుంధర బ్రహ్మాండం శేషులు నాకు కనిపిస్తున్నారు. అమ్మదగ్గర అంతగా తర్ఫీదు పొందారనుకుంటాను. దయామణి అని పేరు వసుంధరకు ఎందుకు వచ్చింది? అమ్మంత దయామణి ఎవరైనా ఉన్నారా ? భర్త భావం తెలుసుకొని ప్రవర్తించేది భార్య అన్నది అమ్మ. యధోక్తంగా వసుంధరను వివాహం చేసుకున్నది అమ్మ. అదేంటండీ ఆడవాళ్ళను ఆడవాళ్ళు వివాహం చేసుకుంటారా? అంటే అమ్మ నాకన్నా పురుషుడెవరురా? అన్నది. పురుషుడు అంటే శరీరమనే పురంలో నివసించేవాడు. అమ్మ అందరి శరీరాలలో నివసించే ఆత్మస్వరూపం కదా! ఆమెకాక పురుషుడెవరున్నారు. మిగతా వారిది పేరుకు పురుషతత్వం తప్ప. అమ్మ పరమ పురుషుడు.

అమ్మ భావం తెలుసుకొని ప్రవర్తించింది వసుంధర. అందుకే తనలో సగభాగమయిన వసుంధరను దయామణి అని అన్నదేమో! వసుంధర అమ్మగదిలో ఉండి అందరినీ ఆదరించేది. కాఫీలు, టిఫిన్లు, భోజనాలు అమ్మ కనుసైగలతో అమర్చేది. చేసేపని ఒక బాధ్యత ధర్మము అని గాక ప్రేమతో చేసేది.

వసుంధర అంటే భూమి అని అర్థం. భూదేవిలాగా సహనమూర్తియా వసుంధర? అమ్మను భూదేవిగా ఆరాధించాం. అమ్మ సహజసహనమూర్తి. ఆమెలో ఏదో కొంత అంశలేకపోతే అమ్మకు అర్థాంగి కాగలిగేది కాదుగా. వసువు అంటే బంగారం. బంగారాన్నిధరించేది వసుంధర. భూమిలో బంగారం ఉంటుంది

గనుక భూమిని వసుంధర అన్నారు. వసుంధర బంగారం లాంటి గుణం కలది కనుకనే ఆ దయామణిని అమ్మ ధరించింది. ఇక గ్రంథంలోకి వెళ్తే దయామయి అయిన అమ్మ చర్యలు ఎంత విచిత్రంగానూ, వినోదంగానూ, ఆశ్చర్యంగాను, ఆకర్షణీయంగానూ, ఆధ్యాత్మిక భావబంధురమై ఉంటాయో - కాన్వెంటువారు నివేదన తెస్తే దొడ్లోకి తీసుకెళ్ళి కాకులకు పెట్టి రండి అన్నది. నేతితో గారెలు చేయించి శ్రద్ధగా గారెలను ముక్కలు చేసి ఒక్కొక్క ముక్క ఎగురవేసింది. గాలిలో ఎగిరే గారెముక్కలను ఎగిరెగరి క్రిందపడకుండా కాకులు అందుకుంటుంటే అమ్మ ఎంతగా కేరింతలు కొట్టిందో. తల్లీబిడ్డల అనుబంధం అలాంటిది. అమ్మకు మనుషులేకాదు పశుపక్ష్యాదులు సృష్టి మొత్తం తనదే తానే అనే భావన నిరంతరం జాగృతమై ఉండటం తెలిపే సన్నివేశాలెన్నో ఈ గ్రంథంలో కనిపిస్తాయి.

ఊళ్ళో కొన్ని కుక్కలకు పిచ్చి ఎక్కిందని ఊళ్ళో జనం వాటి తలలపై కొట్టి ఊరికి దూరంగా పారేశారు. అందులో రెండు కుక్కలు స్పృహవచ్చి బాధతో పరుగెత్తుకొని వచ్చి అమ్మ మజ్జిగ చిలుకుతుంటే క్రిందపడ్డ మజ్జిగ చుక్కలు నాకి తేరుకుని ఒకటి అమ్మ పాదాలపై వ్రాలి ప్రాణాలు విడిచింది. మరొకటి అమ్మను ప్రాణప్రదంగా ప్రేమించింది. అమ్మకు కష్టం కలిగించటానికి వచ్చినవారి అంతుచూచేది. అమ్మ వద్దకు వచ్చే వారికి 7వ మైలు నుండి ఊళ్ళోకి దారి చూపించేది. మళ్ళీ తిరిగి వెళ్ళేటపుడు 7వ మైలు రాయి వరకూ దించి వచ్చేది. ఆ కుక్క అవసానదశలో ఉంటే అమ్మవర్షంలో బురదలో దాని దగ్గరకు వెళ్ళి పాలలో తులసీదళాలు వేయించి ఆప్యాయంగా నిమిరి దాని మూతి తుడిచి వళ్ళు తుడిచి శుభ్రం చేసింది. అంతటి దయామయి అమ్మ ఈ సన్నివేశాలు చూస్తుంటే ధూర్జటి వ్రాసిన కాళహస్తీశ్వర శతకంలోని

ఏ వేదంబు పఠించె లూత, భుజగం బే శాస్త్రముల్ చూసె తా
నే విద్యాభ్యాసనం బొనర్చెకరి, చెంచేమంత్రమూహించె బో
ధావిర్భావనిధానముల్ చదువు లయ్యా కావు నీ పాద సం
సేవాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!

అన్న పద్యం జ్ఞాపకానికి వచ్చింది. నిజమే అమ్మదయకు ఎవరైనా అర్హులే. అందుకే అమ్మ ఆవరణలో ఉన్న కుక్కకూ మీకూ తేడా లేదు అన్నది. వాటిలో కూడా సేవాసక్తి ఉన్నది. వివేచనాశక్తి ఉన్నది. జ్ఞానం ఉన్నది అన్నది అమ్మ.

"దేహబుద్ధ్యా భవద్దాసః జీవబుద్ధ్యా త్వదంశకః
ఆత్మబుధ్యా త్వమేవాహం ఇతిమే నిశ్చితామతిః" అని పెద్దలు చెప్పిన

మాటల ప్రకారం అమ్మ అనుగ్రహం పొందిన వారెందరో ఉన్నారు.

ఒకసారి ప్రభుదత్తబ్రహ్మచారిగారు, నాదయోగి రఘువరదాస్‌గారు అమ్మవద్దకు వచ్చారు. అమ్మను బ్రహ్మచారిగారు జగన్నాథం వెళ్దామా? అని అడిగారు. అంతా అదే అయినప్పుడు ప్రత్యేకంగా వెళ్ళేదేమున్నది? అన్నది. బృందావనం వెళ్దామా? అన్నారు. అమ్మ వినీవిననట్లు ఊరుకొని బ్రహ్మచారిగారు తెచ్చిన జీపు ఎక్కి కూర్చొని ఓంకారనదివైపు జీపును తీసుకొనివెళ్ళి అక్కడ ఆవులను, గేదెలను కాస్తున్న పశుల కాపరులను చూపించి 'బృందావనం వచ్చాం నాన్నా!" అన్నది. బ్రహ్మచారికి రఘువరదాసు గారికి స్వీట్లు నోట్లో పెట్టి ఓంకారనదిలో మూడుసార్లు వేసింది. ఇలా బృందావనాన్ని కళ్ళకు కట్టించింది అమ్మ.

ఈలా ఈ గ్రంథంలోని ప్రతి సన్నివేశమూ మనకళ్ళముందు జరుగుతున్నట్లే చేయగలిగిన వసుంధర రచన అందరిచే చదివింప చేస్తుంది. దర్శింపచేస్తుంది. ఇదీ ఈ రచనలలోని ప్రత్యేకత. అమ్మ తనను సుఖపెట్టిన వారెవరూ లేరన్నది. అమ్మ సౌకర్యంగా హాయిగా వుండాలాని ఆశించిన వారెందరో అమ్మ చిన్నతనం నుండి దేవాలయంలో చేరేదాకా సేవ చేసిన వారున్నారు. అందులో 1960 తర్వాత రామకృష్ణ, వసుంధరలది ప్రత్యేకమైన స్థానమే. తనను కన్నవారికి గాని, తాను కన్నవారిని గాని ఎవరినీ అమ్మ చూడకుండా ఉండలేదు.

గోదాదేవి రంగనాధునకు తిరుప్పావై సమర్పించింది. ధనుర్మాసంలో నెలరోజులు రోజుకొక్క పాశురాన్ని (కీర్తన) సమర్పించింది. గోదాదేవి భూదేవి అవతారమని అంటారు. ఇక వసుంధర అంటే భూదేవియే కదా! వసుంధర కూడా ఈ కవితలతో, వ్యాసాలతో అమ్మను సేవించింది. అమ్మ తనను ధరించింది. అమ్మను తాను ధరించింది. అమ్మకు తానే పూమాలయై, శ్రీ భూహేలలయై, రుక్మిణీ బాలయై శ్రీవారిపాదసన్నిధిలో కైంకర్యం చేసింది. ఆరాధించింది.

ఈ గ్రంథం మొదట చివర వసుంధర అమ్మకు పెట్టుకొన్న మొర అభ్యర్థనలు ఉన్నాయి. వచన కవితారూపంలో. భగవంతుని విరహవేదనే భక్తి. ఆ భక్తి యొక్క పరాకాష్ట అమ్మకు చేసిన మొరలో కన్పిస్తుంది. అలాగే 'నిన్ను విడిచి "ఒంటిరినై నే నెలా ఉండాలని? ఇన్నాళ్లూ నీతో నన్ను ఉంచుకున్నావు. ఇప్పుడు నాతో నువ్వుండాలి" అని అభ్యర్థించింది. నిజానికి అమ్మ వసుంధరతో ఉన్నది, వసుంధరలో ఉన్నది, వసుంధరగా ఉన్నది. ఉంటుంది కూడా. ఈ గ్రంథంలో వలెనే వసుంధర జీవితం అమ్మతో మొదలై అమ్మలోనే అంతర్లీనమౌతుంది. అమ్మ కంఠహారంలో హృదయకుహరంలో దయామణిగా వెలుగుతూనే ఉంటుంది వసుంధర.

మాతృశ్రీ మాధుర్యం



కారుణ్యమూర్తి
సురుచిర లావణ్యమూర్తి
సుందరమూర్తి
మృదుమధుర మంజులగాత్రి

అయిన ఈ అమ్మను మరెక్కడ, మరెప్పుడూ చూడలేము. అలాంటి అమ్మ సన్నిధిన అడుగడిగిన క్షణమే సువర్ణాక్షర బద్ధమైనది. ఈ అమ్మ నాకు 14 సంవత్సరాలు నిండిన తదుపరి దర్శన భాగ్యాన్నందించింది. ఇంతకాలం తనకు దూరంగా అజ్ఞాతంగా వుంచిందే అన్న తపన కలిగింది.

మా నాన్నగారు బాపట్లలో హయగ్రీవగుప్తగారి దగ్గర ప్లీడరుగుమాస్తా చేశారు కొంతకాలం. ఆ రోజుల్లో మా నాన్నగారి తండ్రిగారయిన కోన రాఘవయ్య గారు బాపట్లలోని ఆంజనేయస్వామి గుడికి నన్ను తీసుకువెళ్ళారట. స్వామీ నాకు నిష్కల్మషమైన మనసునిచ్చి బాగా చదువు వచ్చేలా చేసి నీ దగ్గర వుండేలా చెయ్యమని ప్రార్థించానట. ఆ పిన్న వయస్సులో ఆ ప్రార్థనను విన్న మా తాతగారు ఆనందంతో ఇంటికొచ్చాక నా మనుమరాలు అంటే ఇదే నన్నారట.

ఆ తర్వాత కాలంలో చీరాలకు స్కూలు టీచరుగా వెళ్ళారు. ఆ రోజుల్లో - మా అమ్మ నేను భక్తి సినిమాలకు వెళ్ళేవాళ్ళం. ఓసారి భక్తరఘునాధ్ సినిమాకు వెళ్ళటం తటస్థించింది. అందులోని కృష్ణలీలలను చూసి నాకే కృష్ణుడు దూరమైన భావన కలిగి కృష్ణుని యుగంలో నేను లేకపోతినే అన్న బాధ, ఆవేదనతో నిండిన నా మనస్సుకు జవాబుగా - నా తపనకు ఫలితంగా ఫిబ్రవరి -1958లో నాపై కరుణరసం ఒలికించింది. మాతృయుగంలో మాతృమూర్తిగా నన్ను చేరదీసి తన లీలలతో మురిపించి మురిపించి మైమరపించింది.

1962లో భక్తుల పిలుపు మేరకు రెండు నెలలు చీరాలలో బస చేసింది. వారి యిండ్లకు వెళ్ళి వారి గృహాలను పావనం చేసింది. తిరిగి జిల్లెళ్ళమూడి చేరేటప్పుడు అలాగే మా నాన్నగారి ఇంటికీ వచ్చింది. వసుంధరను నాతో తీసుక

వెళ్తున్నాను. దాని బాధ్యత నాది అని ఆగష్టు 9-1962. తనతో జిల్లెళ్ళమూడి తీసుకొచ్చింది. అంతవరకు కొంతకాలం అమ్మ సేవలో, కొద్దిరోజులు మాత్రం గడపటం జరిగేది. నాదీ బాధ్యత అన్న అమ్మ, నాటి నుండి నేటివరకు తన బాధ్యతగా చూసింది. చూస్తున్నది. ఈనాటికీ అమ్మ కరావలంబం ఇచ్చి వెన్నంటే వున్నది.

అమ్మ సాన్నిధ్యము, అమ్మసేవయే, అమ్మ చెప్పింది చెయ్యుటమే పరమావధిగా గల నాకు, ఏ వూహలు లేని నాకు, స్వప్నంలో కల్యాణ మండపంలో వేదికపై వధువుగా వున్న నేను వరుదెవరో తెలియక నిరీక్షణలో వున్న నన్ను చూస్తూ అమ్మ నీ వెవరికోసం చూస్తున్నావో వారినే నేను అంటూ పళ్ళెంలో వున్న మాంగల్యాన్ని తీసి నా గళసీమ నలంకరింపచేసింది. అటు పిమ్మట కొంతకాలం గడిచింది 1966 మే 5 స్వప్నం తీరు వేరు కావచ్చు కాని అది సత్యం చేసింది.

అమ్మ కబుర్లు చెప్పే సమయంలో - అమ్మా ! నువ్వెవరివమ్మా ? అంటే "నేనా, నేనా జిల్లెళ్ళమూడి కరణంగారిభార్యను" అనేది. అసలు నీ విక్కడకు ఎందుకొచ్చావమ్మా ? చెప్పమ్మా అంటే "నేను చెప్పమ్మను కాదు" అంటూ నీ కోసమే వచ్చానని చమత్కృతిగా మాట్లాడేది.

నువ్వు మా మధ్యకు వచ్చినందుకు ఏంచెయ్యాలో చెప్పమ్మా ? అనేదాన్ని. నీకేం తోస్తే అది చెయ్యి నే కాదన్నానా ! అని ప్రశ్నించేదే కాని చెప్పేది కాదు. నీకు చెయ్యాల్సినట్లు, నిన్ను చూడాల్సినట్లు మేము చూడలేకపోతున్నామని బాధను వ్యక్తం చేసేదాన్ని. అమ్మ చిరునవ్వులు చిందిస్తూ కరుణ జాలువారేలా నా వైపు చూసేది.

నిజానికి మనం మనని మనం ఆలోచించుకుంటే అమ్మకు మనం ఏం చేశాం? ఏం చెయ్యగలం ? అనే ప్రశ్న మాత్రమే మిగుల్తుంది. అమ్మ మన మధ్యకు వచ్చి మనతో మనవలె మలిగిన అమ్మగూర్చి చెప్పాలంటే - సముద్రపు లోతును అంచనా వెయ్యటం లాంటిదే.

తల్లి ధర్మం కోసం వచ్చానన్న అమ్మ అటు సతీధర్మము, ఇటు మాతృధర్మము, మాతృవాత్సల్యము, అన్నీ పెనవేసుకుని తనతోటి సాహచర్యాన్ని మనకు ప్రసాదించింది.

సర్వమూ అమ్మ సృష్టే. ఒక్క మానవులే కాదు. సర్వజీవాళి ఆమె సంతానమే. మనపై ఎంత వాత్సల్యమో సర్వజీవరాసులపై అంతే వాత్సల్యం, కాకులు కావ్, కావ్ అని అరుస్తుంటే ఆ అరుపులు విన్న అమ్మ - కావ్, కావ్ కాదు, కావు కావు అంటున్నై (కాపాడమని) భావం. వాటి అరుపులో అమ్మా ! అన్న ధ్వని వినపడ్తోంది అనేది. వాటికి నేతితో గారెలు చెయ్యమని, పూరీలు చెయ్యమని నాతో చేయించేది. వాటికి నేతితోనా ? అంటే వాటికి నేతితో ఎవరు చేసి పెడ్తారు. అవి ఇష్టంగా తింటాయి అనేది. పురుగులు వంటివి వాలి కుడుతున్నా వాటిని తోలనియ్యక అవి నన్ను ముద్దు పెట్టుకుంటున్నై. అవి వాటి సంస్కారమనేది.

మనస్సు ఒక మానవులకే కాదు, సృష్టిలోని ప్రతిజీవికి వుంటుంది. వాటిభాషను వాటి భావాన్ని అర్థం చేసుకోగలగటం అన్నీ తానైన అమ్మకు తప్ప. ఎవరికి తెలుస్తుంది. ఇలాంటి సంఘటనలు ఎన్నో వున్నాయి. మచ్చుకు రెండు విషయాలు చెప్పానంతే. అమ్మ ఓ సందర్భంలో ఎవరైనా జరిగిన సంఘటనలు చెప్పగలరు. కాని ఆ భావాలను అందించలేరు కదా ! అని, అలాగే జరిగిన సంఘటనలను కూడా పూర్తిగా అందించలేమనిపిస్తుంది అన్నది.

సంఘటనలను తెలుసుకొని అందులోని మాధుర్యాన్ని మన కందినంతవరకు ఆస్వాదించటానికి ప్రయత్నిద్దాం.

పూజ్యులు కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీ పీఠాధిపతులు శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామివారు తమ అనుగ్రహ ఆశీస్సులందించారు. వారికి నమస్సులు. మా మామయ్య డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావు, బ్రహ్మాండం రవి, మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, పి.యస్.ఆర్. అన్నయ్య ఈ గ్రంథాన్ని గూర్చి అభిప్రాయాలిచ్చారు. వీరందరూ అమ్మ అనుగ్రహం పొందినవారు. నాకు ఆప్తులు ఆత్మీయులు. తమ రచనలలో వెలువరించిన భావాలు వారికి నాపట్ల ఉన్న ఆదరణ, అమ్మపట్ల ఉన్న ప్రేమ వ్యక్తీకరిస్తున్నాయి. వారికి నా కృతజ్ఞతలు.

- బ్రహ్మాండం వసుంధర

విషయసూచిక

ఆశీర్వాద శ్రీముఖము iii
వసుంధరక్కయ్య శ్రీవారిచరణ సన్నిధి iv
చెప్పదగిన కొన్ని సంగతులు v
ఇల్లాలి ముచ్చట్లు vii
దయామణి ix
మాతృశ్రీ మాధుర్యం xiii
1. అమ్మ 1
2. అదీ నాలాంటిదే 3
3. మీతో పాటే నేను 5
4. సరైన నమ్మకం 8
5. తల్లిప్రేమ 10
6. "మీ వెంటనే ఉంటాను - అమ్మ" 15
7. అమ్మ సర్వవ్యాపి 16
8. అనుగ్రహం 17
9. అమ్మకు అంతా వర్తమానమే 20
10. ఆవేదనే నివేదన 24
11. అమ్మ నిద్రపోతూ కూడా మాట్లాడుతుంది 25
12. ఈ మాత్రం తెలియకపోతే నన్నాడించవూ? 25
13. అమ్మ మాటలమ్మ కాదు మూటలమ్మే 26
14. అమ్మ కళ్యాణం లోక కళ్యాణం 26
15. మురళీ రవళి 29
16. కళ్యాణ కారిణి 31
17. అమ్మకు రెండూ సమానమే 35
18. వాత్సల్యామృత వర్షిణి 38
19. బలే మొండి 40
20. కార్తీక పౌర్ణమి 44
21. అమ్మ ఇచ్చిన హామీ 46
22. ముష్టి దేవుడు 50

23. అమ్మతో మద్రాసు విలేఖరులు 54
24. అదృశ్యరూప అమ్మ 58
25. మూఢభక్తి 61
26. అన్ని జీవరాసులకూ సుగతే 62
27. నాకు ఎవరూ హాని చెయ్యరు 67
28. రెండూ వాడిచ్చినవే 71
29. ఉపదేశం 74
30. అర్చణ 76
31. అమ్మ నోటి నుండి వెలువడిన ఆణిముత్యాలు 79
32. అమ్మ సమర్త బంతి 80
33. మహోపదేశము 83
34. అమ్మ కల 88
35. హైమ ఎంతోమందికి కనిపిస్తూనే ఉన్నది 90
36. భయాపహో 94
37. నామ ప్రాశస్త్యం 96
38. అమ్మ సన్నిధిలో ఆంగ్ల సంవత్సరాది 100
39. నాన్నగారితో నా అనుబంధం 102
40. శ్రావణ శుద్ధ పంచమి 109
41. అందరి - అమ్మ 111
42. నన్ను మరువని హైమ 117
43. ఆనాటి ముచ్చట్లు 119
44. అమ్మ మమకారం 122
45. శక్తి (దేవుడు) కంటే భిన్నంగా ఏదీ లేదు 123
46.. అమ్మా ! 125
47. ఆత్మ - వేద 126
48. అదేమి మాయయో 129
49. నీ ప్రతి కదలికా 130
50. అమ్మా ! కారుణ్యరూపిణీ ! 130
51. అమ్మా ! ఎందుకీ జాగు ? 131
52. నీలో లయమైన నేను 132
53. స్వామీ మాతృమూర్తివై వెలిశావు 133
54. అమ్మా ! 134

నేలరాలు పండుటాకుల వలె స్వామికై వేదనతో
విలసెల్లెడు ఈ గుండె కేమని మారు పల్కను ?

స్వామిసేవకై - వినియోగం కావాలని
తహతహలాడే మా పిడికిళ్ళు
బిగించేశావు. ఎన్నాళ్ళకీ పిడకిలి విడుపులని
అల్లాడే ఈ హస్తాల కేమని బదులివ్వను ?

స్వామి కోసం పరుగునిడనీక
మమ్ము బందీని చేశావు
ఈ బందిఖానా ఎన్నాళ్ళు మాకింక
అని ఘోషించే ఈకాళ్ళకు ఏమి చెప్పను?

ఊపిరి సలుపనివ్వక పోరు సలిపి
నన్ను సతమతం చేసే ఈ మనస్సు నేమని,
ఎంతని సమాధానపర్చగలను
స్వామి సేవలోనే దగ్ధం కావాలని కాంక్షించే ఈ కాయం
దూరానికి సైప లేక పోతుంటే
ఎలా ఓదార్చాలో, మరి
అర్థం కావటం లేదు. అగమ్యంగా వుంది
అన్నింటికీ, అందరికీ ఆ ఓదార్పునందించే
కాలస్వరూపిణివి నీవే కదా!

ప్రశ్నలతో సతమతమయి ఏం తోచక
కాలమే మీకు సమాధానం చెప్పాలన్న - నాజవాబు నచ్చక
నీవే మా దూరాలకు కారణం అని ఎన్నాళ్ళ కెన్నాళ్ళకని
ఒక్కుమ్మడిగా నాపై బడ అశక్తునైన నేను
నా ఘోష నీ ముందుంచాను మరి - నీదే సమాధానం
నీ ఇష్టం.

౨. అదీ నాలాంటిదే

అమ్మా !

ఓ అమ్మా !

కాకులు అమ్మా ! అమ్మా ! అని ఏడుస్తున్నాయి. వాటి రోదన ధ్వని నీకు విన్పించటం లేదమ్మా యిప్పుడు ? కాకులు అరుస్తూ, గదిలోకి వస్తూ, తలుపుల మీద నుంచుని నిన్ను చూసే వాటిని చూచి అవి ఏమంటున్నై – అని ప్రశ్నించగా, వెంటనే "అవీ అమ్మా ! అమ్మా ! అని పిలుస్తున్నాయి. విన్నావా ? వినబడ్తున్నదా! అని నన్ను చూస్తున్న నీకు, ఏం చెప్పాలో తెలియక తోచక, వాటి భావం అర్థం కాని నేను, నీ నవ్వులో నవ్వు కలిపాను.

నీవు దొడ్లో తిరుగుతూ మేడపైన ఉన్న డోమ్ మీద గుంపుగా వాలి ఉన్న కాకుల్ని చూసి కాకులు మీటింగు పెట్టుకున్నై చూడు. మాట్లాడుకుంటున్నై చూశావా.... అంటే వాటి భాష అర్థం కాని నేను, నవ్వుకుంటున్న నిన్ను చూస్తూ నీ నవ్వులో నవ్వు కలిపాను.

వాటి భాషను, వాటి చర్యలను ఎవరు అర్థం చేసుకోగలరు ? ఎవరికి అవసరం? అన్ని నేనులు నీవైన నీకు కాక?–

నీవు దొడ్లో తిరుగుతూ, శ్లాబ్ మీద చేరిన కాకుల్ని చూచి యిడ్లీ తెప్పించి, ముక్కలు చేసి వాటిని ఎగురవేసి అవి నోటితో మధ్యలోనే అందుకొని తింటూంటే ఆ ముక్కలు ఎక్కడ క్రింద బడతయ్యో – అని నోటికే అందించాలని నీవు పడే తపన ఏదమ్మా యిప్పుడు ?

అమ్మా !

కాన్వెంటు నివేదన వస్తే, దొడ్లోకి తీసుకెళ్ళి కాకులకు పెట్టిరండి అని, వెంటనే, కిందబడకుండ నోట్లో బడేలా వెయ్యండని, వెనుక నుంచి హెచ్చరించే నీ హెచ్చరిక ఏదమ్మా?

ఒకరోజు నేతితో గారె చేస్తావా అంటే చేసాను. అవి శ్రద్ధగా తుంచుతుంటే చూస్తూ కూర్చున్నాను. ఒక్కొక్క ముక్క చక్కగా కాకులకు వేశావు. అవి ఎవరికైనదీ, అప్పటికి గాని అర్థం కాలేదు. ఓ రోజు నేతితో పూరీ చెయ్యమన్నావు. వాటికి

నూనైనా సయిస్తుంది గదమ్మా అంటే అవీ యిష్టంగా తింటాయి, నెయ్యయితే బాగుంటుంది నేతితో ఎవరు చేసి పెడ్తారు అన్నావు కదమ్మా !

వాటి ఆకలి గురించి, రుచిగా పెట్టాలని, నేతితో పెట్టాలని ఎవరి కనిపిస్తుంది - వాత్సల్యమూర్తివైన నీకు గాక ?

అమ్మా!

నీకోసం బ్రెడ్ చేయించమని చెప్పి, దానినీ కాకులకే వేయించావు.

పేలాలు వేయించమనీ, అవి జల్లి, వాటిని ఏరుకుతింటూంటే నీవు దగ్గరే నుంచుంటే భయపడతయ్యేమోననీ, దూరం దూరంగా వుండి జల్లుతూ అవి తింటూంటే - చూచి పరవశించావు.

అమ్మా!

ఎవరికి అమ్మవు ? అంటే

"అందరికీ, అన్నింటికీ, అమ్మను అని చాటి చెప్పిన నీవు. మాకర్థంగావటం కోసం నీవు ఆచరించి చూపావా ?

ఇప్పుడు, వాటి భాషనూ, భావాన్నీ, గురించి, ఆకలినీ, రుచినీ గురించీ శ్రద్ధ ఎవరికుంటుందమ్మా ? కాకులు ఆనాడు ప్రేమతో నిన్ను చూస్తూ అమ్మా! అమ్మా! అని పిలిస్తే - ఈనాడు వదిలి వెళ్ళిన నీకోసం, నీ ఆప్యాయతానురాగాల్ని మరువలేక అమ్మా ! అమ్మా ! అని ఘోషిస్తున్నాయి. వాటి అరుపులో నీవున్నావమ్మా! వాటి పిలుపులో నీవు ప్రతిధ్వనిస్తున్నావమ్మా!

ఒకసారి, కాకి లోపలికి వస్తే, తోలినా పోవటం లేదమ్మా అంటే అదీ నాలాంటిదే - నా కోసమే వచ్చిందన్న - నీ మాట స్మృతిలో మెదిలింది.



3. మీతో పాటే నేను

మన మధ్య ఉన్న అమ్మ మనల్ని, మధ్యలోనే వదిలేసి, అనంతశక్తిలో కలసిపోయిన అమ్మ, అమ్మ అంటే జిల్లెళ్ళమూడిలో, నాలుగు గోడల మధ్య, మంచం మీద కూర్చున్న అమ్మే కాదు. ఆద్యంతములు లేనిదీ, ఆద్యంతములు అయినదీ. అమ్మకు గోడలు అడ్డురావు" అని చెప్పి, మంచం వదిలేసి, అనంతాకాశంలోకి ఎగిరిపోయిన అమ్మ, తనకు, అప్పుడూ, యిప్పుడూ, ఎప్పుడూ వర్తమానమే అయిన అమ్మ - మనకు అంతా గతం చేసి గుఱ్ఱంలా నెమరు వేసుకోమని, కొంత మేతవేసి వెళ్ళిపోయింది.

ఈ ఆవరణలో ఎవరికి వాళ్ళకే తోచని స్థితి కల్పించింది. అమ్మ సన్నిధి.

8-12-85న కాలేజీ స్టాఫ్, వాళ్ళ కుటుంబ సభ్యులు. బాపట్ల జీడిమామిడి తోటలో గడుపుదామని అనుకుని డాక్టర్ సత్యం కుటుంబాన్నీ, నన్నూ కూడా రమ్మన్నారు. భోజనంలోకి కావలసిన పదార్థాలను జిల్లెళ్ళమూడిలో తయారు చేసుకొని అన్నం, కూర మాత్రం బాపట్ల హోటల్లో, తీసుకోటానికి తగిన ఏర్పాటు చేశారు.

ఉదయం వాన్‌లో అందరము బయల్దేరాం. కొంత దూరం వెళ్ళాక, అమ్మ ఫోటో తేవడం మర్చిపోయినాము, అనుకున్నారు. బాపట్లలో శ్రీమన్నారాయణ మూర్తిగారింటిలో తీసుకెళ్దాం అన్నారు. దారిలో సత్యనారాయణ మూర్తిగారు నక్షత్ర చేమంతి పూలమాలను తెచ్చి, అందర్నీ పెట్టుకోమన్నారు. అందంగా వున్న ఆ మాలను చూడగానే - "నక్షత్ర చేమంతి పూలు బాగుంటాయి కదూ ! అవి నాకిష్టం" అన్న అమ్మ మాటలు గుర్తుకువచ్చి అమ్మకు పెట్టకుండ మనం పెట్టుకోవటమా ? - అనిపించింది.

మనం తర్వాత పెట్టుకుందాం. ముందు అమ్మకు వేసి అన్నారు అందరూ ఏకగ్రీవంగా. దారిలో శ్రీమన్నారాయణమూర్తి గారింటికి వెళ్ళటం జరిగింది కానీ, అక్కడా అమ్మ ఫోటో తీసుకోవటం జరగలేదు.

జీడిమామిడి తోటకు చేరగానే, 1973లో మండువేసవిలో, చల్లదనం కోసం రోజూ 7 గం॥ల కల్లా బాపట్ల బంగళాకు చేరి, సాయంత్రం వరకు అక్కడే వుండి, స్నానం చేసి అక్కడకు వచ్చిన బిడ్డలకూ, దర్శనం యిచ్చి, యింటికి చేరేది. అట్లా 3 రోజులు ప్రయాణం చేసింది. ఆ గతమంతా ఒక్కసారి కళ్ళముందు కన్పించింది. ఆ ప్రయాణాలలో నా ఒడిలో పడుకుని సేదదీరేది.

అమ్మ ఫోటో తేవడం జరగనందువలన, సంధ్యావందనం పుస్తకాలలో వున్న 4 అమ్మ ఫోటోలను, యిసుక తిన్నెమీద పరజాపై అందరి మధ్య అమర్చి, దండవేసి అలంకరించాము.

కొబ్బరికాయ తేలేదే అన్పించింది. ఈ సారి వూళ్ళో కెళ్ళినప్పుడు అమ్మ ఫోటో, కొబ్బరికాయ తీసుకొద్దామని అనుకున్నారు.

"రమ్మని పిలువ నక్కరలేదు మీ బాధే నన్ను రప్పిస్తుంది.
అదీ పిలుపే" – అనో
"నేను ఎక్కడ వున్నానో మీరు అక్కడే వున్నారు
ఎక్కడా తేడా ఏమీ లేదు" – అనో
"నేను కనబడితే – మీరు చూస్తారు,
మీరు చూస్తే – నేను కనపడను" – అనో
"నేను దగ్గరకు తియ్యటమే కాని –
మీరు దగ్గరకు రావటం కాదు" – అనో
"అన్ని రూపములు – వాడివే కనుక
రూప రహితుడు" – అనో
"మీరు నేను కాదని అనుకోవటం లేదు
మీతో పాటు నేనూ" అనో

మనకు తెలియదు కాని – ఎంత వెదికినా, పూవు, పిందే, కాయ మచ్చుకైనా కన్పించని ఆ తోటలో – ఒక ఎఱ్ఱని జీడి మామిడిపండు అమ్మ ఫోటోల ఎదుటగా పైనుంచి విసిరివేయబడింది.

అనంత వాయువులో లీనమై వున్న అమ్మ విసిరిందో : మీ మధ్య నేనూ వున్నానంటూ తానే – ఆ రూపంలో దిగి వచ్చిందోమరి !

అమ్మ వచ్చింది. అమ్మ వచ్చిందని కొందరూ, అమ్మ పండు విసిర వేసిందని కొందరూ సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు.

"మీరు మర్చిపోయినా, నేను మీ వెంటనే వున్నా" నని నిరూపించి, "నాది కరుణాను బంధం" అని చాటిన అమ్మ మమకారమో, వాత్సల్యమో !

జీడి మామిడి పండ్లూ, అరటి పండ్లూ కలిపి పులుసు పెట్టించి, వడ్డించిన అమ్మ – కళ్ళముందు నడిచింది.

అమ్మ పైమేడమీద పచార్లు చేస్తూ, కింద డాబామీద పని చేస్తున్న పిల్లల్ని

చూసి, అరటి పండ్లు విసిరవేసి, వాళ్ళు పట్టుకుంటుంటే చూసి, ఆనందపడుతున్న అమ్మ – పచార్లుచేసింది నామనసులో–

అమ్మ కివ్వాలని, తెచ్చిన పండు ఎలుక తిన్నదని బాధపడ్తున్న ఒక అన్నయ్యతో – "ఫర్వాలేదు నాన్నా ! ఎలుక తింటే ఏం ? ఎలుక రూపంలో అమ్మే వచ్చి తిన్నది" అన్న అమ్మే ఆ రూపంలో వచ్చిందో.

ఒకసారి డాబా దగ్గర్నుంచి, ముగ్గురం మాట్లాడుకుంటూ, పాకాలో వున్న అమ్మ దగ్గరకు వచ్చాము. మేము రాగానే, మేము మాట్లాడిన విషయాన్ని – అమ్మ మాతో చెప్పారు. ఇప్పుడే గదమ్మా మేము మాట్లాడుతూ వస్తున్నాం. నీ కెవరు చెప్పారమ్మా ? అంటే –

"మీతోపాటు నాలుగోదాన్ని నేనూ వున్నాను" అని చెప్పింది.

మధ్యాహ్నం అన్నం తీసుకురావటానికి వెళ్ళినప్పుడు, అమ్మ ఫోటో, కొబ్బరికాయ తీసుకొచ్చారు.

అన్నపుగిన్నె చూడగానే, ఈ అన్నం సరిపోతుందా ? అన్న శంక కలిగింది. కొద్ది మందికి, అమ్మ ఫోటోను, చెట్టు కొమ్మల మధ్య వుంచి, దండవేసి, అలంకరించి, కొబ్బరికాయ కొట్టి అవసరనైవేద్యంతో పాటు మహానివేదన కూడా చేశాము.

భోజనాలకు విస్తళ్ళు వేసి, వడ్డన చేస్తున్న సమయంలో అనుకోని ఇద్దరు సోదరులు భోజనానికి వచ్చారు.

"ఎవరి అన్నం ఎక్కడ వుంటే, అక్కడ వాళ్ళు తింటారు". అని అమ్మ అన్నట్లు వాళ్ళ అన్నం ఇక్కడ వున్నది. కాబోలు అనిపించింది.

అసలే అన్నం చాలదనుకున్నాం – పైగా యిద్దరూ.

అందరి భోజనాలు అయినా –ఇంకా యిద్దరికి అన్నం మిగిలింది.

అమ్మే కదా అన్నం తెచ్చింది – అన్న విషయం జ్ఞప్తికి వచ్చింది.

తిరిగి యింటికి చేరటం ఆలస్యం కావటంవలన – అందరూ నిద్రపోయి వుంటారు. అతినిశ్శబ్దమైన వాతావరణంలో అడుగు పెట్టాలంటే గుండె ఝల్లుమంటుంది అనుకున్నాను.

కానీ – అడుగు పెట్టేసరికి, "నేనింకా పడుకోలేదు మీకోసమే చూస్తున్నా నంటూ" **"జయహో మాతా – శ్రీ అనసూయా, రాజరాజేశ్వరి – శ్రీ పరాత్పరి"** అఖండ నామం – శ్రవణ పేయంగా వినిపించి మనస్సును స్పందింప చేసింది.

4. సరైన నమ్మకం

అమ్మ ఒకరోజు నిండయిన పండు వెన్నెలలో తెల్లని దుప్పటి పరచిన మంచం మీద ఆరుబయట చల్లని గాలిలో కూర్చున్నది. నిండు చంద్రుడు అమ్మను దర్శిస్తూ ఆనందపరవశుడైనాడు. లక్ష్మీ నారాయణ అన్నయ్య, రామకృష్ణన్నయ్యా, మరికొంతమంది సోదరీ సోదరులు అమ్మ మంచం చుట్టూ కూర్చున్నారు. అమ్మ కబుర్లు చెబుతూ నవ్విస్తూ అన్నం తీసుకురా ముద్దలు కలిపి పెడ్తానన్నది. అన్నంతో పాటు ప్రేమను రంగరించి కలిపి గోరు ముద్దలు తినిపించడంలో అమ్మకు ఎంతో సరదా ఆనందమూ అమ్మ ప్రతిచర్య అనుభవించే వారి ప్రాప్తాన్ని బట్టి వుంటుందనుకుంటాను.

అన్నం తేగానే కలిపి ముద్దలు పెట్టబోతూండగా అమ్మ "వరండాలోకి పదండి నాయనా" అన్నది.

"ఇక్కడే బాగున్నదమ్మా వరండాలోకి వద్దు" అన్నారు అమ్మ దగ్గర వున్నవాళ్ళందరూ.

అమ్మ వెంటనే "వానవస్తే అన్నది". నవ్వుతూ ఆకాశం అద్దంగా వున్నదిగా వాన ఎట్లా వస్తుందని రామకృష్ణన్నయ్య చమత్కరించారు.

అమ్మ నవ్వుతూ "అట్లాగా" అని అన్నపు పళ్ళెం కిందపెట్టి రెండు చేతులూ ఎత్తి "రావే వానా" అని పిలిచింది. ఆ పిలుపును అందుకున్న మేఘం, అమ్మ ఆదేశాన్ని అమలు పరిచింది. వెంటనే వర్షం ప్రారంభమయినది. వరండాలోకి గబగబా పరిగెత్తారు.

అమ్మ వారందరినీ చూస్తూ పందెంలో గురయిన వారు ఎంత ఆనందంగా వుంటారో అలా అమ్మ లోపలికి వస్తూ పకపకా నవ్వుతూ చెప్తే విన్నారూ ! అని ముద్దలు పెట్టింది.

"ఇట్లా మహిమలు చేసే నువ్వు ఎందుకమ్మా. మహిమలు ఒప్పుకోవు" ?

2)

అని రామకృష్ణన్నయ్య వేసిన ప్రశ్నకు సరైన నమ్మకం ఎప్పుడూ ఇట్లాంటి వాటివలన కలుగదు. వీటిననుసరించి ఏర్పడిన నమ్మకం ఇట్లా జరుగని మరుక్షణం సడలిపోతుంది. సరైన నమ్మకం తరుణం వచ్చినప్పుడు నిష్కారణంగా ఏర్పడుతుంది. అంటే ఏర్పడడం అవసరమని నాకు అనిపించినప్పుడు" అని నిర్లప్తంగా జవాబిచ్చింది. మహిమలను ఒప్పుకోని అమ్మ.

మరొకసారి ఒక సందర్భంలో

"మాహాత్మ్యాలతో కలిగే విశ్వాసం అవి నిలిచిపోయినప్పుడు చెదిరి పోతుంది. కనుక ఏమి జరిగినా, ఏ పరిస్థితులలో అయినా, భగవంతునిమీద చెదరని విశ్వాసం ప్రసాదించమని కోరుకోవడమే ప్రార్థనకు పరమావధి అని అమ్మ చెప్పింది.



5. తల్లిప్రేమ

ప్రియమైన హైమా !

నువ్వు అనేకసార్లు అమ్మ కబుర్లు చెప్పక్కయ్యా - నువ్వు అమ్మ దగ్గర వుంటావు కదా ! అని అడిగే దానివి, గుర్తుందా ?

నాకప్పుడు చెప్పటానికి సమయం సరిపోయేది కాదని నీకు బాగా తెలిసిన విషయమే. అయినా నువ్వు - నాకేం చెప్పవు. అన్నీ దాచుకుంటావని పదే పదే అనేదానివి.

అమ్మ అన్నట్లు - నాటక రచయితకు అన్ని పాత్రలు తెల్సినా, అందులో తనూ ఒక పాత్రను తీసుకున్నప్పుడు దానిని పోషించి తీరితేనే ఆ నాటకానికి రక్తి కలుగుతుంది. అందులో తన పాత్రను తాను పోషించి యీనాటకానికి రక్తి కలిగించి "నిర్ణయానికి నిర్ణయించిన వాడూ బద్ధుడే" అన్న అమ్మ తనూ నిర్ణయానికి బద్ధురాలై వెళ్ళింది కదా !

ఇప్పుడు నాకు టైం యిచ్చింది. అమ్మ కూడా ఎప్పుడన్నా తీరిక దొరికినప్పుడు నీ దగ్గరున్నవి చదివి వినిపించమని చదివించుకుండేది. అన్నయ్య కివ్వమనీ చెప్పేది. కాని యింతకాలం వీలుగాక అన్నయ్యకీ యివ్వలేదు, నీకూ చెప్పటం జరగలేదు. ఇప్పుడు నాదగ్గర వున్నంత వరకు తీరికగా ఒక్కొక్కటి చెప్తాను, హైమా ! వింటూంటే నీకూ కొన్ని కొన్ని గుర్తురావచ్చుననుకుంటాను. మధ్యాహ్నం 2 గంటలకు అమ్మ హాల్లో పడుకొని కబుర్లు చెప్తున్నది.

ఈ వూళ్ళో వుండే గుఱ్ఱం సుబ్బమ్మ అనే ఆవిడ రోజూ అమ్మ దగ్గర కొస్తుంటుంది. ఈ రోజు కూడా ఆమె వచ్చి నమస్కరించి యివాళ ఏమీ తేలేదమ్మా అంటూ వక్కపొడి పొట్లాం అమ్మచేతికిచ్చి కూర్చున్నది.

ఆమె కొంచెం సేపు కూర్చుని - "యిదేం ఖర్మ ? నేను వస్తేసరి రామా, కృష్ణా ఏమీ చెప్పదు. పాపం, పుణ్యం ఏమీ చెప్పదు" అన్నది.

అమ్మ నవ్వి మావైపు తిరిగి 'ఆమెకు రామా, కృష్ణా చెప్పాలట. పాపం, పుణ్యం ఏం చెప్పాలి' ? అన్నది అమ్మ పాదసేవ చేస్తున్న సుబ్బమ్మగారి వైపు చూస్తూ.

"పిసుకుతున్నావుగా పాదాలను – వాటినే కొట్టు, వాటినే పిసుకు దేని వల్లనైతే పుణ్యం వస్తుందో దానివల్లనే పాపం వస్తుంది అన్నది. అది విన్న సుబ్బమ్మ "అమ్మా యిదే పాపం, పుణ్యం అంటావా ఏం ? ఇదే ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటాను. అమ్మ యిట్లా అన్నదని అందరికీ చెప్పుతా" అన్నది.

అమ్మ నవ్వుకుని "నువ్వు తాతమ్మ చెప్పిన పాట ఒక్కటి చదువు" అని వెనుకటి సంగతులను కొన్ని జ్ఞప్తిచేస్తూ ఆ పాట చరణాలను చెబుతూ ఇంతేనా ? అంటే – సుబ్బమ్మ "ఇవన్నీ నీకెక్కడ గుర్తు ? నీ పొట్టలో వుంటయ్యా" అన్నది.

అమ్మ నవ్వి "పూర్వకాలపు పాట పూర్వకాలపు దాన్ని కదూ ! అమ్మ అనాది కదూ !" అన్నది.

అమ్మ 7-11-1962న రాత్రి గం॥ 8-30 ని॥లకు తన నివాసం నుంచి (ఇప్పుడు అలంకార హైమవున్న ఇల్లు) రుక్మిణక్కయ్యగారింటి వైపు వచ్చి (ఇప్పుడు మున్నుబుగారి హోటలున్న స్థలం) వాకిట్లో వున్న ఒక అరుగుమీద కూర్చున్నది. అమ్మను ఒకరు కుర్చీలో కూర్చోమని, ఒకరు మంచంమీద కూర్చోమని అంటే –

"ఇక్కడే ఎంతో హాయిగా వున్నది. సింహాసనం మీద కూర్చున్నట్లున్నది" అన్నది. అమ్మ సరదాగా కబుర్లు చెబుతూ, గతంలో జరిగిన సంఘటనలు చెప్పింది. 1953లో నాన్నగారింట్లో దొంగలుపడ్డారు. కొంతసొమ్ము నష్టం అయింది. పోలీసు రిపోర్టు యిచ్చారు. పోలీసులు విచారణకు వచ్చినప్పుడు "మీరేమైనా చూచారా ? గుర్తుపట్టారా ?" అని అమ్మను అడిగారు.

అమ్మ తనకేమీ తెలియదనే చెప్పింది. "వాళ్ళూ బిడ్డలే" నని వాళ్ళపై వున్న మమకారంతో వాళ్ళను బయటపెట్టలేదు.

"దొంగలు కన్నంలోంచి లోపలికి రావటం పిడిగల తళతళ మెరిసే కత్తి తీయటం అంతా చూస్తూనే వున్నాను. వాళ్ళు ఎంత క్రూరత్వంతో వచ్చినా ఎదురుగా అమ్మను చూసేసరికి "వాళ్ళ మనసులు మారినై. క్రౌర్యపు స్థానాన్ని ప్రేమ ఆక్రమించుకున్నది. ఏతల్లిని ఏ బిడ్డ హింసించగలడు ?" అక్కడే వున్న రుక్మిణక్కయ్య వాళ్ళూ బిడ్డలే కాబట్టి నువ్వు క్షమించావమ్మా! ఎవరూరుకుంటారు ? అంటే అమ్మ "ఇంగ్లీషులో తల్లిప్రేమ అనే కథవున్నది విన్నారా" అనడిగింది. వినలేదమ్మా – అన్నాం అందరం.

అమ్మ - కథ చెప్పడం మొదలుపెట్టింది.

ఒక రాజకుమారుడున్నాడు. అతను ఒకసారి గుఱ్ఱం మీద విహారానికి బయల్దేరాడు. దారిలో ఒక వూరిలో ఒక పిల్లను చూశాడు. ఆమె చాలా అందంగా వున్నది. పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. ఆమె దగ్గరకు వెళ్ళాడు. తన కోరికను చెప్పాడు. ఆమె ఒప్పుకోలేదు. అతను ఎలాగైనా ఆమెనే చేసుకోవాలనే కాంక్షలో వున్నాడు. అందువలన ఏవో ఆశలు చూపించాడు. ఆమె అంగీకరించలేదు. నిలువెత్తు ధనం యిస్తానన్నాడు. ససేమిరా ఆమె ఒప్పుకోలేదు. అయినా అతను పట్టువదల్లేదు. చివరకు ఏం చేస్తే చేసుకుంటావని అడిగాడు. ఎందుకూ ఒప్పుకోని ఆమె ఆలోచించి, ఆలోచించి "మీ అమ్మ గుండెకాయ యిస్తే ....అన్నది.

లాలసతతో నిండిపోయిన అతని హృదయానికి అప్పు డా కోరికలోని ఆంతర్యం అర్థంకాలేదు. అతనికి ఆ క్షణంలో అవగాహన అయినదల్లా ఆమె అనుపమ సౌదర్యం. ఆ సౌందర్యంలో వెల్లివిరిసే ఆకర్షణ, ఆ ఆకర్షణ వలన తనలో కలిగిన ఆకాంక్ష, ఆ ఆకాంక్ష రూపంధరించని నాడు తన జీవితమే వ్యర్థమనీ, తనకు మృత్యువే శరణ్యమనీ, అందుకే క్షణమన్నా ఆలోచించకుండా ఇదెంత భాగ్యం అని వెళ్ళిపోయాడు. హుటాహుటీగా స్వగ్రామం బయల్దేరాడు. వెళ్ళే అశ్వం అతి మందగామిగా తోచి అతని అనవసరపు కోపానికి గురిఅయింది. ఇంటికి చేరాడు. ఇంట్లో అడుగు పెడుతూనే-"అమ్మా" అన్నాడు. కేక వేయాలనుకున్న సమయంలో వున్న తొందరపాటు ఆ భావాలు కేక వేసేటప్పటికి వుండవు. ఆ "అమ్మా" అనే రెండుక్షరాల లోనే ఆ భావాలు ద్రవించి పోయినయ్యేమో !

ఏం 'నాయనా' ! అంటూ ఆ తల్లి ఆదుర్దాగా వచ్చింది. ఒరమీద చెయ్యి అలాగే నిశ్చేతనమై పోయింది. హృదయమూ మనసూ నిరామయమై పోయినై. శరీరం కొయ్యబారిపోయింది. ఏం 'నాయనా' ! అన్నది. ఆ మాతృశ్రీ మళ్ళీ ఆ పిలుపుకు అతనిలో మళ్ళీ చైతన్యం రగిలింది. "ఏం లేదమ్మా" అంతకంటే ఏమనుగలుగుతాడు ?

ఆమె వెనుదిరిగి వెళ్ళిపోయింది. అంతలోనే ఆ సుందరి కళ్ళముందు నిలబడింది. అతనిలోవాంఛ బుసపెట్టింది. తన దుర్భలతకు సిగ్గుపడ్డాడు. తన మీద తనకే కోపం వచ్చింది. తనను తానే హెచ్చరిక చేసుకున్నాడు.

"అమ్మా....." మరింత బిగ్గరగా అన్నాడు. వెళ్ళే - అమ్మ వెనుదిరిగింది. అతనిలో భావాలన్నీ తిరగబడినై. అమ్మ ఒక అడుగు ముందుకు వేసింది. అతను గతంలోకి వెళ్ళాడు. అతని కళ్ళముందు తెల్లని తెర. దాని మీద బొమ్మలు. అన్నీ తన బాల్యానికి సంబంధించినవి. ఎన్నెన్నో సంఘటనలు. ఆ సంఘటనల్లో ఎంతో మాధుర్యం ఎంతో అనురాగం - అమ్మ మరో అడుగు ముందుకు వచ్చింది. బొమ్మలు మరింత స్పష్టత సంతరించుకున్నై. అమ్మకు తనంటే - ఎంత వాత్సల్యం ఎంత మమకారం !

"ఏం నాన్నా" ? అమ్మ మాటల్లో ఎంత ఆప్యాయత !

ఎంత అమృతం ! "ఏం లేదమ్మా" అన్నాడే కాని అక్కడ నిలబడగలిగే ప్రశాంతత లేక వెనక్కు తిరిగి వెళ్ళాడు. రోజులు గడుస్తున్నై. అతనికి ఆ సుందరి ధ్యాస తప్ప వేరొకటేమీ లేదు. కోరిక క్షణ - క్షణం బలపడింది. ఆమె కోరిక నెరవేర్చే ఉపాయమే కనపడలేదు. చివరకు ఈ భావ సంఘర్షణలో పిచ్చివాడయ్యే పరిస్థితి ఏర్పడింది. ఆ ఉన్మాదావస్థలో, ఉద్రేకచరమావస్థలో తల్లి వెనుదిరిగి వున్నప్పుడు, పరధ్యానంలో వున్నప్పుడు తల్లి వెన్నులో కత్తిదించాడు కొడుకు.

స్త్రీ వ్యామోహితుడైన వానిలో ఇంకా విచక్షణ విజ్ఞానాలు అనేవి ఎక్కడ మిగులుతై ? గుండె భాగం కోసుకున్నాడు. సుందరి దగ్గరకు బయల్దేరాడు. అదే సమయానికి కారుమబ్బులు, కటిక చీకటి, జోరువాన, హోరుగాలి. ఈ అమానుష కృత్యానికి ప్రకృతి క్రోధంతో, రోషావేశంతో, భీభత్సమయినట్లున్నది. దయారహితమైన రాక్షస కృత్యానికి అశ్రుధారలలో భూదేవి ముఖం దాచుకున్నది. అతని మోహం ముక్కుకు తాడువేసి లాగుతుంటే - అతడు అలాగే నడుస్తున్నాడు. కాని ప్రకృతి భీభత్సంలో అతని శక్తి సన్నగిల్లింది. అతని నడక తడబడింది. అతని శరీరం తూలిపోతున్నది. "జాగ్రత్త నాన్నా" మాటలు విప్పించినై. చుట్టూ చూశాడు. ఎవరూ లేరు. అతనిలోని వాంఛ మెడబట్టుకు నెడుతున్నట్లుగా ముందుకు నడుస్తున్నాడు. మెరకా, పల్లం తెలియని ఆ చిమ్మ చీకటిలో ఒక గుంటలో కాలుపడి ముందుకు తూలాడు. "జాగ్రత్త నాన్నా" ఎవరిదో హెచ్చరిక. ఎవరిదీ ప్రేమ పూరితమైన సలహా. ఇంత చీకటిలో తన వెన్నంటి ఎవరూ యీ హితోపదేశం చేస్తున్నది ! దారి కనిపించటం లేదు. ప్రపంచం అంతా కలిసి తనను

ఎదుర్కొంటున్నట్లుగా ఎదురుగాలి. ఎవరో ప్రబల శత్రువు తన మీద దండెత్తి వచ్చి శంఖనాదాలు చేస్తున్నట్లు భీకరమైన ఏవో ధ్వనులు.

"జాగ్రత్త నాన్నా" మళ్ళా అదే స్వరం. ఆ స్వరంలో అదే ఆప్యాయత. అదే ఆందోళన. తనను గురించి ఎవరికింత శ్రద్ధ ? ఇంతవరకు తనను గురించి యింత విశాల ప్రపంచంలో, యింత ప్రేమ ! యింత శ్రద్ధ చూపించిందీ, చూపించ కలిగేది ఒకే ఒక్కరు.

"జాగ్రత్త నాన్నా" ఔను అదే స్వరం అదే మార్దవం, అదే ఆర్ద్రత. తన తల్లిదే, ఆ కంఠం తన తల్లిదే.

"జాగ్రత్త నాన్నా" వణికే చేతులతో ఆ చేతిలోని గుండెకాయను చెవుల దగ్గర పెట్టుకున్నాడు. హృదయంలో భాషకందని సముద్రాల ఘోష.

"జాగ్రత్త నాన్నా" ఆ గుండెలోని ఆందోళనకు, అనురాగానికి శబ్దస్వరూపం. బావురుమన్నాడు. కానీ ఏం లాభం ? అప్పటికే అంతా మించిపోయింది.

అని కథ చెప్పి ఇందులో రెండు విషయాలు బోధపడ్డై. ఒకటి - ఆ కొడుకు తల్లిని చంపడానికి పడ్డ మధన భావ ఘర్షణ.

రెండు - చంపబడ్డా తర్వాత కూడా ఆ తల్లి కొడుకు శ్రేయస్సు కోసం పడిన ఆందోళన ఆ మాతృహృదయంలోని అనురాగ పరాకాష్ఠ అన్నది అమ్మ.

ఒక కన్నతల్లికే తన కన్నబిడ్డ మీద అంతటి మమకారం వుంటే -

విశ్వజనని అయిన అమ్మ మమకారానికి అవధులేమున్నవి ?

తనను కన్నవారికంటే - తాను కన్నవారిమీదే ఎవరికైనా మమకారం ఎక్కువ అని అమ్మ చాటిచెప్పింది. తనను కన్నతల్లిని తాను కన్ననాడు ఇక దేనితోను పనిలేదని" చెప్పింది. కాల స్వరూపిణి అయి మనల్ని సమకాలీనులను చేసికొని "నిర్ణయానికి - నిర్ణయించిన వాడూ బద్ధుడే అని మనతోపాటు అన్నీ సమంగా అనుభవించి, మనకంటే ఎక్కువగా పాలుపంచుకున్న అమ్మ - మనకు అందని దూరతీరాలకు వెళ్ళినా, మనల్ని వెన్నంటి - తనుకంటున్న మనము చూసిన అమ్మ తన బిడ్డలను గురించి ఎంత విచారిస్తున్నదో !

6. "మీ వెంటనే ఉంటాను - అమ్మ"

తెనాలి వాస్తవ్యులు లక్కరాజు వితలేశ్వరశర్మగారి కుటుంబం అమ్మ అంటే అచంచలమైన భక్తి విశ్వాసాలు కలవారు. తెనాలి పర్యటనలో అమ్మ వారింటికి వెళ్ళి వారిగృహాన్ని పావనం చేసింది. వారి భార్య లలితమ్మ గారు బి.పి., షుగర్‌ల పేషెంట్. ఆమె ఏప్రిల్ నెలలో కాలుజారిపడిందట. ఆమె చిన్నకోడలు లక్ష్మి జిల్లెళ్ళమూడిలో హైమ ప్రతిష్ఠ కార్యక్రమ ఉత్సవాలు జరుగుతున్న కారణంగా జిల్లెళ్ళమూడి చేరినది.

లలితమ్మ గారు లక్ష్మికి కబురు అందచేయాలని జిల్లెళ్ళమూడి ఫోన్ నెంబర్ కోసం ఎంత ప్రయత్నించినా నంబరు ఏదీ దొరకలేదట. చేసేది లేక పక్క యింటి వారిని పిలిపించి జిల్లెళ్ళమూడిలో మావాళ్ళుంటారు కబురందించమని ఓ వ్యక్తిని పంపింది. కాని ఈ లోగానే తెనాలిలో లలితమ్మ గారికి బాగాలేదట అన్న వార్త ఫోనుద్వారా జిల్లెళ్ళమూడి చేరింది. లక్ష్మి వెంటనే బయలుదేరి వెళ్ళింది.

లక్ష్మిని చూసిన ఆమె "ఎట్లా వచ్చావు ?" అంటే ఫోన్ వచ్చిందని" లక్ష్మి చెప్పగానే ఆమె విస్తుపోయింది. ఆమె తెలిసిన కొందరిని జిల్లెళ్ళమూడి ఫోన్ చేసారా అని ఎంక్వయిరీ చేసిందట. ఎవరూ మేము చేయలేదన్నారట.

ఈ లీల అమ్మ లీలగా భావించి అమ్మ తనవెంటవుండి తనను ఎంతగా కనిపెట్టుకొని వున్నదోనని ఎంతో సంతోషపడింది. అమ్మ జ్ఞాపకాలతో మనసంతా నింపివేసిందట.

మరి జిల్లెళ్ళమూడి పంపిన వ్యక్తి అక్కడకు చేరి కబురందించి ప్రసాదం తీసుకొని సాయంత్రానికి చేరాడు తెనాలి. వ్యక్తి కబురైతే మనిషి వచ్చే సరికి సాయంత్రం అవుతుంది కదా మరి ! వ్యవధి ఎక్కువ కదా ! మరి అమ్మ ఆ ఆలస్యాన్ని చూస్తు ఎలా ఊరుకోగలదు ?

తర్వాత ఆమెను హైద్రాబాద్ తీసుకెళ్తారని తెలిసింది. అమ్మ ప్రేరణతో నాలుగు రోజుల తర్వాత నేను, హనుమబాబు గారి తల్లి భాగ్యమ్మ గారు

లలితక్కయ్యని చూడటానికి వెళ్ళాము. మమ్మల్ని చూసి ఎంతో సంతోషించి తన అనుభవాల్ని చెప్పి అమ్మకు తన మీద గల వాత్సల్యాన్ని తెలియజేసింది.

అమ్మ ఒకసారి బాపట్ల సముద్ర తీరానికి వెళ్ళినప్పుడు ఒక ముస్లిం సోదరుడు అమ్మ పాదాలపై వాలి తన భాషలో ఆవేదన వ్యక్తం చేయగా "మీ వెంటనే ఉంటాను" అని అతనిని ఓదార్చింది. ఆ ఓదార్పు అందరిదీను. అలాగే అమ్మ ప్రతిఒక్కరినీ వెన్నంటి వుంటూ ఎవరికి వారికే అమ్మ మా వెంటనే వున్నదనే భావాన్ని కలుగజేసి కరుణిస్తుంది.

7. అమ్మ సర్వవ్యాపి

మధ్యాహ్నం రెండు గంటలకి అమ్మ స్నానమయ్యాక రుక్మిణికయ్య అమ్మకు జడవేసి ఒకే రంగు పూలయితే బాగుంటయ్యమ్మా కదంబం వద్దులే అన్నది. "నాకు కదంబం అంటేనే ఇష్టం అన్ని రకాలు కలుస్తాయి కదా" అన్నది అమ్మ. సృష్టికి మూలం తాను అన్ని రకాలుంటేనే సృష్టి. కనుక అమ్మకు అన్ని రకాలూ కలిపితేనే ఇష్టం. అందుకే కదంబమే కావాలన్నదేమో అనుకున్నాము నేను, రుక్మిణక్కయ్య. రాత్రి 9 గం॥లకు హాల్లో పడుకొని ఉండగా హరిదాసుగారు వచ్చి రెండవ కాలులో కూడా సీల గుచ్చుకున్నదమ్మా ! అన్నారు.

రెండుకాళ్ళు పోయాయన్నమాట. కాళ్ళు పోయినా బుద్ధులెక్కడకు పోతాయి" అన్నది అమ్మ. మేము పోతే పోతయ్యమ్మా! అన్నాడు యోగన్నయ్య" మీరు పోయినా అవి శాశ్వతంగా నిలబడతాయి అన్నది అమ్మ. మేం వినంగదా అన్నాడు యోగన్నయ్య. "మీరుపోతే పోతయ్యను కుంటున్నారేమో అవి యింకా ఎక్కువే మ్రోగుతుంటాయి. ఇప్పుడు మాత్రం విని ఏం చేస్తున్నారు ? పోతే ఇంకో ఊళ్ళో వుంటే నేను చూడను కదా! వుండను కదా ! అనుకుందామా అంటే నాకు ఏ గోడలూ అడ్డురావు. లేవు" అని తన సర్వవ్యాపకత్వాన్ని తెలియజేసింది.

8. అనుగ్రహం

అమ్మ అనుగ్రహం పది విధాలుగా వుంటుంది. అతి సూక్ష్మంగానూ వుంటుంది.

జిల్లెళ్ళమూడిలో మాతృశ్రీ ఓరియంటల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసే కొత్త ప్రసాద్ భార్య లక్ష్మి ఒంగోలులో డి.యస్.సి పరీక్ష రాసింది. ప్రసాద్ ఆమెను మార్కాపురంలో దించి జిల్లెళ్ళమూడి చేరాలనుకున్నాడు. మార్కాపురం నేరుగా వెళ్ళే మంచి డీలక్స్ బస్సు వస్తే ఎక్కారట. అదే బస్సులో లక్ష్మి ఫ్రెండ్ ఎక్కడం జరిగిందట. ఆమెను చూసిన లక్ష్మి ప్రసాద్‌ని మా ఫ్రెండ్ తోడు ఉన్నది కదా ! మీరు మార్కాపురం వచ్చి తిరిగి యింతదూరం ప్రయాణం చేయ్యాలి కదా ! ఇట్నుంచి జిల్లెళ్ళమూడి వెళ్ళమని ప్రసాదుని ఒప్పించిందట. ప్రసాద్ జిల్లెళ్ళమూడి చేరాడు. మార్కాపురం బస్సు 20 కిలో మీటర్లు ప్రయాణం జరిగిన పిమ్మట ఒక క్వారీ నిండుగా మనుషులున్న ట్రాక్టరొకటి ఎదుర్కొని ఢీ కొట్టిందట. ట్రాక్టరులోని నలుగురు వ్యక్తులు మరణించారట. ఒక లక్ష్మికి మినహా ఆమె ఫ్రెండ్స్‌తో సహా బస్సులోని వారందరికీ దెబ్బలు తగిలాయట. (లక్ష్మి అమ్మను స్మరిస్తూ కూర్చున్నదట) ఈ సంఘటన జరిగాక ప్రసాద్‌ని బస్సులోనించి తప్పించిన అమ్మ అనుగ్రహాన్ని తల్చుకొని (తనే వుంటే తనకు దెబ్బలు తగిలేవే కదా) అని ఊహించుకొని అమ్మకు పదే పదే నమస్కరించు కున్నదట. పైగా ఏనాడో పరిచయమైన స్నేహితులు అప్పుడే అక్కడకు రావటం జరిగింది. ఇదీ అమ్మ కరుణే అనుకున్నది. వారి దగ్గర సెల్ తీసుకొని మార్కాపురంలోని వాళ్ళన్నయ్యకు జరిగిన సంఘటనను తెలియచేసింది. వాళ్ళన్నయ్య వచ్చిందాకా క్వారీ దగ్గరున్న వాళ్ళు బస్సులోని ఆమె సంచీని తెచ్చిచ్చి మంచంవేసి కూర్చోమని ఆమె నెంతో జాగ్రత్తగా చూశారట.

మాటల్లో చెప్పలేనంతగా అమ్మ అనుగ్రహాన్ని పొందగలిగాను అనుకుంటూ వాళ్ళ అన్నయ్య వచ్చాక సురక్షితంగా ఇంటికి చేరింది.

ఒకసారి మంటెనవారిపాలెం నుండి వచ్చే సోదరుడు యల్లాప్రగడ కృష్ణమూర్తి గారి 3 సం॥ల పాప పంపుసెట్లు, ఇనుప చువ్వలు ఉన్న లోతైన ప్రదేశంలో ఒక గుంటలో పడిందట. తల్ల దండ్రుల ఆదుర్దా చెప్పుఖ్ఖర్లేదు. తల్లి అమ్మ ఫోటో

ముందు కూర్చుని అమ్మతో మొర పెట్టుకొని ఏడ్చిందట. తండ్రేమో పరుగెత్తాడట. పడ్డావా అమ్మా! అంటే ఆ పాపే చాలా సంతోషంగా అమ్మ కుర్చీలో కూర్చుని నన్ను పట్టుకున్నది నాన్నా అన్నదట. తర్వాత 8వ సం॥లలో ఒక బాబుని ఎత్తుకుని నడుస్తుంటే కాలు విరిగింది. 3 నెలలు గుంటూరు హాస్పిటల్లో ఉన్నదట. కాలికి తగిలిన దెబ్బ తగ్గదేమోనని భయపడ్డారట.

పాపకు అమ్మ కన్పించిందట. ఆ రోజే డాక్టర్ కాలు సెట్ అయినదని చెప్పాడట. అడుగడుగున అమ్మ తమపై కురిపించిన కృపావృష్టికి వారెంతో పొంగిపోయారు.

ఒకసారి వరద వచ్చి తగ్గిన తర్వాత నీళ్ళు మలినమయి ఉన్న కారణంగా నీళ్ళట్యాంకులో బ్లీచింగ్ కలిపితే బాగుంటుందని రామకృష్ణన్నయ్య వాళ్ళు ఆలోచించి మాతృశ్రీ ఓరియంటల్ కాలేజీలో చదువుకునే రఘునాద్ అనే విద్యార్థికి ఆ పని అప్పచెప్పారు.

రఘునాధ్ బ్లీచింగ్ పౌడర్ కలిపిన బక్కెటు తీసుకుని ట్యాంకులో కలపడానికి పైకి వెళ్ళాడు. ఆ ట్యాంకు మీదకు అమ్మ వుండే గది దక్షిణపు దిక్కుగా కఱ్ఱల వంతెన మీదుగా పోవాలి. ఇది నేల మట్టానికి సుమారు 30 అడుగుల ఎత్తున వున్నది. క్రింద నాపరాళ్ళు పరిచి వున్నాయి. మధ్యలో అనేక ఇనుపకడ్డీ, ఎలక్ట్రికల్ తీగలు వున్నాయి. పై నుంచి చూస్తే భయానకంగా ఉంటుంది. దారిలో రామకృష్ణన్నయ్య ఎదురపడి పలకరించాడట.

అమ్మ స్నానం చేస్తున్నది. దభేలుమన్న శబ్దం. విన్పించింది. గుండె గుభేల్ మన్నది. ఆ శబ్దం అమ్మ గదిలోకి కూడా విన్పించింది. ఏమిటా అని చూస్తే రఘునాధ్ ఎక్కిన కఱ్ఱల వంతెన విరిగి వ్రేలాడుతున్నది. అతను రాళ్ళపై పడి అమ్మా అమ్మా అంటున్నాడు.

రామకృష్ణన్నయ్య క్రిందికి పరిగెత్తాడు. అతన్ని చేతులపై తీసుకువచ్చి హోమియో హాస్పిటల్లో పడుకోబెట్టారు. డా॥ సత్యం డా॥ ఇనజ కుమారి ప్రాథమిక చికిత్స చేశారు. పరిస్థితి ఎలా వుంటుందో చెప్పలేము అన్నారు. షాక్ వల్ల మెదడు దెబ్బతిన్నా తినవచ్చు. ఎముకలైనా విరగవచ్చు అన్నారు. ఇదమిద్ధంగా

చెప్పలేక పోయారు. రాత్రంతా అందరికీ ఆందోళనే అతడు మాత్రం అమ్మ ఒడిలో వున్నట్లు హాయిగా నిద్రపోయాడు. మరునాడు ఉదయాన్నే విద్యార్థి లేచి తిరగడం మొదలుపెట్టాడు. అతనికి ఒక్క ఎముకా విరగలేదు. చాలా మామూలుగా ఉన్నాడు. మాకు చాలా ఆశ్చర్యం వేసింది. "ఎట్లా ఉన్నది రఘూ" అంటే నాకేంలేదు బాగానే వున్నది అమ్మ పట్టుకున్నట్టు అన్పించింది" అన్నాడు ఎంతో మామూలుగా.

అమ్మ మాత్రం రఘు ఎట్లా ఉన్నాడని చాలా సాదాగానే అడిగి అతి నిర్లిప్తంగా ఉన్నది. అన్నీ తానైన అమ్మ ఏమంటుంది మరి ?

ఓరియంటల్ స్కూల్‌లో పనిచేసిన బి.ఆర్.కె. మాస్టారి 4 సం॥ల బాబు వాళ్ళక్క గాయత్రీ భవనంపై అంతస్థులో ఆరవేసిన బట్టలు తేవడానికి వెళ్తుంటే ఆమె వెంట వెళ్ళి గుడ్డలతో చుట్టబెట్టుకొని దాదాపు 35 అడుగుల ఎత్తునుండి వెనుకగా క్రింద పడ్డాడు. అందరూ చాలా భయపడ్డారు. కానీ ఆపసివాడి కే మాత్రమూ దెబ్బతగల్లేదు. అమ్మ దయతో చాలా హాయిగా వున్నాడు. ఈ వార్త విన్న అమ్మ వెంటనే పైకి పిలిపించి బాబును ఒడిలో కూర్చోబెట్టుకొని లాలించి బొట్టుపెట్టి చొక్కాగుడ్డ యిచ్చి తల్లి దండ్రులను సాంత్వన పరిచింది. అప్పటివరకు ఆందోళన ఆదుర్దాలతో వున్నవారు అమ్మ తమపై కురుపించిన కరుణకు మురిసిపోయి ఊరట చెందారు.

ఇలాంటి అమ్మ రక్షణలెన్నో

1975 వ సం॥లో నక్సలైట్లు పడ్డప్పుడు నాన్నగారు రోజూ పడుకునే స్థానం నుంచి స్థలం మార్పించింది. మనకు కారణం తెలియకుండానే.

ఆ సమయానికే రామకృష్ణన్నయ్యను ఊళ్ళో లేకుండా చేసి వారికి రక్షణ కల్పించింది. నక్సలైట్లకు ఎదురు నిల్చి పోరాడిన గోపాలన్నయ్యకు బరిసెపోట్లు తగిలినా ప్రాణాపాయం లేకుండా అమ్మ కాపాడింది. ఎవరికీ ప్రమాదం లేకుండా చేసింది. అమ్మ ప్రత్యక్షంగా జరుగబోయేది ఏదీ వాచ్యంగా చెప్పదు. క్రియా రూపేణా జరుపుతుంది. దానినిమనం అవగాహన చేసుకునే సరికి కొంత వ్యవధి పడ్తుంది. అతి సూక్ష్మంగా, మనను వెన్నంటి వుండే అమ్మ వునికిని, అమ్మ అనుగ్రహ స్వరూపాన్ని మనం గ్రహించకలిగే శక్తిని అమ్మే మనకు ప్రసాదించాలి.

9. అమ్మకు అంతా వర్తమానమే

16-7-1965 సాయంత్రం 3.30 గంటల సమయం చల్లగాలి వీస్తోంది. అప్పుడే స్నానం చేసి తెల్లని చీర ధరించి వచ్చిన అమ్మ ఆ వాయుదేవుడ్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకొన్నట్లుంది అమ్మనుంచున్న వైఖరి.

ఇంతలో శ్రీపాద గోపాలకృష్ణ మూర్తిగారు, మెడ్రాస్ పార్థసారధి అయ్యంగారు అమ్మ సన్నిధికి వచ్చారు. వారు రాగానే అమ్మ వచ్చి హాల్లో కూర్చొన్నది (ప్రస్తుతం అఖండనామం జరిగే చోట ఉన్న హాలు).

అమ్మ : నాన్నా! (అయ్యంగారిని చూపిస్తూ) నీతో ఇంగ్లీషులో మాట్లాడాలిగా అంటూ అమ్మను గురించి అయ్యంగారు ఇంగ్లీషులో వ్రాసిన పేపరు చూస్తూ డివైన్ మదర్ అన్న పదాన్ని శ్రీపాద వారికి చూపించింది.

శ్రీపాద : సాంబయ్యగారు ఇంగ్లీషు అక్షరాలు నేర్పించారా ? అమ్మా ! నీకు అన్నారు. అమ్మ నవ్వుతూ "వీళ్ళు డివైన్ మదర్ అంటారు. డివైన్ మదర్ కాదూ ! అసలు డివైన్ అంటే ?

శ్రీపాద : దివ్య అని

అమ్మ : అమ్మకు బిడ్డను అని చెప్పుకున్న లైన్ చూపిస్తూ అమ్మ అని గుర్తించినపుడు తను బిడ్డ అయినాడు. ప్రత్యేకంగా బిడ్డనని సంబోధన వేరే చేసుకోనక్కరలేదు.

శ్రీపాద : అమ్మా ! బ్రహ్మానందసరస్వతి మిమ్మల్ని చూశారా ?

అమ్మ : చూశారు నాన్నా ! బాపట్లలో భట్టిప్రోలు రాధాక్రిష్ణయ్య గారింట్లో సెప్టెంబరు 17వ తేదీ 1957 వ సంవత్సరంలో

శ్రీపాద : ఏమన్నారాయన ? (అని శ్రీపాద అడగగానే వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ చెప్పింది. లోగడ వారితో జరిగిన సంభాషణ చెప్పేటప్పుడు) నీకెట్లా గుర్తుంటయ్యమ్మా ! ఇవన్నీ.

అమ్మ : అన్నీ ఇప్పుడు నాకళ్ళముందు జరుగుతున్నట్లు ఉంటుంది అన్నది.

(అమ్మకు అంతా వర్తమానమేకదా ! బ్రహ్మానందసరస్వతీ స్వామికి అమ్మకు జరిగిన సంభాషణ)

స్వామి : ఏమి నీ సాధన ?

అమ్మ : సర్వసాధారణమైన సాధన నాయనా !

స్వామి : సర్వ సాధారణమంటే ?

అమ్మ : సర్వమూ సాధారణమైనదే కనుక సాధ్యమైనదే సాధన.

స్వామి : అయితే ఏది సాధ్యపడుతుంది ?

అమ్మ : నాకు ఉన్నపని సాధ్యపడుతుంది.

స్వామి : అయితే నువ్వు ఆపని ఏమనుకుంటున్నావు ?

అమ్మ : అనుకున్నది జరుగదు తనకున్నది తప్పదు. అందువల్ల నేను అనుకోవలసినదంటూ లేదు.

స్వామి : ప్రయత్నం లేదా ?

అమ్మ : ప్రయత్నానికి ఏది ప్రయత్నం ?

స్వామి : అవును నిజమే. అని కొంచెం సేపు మౌనం వహించారు.

అమ్మ : ప్రయత్నానికి ఏ ప్రేరణ శక్తి ఐతే ఉన్నదో సంకల్పించేదీ, వికల్పించేదీ అన్నీ అదే !

స్వామి : అయితే నీ ఇష్టదైవమేమిటి ?

అమ్మ : అయిష్టత లేనిదే నా యిష్టదైవం.

స్వామి : నీకు అయిష్టమంటూ లేదా ? ప్రపంచంలో

అమ్మ : మీరు ఈ ప్రపంచంలో అని అడుగలేదు. దైవాన్ని గురించి అడిగారు. అనేకమైన దైవాలు లేవని, ఉన్నది ఒకటే గదా అని అయిష్టత లేదన్నాను.

స్వామి : అయితే మీరు ప్రాణాయామం చేస్తారా ?

అమ్మ : ప్రాణాయామం ఏముంది ? నాయనా ! ప్రాణనియమమే కానీ ప్రాణాయామం లేదు.

స్వామి : ప్రాణనియమం అంటే ?

అమ్మ : నియమం నేను పెట్టుకునేది కాదు. దానంతట అది నడిచేది నియమం. నియమం ప్రకారం అదే జరుగుతున్నది.

స్వామి : మీ దృష్టిలో పాప పుణ్యాలున్నవా ?

అమ్మ : పుణ్యపాపాలకు నిర్వచనం చెప్పండి. తర్వాత నాకు ఉన్నదీ, లేనిదీ, చెప్తాను అన్నాను. ఓ పావుగంట గడిచాక.

స్వామి : అంటే శాస్త్రరీత్యా మంచి పనులు, చెడ్డపనులు అనేవి, ఇది ధర్మం అది అధర్మం అని చెప్పేవి ఉన్నవి కదా ఈ ద్వంద్వమే పుణ్యపాపాలూ.....

అమ్మ : అయితే మీవి నిర్వచనాలు కావు. సందేహాలు కాని, సందేశాలు కావు. పూర్తి నిర్వచనమూకాదు.

స్వామి : పోనీ, అదటుంచి, స్వర్గం, మోక్షం ఉన్నదంటావా ?

అమ్మ : ముముక్షుత్వమే మోక్షం. వర్గం కానిదే స్వర్గం. వర్గ రహితమే స్వర్గము. స్వరకాల సర్వావస్థల యందు వైకల్యం లేనిదే కైవల్యం.

స్వామి : నీకు అద్వైతము, విశిష్టాద్వైతము అంటే తెలుసా ?

అమ్మ : అద్వైతమంటే అంతా అయింది. అర్థంకానిది. విశిష్టాద్వైతమంటే నీవు, నేను.

స్వామి : నిర్వచనాలంటే ఏమిటి ?

అమ్మ : అనిర్వచనీయమైనదే నిర్వచనము.

స్వామి : రజ్జు సర్పభ్రాంతిని గురించి మీ అభిప్రాయమేమిటి ?

అమ్మ : రెండూ తెలియుట చేతనే భ్రమకు కారణం.

స్వామి : ఈ వివరణ నాకు చాలలేదు. శాస్త్రం చదువుకో. పాపం శాస్త్రం నీ కొక్కదానికై పుట్టలేదు.

అమ్మ : ప్రాణాయామం ఏముంది ? నాయనా ! ప్రాణనియమమే కానీ ప్రాణాయామం లేదు.

స్వామి : ప్రాణనియమం అంటే ?

అమ్మ : నియమం నేను పెట్టుకునేది కాదు. దానంతట అది నడిచేది నియమం. నియమం ప్రకారం అదే జరుగుతున్నది.

స్వామి : మీ దృష్టిలో పాప పుణ్యాలున్నవా ?

అమ్మ : పుణ్యపాపాలకు నిర్వచనం చెప్పండి. తర్వాత నాకు ఉన్నదీ, లేనిదీ, చెప్తాను అన్నాను. ఓ పావుగంట గడిచాక.

స్వామి : అంటే శాస్త్రరీత్యా మంచి పనులు, చెడ్డపనులు అనేవి, ఇది ధర్మం అది అధర్మం అని చెప్పేవి ఉన్నవి కదా ఈ ద్వంద్వమే పుణ్యపాపాలూ.....

అమ్మ : అయితే మీవి నిర్వచనాలు కావు. సందేహాలు కాని, సందేశాలు కావు. పూర్తి నిర్వచనమూకాదు.

స్వామి : పోనీ, అదటుంచి, స్వర్గం, మోక్షం ఉన్నదంటావా ?

అమ్మ : ముముక్షుత్వమే మోక్షం. వర్గం కానిదే స్వర్గం. వర్గ రహితమే స్వర్గము. స్వరకాల సర్వావస్థల యందు వైకల్యం లేనిదే కైవల్యం.

స్వామి : నీకు అద్వైతము, విశిష్టాద్వైతము అంటే తెలుసా ?

అమ్మ : అద్వైతమంటే అంతా అయింది. అర్థంకానిది. విశిష్టాద్వైతమంటే నీవు, నేను.

స్వామి : నిర్వచనాలంటే ఏమిటి ?

అమ్మ : అనిర్వచనీయమైనదే నిర్వచనము.

స్వామి : రజ్జు సర్పభ్రాంతిని గురించి మీ అభిప్రాయమేమిటి ?

అమ్మ : రెండూ తెలియుట చేతనే భ్రమకు కారణం.

స్వామి : ఈ వివరణ నాకు చాలలేదు. శాస్త్రం చదువుకో. పాపం శాస్త్రం నీ కొక్కదానికై పుట్టలేదు.

అమ్మ : శాస్త్రం అనుభవమివ్వదు. అనుభవం శాస్త్రాన్నిస్తుంది. అంటే శాస్త్రాలు చదువుకోవటం తప్పని కాదు నా అభిప్రాయం. శాస్త్రం వ్రాసిన వాడి అనుభవం కాని చదివిన వాడి అనుభవం కాదుగా.

స్వామి : పాపం చిన్నపిల్ల అమ్మాయికి శక్తి ఉన్నది. కానీ ప్రోత్సాహం కావాలి.

అమ్మ : ఒకరి ప్రోత్సాహం మీద నాకు ఉత్సాహం లేదు అన్నాను. పొట్ట పొడిచినా అక్షరం లేదని చెప్పాడట. ఒకసారి నాన్నగారు కన్పిస్తే నీ భార్య చాలా ఉత్తమురాలు. ఇవన్నీ వింటే మంచి స్థితిలోకి వస్తుంది. పంపించమని చెప్పాడట నాన్నగారితో. పైగా ఆరోజు మాణిక్య శాస్త్రులగారి చేత పురాణం చెప్పిస్తాను. మీరు వినటం మంచిది అన్నాడు. జ్ఞాన వాసిష్ఠం, యోగావాశిష్ఠాలను గురించి మాట్లాడుతుంటే రెండూ వశిష్ఠుడు వ్రాసిందే అన్నాను. "మీకు తెలియదు, కాదు అన్నాడు. ఆ సందర్భంలో అన్నాను సాహిత్యంతో రాహిత్యం కాదు అని. "మాణిక్య శాస్త్రుల గారికి సాహిత్య మన్నా మిగిలింది నీ కదీ లేదు" అన్నాను.

శ్రీపాదవా రందుకుని "మళ్ళీ ఎప్పుడన్నా వచ్చారా అమ్మా"

అమ్మ : 1962 లో నేను వాడరేవులో ఉండగా బ్రహ్మానందసరస్వతి, భద్రాద్రి రామశాస్త్రి గారు, పిల్లుట్ల హనుమంతరావుగారి కూతురు అనసూయ ఉన్నారు. నేను గుర్తు చేశానుప్పుడు 1942లో నూనె పానకాల తోటలో ఆయన కాపురం పెట్టడం, పురాణం వినటానికి రమ్మన్న సంగతీ అన్నీ గుర్తు చేస్తూ, అన్నీ గుర్తు తెచ్చుకుని పొరపాటు పడ్డానమ్మా అని పశ్చాత్తాపం చెందాడు అని చెప్పింది.



10. ఆవేదనే నివేదన

అవి 1957లో అమ్మ బాపట్లలో వున్న రోజులు. ఇంటింటికి తిరిగి కరివేపాకు అమ్ముకునే ఒక స్త్రీ అమ్మ. సంగతిని విని అమ్మను చూడాలన్న ఉత్సాహంతో మరుసటిరోజు త్వరగా లేచి తన పద్ధతి ప్రకారం కరివేపాకు బుట్ట తీసుకుని ఊరిలోకి అడుగు పెడుతూ అనుకున్నదట. కనీసం ఒక అర్ధణా కరివేపాకు అమ్ముడు పోయినా రెండు అరటి పండ్లు కొనుక్కుని అమ్మ చేతిలో పెట్టి ఆ అమ్మ పాదాలు తాకి పునీతమవుదామని. ఆ హృదయం ఎంత తపన చెందుతున్నదో ! ఆనాడు విచిత్రంగా ఒక్కరు కూడా కరివేపాకు కొన్నవారు లేరట. కనీసం వినిపించుకున్న వారయినా లేరు అర్ధణా కరివేపాకయినా అమ్ముడు పోలేదే! రెండు అరటి పండ్లయినా చేతిలో పెట్టకుండా అమ్మను చూసేదెట్లా అనుకుని కరివేపాకు బుట్టతో వేదనాపూరిత హృదయంతో చిదంబరరావు గారింటికి చేరి పంచలో నిలుచున్నది. అప్పటికి అమ్మ దగ్గరకు చాలాకొద్దిమంది మాత్రమే వచ్చేవారు. వారు తెచ్చిన పూజా ద్రవ్యాలు అమ్మకు సమర్పించి అమ్మ సన్నిధానంలో కూర్చున్నారు.

కరివేపాకు బుట్టతో వచ్చిన ఆమె పంచలో నిలబడి లోపలికి వెళ్ళడానికి పళ్ళులేవని సందేహించి అక్కడే నిలబడి పోయింది. మీలో వున్న ఆవేదనే మీ వద్దకు రప్పిస్తుందన్న అమ్మ త్వరగా ఆ అమ్మాయి వద్దకు వెళ్ళి "ఎందుకమ్మా ఏడుస్తావు" ? అంటూ తనతో లోపల్నుండి బయటకు వచ్చిన వాళ్ళను చూపిస్తూ "వీరంతా నన్ను చూడటానికి వచ్చారు" నేను నిన్ను చూడటానికి వచ్చాను అంటూ ఆమెను దగ్గరకు తీసుకుని భక్తివశ్య అయిన అమ్మ "అమ్మను చూడటానికి పండ్లు వుంటేనేనా వచ్చేది ? వీరంతా టెంకాయలు, పూలు ఇచ్చారు. నీవు తలపండు (హృదయం) ఇచ్చావు. ఈ పండ్లన్నింటికంటే గొప్పదీ, ఇవ్వలసినదీ ఇదే. నీవు తెచ్చిన కరివేపాకు ఇవ్వకూడదనుకున్నావా చూడు కరివేపాకు ఎంతో రుచో" ? అంటూ బుట్టలోని కరివేపాకు రెండు మూడు రెబ్బలు నోటిలో వేసుకొని నమిలి మ్రింగింది. ఆమె మాటలు రాక అమ్మ కౌగిలిలో అలాగే వుండిపోయింది. అమ్మ ఆమెను చూస్తూ "ఆవేదనే నివేదనమ్మా !" అన్నది.

11. అమ్మ నిద్రపోతూ కూడా మాట్లాడుతుంది

హాల్లో అమ్మ మంచందగ్గర జంపకాణా పరిచి వుంది. దానిమీద అమ్మ పడుకుని వుంది. అమ్మకు కుడిచేతివైపు రామకృష్ణన్నయ్య అమ్మ పాదాలను ఒడిలో పెట్టుకొని, పొత్తూరి వెంకటేశ్వరరావు అన్నయ్య అమ్మ తలవైపున లక్ష్మీనారాయణన్నయ్య, పి. యస్. ఆర్. ఆంజనేయులన్నయ్య, సుబ్బారావన్నయ్యా అమ్మకు ఒక ప్రక్కన కూర్చున్నారు. రవి అమ్మ మంచంమీద పడుకున్నాడు. సుబ్బారావన్నయ్యకు ఒంట్లో బాగాలేనందున మందులెయ్యటానికి టైం ఎంతయ్యింది అని నేనంటే "నీవు మందు వేసే టైం అయిపోయింది" అన్నాడు రామకృష్ణన్నయ్య. అమ్మ "డోస్ పడ్డదిగా" అన్నది. ఆ డోస్ పడ్డదనే ఊరుకున్నాను. రామకృష్ణన్నయ్య రెండు డోసులు పడ్డయి అన్నాడు. రామకృష్ణన్నయ్య ఒడిలో అమ్మ తలవుంచి ముడుచుకొని పడుకొని "ఈ టైంలో ఎంత మంది పుట్టారో, పుట్టగానే ఎంతమంది చచ్చారో అంటూ ఇప్పుడు శేషూ (శేషగిరిరావన్నయ్య) ఏం చేస్తున్నాడో" అన్నది. 12 గం॥లలోపల గదిలోకి వచ్చి పడుకొని నిద్రలోనే "తను మూలంమిదం జగత్ సర్వం" అన్నది. అమ్మ నిద్రపోతూన్నట్లుగా వుండి మాట్లాడడం పరిపాటి.

12. ఈ మాత్రం తెలియకపోతే నన్నాడించవూ?

మధ్యాహ్నం 1 గంటకు గుడివాడ బాబాయి (తుమ్మలపల్లి చలపతిరావు) గారు వచ్చారు. ఆయన తెచ్చిన సంచి మందిరంలో పెట్టి వచ్చారు. సంచి తేకుండా వచ్చానని కూర్చున్నవారు లేవబోతుంటే నేను తెస్తాను ఎక్కడున్నదో చెప్పండి అన్నాను. నేను తెచ్చుకుంటాలే అని ఆయన అంటుండగానే "మూడు సంచులు, ఒకచోట వుంటాయి తీసుకురా" అన్నది అమ్మ. అవి తెచ్చి ఆయనకిచ్చి అమ్మచెప్పినట్లుగానే వున్నాయి అంటే బాబాయిగారు అమ్మతో "నీకెట్లా తెలుసమ్మా" అన్నారు. "ఈ మాత్రం తెలియకపోతే నన్నాడించరూ !" అన్నది చిరునవ్వుతో అమ్మ.

13. అమ్మ మాటలమ్మ కాదు మూటలమ్మే

అమ్మ ఉదయం 10 గం॥లకు చిన్న గదిలోకి వెళ్ళబోయే దారిలో గడప దగ్గర కూర్చున్నది. ప్రక్కన రామకృష్ణన్నయ్య వచ్చి కూర్చున్నాడు. "నేను ఇక్కడ కూర్చుని మాటలు చెబుదాం అనుకున్నాను. కానీ అనుకోకుండా ఇక్కడకే వచ్చి కూర్చోవటం జరిగింది. ఏదైనా ఇంతే" అన్నది. కొంచెం దూరంలో వున్నాము నేను యోగన్నయ్య. మనమే అక్కడకు వెళ్ళాము రా ! అన్నాడు యోగన్నయ్య. ఆ మాటలు విన్న అమ్మ "ఏం మాటల్లేవు కూర్చోండి ఇక్కడే". అమ్మ మాటలమ్మ కాదు మూటలమ్మ అన్నది.

14. అమ్మ కళ్యాణం లోక కళ్యాణం

అమ్మ అంటే అంతులేనిదీ. అడ్డు లేనిది. అన్నిటికీ ఆధారమైనది. ఆద్యంతములు తానైనది. మహర్షులు, తపోధనులూ, కొన్ని వేల సం॥రాలు తపస్సు చేసినా లభ్యంకాని ఆ అనంత శక్తి అవ్యాజ కరుణచే అవనిపై అమ్మగా అవతరించింది. తన వాత్సల్యామృతాన్ని మనకు పంచిపెట్టింది.

ఒకసారి అమ్మ దర్శనార్థం వచ్చిన ఒక సోదరుడు "అమ్మా మిమ్మల్ని అందరూ అమ్మా అంటున్నారు. మీరు ఎవరికి అమ్మ ?" అని ప్రశ్నించగా "అమ్మ నీకు, మీకు, మీ అందరికీ, అన్నింటికీ".

సోదరుడు : "ఒక్క మానవులకేనా, సమస్త ప్రాణికోటికేనా" ? అమ్మ "నా దృష్టిలో అంతా పిల్లలే. నాకు పిల్లలు కానివి ఏవీ అనిపించడం లేదు" అని ప్రకటించిన అమ్మ మానవజాతికే కాక సమస్త జీవరాశికీ అమ్మయై సకల చరాచరాలపై తన కారుణ్యామృతాన్ని కురిపించింది.

జగజ్జనని అయిన అమ్మకు 1936 వ సం॥మే 5వ తేదీన అమ్మ కళ్యాణం జరిగింది. మే 5వ తేదీ ప్రతి సం॥రం ఒక విశేష కార్యక్రమం జరుగుతూ వుంటుంది.

1984 సం॥ మే 5వ తేదీన గ్రామస్తులందరికీ విందు చేయాలన్నది. పసి బిడ్డల దగ్గర్నుండి వృద్ధుల వరకు బట్టలు కూడా పెట్టాలన్నది. మనుషులకే కాదు

పశువులకు కూడా విందు ఏర్పాటు చేయమని చెప్పింది.

అమ్మ ఆదేశం ప్రకారం మే 5వ తేదీ సాయంత్రం 6 గం॥లకు అమ్మ పూజా వేదికపై అమ్మ దర్శనానికి ఏర్పాటు చేశారు.

స్త్రీలందరికి పసుపు, కుంకుమ, గంధం, గాజులు, పూలు ఇవ్వమన్నది. ప్రత్యేకించి నన్ను పసుపు రాయమన్నది. అందరి పాదాలకు ఒక్కసారిగా పసుపు రాయటమంటే ఎంత అదృష్టమో ! ఇందరి పాదాలను అర్చించే అవకాశం నాకిచ్చిందని ఎంత పొంగి పోయానో డాక్టరు పాప, శేషు, వైదేహి, రమాదేవి, వనజలు కుంకుమ దిద్దేవారొకరు, గంధం పూసే వారొకరు, గాజులిచ్చేవారొకరు, తలలోకి పూలు అందించే వారొకరు, పన్నీరు చల్లే వారొకరు, అందరం కలసి అంతమందిని ఒక్కసారిగా అర్చించుకున్నాం. అది వైకుంఠంలా అనిపించింది.

గ్రామపెద్ద ఒక్కొక్కరి పేరు చదువుతుంటే కుటుంబ సభ్యులు వేదికపైకి వెళ్ళేవారు. మగవాళ్ళకు ధోవతులు, ఆడవారికీ చీర, రవికె గుడ్డ, మగపిల్లలకు నిక్కరు, చొక్కా, ఆడపిల్లలకు లంగా జాకెట్టు గుడ్డలు, చంకలోని పసిపిల్లలకు గౌను గుడ్డలు యిచ్చి కుట్టించమని చెప్పింది అమ్మ. ఊరిలోని వారికే కాక వారి యింటికి వచ్చిన బంధువులకు కూడా బట్టలు పెట్టింది. అందరినీ కట్టుకురమ్మన్నది. అమ్మ పెట్టగానే కట్టుకొని వస్తే అమ్మకు ఎంత సంతోషమో. అందరూ కొత్తబట్టలు కట్టుకొని వచ్చారు. పసుపు కాళ్లతో, మెడలో గంధాలతో, చేతికి గాజులతో, తలలో పూలతో కళకళ లాడుతూ పందిట్లో తిరుగుతూ వుంటే పెళ్ళి పందిరి వైభవాన్ని తలపింపజేసింది.

అమ్మ పర్యవేక్షణలో అందరికీ భోజనాల ఏర్పాటు జరిగింది.

అమ్మ అన్నం సరిగా వడ్డించమనీ, అందరికీ అందుతున్నాయో లేదోనని మామిడి పండ్లముక్కలు అందరికీ వెయ్యమని సలహాలిస్తూ అక్కడే కూర్చున్నది. భోజనాలు అయ్యాక దగ్గరుండి తాంబూలాలు ఇప్పించింది. ఒక్కసారిగా అమ్మ ప్రేమను పొందిన గ్రామస్థులందరి ముఖాల్లోని సంతృప్తినీ, కళ్ళలోని ఆనందాన్ని చూచిన అమ్మ కళ్ళలో మరింత కరుణ పొంగులు వారింది.

అమ్మ ఆదేశానుసారం 6 తేదీ గ్రామంలోని పశువులన్నింటినీ ఒక్కచోట చేర్చారు. ఆవులూ, దున్నలూ, మేకలూ గొఱ్ఱెలు అన్నీ వెయ్యికి పైగా అయినాయి.

సంగంజాగర్లమూడి నుండి ప్రత్యేకంగా దాణా తెప్పించారు.

అమ్మ "పశువుల వద్ద సన్నాయి మేళం పెట్టమని" సలహా యిచ్చింది. "వాటికి సన్నాయి మేళం ఎందుకమ్మా" ? అంటే "మనకంటే సంగీతం అవే ఎక్కువగా విని ఆనందిస్తాయి. శిశుర్వేత్తి, పశుర్వేత్తి వేత్తి గానరసంపణిః అని వినలేదా ?" అన్నది.

సర్వజీవ కారుణ్యమూర్తి అయిన అమ్మ పశువుల వద్దకు వెళ్ళి దగ్గరుండి దాణా వేయించింది. అన్ని పశువుల దగ్గరికి వెళ్ళి అంతటా కలియదిరుగుతూ పశువుల సొంతవారిని, పశువులు ఎలా వున్నదీ వాటి ఆరోగ్యం ఎలా వున్నదీ, ఎట్లా మేస్తున్నదీ విచారించి ఎప్పుడూ పశువులను ఎలా చూడాలో సలహాలిచ్చి "ఇదంతా మీరు భగవంతునికి చేసే నివేదనగా భావించండి అని సందేశాన్ని అందించింది.

ఆ రమణీయమైన దృశ్యం మనకే ఎంతో ఆనందంగా కనువిందుగా వున్నది. ఇక పశువుల కళ్ళల్లోని ఆనందం చెప్పనలవి కాదు.

పశువుల్ని పసిబిడ్డల్లా పోషించాలి అని చెప్పేది. గొడ్లను మేపేవాడు ఎంత బురదలో అయినా నిలబడి పచ్చిక వున్న స్థలాల్లో వాటిని మేపాలి. వర్షాకాలంలో 25 గొడ్లని కట్టేసినా గొడ్లచావిడి అనిపించకుండా శుభ్రంగా వుంచాలని వాటి జాగ్రత్తలను గురించి వివరించేది.

అమ్మ స్వర్ణోత్సవాల సందర్భంలో లక్షమంది భోజనం చేస్తుంటే చూడాలన్నది. దానికి తగిన ఏర్పాట్లు చేశారు. ఆ రోజుకు ఉదయం లక్షమంది లేరే అని రామకృష్ణన్నయ్య వాళ్ళకు బహుశా ఆలోచన వచ్చి వుంటుంది. భావజ్ఞ అయిన అమ్మ వెంటనే "లక్షమంది మనుషులే వుండాలని ఏముంది ?" మనుషులు వచ్చినంతవరకూ పెట్టండి. మిగిలినది జలచరాలన్నింటికీ పెట్టండి అన్నది. సుమారు 2 లక్షల దాకా భోజనమూ చేశారు. మిగిలింది అమ్మ చెప్పినట్లు పశుపక్ష్యాదులకు జలచరాదులకూ పంచటమైంది. అమ్మ లోకమాత, అమ్మ సర్వజీవ జీవన సంజీవిని. అమ్మ కళ్యాణం లోక కళ్యాణం.

15. మురళీ రవళి

1963వ సంవత్సరంలో ఒకరోజు అమ్మస్నానం చేసి హాల్లో కూర్చున్నది. బ్రహ్మాండం సుబ్బారావన్నయ్య అమ్మకు పూజచేసుకుంటున్నాడు. అమ్మ సన్నిధిలో వున్న అంధ సోదరుడు సిరిగిరి సుబ్బారావు అమ్మను స్తుతిస్తూ వ్రాయబడిన శ్లోకాలను, పద్యాలను, పాటలనూ పాడుతూ చివరగా "ఏదిరా మురళీ రవళి యాదవ జన బృందావన దీపావళి" అని పాటపాడబోతూ పల్లవి ఎత్తుకుంటూనే తనను తాను మరిచిపోయి ఆర్తితో పాడసాగాడు.

అమ్మ సన్నిధిలో వున్న వారరందరికీ "ఊదరా కృష్ణా మరలా ఒకసారి" అన్న చరణం అందుకున్నప్పుడు మధురమైన వేణుగానం వినిపించింది. ఆ గాన మాధుర్యానికి పరవశిస్తున్న మేము ఆశ్చర్యానందాలతో అమ్మ లీలగా భావిస్తూ అందరం ఒకేసారి అమ్మవైపు చూశాము. అమ్మ మావైపు చూస్తూ "ఎవరైనా వచ్చారేమో చూచి రండి" అన్నది. "నీకు తెలియకుండా వచ్చేవాళ్ళు ఎవరూ లేరమ్మా" అని అక్కడే వున్న సింగుపాలెం సోదరి చంద్రమ్మ అన్నది. అయినా అమ్మ ఒకటికి రెండుసార్లు చూడమని త్వరపెట్టినందున నలుగురం నాలుగువైపులకి వెళ్ళి చూశాము. అసలు ఎవరైనా వస్తేగా కనిపించటానికి. ఆ పాట పూర్తయ్యేవరకూ ఆ మురళీ రవళి వినిపిస్తూవున్నది. లోగడ ఎన్నోసార్లు అతను ఆ పాట పాడాడు. ఇలా ఎన్నడూ లేదు.

కొత్తవాళ్ళు ఎవరూ రాలేదమ్మా అని అమ్మతో అంటే "ఎవరో దారిన పోయే వాళ్ళు ఈలవేసి వుంటారులే అందుకే కనబడి వుండరు" అని అలవోకగా అనేసింది. అయినా మేం ఎలా నమ్ముతాం ? మురిపించి, మరిపించి పరవశింపచేసి మాతో పాటు తనూ ఆనందించి" ఇందులో విశేషమేమున్నది" అన్నది ఎంతో మధురంగా తనకది సామాన్యమే కానీ మనకు విశేషమేగా.

ఇది వ్రాస్తుంటే అమ్మ బాల్యంలోని సంఘటన - స్మృతి పథంలో మెదిలింది.

అమ్మకు చింతల తోపంటే చాలా యిష్టం. అమ్మ ఒకరోజు చింతలతోపుకు వెళ్ళింది. చింతచెట్టు ఎక్కి చిటారుకొమ్మపై కూర్చున్నది. అంతలో మన్నవ వాస్తవ్యులు, కృష్ణభక్తులు అయిన గంగరాజు వున్నయ్యగారు ఆ చెట్టు వైపుగా వచ్చారు. (ఆయన ఎప్పుడూ కృష్ణ నామ స్మరణతోనే కాలం గడుపుతూ ఉండెడివారు).

అమ్మ చింతచెట్టుపై నుండే గంగరాజు పున్నయ్య గారిని "తాతగారూ" అని కేక వేసింది. పున్నయ్యగారు నాలుగు దిక్కులా చూచారు. ఎవరూ కనిపించలేదు.

మళ్ళీ "తాతగారూ" అన్న అదే పిలుపు వేణుగానం లాంటి కంఠం. పున్నయ్యగారు ఆత్మ ప్రదక్షిణం చేసినట్లు గిరగిరా తిరిగారు. ఆ పిలుపులోని స్వర తరంగాలు పున్నయ్య గారిలోని అణువణువునూ స్పృశించాయి. తనువెల్లా పులకాంకితమయింది. తలపైకి ఎత్తారు.

చింతచెట్టుపై కృష్ణుడు శిరమున పింఛమూ, ఉరమున కౌస్తుభమూ, కరమును, పెదవులను సంధిస్తూ మురళీ - మనోమోహన లావణ్యమూర్తి కన్నులముందు. కృష్ణా! అని పున్నయ్యగారు పారవశ్యులైనారు.

ఇలాగే మరొక్క సంఘటన.

సీతాపతి తాతగారితో అమ్మ తిరువళ్ళూరు వెళ్ళినప్పుడు కృష్ణ భక్తుడైన ఒక పహిల్వాన్‌కు అమ్మ దర్శన భాగ్యం కలిగింది. అమ్మతో కొంత సంభాషణ జరపటం జరిగింది. అమ్మ మాటల్లోని భావ గాంభీర్యానికి అతడు సమ్ముగ్ధుడై ఒడిలోకి తీసికొని నీవు నా ఇష్టదైవానివేనా అమ్మా!" అని అడిగాడు. "నీ ఇష్టదైవం ఎవరో నాకేమి తెలుసు ?" అన్నది.

"ఎవరో కాదు అడిగో వాడే, మురళీ కృష్ణుడు ! ఆ స్వామి ఎదురుగా వచ్చి మాట్లాడాలని ధ్యానం చేసేవాడిని. ఇందాక నీకు ఆ ఫోటో చూపించినప్పుడు అందులోకి దివ్య సౌందర్యం నీలో తళుక్కు మన్నది. క్రమంగా చూస్తుండగానే నీవు ముమ్మూర్తులా నా స్వామివే అయినావు". కొన్ని క్షణాలు అతడు నిశ్చేష్టుడై తిరిగి అశ్రుదారలతో, గద్గద స్వరంతో "కృష్ణా ! శక్తి స్వరూపం కూడా నీవేనా రాధవై వచ్చావా ? మొన్ననే అనుకున్నాను. రాధాసమేతుడవైన నీ చిత్రం తెచ్చుకుందామని ఇక ఏ ఫోటోలు అక్కరలేదు. ఇట్లాగే నాలో వుండిపో కృష్ణా!" అంటూ అమ్మ శిరస్సుపై తన గడ్డం వుంచి వత్తి పట్టుకున్నాడు. అంతలో అమ్మ ముఖం తనవైపు తిరిగినట్లయింది. చప్పున అమ్మ నొసట పైన తన పెదవులతో స్పృశించాడు. అంతే కృష్ణా ! అని అరిచిపడి పోయాడు. అతనికి ఆలోకాతీత స్థితిలో ఎటుచూచినా కృష్ణ దర్శనమే అయింది. (మాతృశ్రీ జీవిత మహోదధి తరంగాల ఆధారం)

ఇలా ఎన్నో, ఎన్నెన్నో అమ్మ తన చిత్రాతి చిత్రమైన లీలా విశేషాలతో జనలను ముంచెత్తుతుంది.

16. కళ్యాణ కారిణి

మాతృమూర్తియై మహనీయ వాత్సల్యంతో విశ్వాన్ని పునీతం గావించిన జగన్మాత అమ్మ.

"నేనూ మీ లాంటి దాన్నే. సర్వ సామాన్యమయిన దాన్ని" అని చెప్తున్నా అమ్మ యొక్క జీవితం విశిష్టమైనది.

అమ్మకు 1936 మే 5వ తేదీన నాన్నగారితో (బ్రహ్మాండం నాగేశ్వరరావు గారు) కళ్యాణం జరిగినది. బాహ్యంగా అమ్మ గృహిణియైనా ఆచరణలో సన్యాసిని" సర్వభక్షకుడైన వాడే భిక్షుకుడు. లింగభేదం రూపభేదం లేనివాడు సన్యాసియని, సర్వత్రా అనురాగమే విరాగమని" అమ్మ చెప్పిన సూక్తులు నిజమైన వైరాగ్యం యొక్క వైశిష్ట్యాన్ని నిరూపిస్తాయి.

అమ్మలో ఈ అతీత స్థితిని గుర్తించినవారు "నీకెందుకమ్మా యీ పెళ్ళి" అని అడిగినపుడు - అమ్మ" ఎన్ని వచ్చినా మనస్సుకు ఏమీ సబంధం లేదని చెప్పడం కోసమే యీ పెళ్ళి. "పెళ్ళిలో పెద్దపులి వున్నదని భయపడేవారి భయం పోగొట్టడం కోసమే యీ పెళ్ళి" అని వివరించింది.

నిరంతరం అర్చనలు, ఆరాధనలు అందుకునే అమ్మ "భర్తే దైవమంటుంది. నాన్నగారంటే అమ్మకు సాక్షాత్తు దైవమే. వివాహమంటే అన్నీ అనుభవిస్తూ ఏదీ మనసుకు అంటకుండా ఉండటమే నని, పరిణయమంటే ఒక పెన్నిధి అందనచేరే పరిణామమేనని, కళంకరహితమైన మనస్సును కళంకరహిరితంగా మరొకవ్యక్తికి అర్పణ చేయటమే కళ్యాణమనీ వచించింది.

నేను అమ్మను, నేను వేటినీ వదలలేదు. భర్త, పిల్లలు, సంసారం అన్నీ వున్నై. సమయానికి ఏది వస్తే అది అనుభవించటం మాత్రమే తెల్సు" అన్న అమ్మ పతిని ఆధారం చేసుకొని పాతివ్రత్య శిఖరాన్ని అధిరోహించింది.

ఒక సందర్భంలో ఒక సోదరుడు "పరధ్యానంగా ఉన్నట్లున్నారే" అంటే పరధ్యానం కాదు నాన్నా ! "పతిధ్యానమే" అన్నది.

ఆధునిక కాలంలో కూడా పాతివ్రత్యం సాధ్యం అవుతుంది అని చెప్పటానికే అమ్మ వివాహం చేసుకున్నదనిపిస్తుంది.

అమ్మ తనమెడలోని మంగళసూత్రాలు రెండూ నాన్న గారి పవిత్ర పాదాలుగా భావించి నిత్యమూ అభిషేకించి తీర్థాన్ని స్వీకరించేది. ఆ తీర్థమే అందరికీ తీర్థం వేసే అర్హతను ప్రసాదించింది" అంటుంది. పుష్పాలతో పూజించి అర్చన చేసేది. మంగళ సూత్రాల రూపేణా భర్త భార్యతో వుంటాడు" అంటుంది.

లోకారాధ్య అయిన అమ్మ నాన్నగారి పాదాలే తనకు ఆరాధ్యమంటుంది.

ఓరోజు "నాన్నగారు ఊరెళ్ళారమ్మా" అంటే "ఎక్కడి కెళ్ళారు. పాదాలు ఇక్కడే కుదువబెట్టి వెళ్ళారు" అన్నది అమ్మ.

ఒకసారి అమ్మ పడుకునుండగా అమ్మ ప్రక్కనే నేను కూర్చుని వున్నాను. "మీ పాదాలు నాక్కావాలి మీరు కూడా కూర్చోవాలి" అంటుంది అమ్మ.

నాగేశ్వర పదాంభోజ రాగాంకిత కదా ! మరి.

1954 వ సం॥లో నాన్నగారు విజయవాడ పనుండి వెళ్ళినప్పుడు ఒకచోట కూర్చుని లేచి వెళ్తుంటే – సంచీ మరిచిపోయివెళ్తున్నారు తీసుకోండి" అని అమ్మగొంతు వినిపించి వెనక్కు వెళ్ళి ఆ సంచీ తెచ్చుకున్నారు. అందులో చాలా ముఖ్యమైన కాగితాలు ఉన్నైట.

1963లో నాన్నగారు మొక్కపాడు పొలంపని మీద వెళ్ళినప్పుడు చాలీ చాలని నులక మంచంపై పడుకుంటే జిల్లెళ్ళమూడిలో వున్న అమ్మ రాత్రి 9 గం॥లకు (ప్రక్కనే వున్నాను నేను) నులక మంచం వత్తుకుంటుంది. కాళ్ళ కింద దిండు వేసుకోమని 2,3 తడవలు అన్నది. ఎవరితో అంటున్నదో ఎందు కంటున్నదో అర్థం కాలేదు. రెండు రోజుల తర్వాత నాన్నగారు ఊరునుంచి వచ్చారు. నాన్నగారిని అడుగుదామని పించి మీరు ఏ మంచంమీద పడుకున్నారు అని అడిగితే "నులక మంచంమీద పడుకున్నా" నన్నారు. అయితే అమ్మ మాట్లాడింది నాన్నగారితో నన్నమాట. నాన్నగారు ఎక్కడున్నా నాన్నగారి వెంటే వుంటుందనిపించింది. జరిగిన విషయం అమ్మకు చెప్తే చిద్విలాసంగా నవ్వింది. అమ్మ, నాన్నగారితో మాట్లాడేటప్పుడు కూడా నాన్నగారి పాదాలవైపే చూస్తుండేది.

అమ్మకు కాఫీ తీసుకెళ్తే "ముందు నాన్నగారి కిచ్చిరా" అనేది. నివేదన తీసుకెళ్ళినా ముందు నాన్నగారికి ఇచ్చిరా అనేది. సంక్రాంతినాడు నాన్నగారికి.

5)

బొట్టుపెట్టి మెడలో దండవేసి పాదాలకు భోగిపళ్ళు పోసి నమస్కరించి ఆ తర్వాత మనకు పోసేది.

(1962లో) కార్తీక పౌర్ణమికి స్నానానికి వెళ్తూ ముందు నాన్నగారికి నమస్కరించి అమ్మకోసం ఏర్పాటు చేసిన మేనాలో ఎక్కింది. ఏ కార్యక్రమం ప్రారంభించినా ముందుగా నాన్నగారికి నమస్కరించి ప్రారంభించేది.

స్త్రీకి పతివ్రతా ధర్మం కన్నా మించినది లేదనీ, పతివ్రత అంటే పతిని ఆధారంగా చేసుకొని పంచభూతాలను జయించటమేనని ప్రకటించిన అమ్మ, నిరంతరం పూజలు అందుకునే అమ్మ, నాన్నగారికి జ్వరం వస్తే నాన్నగారి మంచం ప్రక్కనే క్రింద పడుకునేది.

మధ్య, మధ్య నడుం రాస్తూ, పాదసేవ చేస్తూ ఏక్షణం, ఏ అవసరం వస్తుందోనని కంటికి రెప్పలా కనిపెట్టి వుండి స్వయంగా బ్రెడ్‌కాల్చి పెట్టి ఎలా కట్ చెయ్యాలి ఎలా కాల్చాలో వివరంగా మాకు చూపెట్టి స్వయంగా తానే పథ్యం పట్టేది "నాగేశ్వర పదాంభోజ బంభరాయిత మానస" అయిన అమ్మ.

సర్వాన్నీ స్వాధీనం చేసుకున్నదే సాధ్వి. అమ్మకు సర్వమూ అధీనమే. అమ్మ ప్రత్యేకించి ఏ విగ్రహాన్ని పూజించలేదు. నాన్నగారే అమ్మకు ప్రత్యక్షదైవం. పాతివ్రత్యానికి చరమదశ భర్త భార్యను అమ్మా అని పిలవటం. పాతివ్రత్యం సంపూర్ణమయిన అద్వైతానికి తీసుకువెళ్తుంది.

నాన్నగారు ఒక రోజు హైమాలయానికి వెళ్ళి వస్తూ అక్కడున్న తోటలోని ఓ పువ్వును చూసి అటుగా వస్తున్న నాతో "ఆ పువ్వు బాగుంది కదూ అని ఆ పువ్వును కోసుకుని వచ్చి పడుకుని వున్న అమ్మ పాదాలపై వుంచారు. ఆ దృశ్యం చూసిన నా హృదయ మెంత ఉప్పొంగిందో.

1965లో బామ్మగారు పోయారు. ఆ కార్యక్రమాలను నిర్వహిస్తున్న నాన్నగారు "గయలో పిండం వదిలేస్తే తద్దినాలు పెట్టఖ్ఖరలేదుట గదా ! అట్లా చెయ్యమంటావా నన్ను" అని అమ్మను సలహా అడిగారు. అమ్మ "నాకేం తెలుస్తుంది" అంటే నీకు తెలియకపోవట మేమిటి ? దాన్ని గురించి నీకు ఏ భావమూ లేదా?

ఏం చెయ్యమంటావో చెప్పు" అన్నారు. అమ్మ "ఏ భావమూ లేకుండా ఎట్లా వుంటుంది ? ఇది కానివ్వండి ఏదో ఒకటి చేద్దాం అన్నది. ఆ అట్లా ఆశీర్వదించు అన్నారు చాలా సహజంగా, అమ్మను మనం కోరినట్లుగా. మరో సందర్భంలో అమ్మ వెనుకటి సంఘటనను గూర్చి అమ్మమ్మతో మాట్లాడుతుండగా అక్కడేవున్న నాన్నగారు "అట్లా అడుగమ్మా" అన్నారు. ఎంతో సహజ ధోరణిలో మనం అనేలా.

1972లో నాన్నగారికి గుంటూరులో జె.వి. కృష్ణారావు ఆసుపత్రిలో ఆపరేషన్ జరుగబోతుండగా నాన్నగారు అమ్మకు ఒక ఉత్తరంలో "ఆపరేషన్ను తిలకిస్తూ ఆ సమయంలో నీవు జిల్లెళ్ళమూడిలో వుండిననూ నా చెంతనే వుండగలవని నమ్మిక" అని వ్రాశారు. నక్సలైట్లు జిల్లెళ్ళమూడిలో పడ్డప్పుడు రోజు పడుకుండే స్థలంలో కాకుండా ఆరోజు నాన్నగారిని మరో చోటుకు పంపింది. అమ్మ పంపివుండకపోతే నాన్నగారికి ప్రాణసంకటం ఏర్పడి వుండేదేమో!. మరి నాన్నగారు అమ్మ కంటే ముందే వెళ్ళారు కదా. అన్న ప్రశ్న ఉద్భవించవచ్చు.

అమ్మను నాన్నగారు "నీ కంటే నేను ముందు పోవాలి" అని వారు కోరిన కోర్కె మేరకు సర్వసృష్టి, స్థితి, లయ కారిణి, నిత్య సుమంగళి, పాతివ్రత్య శిరోమణి అయిన అమ్మ 1981 ఫిబ్రవరి 16వ తేదీన నాన్నగారి కోర్కెను తీర్చింది. ఈశ్వరత్వాన్ని ప్రసాదించింది.

జయహోమాతా !



17. అమ్మకు రెండూ సమానమే

వాత్సల్యామూర్తియైన అమ్మను దర్శించిన వారు కొందరు, సాన్నిధ్యాన్ని పొందిన వారు కొందరు, సాన్నిహిత్యాన్ని పొందినవారు కొందరు ఎందరెందరో వున్నారు. ముక్తి ప్రదాయిని అయిన అమ్మ బడిలో అంతిమ శ్వాస వదిలిన వారూ వున్నారు. వారిలో పోతుకూచి విద్యాసాగర్ గారి అబ్బాయి ఒకడు.

రవి 1961 నవంబర్‌లో అమ్మను చూశాడు. అమ్మను దర్శించిన అతను అమ్మ పాద పద్మాలను చూసి ముగ్ధుడై అనిర్వచనీయమైన ఆనందాబ్ధిలో మునిగిపోయాడు. అమ్మ సన్నిధిలో వుండే అవకాశం లభ్యం కావాలని కోరుకున్నాడు. అన్నీ తానైన అమ్మ రవి శిరస్సును ఆప్యాయంగా నిమురుతూ ఒడిలోకి తీసుకున్నది. 1962 జనవరిలో అతని కోరిక నెరవేరింది. అతను బాల్యావస్థలోనే హృద్రోగ పీడితుడైనాడు. రకరకాల చికిత్సలు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇక్కడి కొచ్చాక అమ్మ అద్వితీయమైన ఆదరణలో అతను ఎంతో సంతోషంగానూ, సంతృప్తిగానూ వుండేవాడు. అమ్మ వాత్సల్యం, అమ్మ చల్లని స్పర్శ, అమ్మ ఇచ్చే తీర్థం, అమ్మ దిద్దే కుంకుమలే తన ఆరోగ్యానికి కారణమని తనకు కలిగిన అనుభవాలను బట్టి నిశ్చయించుకున్నాడు. ఆవరణలో అప్పట్లో ఆవులూ, గేదెలు అన్నీ వుండేవి. క్రమంగా పశువుల పోషణలో ప్రవేశించాడు. 1963లో జిల్లెళ్ళమూడి వరదచే చుట్టబడింది. వరద కాస్త తగ్గుముఖం పట్టాక కాలువవైపు గొడ్ల కాపరులు రవీ వెళ్ళారు.కాలువ అవతలిభాగం వైపు వెళ్ళి పశువులను మేపి తిరిగి వస్తూ కాలువ దిగుతుండగా ఆ నీటి వేగానికి ఆవు బెదరటంతో రవి తోక వదిలివేశాడు. నీటిలో మునిగిపోయిన అతను 6 గజాల లోతుకు వెళ్ళాక తగిలిన ఒక మట్టి పుట్టను గట్టిగా పట్టుకొని అమ్మ నామస్మరణం చెయ్యసాగాడు. స్పృహకోల్పోకుండా నీరు త్రాగకుండా ఆ స్థితిలో అక్కడ దాదాపు 20 ని॥ ఉన్నాడట. ఇంతలో అతని స్నేహితుడు ఒకడు వచ్చి ఒడ్డుకు చేర్చటం జరిగింది. ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకుంటూ అమ్మ నామమో, అమ్మ పాటలో పాడుకుంటుండేవాడు. అమ్మ ధ్యాస తప్ప మరొకటి లేదు అతనికి. నామ మహిమ ఎంతటి శక్తినైనా ప్రసాదిస్తుంది. పోయే ప్రాణాలనూ తిరిగి ఇస్తుంది. భుక్తినీ,

ముక్తినీ కూడా అందిస్తుంది. ధ్యానం కదా ఆ ధ్యానమే అమ్మను రవి దగ్గరకు తీసుకెళ్ళింది. మేము అమ్మను అమ్మ ఉన్నచోటచూస్తే, అతను ఎక్కడుంటే అక్కడ అమ్మను చూడగలిగేవాడు. తన గుండె నొప్పితో కాని ఆయాసంతోకాని ఎక్కువగా బాధపడేటప్పుడు అమ్మ హస్తస్పర్శలోని సుఖానుభూతిని పొందేవాడట. పొలానికి కాపలా అవసరమైన రోజుల్లో దట్టమైన చీకటి రాత్రి అయినా అమ్మ ఉన్నదనే ధైర్యంతో పొలం వెళ్ళటానికి భయపడేవాడు కాదు.

20-2-67 నుంచి రవికి జబ్బు తీవ్రస్థాయిని అందుకున్నది. అమ్మ అతనికి బాగుండని దగ్గర్నుంచీ ఎక్కువగా అతని దగ్గరనే కూర్చుంటున్నది. కార్య, కారణ నిర్ముక్తా, ద్వంద్వాతీత అయిన అమ్మ సన్నిధిలో శుభాశుభాలు రెండూ సమానమే. 24-2-67న బాపట్ల వాస్తవ్యులు అమ్మ భక్తులు అయిన వర్ఝ్రా శివరామయ్యగారి జ్యేష్ఠపుత్రునికి వివాహం అమ్మకు పినతల్లి గారైన నంబూరి భాగ్యమ్మగారి మనుమరాలు అరుణ నిచ్చి జరపటానికి నిశ్చయమైనది. ఒకవైపు రవి మరణం సమీపిస్తున్నట్లున్నది. మరొకవైపు కళ్యాణ వేడుక.

పురోహితుడు, అతడు బ్రతకటానికి ఆస్కారం లేదు - వివాహవేదిక మార్చాలి అంటున్నాడు. రవి జబ్బుతీవ్రతను బట్టి పెళ్ళివారు పెళ్ళి ఎలా జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అమ్మ "వారితో జరగాల్సిందేదో జరుగుతుంది. ఏది జరిగినా దేని దారి దానిదే, పెళ్ళి ఏర్పాట్లు కానివ్వమని ధైర్యం చెప్పింది. అమ్మ ఇచ్చిన ధైర్యంతో వారు నిశ్చింతగా పెళ్ళి ఏర్పాట్లు చేశారు. అమ్మ నిర్వికారంగా వివాహ వేదికపై ఆసీన అయి నూతన వధూవరులను ఆశీర్వదించి వైభవంగా పెండ్లి జరిపించింది. అమ్మ రవి కోరినట్లుగా పట్టెడంచు గల నల్ల రవికె, తెల్ల పట్టుచీర ధరించి రవి దగ్గరికెళ్ళి రవిని పలకరించింది. తన కిష్టమైన చీర కట్టుకుని అమ్మ దర్శనమిచ్చి నందుకు చెప్పలేని ఆనందాన్ని పొందాడు. 25వ తేదీన అమ్మ వేసిన తీర్థం తాగి శాశ్వతంగా అమ్మ ఒడిలోకి చేరిపోయాడు. అమ్మ దగ్గరనుండి అంత్యక్రియలు జరిపించింది. శ్మశానానికి వెళ్ళి స్వయంగా చితికి కర్పూరంతో నిప్పు అంటించింది. అమ్మ ఇలా ఇంకా కొద్ది మందికి స్వయంగా నిప్పంటించిన సన్నివేశాలున్నాయి వారెంత ధన్యులో. దహన సంస్కారాలయ్యాక పెళ్ళివారితో కలిసి బువ్వబంతీ, అప్పగింతలు మొదలైన వివాహ వేదుకలు జరిపించింది. మూడు రోజులపాటు అమ్మ ఈ వేడుకలలో పాల్గొని వారి మనసుకు ఏ రకమైనా

బాధ కలుగకుండ వారిని సంతృప్తి పరచింది కరుణా సింధువు అయిన అమ్మ.

రవికి అమ్మనామం ఇష్టమని నామసప్తాహం జరిపించింది. ఈ ప్రేమ అనన్య మయిన, అద్వితీయమైను రెండూ కార్యక్రమాల్లోనూ చూపెట్టింది. ఇలా అమ్మ సాన్నిధ్యంలో రెండు కార్యక్రమాలు జరగటం చాలా సహజమైనవే. ఏప్రిల్ 5, 1968 అమ్మ కన్న కూతురు సిద్ధిపొందితే ఆఅవతేదీ హైమకు దైవత్వాన్నిచ్చి హైమాలయానికి హైమను శంకుగా చేసి ప్రతిష్ఠ చేసింది. 9వ తేదీ అమ్మ జన్మదినోత్సవ వేడుకలు జరిగాయి అంతకంటే విశేషము మహనీయత ఏముంటుంది? మాటల్లో వర్ణించలేము. అమ్మ వర్ణనాతీత.



అమ్మతో హైమ వసుంధర (క్రింద కూర్చున్నవారు)
నిలబడ్డవారిలో వరలక్ష్మి, నాగమణి, కస్తూరి, రుక్మిణక్కయ్య ఎందరో..

18. వాత్సల్యామృత వర్షిణి

జగన్మాత అయిన అమ్మ జగత్తే మాత అని ప్రవచించింది.

ప్రస్తుత అఖండ నామం జరుగుతున్న ఇల్లు. ఆ ఇంటి హాల్లో అమ్మదర్శనం కొరకు ఎదురు చూస్తున్న బిడ్డలు. అమ్మ స్నానం చేసి పెద్ద జరీ అంచుగల పట్టు రవికె వేసుకొని ఎఱ్ఱని జరీ అంచుగల పట్టుచీర ధరించి ముక్కుకు బులాకీ పెట్టుకుని విరబోసిన జుట్టుతో వచ్చి హాల్లో మంచం మీద కూర్చుని దర్శనమిస్తోంది.

ఆ సమయంలో ఓ జీపు వచ్చింది. ఉత్తరప్రదేశ్, అలహాబాద్‌లోని ప్రఖ్యాత సంకీర్తన భవన్‌కు వ్యవస్థాపకులు, ఋషి, జితేంద్రియులు, తత్వవేది, తపస్వి, సాధు మహారాజ్ మంత్రిసిద్ధి పొందిన రాధోపాసకులు అయిన శ్రీశ్రీశ్రీ ప్రభు దత్త బ్రహ్మచారిగారు, వారి ప్రధాన శిష్యులు అమ్మను పరాశక్తిగా దర్శించి "జయహోమాతా శ్రీ అనసూయా రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి" అన్న అమ్మనామాన్ని మధురాతి మధురంగా గానం చేసి పరవశించి, రామనామ సంకీర్తన ప్రచారం చేసిన భాగవోత్తములైన శ్రీశ్రీశ్రీ రఘువరదాస్‌గారు వారి శిష్యులతో కలసి అమ్మ దర్శనం చేసుకొన్నారు. అమ్మ వారిని చూస్తునే చేతులు చాపి వారిని చేరి ఒక వైపు మంచం మీద కూర్చోబెట్టుకున్నది. సంగీతానికి, సాహిత్యానికి ప్రతీకలై నిలచిన ఆ ఇద్దరు మహనీయులు అమ్మకు ఇరువైపుల ఆశీనులైతే అమ్మ సరస్వతీ దేవియై శోభిల్లిన దృశ్యం రమణీయమైనది. ఆ ఆనందం ఊహాతీతం.

తన అమృత హస్తాలతో ఆప్యాయంగా ఆ ఇద్దరినీ నిమురుతున్న ఆ మాతృమూర్తిని చూడగానే నాకు ఒళ్ళు జలదరించి కన్నులు బాష్పపూరితా లయినాయి. చూచేవారికే అలా ఉంటే అమ్మఒడిలో అనుభూతిని పొందుతున్న ఆ మహాత్ముల హృదయాలు ఎంత పరవశించాయో అనిపించింది.

వాళ్ళిద్దరికి ప్రతిదానికి హరేరామ అనే అలవాటు అమ్మను చూసి నప్పట్నుంచి జై మా, జై మా అంటున్నారు.

బ్రహ్మచారిగారు అమ్మను అతిదగ్గరగా తీసుకుని 'జగన్నాథం వెళ్దామా?' అమ్మా ! అన్నారు.

"అంతా అదే అయినప్పుడు ప్రత్యేకంగా వెళ్ళేదేముంది ? వారికి తెలుగు బాగా అర్థం కానందువల్ల అక్కడే వున్న సోదరి ఉమ హిందీలోకి అనువాదం

చేసింది. ఆయన విని నవ్వుకున్నారు. "బృందావనం వెళ్దామా?" అన్నారు.

అమ్మవిన్నది. కానీ విననట్లుగా ఉండి తన పని తను చేస్తున్నట్లుగా రెండు మామిడి పండ్లను కొరికి ఒకటి బ్రహ్మచారికీ, మరొకటి రఘువర దాసుగారికీ నోట్లోపెట్టి వారితో వచ్చిన వారందరికీ మామిడిపండ్లు ప్రసాదం ఇచ్చింది. శాయమ్మగారిని ఏదయినా ఫలహారం చేసుకురమ్మని చెప్పింది. శాయమ్మగారు వెంటనే స్వీటుచేసి తీసుకొచ్చింది.

అమ్మ బ్రహ్మచారి గారి చేయిపట్టుకొని గేటు ఇవతల ఉన్న జీపు దాకావచ్చి చిన్నపిల్లలు కూర్చున్నట్లు తక్కున ఎక్కి కూర్చున్నది. ప్రక్కనే బ్రహ్మచారిగారు కూర్చున్నారు. వెనుక సీటులో వారితో వచ్చిన సీతమ్మగారు, ఆమె తమ్ముడు ఆమె తల్లి, శాయమ్మగారు, బ్రహ్మాండం సుబ్బారావన్నయ్య, నేను ఎక్కాము. రామకృష్ణన్నయ్య, రఘువర దాసుగారు ఇంజన్‌కు ఒకవైపు, మరొకవైపు సోదరి ఉమ, కస్తూరిలు ఎక్కారు.

అమ్మ జీప్‌ని బయల్దేరమన్నది. ముట్టిపూడి వెళ్తుందేమో అనుకున్నాం. అమ్మ ఓంకారనది వైపుకు వెళ్ళమని సూచించింది. ఒడ్డున ఆపించింది. జీపు దిగి అక్కడ ఉన్న ఆవులను గేదులను వాటి ని కాస్తున్న కాపరులను చూపించి, "బృందావనం వచ్చాం నాన్నా" అన్నది. అమ్మ తీయని పలుకులు విన్న అంతా ఆశ్చర్యపోయారు.

"మేము మట్టిపూడి అనుకున్నాం కాలువ దగ్గరకు తీసుకొచ్చింది. ఎంతమాయ చేసింది అమ్మ లీలను మనమేం తెలుసుకోగలము". అని అమ్మ లీలను స్మరిస్తూ పరమానంద భరితులయినారు. సోదరి సీతమ్మగారు వాళ్ళు.

అమ్మ శాయయమ్మగారు తెచ్చిన స్వీటును ముందుగా ఓంకారనదిలో మూడుసార్లు వేసింది. నది కూడా అమ్మబిడ్డే గదా ! తర్వాత బ్రహ్మచారిగారికీ, రఘువరదాసుగారికీ నోట్లో పెట్టింది. రఘువరదాసుగారు కూడా అమ్మకు మూడుసార్లు నోట్లోపెట్టే అదృష్టాన్ని పొందారు.

అక్కడ ఉన్న అందరికీ అమ్మ నోట్లో పెట్టింది. అల్లంతదూరాన ఉన్న కాపరులకు ప్రసాదం పంచింది. బృందావనం నుండి ఇంటికి తిరుగుముఖం పట్టింది. ఇంటికి రాగానే వారు వెళ్ళటానికి అనుజ్ఞకోరారు. అమ్మవారికి అనుజ్ఞనిచ్చి వారి జీపు కన్పించేటంత వరకు ప్రేమ పూరిత నేత్రాలతో చూస్తూనే ఉన్నది.

19. బలే మొండి

అమ్మ 5 గంటలకు లేచి ముఖం కడుక్కొని ఎఱ్ఱ రవికె వేసుకుని ఎఱ్ఱంచుగల పసుపు పచ్చరీర కట్టుకున్నది. కనకాంబరం పూలతో జతచేసిన పచ్చ చేమంతి పూలచెండును వేలిముడిపై అలంకరించుకుని నొసట ఎఱ్ఱని కుంకుమ తిలకం దిద్ది సువర్ణచ్ఛాయ కలిగి నిత్యమంగళ స్వరూపిణిగా అమ్మ స్నానానికి నీళ్ళు తోడండి అని చెప్తూనే హాల్లో వచ్చి కూర్చున్నది.

అధరాపురపు శేషగిరి రావన్నయ్య, రుక్మిణక్కయ్య యోగయ్యగారు క్రిష్ణవేణమ్మక్కయ్య, నేను అమ్మ దగ్గరున్నాము.

స్నానానికి నీళ్ళు తోడారమ్మా ! అని చెపితే కబుర్లు చెపుతూ నవ్విస్తున్న అమ్మ నే నిప్పుడు పోసుకోనని మారాం చేసింది.

ఇంతలో నాన్నగారు కూడా వచ్చి కూర్చున్నారు. నాన్నగారు ఇదిగో "అని అమ్మను సంబోధిస్తూ" సరే గాని సగటున ఎంతవుతుందంటావ్" ? అన్నారు.

సడన్‌గా, సందర్భం లేకుండా నాన్నగారు అట్లా అడగటం ఎంరికీ అర్థం కాలేదు.

'ఏ విషయంలో ?' అన్నది అమ్మ.

నాన్నగారు : అదే ఇప్పుడు హరిదాసుగారు లెక్కతేల్చు కొచ్చారులే.

అమ్మ : తేల్చు కొచ్చారుగా

నాన్నగారు : ఆయన తేల్చు కొచ్చారులే ఇదా నిన్ను చెప్పమన్నది ? షుమారున భోజనాల ఖర్చు ఎంతవుతుందో చెప్పు.

అమ్మ : అదినాకు తెలియదు.

నాన్న : నిజంగా నీకు తెలియదా !

అమ్మ : నిజంగా తెలియదు.

నాన్నగారు : (శేషగిరిరావన్నయ్య వైపు చూస్తూ) ఎంత నిజంగా అబద్ధమాడుతున్నదండీ అని మళ్ళీ అమ్మవైపు చూస్తూ – అంతా చెప్పమని అడగనులే నీ సొమ్ము ఏం పోయింది చెపితే"

అమ్మ : నాకు ప్రత్యేకమైన సొమ్ములేదు. పోదు.

6)

నాన్నగారు : (అమ్మవైపు చూస్తూ – నాలుగు వేళ్ళూ ముడిచి చేయిచాచి) కాస్త చెవుదూ ..... అని బ్రతిమాలుతున్నట్లుగా అన్నారు.

అమ్మ : నాకేం తెలుసో మీకు తెలియదా ?

నాన్నగారు : గంభీరంగా ఈ కబుర్లకేం చెపుదూ!

అమ్మ : మీరిట్లా అడుగుతుంటే ఏం చెప్పాల్లో నాకు తెలియంలేదు. ఒక రోజు తేలితే నెల తేలుతుంది. నెల తేలితే .....

నాన్నగారు : అమ్మ ఏదో చెప్తుందన్న ఆశతో ఆ..... ఆ ..... నెల తేలితే

అమ్మ : నెల తేలితే... సంవత్సరం తేలుతుంది. ఇంతకూ లక్ష్మీ నరసమ్మగారి నడగండి. (ఆ రోజుల్లో ఆమె అన్నపూర్ణాలయంలో వంట చేసేవారు)

నాన్నగారు : ఊ..... ఊ..... అని (వాకిట్లో వెళ్ళిన శేషగిరి రావన్నయ్యతో) పితలాటకమండీ ! బ్రహ్మాండమైన పితలాటకం.

అమ్మ : అక్కడే వున్న కృష్ణవేణమ్మక్కయ్యను చూపిస్తూ కృష్ణవేణమ్మగారి నడగండి.

నాన్నగారు : శేషగిరి రావన్నయ్యవైపు చూస్తూనే కాస్త జారింది మళ్ళీ వెనక్కితిరిగి ఆలోచించుకుని మార్చేసింది. వారా ? వీరా ? అంటున్నది. వాళ్ళందరి సంగతి నాకెందుకు ? సరాసరి చెప్పాలనేం లేదు. బొటాబొటీ చెప్పాలనీ లేదు. షుమారు చెప్పు. ఏమిటో ఆలోచిస్తున్నావు.

అమ్మ : అబ్బేం ! ఏం లేదు

నాన్నగారు : చెప్పవా ఏమిటి ? పోనీ చెప్పనని చెప్పు నేను వెళ్ళిపోతాను.

అమ్మ : వెళ్ళిపోవటం ఎందుకు ? కూర్చోండి. కేవలం దీనికోసం కాదుగా వచ్చింది.

నాన్నగారు : నాకవతల పనున్నది. కూర్చున్నది దీని కోసం. ఒకే ఒక మాట చెపు వెళ్ళి పోతాను.

అమ్మ : చెప్పనని చెప్పను. తెలియదని చెపుతా.

నాన్నగారు : ఏంపోయింది నీసొమ్ము ? నేనేం ఎకరం 2 పుట్ల పంట అడుగుతున్నానా ? బేరన్‌కు డబ్బు కావాలని అడుగుతున్నానా ?

అమ్మ : ఊ నేనన్నానా ?

నాన్నగారు : ఇష్ ! అబ్బబ్బ ! చెపుదూ !

అమ్మ : అప్పుడే లోపలికి వస్తున్న గజేంద్రమ్మను చూపిస్తూ..... గజేంద్రమ్మను అడగండి.

నాన్నగారు : నాకేంపని ? సింగినాదమ్మను, జీలకఱ్ఱమ్మను అడగమంటావేం? నేను నిన్నడుగుతుంటే.

అమ్మ : తెలియనిదేం చెప్పమంటారు ?

నాన్నగారు : తెలియదంటావ్ ?

అమ్మ : తెలియదు ..... తెలియదు.

నాన్నగారు : తెలియదూ ? అని గట్టిగా అంటారు.

అమ్మ : నిజంగా తెలియదు. మీరుగట్టిగా అడిగితే ఎట్లా మాట్లాడాలో తెలియకుండా పోతున్నది. ఇహ ఇప్పట్నుంచీ జాగ్రత్తగా వాడి ఒక సంవత్సరంలో చెపుతానన్నది. (భయపడుతున్నట్లుగా) ఎంతో వినయంగా.

నాన్నగారు : (ముక్కు రాచుకుంటూ) ఎన్నాళ్ళకూ, ఎన్ని రోజుల్లో ?

అమ్మ : ఒక సంవత్సరం లోపల.

నాన్నగారు : ఏడిచినట్లే ఉంది అని –లేదూ ? కొన్ని రోజులు టైం తీసుకో?

అమ్మ : నాకు చాలదు. అంత తెలివా ? అదెంత చిక్కంటే... మీరు అడుగుతున్నారు కానీ, ఒక వీశె గోంగూర వచ్చిందనుకోండి ఒక సొరకాయ వచ్చింది. వాటికి కిమ్మతువేయం. అవి రెండూ ఒకపూట తేలికగా గడుపుతాయి కదా ! అవీ న్యాయంగా లెక్కకు రావలసినవేగా. అవి గుర్తుంచుకొని చెప్పటం ఎంత కష్టం ?

నాన్నగారు : ఈ కబుర్ల కేమొచ్చె చెప్పు. అవన్నీ వేసుకునే చెప్పు. అయినా నీకు గుర్తుండక పోవడం ఏమిటి ? (శేషగిరి రావన్నయ్యతో మీ అమ్మగారికి భలే జ్ఞాపకశక్తుండోయ్. నాకు తక్కువ గానీ. ఇదివరకు బేరన్ ఉన్న రోజుల్లో డబ్బు తెచ్చి మీ అమ్మగారికి ఇచ్చేవాడిని.

క్రిష్ణవేణమ్మ : నిజంగా ఇచ్చారా నాన్నగారూ ! మా అమ్మగారు ఎట్లా వాడేది ? మా అమ్మ అసలు పిచ్చమ్మ అయితే అన్నది. ఆమె ఆమాట అనగానే అట్లా అనచ్చా నాన్నగారిని అన్నట్లు కళ్ళతోనే ఆమెవైపు మందలింపుగా చూసింది.

నాన్నగారు : వచ్చింది. వచ్చినట్లుగా ఇచ్చేవాడినండీ. మీ అమ్మగారికి తెలియకపోవటం ఏమిటండీ ? బలే చిక్కని స్థితి.

అమ్మ : నేను చిక్కినంతగా ఎవరూ చిక్కలేదు.

నాన్నగారు : ఏం చిక్కావు ?

అమ్మకు నీళ్ళు తోడిన సోదరి శకుంతల నీళ్ళు చల్లారి పోతున్నయ్యంటూ వచ్చింది. అమ్మ స్నానానికి లేవబోతుండగా.

నాన్నగారు : "ఏం స్నానానికి లేవబోతున్నావా ? ఎందుకు ? ఆ కాస్తా చెపితే నువ్వు స్నానానికి పోవచ్చు. నేను వెళ్ళి నాపని చూసుకుంటాను. అదేదో చెప్పేసేయి. ఉడాయిస్తాను." అన్నారు పట్టుదలగా అమ్మచేత ఎలాగయినా చెప్పించాలని నాన్నగారు.


అమ్మ ఏం మాట్లాడుకుండా దిండు ఒడిలో పెట్టుకొని దాన్ని ఊపుతూ కూర్చున్నది.

నాన్నగారు : చిటికెవేసి ఊ ఊ ! పోనీ షుమారుగా వెయ్యి. ఒక రోజుకు చెప్పు. మేము లెక్కవేసుకుంటాం. అని అమ్మ ఏం చెప్తుందో ఆకలి వేసిన బిడ్డ తల్లి ముద్దకోసం చాలా ఆశగా, ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లుగా –

అమ్మ మాత్రం చీమలు మంచం కోడుమీదుగా అమ్మ చేతి వేళ్ళ సందుల్లోకి వచ్చి కరుచుకున్నై ఏదో మధురసాస్వాదన కోసమనట్లు, ఈగలు ఎగురుతూ అమ్మను చుట్టిముట్టి ఆ స్పర్శకోసం తపిస్తున్నట్లుగా ఉన్నై. అయినా వేటినీ వదులుకోలేదు. విదిలించలేదు.

నిశ్చలంగా, ప్రశాంతంగా నాన్నగారి మాటలు వింటూ కూర్చున్నది. నాన్నగారు అడిగీ, అడిగీ ఇహ సమాధధానం రాదని నిశ్చయించుకుని

ఎందుకు నీతో – సరేపో, స్నానంచెయ్యి అన్నారు. నాన్నగారు అన్నదే తడవుగా అమ్మ లేచి స్నానానికి వెళ్ళింది. అమ్మ లేచి వెళ్తుండగా "భలే మొండి" అంటూ నాన్నగారు వెళ్ళారు.



౨౦. కార్తీక పౌర్ణమి

అమ్మ రాత్రి కూర్చుని కబుర్లు చెప్తూ రేపు పూర్ణిమ కదా ఓంకారనదికి స్నానానికి వెళ్దామని చెప్పింది. అమ్మకోసం మేనా ఒకటి వున్నది. ఆ మేనాను అన్నయ్యలు అలంకరించారు.

గజేంద్రమ్మక్కయ్య వచ్చి మేనాకు అలంకారం చేశారు చూశావా అని అమ్మ దగ్గర ఉన్న నన్ను అడిగింది.

అమ్మకు అలంకారం అయిందా అని గజేంద్రమ్మ అన్నట్లుగా అమ్మకు విన్పించి "ఏమి అలంకారమమ్మా ! అలంకారాలతో వచ్చేదేమున్నది చల్లని దనమే చక్కని దనం ఎంతయినా తరగని ధనం, అలంకరణాకాదు. రంగూకాదు," అంటూ బయటకు వచ్చింది. మనకు ఈ సూక్తిని తెలియపరచి దలచి అలా అమ్మకు విన్పించి ఉంటుంది.

అమ్మ ఏ కార్యక్రమం చేయ తలపెట్టినా ప్రధమంగా నాన్నగారికి నమస్కరించి ప్రారంభిస్తుంది. వాకిట్లో తన కోసం సిద్ధం చేసిన మేనాను చూసి నాన్నగారికి నమస్కరించి మేనాలో ఆసీనురాలైనది.

ఓం ఐం క్లీం ప్రీం శ్రీం ఓం బీజాక్షరాలను పఠిస్తూ అమ్మ నామం చేస్తూ సోదరీ, సోదరులు అమ్మ ఎక్కిన మేనాను ఓంకారనది సమీపానికి చేర్చారు. అమ్మ మేనా నుండి దిగిన తర్వాత అమ్మను కుర్చీలో కూర్చోబెట్టి కుర్చీనలువైపులా అందరం పట్టుకొని నదిలోకి దిగాము. నీళ్ళను చిందిస్తూ ఆటలాడుతూ కొంత తడవు అయ్యాక కుర్చీ నుండి దిగి నీళ్ళల్లో నడుస్తూ లీలావినోదిని జలక్రీడా మహోత్సాహి అయిన అమ్మ నెత్తిన ముసుగువేసుకొని చిద్విలాసంగా చూస్తూ మహదానందంగా పసిపిల్లలాగా అల్లరి చేస్తూ అందరినీ హావ భావాలతో నవ్విస్తూ, కవ్విస్తూ, అనేక విధాలుగా ఆనందాన్ని అందిస్తూంటే ఆ ఆనందంలో అమ్మతో పాటు స్నానాలు చేస్తున్న అందరినీ అమ్మ కరుణా దృక్కులతో ఒక్కొక్కరినీ దగ్గరకు పిలిచి తీర్థమిచ్చి తన మృదు పాధ ద్వయాన్ని ఒక్కొక్కరి శిరస్సుపైన ఉంచి తన అనుగ్రహాన్ని అందరిపై ప్రసరింపచేసింది. దీపాలు వెలిగించి కాలవలో వదలమన్నది.

రెండు గంటల కాలము ఈ జలక్రీడా మహోత్సవం జరిగినది. ఒక క్షణంలా అన్పించి అప్పుడే అయిపోయిందే అనిపించింది. వెనుక పురాణాలలో చెప్పే గాథలన్నీ నేడు మనకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా అనుభవాన్ని ప్రసాదించాయి.

అమ్మనామం చేస్తూ బీజాక్షరాలను పఠిస్తూ పద్యాలతోనూ, పాటలతోనూ, జలక్రీడ పూర్తిచేసి అమ్మ ఒడ్డుకు వచ్చింది. కొబ్బరి కాయలు కొట్టి హారతి ఇచ్చాము. ఇటు హారతి వైపు చూస్తూనే ఉన్నది. "నా కెక్కడో కారు శబ్దం వినిపిస్తున్నది కారు వచ్చిందేమో" అన్నది. మాకెవరికీ వినబడలేదు. ఇక్కడకు రావటానికి ఎవరైనా బయల్దేరారేమో అని అనుకున్నాం. సర్వాంతర్యామి కనుక తనకు తెలుస్తుంది కదా. 10 నిమిషాలకే కారు వచ్చింది. ఇక్కడ జరిగిన ఈ మహోత్సవానికి రాలేకపోయామని కారులో నుండి దిగిన కుటుంబం బాధపడ్డారు.

అమ్మవాళ్ళను ఓదార్చి దగ్గరకు తీసుకొని వారిపై తీర్థం చల్లి వారికి తీర్థంవేసి ఆశీర్వదించింది.

అమ్మ ఇంటికి తిరుగు ముఖం పట్టింది. అమ్మ మేనా ఎక్కింది. అమ్మ ఎక్కిన మేనాను మేమంటే మేమని సోదరీ సోదరులు చిన్న, పెద్ద అందరూ పోటీపడి అమ్మనామం చేస్తూ, బీజాక్షరాలు పఠిస్తూ ఇంటికి వస్తుండగా రుక్మిణి అక్కయ్య అనే సోదరి అబ్బా ! ఏమి ఊరమ్మా మీ ఊరు. నడవలేకపోతుంటే అన్నది.

అమ్మ "మీ మనస్సు లెట్లాంటివో మా ఊరి రోడ్లు అట్లాంటివి. తొక్కితేగా సాఫీ అయ్యేది". అని చమత్కరించింది. (ఆ రోజుల్లో రోడ్లు పెళ్ళలు, పెళ్ళలుగా ఉండి నడవగలిగేలా ఉండేవి కావు).

అమ్మతో ఇంటికి చేరాము. ఆలపాటి పూర్ణ చంద్రరావు అనే సోదరుడు అమ్మకు రవికె కుట్టించడం కోసం అమ్మా ! నీ ఆది రవికె ఇవ్వమ్మా" అన్నారు. అమ్మ "నా ఆది నాకు తెలియదు" అన్నది. అక్కడే ఉన్న సోదరుడు అచ్యుతుని రామకృష్ణ శర్మగారు నీ ఆది తెలుసుకుందామని అనుకుంటున్నారు వీళ్ళ మోహం ఏమిటీ తెలుసుకునేది ? అని, మా ఆది నీకు తెల్సుకదమ్మా" అన్నారు. అమ్మ "మీ ఆది తెలియటంలో విశేషమేమున్నది. కన్నప్పుడు తెలియకుండా ఎట్లా ఉంటుంది? అని అందరినీ తాను కన్నట్టుగానే స్పష్టపరిచింది.

21. అమ్మ ఇచ్చిన హామీ

అమ్మ లీలలు చాలా విచిత్రంగా ఉంటాయి. 14-2-1975 శుక్రవారం నాడు అమ్మదర్శనం చేసుకుని తిరిగి వ్యాన్‌లో వెళ్తున్న నలుగురు సోదరులు అమ్మ గురించి మాట్లాడుకుంటున్నారు. అందులో ఒక సోదరుడు మీ అనుభవం చెప్పమని కిషన్ అనే సోదరుడ్ని అడగగా కిషన్ తన అనుభవాన్ని చెప్పిన వైనం.

నాది ఢిల్లీలో సుభాష్‌నగర్ - ఉద్యోగ రీత్యా బాపట్లకు వచ్చాను. అమ్మ నన్ను ఆపదలో రక్షించింది.

1972వ సంవత్సరంలో ఏప్రిల్ నెల మాతృశ్రీని గురించి బాపట్ల టెలిఫోన్ ఆపరేటరయిన వెంటకేశ్వర్లు గారివలన నేను వినడం జరిగింది. ఆయమ్మ చాలా మహత్తు కలదనీ ఆపదుద్ధారిణి అన్న నమ్మకం నాకు బాగా పాతుకు పోయింది.

జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మను ఎప్పుడు చూడగలనా అని మనస్సు ఉరికే ఆరాటపడుతూ ఉండేది. ఉద్యోగ బంధాల్లో చిక్కి ఉండడం మూలాన, నాకు అమ్మను చూచే అవకాశమే లేకపోయింది చాలాకాలందాకా. రోజు రోజుకూ నాకు అమ్మను చూడాలనే ఆకాంక్ష చాలా తీవ్రమయింది. ఆరోజుల్లో ఒక సంఘటన కూడా దానికి తగ్గట్లే జరిగింది. ఢిల్లీలో ఉన్న నాభార్యకు "చెస్ట్ క్యాన్సర్" వచ్చిందని అనుమానం వచ్చి ఆమెను తీసుకునిపోయి డాక్టర్ల చేత పరీక్ష చేయించారు. డాక్టరు అది క్యాన్సరే అని స్థిరపరిచారు. ఇంకా పెద్ద డాక్టర్లకు చూపించగా వాళ్ళు వెంటనే ఆపరేషన్ చేయించుకోకపోతే అది ప్రమాదానికి దారి తీయగలదన్నారు. నాకు చిన్నపిల్లలు కూడా ఉన్నారు. ఆమెను ఆపరేషను కాలంలో కనిపెట్టుకుని ఉండడానికీ నా భార్య ఆసుపత్రిలో ఉండగా ఇంట్లో పిల్లలను కనిపెట్టుకుని ఉండటానికీ నేను ఢిల్లీ వెళ్ళటం తప్పనిసరి అయింది.

కాని నాకున్న సెలవంతా అది వఱకే వాడేసుకుని ఉండటం చేత ఆ సంవత్సరానికి కిక నాకు సెలవు దొరకడం అసాధ్యమయిపోయింది. 1973వ సం॥ వస్తే తప్ప (కొత్త సంవత్సరం తిరిగివస్తే తప్ప) నాకు సెలవు దొరికే అవకాశం కనిపించలేదు.

నాకు భగవంతుడు తప్ప సహాయపడే ఆధారం ఇంకొకటి కన్పించలేదు.

పరమాత్మా ! ఈ చిక్కులు విడదీసి. పరిస్థితులను నాకు అనుకూలంగా మార్చి నన్ను గట్టెక్కించవలసినదని ప్రార్థించడం కంటే నాకు గత్యంతరం లేకపోయింది. ఎటువంటి అఘటనాఘటనల నైనా పరమాత్మ సంభవముగా చేయగలడని నాకు ప్రబలమైన, దృఢమైన విశ్వాసముంది. నా మనస్సులోని భారాన్ని స్నేహితుడు వెంకటేశ్వర్లుతో వెళ్ళబోసుకుని ఏం చెయ్యమంటావు నన్ను, ఈ గండ కత్తెరలో అని అడిగాను.

విచారించకు. అమ్మదగ్గరకు వెళ్ళి ఆమె సలహాను, ఆశీర్వాదాన్ని పొందుదాం అని ఓదార్చాడు వెంకటేశ్వర్లు.

ఆ మరునాడే జిల్లెళ్ళమూడి వెళ్ళి అమ్మకు నా కష్టభారాన్ని నివేదించుకున్నాను. ఆవేదనను అర్థం చేసుకున్న అమ్మ డాక్టర్లు ఏ సలహా ఇస్తే అలాగే చెయ్యి నాన్నా ! దైవ నిర్ణయం నీకనుకూలంగా తప్పక జరుగుతుంది. నా ఆశీర్వాదం ఎప్పుడూ నీకు తోడుగా ఉంటుంది అన్నది.

మర్నాడు నన్ను నాపై ఉద్యోగి తన ఆఫీసు గదిలోకి పిలిచి "నీకేమైనా గృహచ్ఛిద్రాలు, బాధలూ ఉన్నాయా, అలా ఉన్నావేం" అని అడిగాడు.

సహోద్యోగులకు కాని ఆఫీసులో ఇంకెవరికి కానీ నేనీ సంగతి చెప్పకుండానే నా అధికారికి ఈ సంగతి ఎలా తెలిసిందో అని నేను విస్తుబోయాను.

ఆఫీసర్‌కి ఆ క్రిందటి రాత్రి ఎవరో కలలోవచ్చి చెప్పారని తనంతట తానే చెప్పి నన్ను సెలవుదరఖాస్తు పెట్టమన్నారు. హెడ్డాఫీసుకి ఫోన్ చేసి నన్ను టెంపరరీ డ్యూటీమీద మూడు నెలల పాటు ఢిల్లీకి పంపవలసినదని గట్టిగా చెప్పి అంతా స్వయంగా ఏర్పాటు చేశారు.

ఇంకో ఆఫీసరును ఢిల్లీకి పంపి అక్కడ కూడా ఏ అభ్యంతరము లేకుండ పని సాఫీగా జరిగిపోయేలా ఏర్పాటు చేశాడు.

రెండు రోజుల్లో మూడు నెలలపాటు నాకు ఢిల్లీ బదిలీ అయినట్లు ఉత్తర్వులు వచ్చాయి. ఢిల్లీ చేరగానే అతినిపుణులైన డాక్టర్లను సంప్రదించాను. భారతేదేశంలో పెద్ద క్యాన్సర్ హాస్పిటల్ బొంబాయిలో తాతా మెమోరియల్‌కు తీసుకెళ్ళమనీ అక్కడ నవీనమైన యంత్రపరిక్షా సామాగ్రి ఉన్నదని వారు నాకు సలహా ఇచ్చారు.

బొంబాయిలో నా భార్యను శ్రద్ధగా ఆసుపత్రిలో పరీక్ష చేశారు. ఏమీ భయంలేదనీ క్యాన్సర్ ప్రారంభదశలో ఉన్నదనీ, ఆపరేషన్ అవసరం లేదనీ చెప్పారు. ఆపరేషన్ అవసరంలేకపోయినా ఆరు నెలల తర్వాత వస్తే మళ్ళీ పరీక్ష చేసి చెప్తామని అన్నారు. ఆ పరీక్షలో కేన్సర్ చిహ్నాలు లేకుండా సమసిపోయాయని చెప్పారు.

జూన్ 72 ఢిల్లీ నుంచి తిరిగి వచ్చాను. బాపట్లలో తిరిగి డ్యూటీలో చేరాను. ఆ రోజులలోనే బొంబాయికి నేను ట్రాన్సర్ అయినట్లు ఆర్డర్లు కూడా వచ్చాయి. ఒకటి, రెండు రోజుల్లో వెళ్ళటానికి సిద్ధంగా ఉండమన్నారు. నాభార్య విషయంలో అమ్మ నా ముప్పు గడిపినప్పట్నుంచి అమ్మంటే నాకు పరదైవమే అయింది. బొంబాయి వెళ్ళేముందు అమ్మను తప్పకుండా దర్శనం చేసుకుని పోదామనుకున్నాను. కాని వ్యవధి చాలా కొంచెంగా ఉండి ఆఫీసు పనుల వలలో పిట్టలానన్ను బంధించి ఉంచడంవల్ల ఏమీ చేయడానికి పాలుబోక "అమ్మా ! నీ దర్శనం నాకెలా దొరుకుతుందమ్మా" అంటూ ఆర్తితో కాలం గడపసాగాను. నా దురదృష్టాన్ని నిజంగా ఎంతో నిందించుకోసాగాను.

ఇంతలో హఠాత్తుగా టెలిఫోను మీద ఒక సందేశం వినిపించింది. అమ్మ సముద్రపు ఒడ్డుకు వస్తున్నదని వెళ్ళి అమ్మను చూడాలనీ మనసు తహతహలాడింది. కానీ ఆఫీసు విడిచి వెళ్ళటానికి కూడా నాకు పర్మిషను దొరకలేదు. ఆఫీసును విడిచి వెళ్ళకూడదని అతి ప్రధానమయిన డ్యూటీలో ఇరుక్కుపోయాను. ఆనాడు కొన్ని పండ్లు, పూలు ఒక స్నేహితునికిచ్చి నాపరంగా, అమ్మ పాదాల మీద ఉంచి, నా చేతులు అనుకొని నీ చేతులతో ఒకసారి నమస్కరించు" అని చెప్పి పంపాను. కానీ నా మనస్సులో అమ్మ దర్శనాకాంక్ష అతి తీవ్రంగా అగ్నివలె ప్రజ్వలించసాగింది. నేను మెయిన్ గేటు దాకా డ్యూటీమీద వెళ్ళవలసి వచ్చింది.

ఆశ్చర్యం మీరీ మాట నమ్మరు. కారులో స్వయంగా తానే వచ్చింది. అమ్మయే గేటులో సాక్షాత్కరించింది. ఆహో ! ఏమి నా భాగ్యము ! అమ్మకింత సమీపంగా ఉండగలిగినందుకు నా జన్మ ధన్యమైదని పరవశించాను. అమ్మ నా అంతర్యాణిని విని నన్ను అనుగ్రహించటానికి వచ్చినదని గ్రహించి మహదానందంతో పొంగిపోయాను. అని ఇంత కథను చెప్పారు.

7)

1980 వ సం॥లో అమ్మకు అనారోగ్యం ఏర్పడింది. అందుకుగాను హైద్రాబాద్ తీసుకెళ్ళవలసి వచ్చింది. బంజారాహిల్స్ చారిగారింట్లో ఉన్నాము.

అక్కడ ఎక్స్‌రే తీయించారు. ఎక్సరేలో కాన్సర్ వ్యాధి కన్పించింది. ఆ విషయం తెల్సుకున్న రామకృష్ణ అన్నయ్య, దినకర్ ఖిన్నమనస్కులై ఏం చెయ్యాలో పాలుపోక అమ్మకు ఈ విషయాన్ని చెప్పలేక కొన్ని గంటలు పాటు అమ్మకు కనిపించకుండా ఇద్దరూ కలిసి బయటకు వెళ్ళి సాయంత్రానికి గాని ఇంటికి రాలేదు. ఈలోగా అమ్మ ఎన్నిసార్లో అడిగింది. అన్నయ్య వాళ్ళొచ్చాక అమ్మ వాళ్ళిద్దరి ముఖాలను చూసి వాళ్ళు ఏదో దిగులు పడ్తున్నట్లు గ్రహించి ఏమట్రా అట్లా ఉన్నారు అని అడిగింది. ఏమీ లేదమ్మా అని చెప్పారు. ఆ అడగటం అమ్మకు తెలియక కాదు. కాసేపు వాళ్ళను బ్రతిమాలింది. అమ్మకు చెప్పకుండా ఎంతసేపు దాచుకోగలరు. అమ్మ ప్రేమ అవతలి వాళ్ళ ద్వారా చెప్పిస్తుంది. అన్నయ్య తీవ్రమైన ఆవేదన చెందుతూ విషయాన్ని అమ్మ ముందుంచాడు.

అమ్మ చాలా ప్రసన్నవదనంతో "ఇందుకోసమా మీ రట్లా ఉన్నది" అంటూ చాలా తేలికగా అనేసి "నాకు క్యాన్సర్ ఉండదురా" అన్నది. అదేంటమ్మా డాక్టర్లు అంత స్పష్టంగా చెప్పారు. లేదని మమల్ని ఓదారుస్తావెందుకమ్మా అంటూ కళ్ళనీరు పెట్టుకున్నాడు. దినకర్ మరొకవైపు తలవంచుకుని బాధపడ్తున్నాడు. అమ్మ "ఎందుకురా మీకంత బాధ ? నాకు కాన్సర్ ఉండదురా అన్నా ఎందుకు నమ్మరు? మిమ్ముల్ని ఎలా నమ్మించాలిరా ? నాకు లేదు రాదు" అని స్పష్టంగా నిర్దుష్టంగా అన్నది.

"కావాలంటే మళ్ళీ తీయించండి ఎక్సరే అప్పటికైనా మీకు నమ్మకం కలుగుతుందేమో" అన్నది.

వెంటనే ఎక్సరే తీసే డాక్టర్సుకు కబురుచేసారు. ఎక్సరే ప్లాంట్ తీసుకొచ్చి ఎక్స్‌రే తీసారు. అంతకు ముందు తీసిన ఎక్స్‌రేకి మరొక సారి తీసిన ఎక్స్‌రేకి సంబంధం లేదు. అమ్మ హామీ ఇచ్చినట్లుగా ఎక్సరేలో కాన్సర్ సూచనలు లేవు" అమ్మ ఏదైనా చెయ్యగలదు చెయ్యాలనుకుంటే.

అమ్మ ఇచ్చిన హామీ ఎన్నటికీ వృధాపోదు. ఇలాంటి అమ్మలీలులు ఎన్నో ఎన్నెన్నో !

22. ముష్టి దేవుడు

అమ్మ బాల్యంలో భారతీదేవిగారు అంటే అమ్మ చిన్న తాతగారు చిదంబరరావు గారి కూతురు అమ్మ చేతిలో మూడు అణాలు పెట్టి సూది, దారం తీసుకురమ్మన్నదట. అమ్మ సరేనని డబ్బులు తీసుకుని ఇన్‌కమ్‌టాక్సు ఆఫీసు మీదుగా వెళ్తుండగా ఎవరెవరో ముష్టివాళ్ళు, కుంటివాళ్ళం, గుడ్డివాళ్లం అంటూ ఎదురు వస్తారు. కరుణార్ద్ర అయిన అమ్మ ఆ మూడు అణాలు వారి చేతిలో పెట్టి వెళ్తుండగా దారిలో ఉన్న బ్రహ్మాండం వారి సత్రం చూసింది. ఉదయం అన్నం పెట్టిన మరికొందరు బిచ్చగాండ్రు భోజనాలు చేస్తున్నారు. అమ్మ అదృశ్యం చూసి 'మన ఇంట్లో మనం ఉన్నట్లుగా మీరు ఇక్కడ ఉన్నారే- ఇది మీ ఇల్లా" అని అడిగింది. "ఇది మా ఇల్లు కాదమ్మా ! సత్రం" అని అన్నారు. సత్రం అంటే ఇదా అందరికీ స్వతంత్రమేనా" అనుకుంటుండగా ఆ దారిన పోయే ఓ కుర్రవాడు విని చక్కని నిర్వచనమమ్మా అన్నాడు. "ఈ ఎదురుగా ఉన్నదేమిటి ?" అని అతనిని ప్రశ్నించింది. అది ఆంజనేయస్వామి దేవాలయము ఇది దత్తమఠమని ఇవన్నీ బ్రహ్మాండంవారివనీ చెప్పాడు.

అప్పుడు అమ్మ దేవస్థానం లేని ఊళ్ళో దేవాలయమూ, సత్రంలేని చోట సత్రమూ కట్టిస్తే ఎంత బాగుండును అనుకున్నది. ఆ చిన్న వయస్సులో పెద్ద ఆలోచన చేసింది. అమ్మ నిర్ణయం తిరుగులేనిది కదా. తన ఆలోచన కనుగుణంగానే ఏమీలేని కుగ్రామమైన జిల్లెళ్ళమూడిని తన నివాసస్థానంగా ఎన్నుకుని 1941వ సంవత్సరంలో తన పవిత్ర పాదస్పర్శచే పునీతం చేసింది. ఆధ్యాత్మిక సంపన్నులచే ముక్తిస్థానంగాను శక్తికి కేంద్ర బిందువుగాను పేర్కొనబడి విరాజిల్లుతున్న దీనాడు.

అమ్మ కళ్యాణ మహోత్సవమైన మే 5వ తేదీ (1956 వ సంవత్సరంలో) పసివయస్సులో తన మనస్సులో కలిగిన ఊహకు రూపకల్పన చేసి దేవాలయానికి శంకుస్థాపన చేయటం జరిగింది. ఆ ఆలయ నిర్మాణం అమ్మ పర్యవేక్షణలోనే జరిగింది. నిర్మాణం జరుగుతుండగానే పునాదులవరకు వచ్చిన దగ్గర్నుంచీ అమ్మ అక్కడే తరచుగా తిరుగుతూ, దర్శనాలు ప్రసాదిస్తూ అక్కడే పండుకుంటూ ఉండేది.

అది ఒక ప్రాతః సమయం. "ఇక్కడ స్నానానికి హాయిగా బాగుందమ్మా ఈ పూట ఇక్కడ స్నానం చేయిస్తామమ్మా" అన్న మా కోరిక మేరకు అమ్మ

అంగీకరించింది. స్నానానికి సిద్ధం చేశాము. శ్వేత వస్త్రధారిణి అయిన అమ్మస్టూలు మీద ఆసీన అయింది. ఆ రోజుల్లో పంపులు లేవు చెరువు నుండి నీళ్ళు తేవాలి. అమ్మ స్నానానికి గానీ, భోజనాలకు గానీ ఆవరణలో ఉన్న వాళ్ళం అంతా ఎదురువెళ్ళి పోటీలుగా, స్పీడుగా తెచ్చేవాళ్ళం.

అమ్మకు కేవలం ఒంటిమీద కాకుండా శిరఃస్నానం (పూర్ణాభిషేకం) జరుగుతున్నది. నీళ్ళు తెచ్చేవాళ్ళు తెస్తున్నారు. పోసేవాళ్ళు పోస్తున్నారు. శ్వేత వస్త్ర ధారిణి అయిన అమ్మ సజీవమైన పాలరాతి శిల్పంలా మెరిసిపోతున్నది. ఆ అమ్మను చూస్తూ స్నానం చేయిస్తూ ఆనందపారవశ్యంలో మునిగిపోయాం. అలా ఓ గంట గడిచింది. ఇంతలో నాన్నగారి ప్రవేశం జరిగింది. శిలావిగ్రహంలా ఉన్న అమ్మను చూశారు. అలాగే అమ్మ ఉండిపోతుందేమోనన్న ఆందోళన వ్యక్తం చేశారు. "ఏమిటా స్నానాలు ఆపండి" అని సీరియస్‌గా ఒక కేక పెట్టారు. నిశ్శబ్దం ఆవహించిన వాతావరణం ఏర్పడింది. పతి దేవుని కంఠధ్వని వినగానే అతి ప్రసన్నంగా చిరుమందహాసంతో కనులు తెరిచింది. మార్చి, మార్చి అందరినీ ఒకసారి పరికించి చూసింది. నాన్నగారి మాట వినాలి కదా అన్నట్లుంది.. ఆ చూపులోని ఆంతర్యం. వెంటనే లోపలికి వచ్చేసింది. ఈ నాటికీ అదృశ్యం మరుపురాని క్షణం. మరొకరోజు అధరాపురపు శేషగిరి రావన్నయ్య కిరీటధారిణి పాదాలను అయిన అమ్మ తమలపాకులతో అందంగా అలంకరించి అర్చన చేశాడు. ఇంకా అక్కడ మంత్రోక్తంగా అభిషేకం చేశాడు రామకృష్ణన్నయ్య. ఇంకా ఎన్నో ఎన్నో విశేషార్చనలు జరిగినై. ఇదంతా ఇప్పుడు మూలవిరాట్ ఉన్న స్థలంలో 1962లో దీపావళి రోజు ఆలయం చుట్టూ కొవ్వు వత్తులతో అలంకరించి గర్భాలయానికి ఎదురుగా వాకిలికి ఇరుప్రక్కలా బొప్పాయి చెట్లు పెట్టి మైనపు వత్తులతో అలంకరణ చేశారు. ధవళవస్త్రాన్వితయై తేజోమూర్తి అయిన అమ్మ దీపాలంకరణ మధ్య బొప్పాయి చెట్ల మధ్య భాగంలో నుంచుని దీపావళి మందులు వెలిగిస్తుంటే ఆలయానికి తేజస్సును విరజిమ్ముతున్నట్లుండేది.

ఈ ఆలయంలో ఏ దేవుడ్ని పెడతావమ్మా ? అన్న ప్రశ్నకు "ముష్టిదేవుడ్ని పెడతాను" అని అమ్మ సమాధానం. ఆ ముష్టిదేవుడు ఎవరో మనం తెలుసుకోవాలి.. ఈ ఆలయం అమ్మ పవిత్ర పాదస్పర్శతోనూ, అమృతకర స్పర్శతోనూ అణవణువూ పునీతమైనదే.

శ్రీశ్రీశ్రీ పూర్ణానంద స్వామిజీ శిష్య పరమాణువు శంకర్ ఆలయంలో మండల దీక్షతో అమ్మవారి ఉపాసన చేశాడు. తత్ఫలితంగ ఉపాసనమూర్తి అమ్మ వెళ్ళి అతని శిరస్సుపై తన అమృత హస్తముంచి ఆశీర్వదించింది.

అంధుడైన సోదరుడు రాధాకృష్ణరెడ్డి ఆ ఆలయంలో దీక్షగా అమ్మనామ సప్తాహం చేశాడు. ఆ ఏడు రోజులు ఒక్క మంచినీటి చుక్కయినా తీసుకునేవాడుకాదు. అమ్మ అతని దీక్షను చూసి ఈ సమయంలో అతని శరీరంలో రక్తమే నీరుగా మారి అతని దాహం తీరుస్తుంది అనేది. ఈ దీక్షావిరమణ పిమ్మట "మరెప్పుడైనా మళ్ళీ దీక్ష చేస్తాను అంటే ఆహారం తీసుకుంటూ చేసేటట్లయితే చెయ్యి" అని అతనిని ఒప్పించింది. అన్ని బాధలకంటే ఆకలి బాధే ఎక్కువ అనే అమ్మ పస్తులుంటే సహించలేదు కదా ! ఒక నియమం ప్రకారం పద్ధతిగా ఆహారం ఇవ్వమని నన్ను ఆదేశించేది.

ఆ ఆలయమే తన స్వస్థానంగా తన స్వగృహంలా మసిలేవాడు. అక్కడ తను అనేక మహిమలను దర్శించానని చెప్పాడు. కొందరు నృత్యగానాలతో, గజ్జెల చప్పుళ్ళతో అమ్మ నామం చేస్తూ కనిపించేవారట.

1981లో నాన్నగారు సిద్ధిపొందక మునుపే గుడిలో నుంచి ఖాళీచేసి బయటకు వచ్చేయి. నీ నివాసం మార్చు అని చెప్పింది. కాని అతను అక్కడ్నుంచి "కదల్లేదు, నన్నెవరు ఖాళీ చెయ్యమంటారు ? నేనెందుకు చెయ్యాలి ?" అని ధీమాగా ఉన్నాడు. గర్భగుడిలో పెట్టుకున్న అతని బట్టలు పోయాయి. అయినా అతనికి అక్కడ్నుంచి లేద్దామన్న భావం కలగలేదు. అమ్మే ఇస్తుంది, ఎవరికోసం ఇస్తుంది అన్న భావమే. ఎందుకమ్మా రాధన్నయ్యను గుడి ఖాళీచెయ్యమంటున్నావని ఒకరోజు అమ్మనడిగాను. "గుడిలో చోటు ఉంటే మేడల్లో మిద్దెల్లో ఉండాల్సిన పనేమున్నది" అన్నది. ఈ మట్టి బుఱ్ఱలకు అందులో అంతర్భావం ఏమర్థమవుతుంది

తర్వాత కొద్ది రోజులకే నాన్నగారు సిద్ధి పొందటం జరిగింది. 1981 ఫిబ్రవరి 17వ తేదీ ఆలయంలో నాన్నగారిని ప్రతిష్ఠించటానికి నిర్ణయించింది. నాన్నగారి పక్కన తన స్థానాన్నీ నిర్దేశించి, నాన్నగారి ప్రతిష్ఠను పూర్తిచేసి ఆనాటి నుండే మహన్యాస సహిత ఏకాదశ రుద్రాభిషేకాలు, రెండు పూటలా సహస్రనామార్చనలను, నాన్నగారు సిద్ధిపొందిన రోజు కనుక లక్షనామార్చనను జరపటానికి నిర్ణయం జరిగింది.

అనాడే అఖండ దీపారాధనను అమ్మ స్వయంగా వెలిగించింది. హైమాలయంలోని అఖండ జ్యోతి కూడ అమ్మ వెలిగించిందే ఆలయంలో జరగవలసిన విధానానలు, పద్ధతులనూ స్వయంగా నిర్ణయించి, నిండు నాలుగు సంవత్సరముల కాలం తన పర్యవేక్షణలో జరిపింది.

పిల్లలకు మనం కొన్ని పద్ధతులు నేర్పి ఇహ ఫర్వాలేదు. వాళ్ళు నేర్చుకుంటారు. అని పెద్దలు ధైర్యం వహించినట్లు అమ్మకో ధైర్యం వచ్చినట్లుంది పాపం. నాన్నగారు రాగానే అమ్మలేచివెళ్ళేది. అలాగా నాన్నగారి పిలుపు నందుకున్న అమ్మ జూన్ 12 (1985) వ తేదీ నాన్నగారి సన్నిధికి వెళ్ళింది.

నిజంగానే ఒక సోదరికి నాన్నగారు కన్పించి మీ అమ్మగారిని తీసుకెళ్తున్నానని చెప్పారట. ఆ అమ్మాయి లేచేసరికి అమ్మ ఆలయ ప్రవేశవార్త అందుకని జిల్లెళ్ళమూడి చేరింది. నాన్నగారి తర్వాత శిఖర ప్రతిష్ఠకు తొందరపడి లక్ష్మీ నారాయణన్నయ్య చేత అది పూర్తి చేయించింది.

గృహ నిర్మాణం పూర్తి చేసుకుని మనం గృహప్రవేశం అయినట్లే. అమ్మ ఆలయ కార్యక్రమం, విధానాలు అన్నీ సంపూర్తిగావించుకుని ఆలయ ప్రవేశం చేసింది. అమ్మ తర్వాత ఆ ఆలయం పూర్తి వెనుకభాగంలో తోచక కూర్చునుండగా సామూహికమైన ఓంకార నాదాల సవ్వడి శ్రవణ పేయంగా వినిపించింది. గుళ్ళో ఎవరూ లేరే అనుకుంటూ లోపలికి వెళ్ళాను. ఆధ్వని తప్ప మరేమీ లేదు.

అమ్మను ఒక సోదరుడు "అమ్మా ! నల్లబడ్డావే మమ్మా" అని ప్రశ్నిస్తే ! మీ గురించి ఆలోచనతో నాన్నా" అన్నది. అమ్మ చెప్పినట్లుగానే నల్లరాతితో అమ్మ మూర్తి రావాలని అమ్మ ఇచ్చిన ఆదేశమే ఎప్పుడూ మన గురించే ఆలోచించే అమ్మ అమ్మ రావాలనుకున్నది కాబోలు.

అమ్మ ముష్టిదేవుడ్ని పెడతానన్నది కదా ! అమ్మ. మాట నిలబెట్టుకున్నది మనందరికి కరుణ అనే ముష్టిని ప్రసాదిస్తూ ఎవరికి ఏది అవసరమో అది ఇస్తానన్నది అమ్మ వాగ్దానం. అది ఏ రూపంలోనైనా కావచ్చు. మనను అనుగ్రహించి భిక్షపెడ్తోంది. నాన్నగారు ఉత్సవమూర్తి, కళ్యాణ మూర్తిగానే కాక అర్చామూర్తి, అభిషేక మూర్తిగా కూడా అమ్మ సరసన ఆసీనురాలైనారు.

శివశక్తి స్వరూపులైన వారిద్దరూ అనసూయేశ్వరాలయంలో కొలువై మనకు అనుగ్రహముష్టిని వెయ్యటానికి సిద్ధంగా ఉన్నారు.

23. అమ్మతో మద్రాసు విలేఖరులు

1975వ సంవత్సరంలో మద్రాసులో ఉన్న అమ్మ సంతానం అమ్మను మద్రాసు రమ్మని అభ్యర్థించారు. అమ్మవారి కోరికను మన్నించి అంగీకరించింది.

మార్చి 24వ తేదీ సోదరీ సోదరులతో కలసి మద్రాసు చేరింది.

ఆళ్వారు పేటలో శ్రీమాన్ శ్రీనివాస అయ్యంగారి స్ట్రీట్‌లోని చుండూరి సీతారామయ్యగారి కొడుకు అచ్యుతరామ్‌గారి ఇంట్లో బసచేసింది. అది వారి అదృష్టం. హేమ మాలినీ కళ్యాణ మండపంలో అమ్మ దర్శనానికి ఏర్పాటు జరిగింది. అక్కడ ఉదయం, సాయంత్రం అసంఖ్యాకమయిన తన సంతానానికి దర్శనం ప్రసాదించి వారిని ఆశీర్వదించింది.

అమ్మ రూములోకి వచ్చాక కూడ ఎడితెరిపిలేకుండా దర్శనాలు జరుగుతూనే ఉండేవి. వాళ్ళ కష్టసుఖాలు విన్నవించుకుని ఓదార్పు పొంది వెళ్ళేవారు.

27వ తేదీ మధ్యాహ్నం పత్రికా విలేఖరులు వచ్చి అమ్మను దర్శించారు. వారిలో ఒక విలేఖరి అమ్మా ! మీరు మద్రాసు రావటంలో ఆలోచన ఏమిటి ?

అమ్మ : అమ్మనని అనుకున్న తర్వాత రావటంలో ఆలోచన ఏమున్నది ?

విలేఖరి : స్థానికంగా అక్కడ (జిల్లెళ్ళమూడిలో) వివిధ సందర్భాలలో అర్చనకు అనుకూలంగా పూజా విధానం ఏదైనా ఉన్నదా ? ఏదయినా ఒక పద్ధతి ఉన్నదా ?

అమ్మ : పద్ధతి అంటూ ఏమీ లేదు. చేసుకుండే వారి ఇష్టానుసారమే.

విలేఖరి : మీరు ఎన్ని దినాలుంటారు ? అమ్మ మౌనంగా ఉన్నది.

విలేఖరి : ప్రపంచానికి మీ దర్శనమే కాక మీరు చేయగలిగిన మంచి ఏమిటి ?

అమ్మ : తల్లి ప్రత్యేకించి చేసేమున్నది ?

విలేఖరి : మీ సన్నిధిలో ఉన్న కళాశాల విద్యార్థులు మీ బోధలు ప్రచారం చేస్తారా ?

అమ్మ : వాళ్ళకు విద్య చెప్పిస్తున్నది ప్రచారానికని కాదు. ఎందుకైనా ఉపయోగపడవచ్చు.

విలేఖరి : మీకు శిష్యకోటి ఉన్నారా ?

అమ్మ : నాకు శిష్యకోటి ఎవరూలేరు. శిశుకోటి మాత్రమే.

విలేఖరి : మీ సన్నిధికి విదేశాల నుండి ఎందరోవస్తారు. వారికున్న మతాన్ని వదిలి ప్రత్యేక మతాన్ని అవలంబిస్తున్నారా ?

అమ్మ : వారి మతాన్ని గురించి కాని వారి అభిమతాన్ని గురించి కాని నాకు ఆలోచన లేదు. వారికి ఏది తృప్తినిస్తుందో, వారికి ఏది ఉపకరిస్తుందో, వారికి కావలసిన వసతి చూడటమూ, ఆకలి అయినపుడు వారికి అన్నం పెట్టడం ఇవే తెలుసు నాకు.

విలేఖరి : ప్రేమకు, ఆరాధనకు తేడా ఉన్నదా ?

అమ్మ : ప్రేమలో ఆరాధన, ఆరాధనలో ప్రేమ ఉన్నాయి. పిల్లవానిపై చూపెడితే ప్రేమ. విగ్రహముపై చూపెడితే ఆరాధన.

విలేఖరి : తెలిసి తప్పెందుకు చేస్తారు ?

అమ్మ : తప్పని తెలిసి తప్పించుకోలేక తప్పనిసరై తప్పు చేస్తారు. ప్రత్యేకించి వేరే కారణం లేదు. నీవు కారణం కాదు. నీవు చేయడం లేదు. కాలమే కానీ నీవు కారణం కాదు. కాలమంటే – దైవమనే దైవమే కారణం.

విలేఖరి : జీవితమంతా తప్పులైతే విమోచన ఏదీ ?

అమ్మ : అన్నీ తప్పులే చేయలేవు.

విలేఖరి : చేస్తున్నాను.

అమ్మ : దైవమే చేయిస్తున్నదనుకుంటే ఏదీ లేదు. పోనీ ఈ భావం కూడా నీకు అందకపోతే తప్పులే చేయి, నాదీ బాధ్యత.

విలేఖరి : ఆచారం తరిగింది. అనాచారం పెరిగింది. నాస్తికత పెరిగి పవిత్రత అడుగంటింది. ఫ్యాషన్లు మనస్సును లొంగదీసుకున్నాయి. ఈ స్థితిలో మాబోటి వాళ్ళం ఏమి చేయాలి ? అన్నిటినీ మౌనంగా భరించాలా ? ఎదురు

నిల్చి ఆస్తిక ప్రచారం ప్రారంభించాలా ?

అమ్మ : ప్రచారమనే ప్రశ్నేలేదు ?

విలేఖరి : యాంటీ ప్రాపగాండా అవసరం లేదా ?

అమ్మ : ఎన్నో జరిగిపోయాయి.

విలేఖరి : దేవుని పటాలు కాల్చివేస్తున్నారు. ఇంట్లో ఆస్తికులుగా ఉంటూ బయట నాస్తిక ప్రచారం చేస్తున్నారు.

అమ్మ : ప్రచారమంటే మాటల్లో లేదు. మనస్సు మారటమే. ప్రచారం కానీ మాటలు కావు. పరిస్థితుల మాటలు రావాలి. కానీ మాటల వల్ల ఏదీ జరుగదు. మాటలు బలం చాలు. దానంతట అదే జరిగి పోతున్నది.

విలేఖరి : అయితే ఏం చెయ్యమంటావు ?

అమ్మ : ఏం చెయ్యనక్కర్లేదు. ప్రచారం అన్నింటికీ జరిగినా ఉన్నదే నిలుస్తుంది. ఉన్నది మనస్సే. ఒకరిని గురించి ఒకరు చెప్పుకోవడం ప్రచారమే. చెడు అలాంటిదే. ఉన్నదే దైవమనుకున్నప్పుడు వీడి ప్రచారమనీ, వాడి ప్రచారమనీ లేదు. ఏది జరిగినా ఆశక్తే.

విలేఖరి : ప్రభుత్వ మద్దతులో ఆఫీసులలో దేవుని పటాల విధ్వంసం ప్రతీకారానికి మాకు బలమోట్లా వస్తుంది. మేము విడిచి పెట్టాలా, చూస్తూ కూర్చోవాలా ? మేం ఏం చేయాలి ?

అమ్మ : దేవుడనేది భావమే కదా ! ఆ భావాన్ని తీసివేయలేవు. కాల్చి వేయలేవు. ఫోటోలు తీసివేయగలరు కాని మీ భావాన్ని తీసివేయలేరు. మీ భావాలను ఎవరు ఛేదించగలరు. పోనీ దేవుడే బలహీనుడై మానవుడే బలవంతుడయితే కాలిస్తే మాత్రం ఏం ?

విలేఖరి : గుడికి వెళ్తే మమ్ముచూచి వాళ్ళు నవ్వుతారు.

అమ్మ : వాళ్ళను చూసి మీరు నవ్వితే సరి.

విలేఖరి : మీనుంచి ప్రజలకేమన్నా సందేశం.

8)

అమ్మ : సందేశమా ! ఆ పేరుతో నా దగ్గర ఏదీ లేదు. సందేశంగా ఏదీ చెప్పలేదు. ఏదైనా మనం చేయగలం అనికానీ, చేస్తున్నామని కానీ అనుకుంటే కదా ! జరిపించేది. జరిగేది సందేశం. మాటలే సందేశం కాదుగా మీరు చేయగలమని మీరు అనుకుంటే మీకున్నది తృప్తిగా తిని ఇతరులకు ఇంత ఆదరణగా పెట్టండి. అంతాదైవమే చేస్తున్నదని నమ్మండి.

విలేఖరి : సంప్రదాయ సిద్ధమైన పూజా పద్ధతులను మార్చవచ్చునా ? లేక దాన్ని అలాగే కొనసాగించవచ్చునా ?

అమ్మ : మీకు ఎట్లా తృప్తిగా ఉంటే అట్లా చేసుకోండి.

విలేఖరి : మీరు తమిళనాడు పర్యటించినట్లుగానే భారతావని అంతా మీ పాదస్పర్శతో పునీతం చెయ్యాలి. అమ్మా అంటూ అమ్మ పాదాలపై తలవాల్చారు. అమ్మ చిరునవ్వే సమాధానం అమ్మ అన్నం తెప్పించి కలిపి వారందరికీ ప్రసాదం పెట్టింది. అమ్మ అమృతహస్తంతో పెట్టిన ప్రసాదం తిన్నందుకు వారు ధన్యులము అమ్మా అంటూ సెలవు తీసుకుని వెళ్ళారు.



24. అదృశ్యరూప అమ్మ

1964 లో ప్రస్తుతం అఖండనామం జరుగుతున్న ఇంట్లో అమ్మ నివాసం. ఒక రోజొక చిద్విలాసం చేసింది.

జిల్లెళ్ళమూడి నివాసి అయిన డా॥ సాంబయ్య బాపట్ల నుండి వచ్చి ఏడవమైలు నుంచి నడిచి వస్తుండగా నిర్మాణం జరుగుతున్న అన్నపూర్ణాలయం డాబా దగ్గర ఒంటరిగా నిల్చున్న అమ్మను చూశాడట. అమ్మ ఇక్కడ ఒంటరిగా ఉన్నదేమిటి ? అని అనుకుని తనతో ఉన్నవారితో అమ్మ ఇక్కడ ఒంటరిగా ఎందుకు నిలబడ్డట్లు అని అన్నాడట. సాధారణంగా అమ్మ పక్కన ఎవరైనా ఉండటం అలవాటు. అమ్మను ఒంటరిగా ఉంచటం అలవాటు లేదు కనుక ఆయనకు ఆశ్చర్యం కలగటంలో విశేషం లేదు. తోటి వాళ్ళు అమ్మ కాదేమో అన్నారట. అమ్మ కాకపోతే ఆ పోలికలతో యింకెవరున్నారు ? అన్న ఆలోచనలతోనే ఊళ్ళోకొచ్చాక పూలు, పళ్ళు తీసుకుని అమ్మ ఇంటికి వచ్చాడు. అక్కడ రామకృష్ణన్నయ్యతో మాట్లాడుతున్న అమ్మను చూచి దిగ్భ్రాంతితో యిప్పుడే ఆ డాబాదగ్గర కనిపించావు కదమ్మా ! అని ప్రశ్నించాడు. 2 గంటల నుంచి ఎక్కడకీ కదలకుండా రామకృష్ణతో మాట్లాడుతూ ఇక్కడే కూర్చున్నాననీ, తనకేమీ తెలియదనీ అతి ప్రసన్నంగా జవాబిచ్చింది. సర్వవ్యాపిని అమ్మ. సాంబయ్య అప్రతిభుడై నీ లీలను మేము తెలుసుకోగలమా ! అంటూ అమ్మ పాదాలకు మోకరిల్లాడు.

అమ్మ వాత్సల్యాన్ని పొందిన సోదరి లలిత పూజకోసం పెరట్లోని పూలుకోసుకురమ్మని వారి అమ్మాయి లక్ష్మిని పంపబోతుండగా పెరట్లోపూలుకోస్తున్న 12 సంవత్సరముల పిల్లను చూసింది. లక్ష్మి ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళి ఏ అమ్మాయ్ పూలు మాకు పూజకు కావాలని అంటుండగా ఆ అమ్మాయి వీరి వైపు తిరిగింది. ఆ అమ్మాయి నుదుట పెద్దబొట్టు ఉన్నది. ఆశ్చర్యంగా చూసేటంతలోనే అదృశ్యమైనదట. బాలగా ఆమెకు దర్శనమిచ్చింది. ఇది అమ్మలీలగా తమ అదృష్టంగా భావించింది. "బాలా ! లీలావినోదిని" కదా అమ్మ.

1971లో ఓ రోజు గుంటూరు నుండి అన్నపూర్ణాలయానికి సరుకులు వచ్చాయి. రామకృష్ణన్నయ్య ఆ సామాను సర్దించి వాత్సల్యాలయానికి అమ్మ

దగ్గరకు వచ్చేసరికి 12 గంటలు దాటిందిట. అన్నయ్య తలుపు తట్ట పిలిచాడట. కాని మాకెవరికీ వినిపించలేదు.

అమ్మే తలుపు తీసిందిట. మర్నాడు లేచాక అక్కడ ఉన్న మమ్మల్ని మందలించాడు. నేను, ఇంకెవరు వున్నారో గుర్తులేదు. అమ్మ లేచి వచ్చి తలుపు తియ్యాలా ? మరీ అంత నిద్రపోతే ఎట్లా ? అని.

అమ్మ రాత్రి గాఢంగా నిద్రపోయింది. అమ్మ మంచం దిగలేదు. మేము ఎవ్వరమూ నిద్రపోకుండా అమ్మను చూస్తూ కూర్చున్నామని చెప్పాను. అన్నయ్య ఆనందంగా ఇది అమ్మ లీలగా భావించి రాత్రి అమ్మే వచ్చి తలుపు తీస్తే నువ్వు వచ్చావు ఎవరూ లేరా అమ్మా ! అంటే అందరూ నిద్రపోతున్నారు వాళ్ళను లేపటం ఎందుకులే అని నేనే వచ్చాను. పగలల్లా ఈ పనీ, ఆ పనీ చేసి ఉంటారు. అలసట చెంది వళ్ళు మరిచి నిద్రపోతారు. ఈ నిద్రేలేకపోతే వారికి పగలల్లా మత్తుగా ఉంటుంది. నేనంటావా ? పనీ, పాటా లేనిదానను కనుక అలసటా ఉండదు. ఆకలి ఉండదు. నిద్రా ఉండదు, నీరసమూ వుండదు. అని అమ్మ చెప్పిందని చెప్పగా ఆశ్చర్యపడటం మా వంతయింది. అన్నయ్యకు అనుభూతిని ప్రసాదించటంతో పాటు మాపై అమ్మ మిక్కుటమైన ప్రేమను వ్యక్తం చేసింది అనురాగమయి అమ్మ.

ప్రస్తుతం నేను ఉన్నగదిలో దోమలు ఎక్కువగా ఉంటే ఓ రోజు కిటికీ రెక్కలన్నీ వేశాను. పడుకునే సమయంలో వెంటిలేషన్ ఉండదని తోడుపడుకున్న ఒక విద్యార్థిని చేత ఒక కిటికీ తలుపులు తీయించి పడుకున్నాను. కొంత సేపయ్యాక ఓ స్త్రీమూర్తి ఒక కిటికీ గడియ వెయ్యటం స్పష్టంగా కనిపించింది. అదికలగా భావించాను. 2 గంటల సమయంలో నేను లేచి కళ్ళు తెరిచేసరికి వాస్తవంగానే కిటికీ రెక్కలు వేసి ఉన్నాయి. తీసి పడుకున్నాం కదా అనుకున్నాను. జరిగింది కలకాదు అమ్మే తలుపువేసింది అని స్పష్టమయింది. తెల్లవారి విద్యార్థిని ఆశ్చర్యంగా నన్ను తియ్యమని మీరు వేశారేమిటన్నది. నేను కాదమ్మా వేసింది ఇది అమ్మ లీల అని చెప్పాను. అన్నింటి కన్న విలువైనది అవసరం అనికదా అమ్మ సూక్తి వెంటిలేషన్ కంటే దోమల బాధ లేకుండా చెయ్యటం అవసరమనుకున్నది. మనకు ఏది అవసరమో దాన్నిబట్టి చేస్తానన్న అమ్మ కొన్ని చేసి చూపెట్టితే గాని మనని అమ్మ కనిపెట్టే ఉన్నదని అర్థం చేసుకోలేని అజ్ఞానులం కదా. భక్తిప్రియ, భక్తివశ్య

అయిన అమ్మ ఎందరికో ఎన్ని రకాలుగానో దర్శనాలను, నిదర్శనాలను చూపిస్తోంది.

ఆ భక్తుల అవసరాలను బట్టి సందర్భాన్ని బట్టి మరో వ్యక్తి రూపంలో సాయం చేసే సన్నివేశాలు ఉన్నాయి.

రామకృష్ణన్నయ్య 1977లో విశాఖపట్నం నుండి మద్రాసు రైల్లో వెళ్ళాడు. దారిలో టి.సి. టికెట్ తీసుకుని ఇవ్వకుండా వెళ్ళాడు. మద్రాస్ సెంట్రల్ స్టేషన్‌లో దిగి టికెట్ కోసం వెతుక్కుంటే టి.సి. ఇవ్వని విషయం గుర్తుకు వచ్చి అతను కనిపిస్తాడేమోనని వెతికి అతను కనపడక ఆందోళన చెందుతూ బయటకు వెళ్ళే దారితెలియక తికమక పడుతుండగా ఒక కూలీవాడు వచ్చి ఆందోళన చెందుతున్న అన్నయ్య దగ్గరకు వచ్చి "మీరేమి కంగారపడకండి. మీ సామానులు తీసుకుని నేను ముందునడుస్తుంటాను మీరు పక్కలకు కూడా చూడకుండ నావెంటరండి" అని సలహా ఇచ్చాడు. సందేహంగా, ఆలోచనగా చూసే అన్నయ్య వంకచూస్తూ "మీకేమి భయంలేదు. నేనున్నాను నావెంటరండి" అని అభయమిచ్చినట్లు మాట్లాడి సమాధానం కొఱకు ఎదురుచూడకుండానే సామానులు నెత్తిన పెట్టుకుని ముందుకు సాగాడు. అన్నయ్య అతన్ని అనుసరించాడట. బయటకు వచ్చాక సామాన్లు వప్పజెప్పి కూలి డబ్బులు అడక్కుండ తీసి ఇచ్చే వ్యవధి లేకుండా వెళ్ళిపోయాడట. తన ఆందోళన చూడలేక అమ్మే ఆ కూలీ రూపంలో వచ్చి ప్రేమనందించి వెళ్లిందనుకున్నాడట. అమ్మ "మంచిని మించిన మహిమలు లేవంటూనే" మహిమలను కనబరుస్తూ తన అనుగ్రహ వర్షాన్ని మనపై కురిపించే అమ్మను సదా స్మరిద్దాం.



25. మూఢభక్తి

1959 వ సంవత్సరములో జిల్లెళ్ళమూడిలో ఒకరోజు అమ్మకు క్షీరాభిషేకం జరుగుతున్నది. ఈ వార్త గ్రామస్తులందరికీ తెలిసింది. గ్రామస్తురాలైన కర్రి రాఘవమ్మ అమ్మ అంటే మూఢభక్తి కలవ్యక్తి. ఆమె క్షీరాభిషేకం జరుగుతున్నదన్న వార్త విని ఆ పవిత్ర కార్యక్రమంలో తానూ పాల్గొనాలన్న ఆరాటంతో అభిషేకం అయిపోతుందేమోనన్న ఆదుర్దాతో పొయ్యిమీద సలసలా కాగుతున్న కుండలోని పాలు ఒక గిన్నెలోకి వంచుకుని అతి వేగంగా అమ్మ దగ్గరకు వచ్చింది. అమ్మను చూస్తు ఆ వేడిపాలు అమ్మ పాదాలపై కుమ్మరించింది. సెగలు వస్తున్నె. అంతవరకూ అవి వేడి పాలని ఎవరికీ తెలియదు కదా ! అది చూచిన మాకు భయాందోళనలు కలిగాయి. అమ్మకేమవుతుందో నన్న ఆదుర్దా. కాని అమ్మ వెంటనే తలపైకెత్తి రాఘవమ్మను చూచింది. చూపుల్లో అనుగ్రహమే కాని ఆగ్రహం కన్పించలేదు. ఆ కన్నుల్లో కరుణజాలు వీచింది. భక్త్యావేశాలకు లోనైన ఆమెకు ఒళ్ళుతెలియలేదు.

అతి సున్నితమైన అమ్మ శరీరం ఎలా ఉన్నదో నన్న వేదనతో అమ్మ లోపలకు రాగానే మరీ అంత వేడిపాలు కుమ్మరించిందేమిటమ్మా! ఎట్లా ఉన్నదమ్మా? చాలా భయంగా ఉన్నదమ్మా అంటే నాకేం కాలేదు. బాగానే ఉన్నాను. ఆమెకు నా దగ్గరకు రావాలన్నా తొందరలో వేడిపాలన్న గమనిక లేదు. త్వరగా అభిషేకానికి రావాలన్న ఆరాటమే తప్ప ఆలోచనలేదు. పాపం దానిది మూఢభక్తి అని ఆమె తప్పును సైరించింది. తన బాధను సహిస్తూ ఆమెపై వాత్సల్యాన్ని కురిపించింది. దయామయి అయిన అమ్మ.



26. అన్ని జీవరాసులకూ సుగతే

మన దృష్టిలో మనుషులు మాత్రమే లెక్క. జగన్మాత అయిన అమ్మ దృష్టిలో ప్రతి ప్రాణీ తన సంతానమే కదా. అందరూ, అన్ని రకాల ప్రాణులు తింటే కాని తల్లికి తృప్తి ఉండదు.

1950 సంవత్సరంలో గ్రామంల కొన్ని కుక్కలకు పిచ్చి ఎక్కిందని ఊరివారు వాటి తలల మీద కొట్టి ఊరికి దూరంగా పారేశారు. వాటిలో ఉన్న 2 కుక్కలు ఆ కొట్టిన దెబ్బలకు మరణించక స్పృహ వచ్చాక నడవటానికి ఓపికలేక పోయినా తగిలిన గాయాలు బాధపెడుతున్నా పరిగెత్తుకొని వచ్చి అమ్మ సన్నిధికి చేరాయి. అమ్మ మజ్జిగ చిలుకుతుంటే కింద పడ్డ మజ్జిగ చుక్కలు నాకి అమృతాన్ని ఆస్వాదించినట్లు దానిలో ఒక కుక్క తేరుకున్నది. మజ్జిగ చుక్కలు నాకినంత మాత్రాన తేరుకునే స్థితి మాత్రం కాదు. ఒకటి అమ్మ పాదాల మీద వాలి ఆత్మార్పణం చేసుకొన్న ధన్యజీవి.

తేరుకున్న కుక్క అమ్మను ప్రాణప్రదంగా ప్రేమించేది. అమ్మకు ఏ చిన్న బాధ కలిగినా సహించలేకపోయేది. అమ్మకు కష్టం కలిగించిన వాళ్ళ అంతు కనుక్కునేది. దాని చూపులో, నడకలో, నడతలో అమ్మ కోసం ఏ క్షణంలైనైనా ఆత్మార్పణ చెయ్యగల త్యాగం, ధైర్యం కన్పిస్తుండేవి. అనేక సంఘటనల్లో అమ్మ కు తోడుగా, మిత్రుడుగా ప్రవర్తించేది.

అమ్మ ఒక సందర్భంలో "దాన్ని గురించి చెప్పాలంటే మనిషి మనిషిని ఎంతగా ప్రేమించవచ్చో అంత దూరం అది నన్ను ప్రేమించింది. ఎప్పుడైనా ఇంట్లో పిల్లలకు జబ్బుగా ఉంటే నేను వాళ్ళ దగ్గర కూర్చునే అవకాశం లేక పనిలో ఉన్నప్పుడు నేను పని పూర్తి చేసుకొని వచ్చే వరకు వాళ్ళ దగ్గర కూర్చునేది. ఇంటికి ఎవరైనా కొత్త మనిషి వస్తే నా దగ్గరకు వచ్చి తాకి సంజ్ఞ చేసి చెప్పేది" అని చెప్పింది.

అమ్మ దగ్గరకు వచ్చే జనానికి 7వ మైలు నుండి ఊళ్ళోకి దారి చూపించేది.

వూళ్ళోకి ఎట్లా తీసుకొచ్చేదో అట్లాగే పంపి వచ్చేది. అది ఎవరి జోలికి పోయేది కాదు. అనవసరంగా తన జోలికి వస్తే ఊరుకోదు.

అమ్మ స్నానం చేసి హాల్లోకి వచ్చేసరికి రోజూ వచ్చే కుక్క రాకపోయేసరికి కుక్క ఎక్కడుందో చూసి రమ్మని వెతికించింది.

అప్పుడు అమ్మ అలంకార హైమ ఉన్న ఇంట్లో ఉండేది. కుక్క దూరంగా (ఇప్పుడు అన్నపూర్ణాలయం కెరుదుగా వున్న ఇసుక దిబ్బల మీద) పడుకున్నది. మరణయాతన పడుతున్నది. లేవలేక పోతున్నదని చెప్పారు.

అమ్మ వెంటనే కుక్కను చూడటానికి బయల్దేరింది. అప్పుడు సన్నగా వర్షం పడుతుంది. ఈ వర్షంలో, బురదలో వద్దని వారించి కుక్కను నీ దగ్గరకు తీసుకొస్తా మన్నాడు రామకృష్ణన్నయ్య. అందుకు అమ్మ నవ్వి దాన్ని మీరు ఇక్కడకు తీసుకొచ్చేది నా కోసం కాని దాని కోసం కాదుగా. నాకేం ఫర్వాలేదు. నేను వెళ్లాల్సిందే అని బురదగా వున్న నేల మీద కూడా పొడి నేలమీద నడిచినట్లు చకా చకా నడుస్తూ అంతిమ దర్శనానికి ఎదురు చూస్తున్న ఆ కుక్కను (భక్తుడ్ని) సమీపించింది నిరవద్య అయిన అమ్మ.

అప్పుడే పాలు తాగించడానికి ప్రయత్నిస్తున్న సోదరి చేతిలో పాలల్లో తులసిదళాలు తెప్పించి వేసి కుక్క పక్కన కూర్చొని ఆప్యాయంగా దాని మీద చెయ్యి వేసి నిమురుతుంటే – తన ప్రార్థనల నాలకించి వచ్చిన ఆర్తత్రాణ పరాయణ అయిన అమ్మ అమృత స్పర్శకు ఆ కుక్కలోని నరనరమూ ఆనందంతో పులకించిదేమో ఆ ఆనంద ఛాయలు దాని కదలిక లోనే కాక ముఖంలో కూడా కన్పించాయి. కళ్ళు విప్పి అమ్మను చూడాలని ప్రయత్నం చేసింది.

పాలగిన్నె ముందు పెట్టినా కుక్క ముట్టుకోలేదు. దాని నర్థం చేసుకున్న అమ్మ దాని మూతి కడిగి శరీరమంతా నీళ్ళు చల్లి తోకవైపు భాగం తుడిచి చెవి పట్టుకుని అక్కడ వున్న కురుపు చూచింది. అది బాధగా మూల్గింది. మళ్ళీ ఒకసారి నీళ్ళు చల్లి చెవి అంతా కడిగి శరీరమంతా నిమిరి వెచ్చగా ఉన్న ప్రదేశంలో పడుకోబెట్టమన్నది. (వాతావరణం చాలా చల్లగా వున్నది).

తర్వాత 2 రోజులకు అంతిమ శ్వాస వదిలి శాశ్వతంగా అమ్మను చేరింది. ఈ విషయం విన్న అమ్మ మరో కుక్కలు గాని, జంతువులు గాని పీకి తినకుండా

గొయ్యి తీసి పూడ్చి పెట్టమన్నది. శరీర త్యాగం చేసిన తర్వాత కూడా అమ్మ ఆ బిడ్డపై చూపిన వాత్సల్యం సంస్కారమనేది కేవలం మానవులలోనే కాక మిగతా జీవజాలంలో కూడా ఉన్నదని మనకు తెలియజేసిన సౌజన్యమూర్తి.

ఈ కుక్క అమ్మ చరిత్రలోనే ఒక విశిష్టస్థానాన్ని ఆక్రమించింది. ఈ కుక్కే అమ్మ సన్నిధిలో మెలిగే ఆవు దగ్గర పాలు తాగింది. ఇదే పిల్లికి పాలిచ్చింది. ఈ పిల్లి "మ్యావ్" అన్న ధ్వనిలో ఓంకారం ధ్వనించేది. అమ్మ పని చేసుకొని తీరిక వేళలో గుంజకానుకొని కూర్చునుంటే ఎలుకలు, పిల్లులు కలిసి అమ్మ పమిటి చెరుగు మీద స్నేహితుల్లా ఆడుకుండేవి. ఆ దృశ్యం కనువిందుగా ఉండేది.

ఒకసారి అమ్మ గదిలో పిల్లులు బాగా తిరుగుతుండేవి. అవి అమ్మ మంచం మీద కెక్కి అమ్మ సింహాసనం లోకి దూకి మూత్ర విసర్జనతో కలుషితం చేసేవి. అమ్మ దుప్పట్లలో ఆడుకుంటూ చింపేవి. అలమరలో నక్కి కూర్చుని అమ్మ దుప్పట్లన్నీ ఖరాబు చేసేవి. తమ పిల్లలకు ఆహారం కోసం రోజూ రాత్రిళ్ళు ఎలుకలను చంపి అమ్మ గదిలోకి తీసుకొచ్చేవి. తెల్లవారేసరికి అంతా రక్తపు మరకలు, మాంసపు ముక్కలు. ఆ దృశ్యాలను చూసి సహించలేకపోయే వాళ్ళము. ఒకరోజు పిల్లి, పిల్లలను గోతంలో వేసుకొని వాటిని మరో ఊరిలో వదిలి రావటానికి ఆలోచించారు.

ఈ విషయం అమ్మకు తెలిసి వాటిని స్వేచ్ఛగా వదిలివేయండి. మీరు బజారుకు వెళ్ళారనుకోండి అక్కడ మంచి పళ్ళు కనిపిస్తాయి. వాటిని కొనుక్కొచ్చి మీ పిల్లలకు పెడదామనుకోరూ ? తోటలో మంచి కూరగాయలు చూసినా వాళ్ళు కిష్టమయినవి తెచ్చిపెట్టుకోరూ ? అవీ అంతే ! వాటిని గురించి ఇంత అల్లరీ, ఆగమూ ఎందుకు? వాటిని ఏం చెయ్యవద్దు. ఎక్కడికీ పంపవద్దు అన్నదా దయార్ద్ర హృదయ.

ఒకసారి అమ్మ గదిలోకి ఒక కాకి వచ్చి అటూ, ఇటూ తిరుగుతున్నది. అది ఎంత తోలినా పోవటం లేదమ్మా అంటే అదీ నాకోసమే వచ్చిందన్నది.

మరొకసారి నేతితో పూరీలు చెయ్యమన్నది. పూరీలు చేసి అమ్మ కిచ్చాను. అవి తుంచి ముక్కలు చేసి వాకిట్లోకి వచ్చి ఒక్కొక్క ముక్క కాకులకు కింద పడకుండా నోటితో పట్టుకునేలా ఎగురవేస్తుంటే "అమ్మా కాకుల కోసమా నేతితో చేయమన్నది" అని ఆశ్చర్యంగా నేనంటే "వాటికి నేతితో ఎవరు పెడ్తారు. అవీ

రుచిగా తింటైే కదా అనేది. అలాగే గారెలు కూడా నేతితో చేయించి వాటికి పెట్టేది. వాటిపై ఎంత మమకారమో ! మొక్కజొన్న పేలాలు వేయించమని, అవి కూడా ఎగురవేసేది. అవి కిందపడకుండా కాకులు పట్టుకునేలా. అవి ఎగిరెగిరి పట్టుకుంటుంటే అమ్మ కళ్ళల్లో ఎంత ఆనందమో ! వాటికి ప్రత్యేకంగా వండి పెట్టాలనీ, రుచిగా పెట్టాలని మన కుండదు కదా !

అమ్మ ఇంట్లో ఒక గుడ్డి గేదె ఉండేది. అమ్మ ఎక్కడికి వెళ్తే అది అమ్మకు తోడుగా వెంట ఉండేది. అమ్మ బయటకు వెళ్తుండగా ఒక సర్పం వచ్చింది. అమ్మను ఆ పాము ఏం చేస్తుందోనని అది అవతలకు వెళ్ళిందాకా ఆ బఱ్ఱె అక్కడ్నుంచి కదల్లేదు. దానికి అమ్మ అంటే ఎంత ఆరాధనో !

ఒక ఆంబోతు ఎద్దు ఉండేది. అమ్మ చుట్టూ రోజూ ప్రదక్షిణం చేసేది. అమ్మ మంచం చుట్టూ ఎంత మంది పడుకున్నా తొక్కకుండా వెళ్ళేది.

ఒక శుక్రవారం నాడు అందరం అమ్మకు పూజ చేసుకుంటుండగా అక్కడకు ఒక పాము ప్రవేశించింది. దానిని చూచిన అందరం భయపడుతున్నాము. అది మెల్లిగా పూజాద్రవ్యాల క్రిందకు చేరింది. అంతా గమనిస్తున్న అమ్మ "దాన్ని కదలించవద్దు. అది పూజ చూడటానికి వచ్చింది. అది అపకారం చేసిన వాళ్ళ జోలికే పోతుంది. మనం అందరి జోలికిపోతాం" అన్నది. అమ్మ అన్నట్లే ఆ పాము పూజ పూర్తయ్యే వరకు ఉండి ఎటు వైపు వెళ్ళిందో మాకెవ్వరికీ తెలియదు.

ఒక రోజు అమ్మ హాల్లో మంచం మీద కూర్చుని దర్శనమిస్తుండగా ఒక కప్ప వరండాలో అటూ, ఇటూ తిరుగుతూ హాల్లోకి ప్రవేశించింది. అమ్మ మంచం దిగి వరండాలోని వెళ్తూ కప్పును రమ్మని తలూపింది. అమ్మ రమ్మని పిలవగానే అది అంతే చాలనుకుని వెంటనే అమ్మ వద్దకు వచ్చింది. అమ్మ దానితో ఏం మాట్లాడిందో, దానికేమి అర్ధమయిందో మరి.

అమ్మ ఒక రోజు ఆరుబయట పందిట్లో మంచం మీద కూర్చున్నది. అప్పట్లో కరెంటు లేదు. పెట్రోమాక్సు లైటు వెలిగించి స్థంబానికి తగిలించారు. ఆ లైటు చుట్టూ పురుగులు చేరినై. అమ్మ మంచం చుట్టుముట్టాయి. ఆ పురుగుల్ని దులపబోతుంటే అది చూచిన అమ్మ "దులపబోకండి. ఉండనీయండి అది వాటి సంస్కారము" అన్నది. అవి అటూ ఇటూ తిరుగుతున్నాయి. వాటిలో ఒక నల్లని పురుగు ఒకటి అమ్మ వక్షస్థలంపై వాలింది. అమ్మ దానిని ముద్దు పెట్టుకున్నది. "చూడమ్మా ఈ పురుగు దీన్ని ముద్దు పెట్టుకున్నా వదలటం లేదు. దీని సంస్కారం.

సంస్కారమనేది ఎవరికైనా ఒకటే. ఇన్ని పురుగులున్నై కదా. ఇది ఒక్కటే రావటానికి దీని సంస్కారమేగా. చూడు ఎట్లా మెల్లిగా నడుస్తున్నదో" అన్నది. ఆ నల్లపురుగు సుమారు ఒక అరగంట మెల్లిగా నడుస్తూనే అమ్మ శరీరమంతా స్పృశిస్తున్నది. ఈ అవకాశం మళ్ళీ లభ్యం కాదేమోనన్నట్లు. అమ్మ చుట్టూ పరివేష్టితులైన సోదరీ సోదరులు అమ్మకు వాటిపై గల మక్కువకు అమ్మ చర్యలకు చకితులైనారు.

ఇలాగే దోమల్లో కూడా. అమ్మ పాదాలకు ప్రదక్షిణ చెయ్యటం. మరికొన్ని అమ్మ పాదాల మీద ఆత్మార్పణ చేసుకోవటం. అమ్మ అన్నట్లు అది వాటి అదృష్టం, సంస్కారం. కందిరీగ కుట్టి చెయ్యి వాచి బాధపెడ్తున్నా సేవ చేసుకొని వెళ్ళిందనేది. పురుగు వాలి గట్టిగా పట్టుకొని వదలక పోయినా "అది దాని సంస్కారం, దాన్ని సేవ చేసుకోనివ్వండి" అంటుంది.

చీమలు శరీరం మీద పాకుతున్నా, తను బాధ పడ్తున్నా కాలు కదల్పదు సరిగదా తియ్యనివ్వదు.

తన సంతానం అంతా తన చుట్టూ ఉండాలనే కోరికే. గడ్డ లేచిందిట గదమ్మా అంటే "గడ్డ కూడా బిడ్డే" అన్నది. నీకీ బాధలేమిటమ్మా అంటే "అవీ మీలాగే" అంటుంది అమ్మలోని మాతృత్వం.

కాకులు, కుక్కలు, పిల్లులు, పిచ్చుకలు, చీమలు, దోమలు, పురుగులు సమస్త జీవులు అమ్మ ప్రేమలో మునిగి తేల్తుంటాయి.

ఒక సందర్భంలో అమ్మ అన్నది "తరించటానికి మానవజన్మయే అవసరం లేదు. ప్రతి వ్యక్తీ ప్రతివారు బాగుపడటానికే వచ్చింది. ఎవ్వరూ వృధాగా పోరు అందరికీ సుగతే. కాస్త వెనుకా ముందు తేడా అంతే".



27. నాకు ఎవరూ హాని చెయ్యరు

ఈ ఏప్రిల్ మాసంలో అమ్మను గురించి ఆలోచిస్తున్న నాకు గతస్మృతులు కొన్ని గుర్తుకు వచ్చాయి.

అది 1981వ సంవత్సరం ఏప్రియల్ 17వ తేదీ రాత్రి. తెల్లని చీర ధరించిన అమ్మ ఆరుబయట అంటే ఇప్పుడు ధాన్యాలయం ఉన్న ప్రదేశంలో మంచం మీద కూర్చున్నది. అమ్మ పాదాల స్పర్శను పొందుతున్న వెన్నెల రేడు ఆహ్లాదాన్ని పొందుతున్నాడు.

ఎంతరాత్రయినా అమ్మ దగ్గరకూర్చున్న వారితో హాయిగా కబుర్లు చెప్తుండేది. అర్ధరాత్రయినా టూరిస్టుబస్సులో అమ్మ దర్శనానికి వస్తే వాళ్ళు భోజనం చేసిందీ లేనిదీ కనుక్కొని భోజనాలు పెట్టించి వెంటనే వాళ్ళకు దర్శనమిచ్చి అనుగ్రహించేది, వాళ్ళను ఆపి ఇబ్బంది పెట్టటం ఇష్టంలేక. మనమయితే ఇంత రాత్రి అన్నం తినకుండా ఎట్లా వుంటారనుకుంటాం కదా. అమ్మ స్నానానికీ ఒక సమయమంటూ లేదు. రాత్రీ, పగలూ ఒకటే.

అమ్మ దగ్గర నేనూ, చాగంటి వెంకట్రావుగారు మరి కొద్దిమంది సోదరీ, సోదరులు ఉన్నాం.

పాటలు వచ్చిన వాళ్ళ చేత పాటలు పాడించి, పద్యాలు వచ్చిన వాళ్ళతో పద్యాలు పాడించింది అమ్మ. చతురోక్తులతో, నవ్వులతో ఆనందంగా సమయం గడుస్తుండగా అమ్మ ఉన్నట్లుండి ఇవాళ తేదీ ఎంత అని అడిగింది. ఏప్రిల్ 17 అన్నారు ఒకరు.

అమ్మ వెంటనే "నాన్నగారి క్రతువు కూడా 17న జరిగింది కదా" అన్నది "నేను మొట్ట మొదట జిల్లెళ్ళమూడి కాపురానికి వచ్చింది 1941 ఏప్రియల్ 17నే. నాతో మరిడమ్మ తాతమ్మ కూడా వచ్చింది. సుబ్బారావు 5 నెలల పిల్లవాడు. బాపట్ల నుండి ఇక్కడకు గుఱ్ఱపు బండిలో వచ్చాము.

ఖగ్గారామయ్యగారి దొడ్లో ఉన్న పాకలో ఉండే వాళ్ళము. నాన్నగారికి ఈ ఊరుకరణీకం. నాన్నగారికి ఆరురూపాయల జీతం ఉండేది.

నేను ఇక్కడ అడుగు పెట్టగానే దిష్టి తీశారు. నీళ్ళు చెరువు నుంచి తేవటానికి ఒక కుండ ఇచ్చారు. అప్పటిదాకా నాకు అలవాటు లేదు. ఆ రోజు నుండి నీళ్ళు తెచ్చుకోవటం అలవాటయింది. ఇంత చిన్నగ్రామంలో చెరువు నుంచి వస్తూ దారి తప్పానని చెప్తూ. జీవితంలో మాత్రం దారి తప్పలేదని చమత్కరించింది.

అప్పుడు దారి సరీగా ఉండేది కాదు. ఎక్కడ చూచినా పొదలు, తుప్పలు, డొంకలు; వరదలు వచ్చాయంటే ఇంట్లోకి పాములు వచ్చేవి. ఎత్తుగా మంచం కట్టి పసిపిల్లవాడ్ని పడుకోబెడితే పై కప్పులోనుండి పాములు మంచం మీదకి దిగేవి అని అమ్మ అంటుండగా "ఇక్కడి కెట్లా వచ్చారమ్మా అసలు" అన్నాను. అంతకు ముందు నాన్నగారు కొద్దికాలం ఒంటరిగా ఉండటం జరిగింది. నాన్నగారికి గుండె నొప్పివచ్చింది. ఆ కారణంగా ఇక్కడికి రావటం జరిగింది,..

"వైద్యసదుపాయం ఉండేదా ఆమ్మా" వెంకట్రావుగారు అడిగారు.

అమ్మ "వైద్యం అవసరమయినంత గుండె నొప్పి రాలేదు. అయినా నాకు ఎప్పుడూ అదేమిటి, ఇదేమిటి అని అడిగే అలవాటు లేదు. ఇప్పుడు వైద్యసదుపాయం ఉండి ఆగిందీ లేదు. ఎట్లా జరగవలసి ఉంటే అట్లా జరుగుతుంది. నాన్నగారు నాకు దూ, దూ బసవన్న అని పేరు పెట్టారు. నన్ను అందరు మొద్దమ్మాయి అని పిలిచేవారు. అమ్మ చెప్తుంటే మేము మొద్దు అమ్మాయివా, ముద్దు అమ్మాయివా, అని పెద్దగా నవ్వటం జరిగింది.

"మరి నాకు చదువురాదు. కాని నాకు చదువుకోవాలని అనిపించేది. నాకు ఎందుకో జిల్లెళ్ళమూడి అంటే చాలా ఇష్టం. పట్టణవాసంలో కొన్ని సదుపాయాలు ఎక్కువగా ఉన్నా ఇక్కడ జిల్లెళ్ళమూడిలో ఆ సదుపాయాలు లేకపోయినా.... ఈ గ్రామం చాలా బాగుందని నాకు అనిపించేది. ఈ బాగుండటం, బాగుండకపోవటం మనస్సుకు సంబంధించినది కదా !

నలభై సంవత్సరాల నుంచి ఈ గ్రామంతో అనుబంధం. ఆనాడు ఏప్రిల్ 17 అదే రాత్రి సమయంలో ఇంటికి చెరువు నుంచి నీళ్ళు మోసుకొస్తున్నాను.

ఈ గ్రామ ప్రజలు మంచివారు. అప్పటికి ఈ పైరు భూములు లేవు. మెట్టపంటలు, పొగాకు పండించేవారు. మన్నవలో బ్రాహ్మణులు విద్యావంతులైనా,

విద్య, సంస్కారం లేని జిల్లెళ్ళమూడి గ్రామస్థుల కంటే నాకేమీ ఎక్కువ అనిపించలేదు.

ఒకసారి సీతాపతి తాతగారు ఎంతో బాధగా నీ జాతకం చాలా గొప్పదన్నారమ్మా ! మరి జిల్లెళ్ళమూడిలో ఇన్ని కష్టాలు పడుతున్నావు అని బాధపడ్డారు.

అవి కష్టాలు అనుకోవటం లేదు కదా నాన్నా.... అదే జాతకం గొప్పదంటే ...” అన్నాను.

మరి సీతాపతితాతగారు ఈ గడ్డ మీద దేహం చాలించారు. ఆరోగ్యం బాగలేకపోతే కూతురు దగ్గర చనిపోవటమేమిటని మన్నవ వెళ్ళారు. కాని మళ్ళీ ఇక్కడికే తిరిగివచ్చి 1965 లో చనిపోయారు.

ఆయన పూజ చేసేవారు. సాష్టాంగ నమస్కారం చేసి పూజానంతరం దిష్టి తియ్యమనేవారు. ఒకసారి పద్మనాభ స్వామివ్రతం చేసుకుంటూ పద్మనాభస్వామిని అను నీకు ఈ నైవేద్యం అర్పిస్తాను” అన్నాడు.

పద్మనాభస్వామినే అంటే గాని ఊరుకోలేదు.

అప్పుడు ఎంతోతృప్తి పడ్డాడు.

సీతాపతి తాతగారు అనేవారు. నేను దశరధుని కన్నా అదృష్టవంతుడ్ని. ఆయన తన కుమారుడైన రాముడిని భగవంతునిగా గుర్తించలేకపోయాడు. నేను గుర్తించగలిగాను అనుకునేవాడు.

రాఘవరావు మామయ్య కూడ జబ్బు పడి ఆసుపత్రిలో చికిత్సపొంది చివరకు జిల్లెళ్ళమూడి వచ్చి పదిహేను రోజు లుండి 2-12-1981 న అనాయాస మరణాన్ని పొందాడు ఎలా జరగవలసింది అలా జరుగుతుంది.

మరిడమ్మ తాతమ్మ అత్యుత్తమరాలు. అన్ని మంచి గుణాలు ఆవిడలో ఉండేవి. ఎంతో శ్రావ్యంగా పాడేది. ఆమె గొంతు రికార్డు చేయిస్తే బాగుంటుందని చిదంబరరావు తాతగారు అనేవారు. ఎంత పాటరాని వారికైనా ఓపికగా ఆమె పాటలు నేర్పేది. మనం ఒక్కొక్కరిలో ఒక్కొక్క మంచి గుణం చూస్తుంటాం కాని ఆమెలో మంచి గుణాలన్నీ కేంద్రీకృతమై ఉండేవి. ఆమెది అంతా దైవీ సంపత్తే.

ఆమెకు ఆరవ సంవత్సరంలో వైధవ్యం ప్రాప్తించింది. తన జీవితాన్ని నిస్వార్థసేవకే అంకితం చేసింది.

నాన్నగారు బాపట్ల వెళ్ళారు. ఆరోజు అక్కడ ఉండాల్సి వచ్చింది. (ఈ జిల్లెళ్ళమూడిలో పార్టీలు, తగవులాటలూ ఉండేవి) నీకు ఏదైనా హాని కలుగుతుందేమో అని అనిపిస్తోంది. అందువల్ల నీవు వెంటనే బాపట్ల వచ్చేయ్యి అని కబురు పెట్టారు.

"నా కేమీ భయం లేదు. నాకు ఎవరూ హాని చెయ్యరు అని కబురు పెట్టాను ధైర్యంగా" అని చెప్పి

ఏడవ మైలు వరకు ఇళ్ళు లేచి చుట్టూ నాలుగు ప్రక్కలా నాలుగు సింహద్వారాలు కట్టిస్తే ఈ ఊరు ఎట్లా ఉంటుంది? అని చిరునవ్వుతూ అందరివైపు చూచింది.

మా అందరితో పాటు అమ్మ చెప్పే కబుర్లను వింటున్న సుధాంశుడు కూడ పరవశించి మరింత వెన్నెల జల్లులను కురిపించాడు.



28. రెండూ వాడిచ్చినవే

అమ్మ హాల్లో దర్శనమిస్తున్నది. దర్శనం చేసుకున్న సోదరుడు "అమ్మా మీరు సాయిబాబాలా కనిపించారు. కారణమేమిటని అడిగాడు.

అందుకు అమ్మ నవ్వుతూ "నాన్నా నీకు సాయిబాబా అంటే ఇష్టం కదా" అన్నది.

మరొక సోదరుడు "అమ్మా మనశ్శాంతిలేదమ్మా ఆధ్యాత్మికంగా ఏదైనా చేద్దామని వుంది. ఎంత ప్రయత్నించినా మనస్సు కుదరటం లేదు. దానికి నా పూజా లోపం అనుకుంటున్నా అని తన ఆవేదనను వ్యక్తం చేశాడు.

అమ్మ ఆ సోదరుని లాలనగా దగ్గరకు తీసుకుని పూజ అంటే కేవలం పూలతో చెయ్యటం కాదు నాన్నా. ఎన్ని బాధలు వచ్చినా, వాడిని మరువకుండా ఉండటమే పూజ. పూజవాడు చేయించుకోవటమే గాని నువ్వు చేసేదేం లేదు నాన్నా. నువ్వేమీ బాధపడకు. వాడు నీతో కావల్సింది వాడే చేయించుకుంటాడు".

సోదరి : బాధలు ఎట్లా తీరుతాయి మరి ?

అమ్మ : ఏం చేద్దాం ? పడదాం.

సో : ఎప్పుడూ ఎరగను.

అమ్మ : ఎప్పుడూ ఉంటే అనిపించదు. మధ్యలో వచ్చింది కనుకనే - బాధ"

అక్కడే ఉన్న రామకృష్ణన్నయ్య అందుకుని "జిల్లెళ్ళమూడి జీవితానికీ, బైట జీవితానికీ తేడా ఏమిటమ్మా?" అని అడిగాడు.

అమ్మ : "తేడా ఏమీ లేదు. జిల్లెళ్ళమూడి జీవితం ముళ్ళకంచెలో ఉన్నట్లు. నాకు ఒక సంఘటన ఎదురైంది. చీరాలలో బేర్ హాస్పిటల్ నుండి వచ్చి రిక్షా చేసుకుందామని అనుకుంటే అక్కడే ఉన్న ఒక ఆమె "అటుగా వెళ్ళమ్మా" అన్నది ఆమె చెప్పినట్లు వెళ్ళాను. అటువైపు ఇసుక. కాళ్ళకు చెప్పుల్లేవు. తల మాడుతున్నది. పక్కగా వెళ్తే పల్లేరు కాయలు. చేతిలో మరచెంబు చంకలో సుబ్బారావు ఇదీ పరిస్థితి.

మనకున్నది ఎప్పుడూ తప్పించలేరు. మరి రిక్షా ఎక్కుదామనుకున్నాను కదా. కానీ ఈ పరిస్థితి. అనుభవం తప్పలేదు. "అనుకున్నది జరుగదు మనకున్నది తప్పదు నాన్నా!"

అన్నయ్య : అమ్మా జీవితానికి లక్ష్యం ఉన్నదా లేదా ? అంటే పరమార్థం

అమ్మ : పరమార్థం అంటే.

అన్నయ్య : గమ్యం లక్ష్యం.

అమ్మ : ఉంటుంది. లక్ష్యమంటే ఏమిటి ?

అన్నయ్య : చదువుకుండే వాడికి పరీక్షప్యాసవటం లక్ష్యం. ఒకడు ఏదోరకంగా జీవితం గడిపి మరణిస్తాడు. మరొకడు ఒక లక్ష్యం కోసం ప్రయత్నం చేసి ఆహుతి అవుతాడు. ఇద్దరికీ ఫలితం ఒకటేనా ?

అమ్మ : లక్ష్యం పెట్టుకుని చేసేవాడు ఆనందపడతాడు. లక్ష్యం లేనివాడికి అది తెలియదు.

అన్నయ్య : ఒకడు దొంగతనం చేసి తృప్తిపడతాడు ఒక ఉద్యోగి నెలజీతం తీసుకుని తృప్తిపడతాడు. ఒకడికి ఏదో రకంగా తినటం తిరగటం తృప్తి. అందరికీ ఫలితం ఒకటేనా ?

అమ్మ : త్రాగేవాడు, జూదమాడేవాడు. అనుక్షణం తృప్తి పడలేడు.

అన్నయ్య : జీవితానికి వ్యక్తిగతంగాకానీ, సామూహికంగా కానీ ఫలితం ఏమిటి? శాస్త్రాదులలో జన్మ రాహిత్యం అని వాడేవారు. అమ్మ దృష్టిలో లేదు. ఇంకో రకంగా లక్ష్యమేమిటి ?

అమ్మ : ఎన్ని జరిగినా, ఏమి వచ్చినా హాయిగా ఉండటం.

అన్నయ్య : తృప్తిలేదుగా. ఆ అసంతృప్తి ఎట్లా పోతుంది ?

అమ్మ : తృప్తి, అసంతృప్తి రెండూ వాడిచ్చినవే అన్న భావం కలగాలి.

అమ్మ తీయని పలుకులు వింటూ అమ్మ సాన్నిధ్యంలో ఉన్న ఒక సోదరుడు. తన కష్టాలను అమ్మకు విన్నవించుకొని అమ్మ అనుగ్రహాన్ని పొందాలనుకుని

10)

"అమ్మా నేను చెప్పలేని ఇబ్బందుల్లో ఉన్నాను" అన్నాడు.

అమ్మ : అవన్నీ నాకేం తెలియవు నాన్నా !

సోదరి : మీకు అన్నీ తెలుసునమ్మా. సర్వం మీరే.

అమ్మ : మీరు అనుకోవటం తప్ప నిజంగా నాకేమీ తెలియదు నాన్నా !

సోదరుడు పాదాలకు నమస్కరిస్తూ మీ అనుగ్రహం ఉంటే చాలమ్మా!

అమ్మ : అది ఎప్పుడు వుంటుంది నాయనా! సర్వం ఒకటే అనుకుంటున్నప్పుడు ఈ ఇబ్బందులు కూడా అమ్మ ఇచ్చినవేగా నాన్నా! ఇది అందులో కాకుండా పోతుందా ? పది రూపాయలు చేతికి వచ్చినప్పుడు అమ్మ ఇచ్చింది అనుకుంటున్నప్పుడు పదిరూపాయలు తీసేసినప్పుడు అమ్మ కాదూ !

ఆ సోదరుడు మీ అనుగ్రహం ఉంచండమ్మా అని పదే పదే నమస్కరిస్తూంటే భోజనం లోనే వాత్సల్యాన్ని, అనుగ్రహాన్ని నింపి పంచే అమ్మ భోంచేసి వెళ్ళు నాన్నా ! అన్న పలకరింపు. అతన్ని పులకరింపచేయగా. అమ్మ పాదాలపై నుంచి లేచి భోంచేసి వచ్చి అమ్మ ఆశీస్సులందుకుని వెళ్లాడు.



29. ఉపదేశం

అమ్మ దర్శనార్థం విజయవాడ నుండి వచ్చిన సోదరులు కొందరు అమ్మకు తమ ఆవేదన విన్నవించుకోవాలని అమ్మకు చెప్పే చొరవ చెయ్యలేక ఏమీ పాలు పోక తదేక దృష్టితో అమ్మను చూస్తున్నారు. అమ్మ వారి మనస్సులోని ఆవేదనను గమనించి వారిని దగ్గరకు చేరదీసి "ఏమిటి నాన్నా! ఏదో ఆందోళనగా ఉన్నట్లు వున్నావు" ? అని ప్రశ్నించింది.

"పారమార్థిక సాధనకు మనస్సు స్థిమితంగా ఉండటం లేదమ్మా ! ఇంద్రియనిగ్రహం సాధించటానికి ప్రయత్నిస్తున్నాను. సినిమాలకు, హోటళ్ళకు వెళ్ళటం మానేశాను. అయినా మనస్సు నిలవటం లేదు. ఏం చెయ్యాలో తోచక ఆందోళనగా ఉంటోందమ్మా"! అమ్మ నిషేధాలు తొలగించుకో నాన్నా ! అప్పుడు ఈ గొడవలన్నీ ఉండవు. ఏది తటస్థపడితే అది అనుభవించు. దైవం చేయిస్తున్నాడనుకో. జ్వరంలో వంకాయ కూర నిషేధం అంటే, దాని మీదే ధ్యాస కలుగుతుంది. ఏది వద్దు అనుకుంటామో మనస్సు దానిమీదకే పరుగెత్తుతుంది. అస్థిమితం పోయి స్థిమితం కలగాలంటే, జరిగే ప్రతిదీ దైవం చేయిస్తున్నాడను కోవటమే సాధన సాధ్యం కావటంమంటూ లేదు. సాధ్యమైనదే సాధన నా దృష్టిలో.

మరొక సోదరుడు అందుకొని "ఉత్తరాలు రాస్తే మీరు సమాధానం ఇస్తారా అమ్మా!" అన్న ఆ సోదరునితో అమ్మ చిరు దరహాసంతో – "నేను చూడటమే సమాధానం నాన్నా! అయినా కాగితం మీద వ్రాయటం కాదుగా మీ క్కావల్సింది. నువ్వు ప్రశ్న వేస్తే నోటితో సమాధానం కాదు కావాల్సింది, నీ అనుభవంలోకి రావాలి" అంతే కదా.

"అవునమ్మా ! మా ఉత్తరాలకు నీ నుండి మేము సమాధానం అందుకుంటామన్నమాట"అంటూ ఎంతో తృప్తిగా హాయిగా అమ్మ వద్ద సెలవు తీసుకొని వెళ్ళారు. కాని నిజంగానే అమ్మ మన బాధ విని అమ్మవాక్కు ద్వారా సమాధానం పొందితేనే మనం తృప్తిపడతాం.

ఒకసారి ఒక సోదరుడు వారి బంధువు గురించి ఉద్యోగం లేదని అమ్మకు విన్నవించాడు. అమ్మ చాలా నిర్లిప్తంగా ఉన్నది. అమ్మకేమీ పట్టనట్లు, తనేమీ విననట్లుగా వున్నది. ఆ సోదరుడు చాలా బాధపడ్డాడు. నే నింతగా చెప్తుంటే అమ్మ ఏమీ వినిపించుకోలేదేమిటి ? అనుకొన్నాడు. అర్జంటుగా ప్రయాణమై వెళ్ళాల్సి వచ్చింది. అమ్మకు చెప్పి బొట్టు పెట్టించు కొని వెళ్ళాడు. సోదరుడు ఊరు

చేరేసరికి అమ్మకు విన్నవించిన సమస్య పరిష్కరింప బడింది.

అమ్మకు విన్నవించుకోవటం మనవంతు
ఆపై బాధ్యత అమ్మవంతు.
అది ఆనాడు, నేడు జరుగుతూనే ఉంది.
మరొక చిన్న సంఘటన

వెంకటగిరి చంద్రమోహన్ అనే సోదరుడు అతని చదువు పూర్తయ్యాక అమ్మ సాన్నిధ్యంలో ఉండి అమ్మ సేవలో పాలుపంచుకుని అమ్మ సాన్నిహిత్యాన్నీ ప్రేమను పొందిన వాడు. అతనికి 1982వ సంవత్సరంలో ఉద్యోగం వచ్చి ఇక్కడ్నుంచి వెళ్ళే సందర్భంలో అతనికి చేసిన ఉపదేశమేమిటో చూడండి. "నీకేమయినా బాధ అనిపిస్తే ఉత్తరం వ్రాయి నాన్నా! ఆ ఉత్తరం చేరిందా అనికానీ అమ్మ చదివిందా అని కానీ ఆలోచించకు" ఇది అమ్మ ఉపదేశం.

ఈ మధ్య 3, 4 సంవత్సరాల క్రిందట చంద్రమోహన్‌కి అనారోగ్యం సంభవించింది. ఎన్ని వైద్యాలు చేసినా, ఎన్ని మందులు వాడినా వ్యాధి తగ్గక తీవ్రమైన బాధకు గురి అయ్యాడట. కొంతకాలం బాధ అనుభవించాక ఓ అర్ధరాత్రి సడన్‌గా అమ్మ చేసిన ఉపదేశం స్ఫురించినవాడయి అమ్మకు ఉత్తరం వ్రాశాడు. రేపు ఉదయం పోస్టులో వేద్దామని తలక్రింద పెట్టుకుని పడుకున్నాడట. ఉత్తరం పోస్టుద్వారా అమ్మదగ్గరకు వెళ్ళలేదు. కాని అమ్మ దగ్గరకు ఉత్తరం చేరింది. తెల్లవారి లేచేసరికి అనారోగ్యమంతా మాయమై చాలా ఫ్రెష్‌గా, హాయిగా ఉన్నదట. అమ్మ చంద్రా జాబుకి జవాబిచ్చింది.

ఉత్తరం వ్రాయకుండా అనుభవం ఇచ్చిన మరో సంఘటన తెలుసుకుందాం.

చంద్ర అద్దెకున్న ఒక రేకుల ఇంటిలో వీరి కుటుంబమే కాక మరొక భాగంలో ఒక స్నేహితుడు ఉన్నాడట. ఓ రోజు పెద్ద తుఫానుగాలి వీచి రేకులు కిందపడి పోతాయేమో అన్నంత భీకరంగా టప టప లాడుతున్నాయి. మనుషుల మీద పడతాయేమో అని భయపడి ఆ స్నేహితుడు ఎట్లా అని వణికి పోతూ చంద్రా దగ్గరకు వచ్చాడు. అప్పటికే 'అమ్మా ఇప్పుడు ఏం చెయ్యమంటావమ్మా' అని ఆవేదనగా ప్రశ్నిస్తున్న చంద్రకు ప్రక్కగదిలోకి వెళ్ళమని స్పష్టంగా పలికిన అమ్మ కరుణను ఏమందాం. వారు ప్రక్కగదిలోకి వెళ్ళగానే టపటప లాడే రేకులు పటపటా క్రిందపడిపోయాయి.

ఆవేదనే ఆరాధన అనిపలికే అమ్మనుండి ప్రతి దానికి స్పందన కనిపిస్తునే ఉంటుంది. మనను పాలిస్తూ మన మొరలాలిస్తూ ఉండే మాతృశ్రీకి మంగళం.

౩౦. అర్పణ

6-8-1972న అన్నపూర్ణాలయంలోని గంట గణగణ మోగుతూ ఆప్యాయంగా అందరినీ భోజనాలకు ఆహ్వానిస్తోంది.

వాత్సల్యాలయంలోని అమ్మ కుశల ప్రశ్నలతో పరామర్శిస్తూ వాత్సల్య పూరితంగా భోజనం చేసి రండి నాన్నా ! అంటూ దర్శనమిస్తోంది.

అమ్మ దర్శనస్పర్శన భాగ్యాన్ని అందుకున్న సోదరుడు నిరంతరమూ లేదనుకుండ చేయబడుతున్న భోజన సదుపాయాలను చూసి "అమ్మా ! ఎప్పుడు వచ్చినా ఎంతమంది వచ్చినా భోజనం చేసే సౌకర్యం ఉన్నది ఇక్కడ. నేను ఇటువంటిది ఎక్కడా చూడలేదూ వినలేదమ్మా" అన్నాడు.

అమ్మ ; ఎప్పుడు వచ్చినా ఎంత మంది వచ్చినా ఇక్కడ అందరూ తినలేరు నాన్నా ! నేను పెట్టడం కాదు ఎవరి అన్నం వారు తింటున్నారు. ప్రాప్తం ఉన్నవాళ్లే తినగలుగుతున్నారు భోజనం కాదు నాన్నా ! ఇది ప్రసాదం. ఉంటే అన్నం తింటారు. లేకపోతే నీళ్ళు త్రాగుతారు. అయినా ఇది భోజన సౌకర్యం లేని గ్రామం కదా!

సోదరుడు: సౌకర్యాలున్న ప్రదేశంలో మాత్రం ఇట్లా ఇటువంటి అన్నదానం జరుగటం నేను చూడలేదమ్మా !

అమ్మ : ఇది దానం కాదు నాన్నా ! తల్లి ధర్మం. నా ధర్మం నేను నెరవేరుస్తున్నాను. లేని తల్లి భిక్షమెత్తుకునైనా బిడ్డల పొట్ట నింపుతుంది. ఇది దానమని దీని వల్ల ఏదో పుణ్యం వస్తుందనీ నేను అనుకోను. మీరు మీ పిల్లలకు అన్నం ఎట్లా పెట్టుకుంటున్నారో ఇదీ అంతే. ఎక్కడ ఎట్లా జరగాలో అక్కడ అట్లా జరుగుతుంది. ఒక దానితో పోలిక ఎందుకు ? భోజనానికి ఆకలే అర్హత గానీ డ్రస్సును బట్టి, అడ్రసును బట్టి కాదు. ఇక్కడకు తినకుండా రావచ్చుకానీ తినంకుండా వెళ్ళకూడదు. '99' మంది తిన్నా ఒక్కడు తినకుండా వెళ్తే బాధగా ఉంటుంది నాన్నా ! అన్నది. అమ్మమాటలు వింటున్న (1960 సంవత్సరం నుంచి వచ్చే) సోదరుడు నారాయణరావు "వెనుకటి రోజులు గుర్తుకు వస్తే చాలా బాధగా

ఉంటుందమ్మా : తరచూ అమ్మ దగ్గర ఎక్కువ కాలం గడిపేవాళ్ళం కదా ! అని."

అమ్మ : మీరే జనం రావాలంటారు. మీరే దగ్గర కూర్చోవటం లేదనుకుంటారు. మనం అనుభవించింది వారికి లేకపోయెనే అని అనుకోవాలి. వ్యక్తులు అంతే, పరిస్థితులూ అంతే నాకు. మమ్మల్ని పూర్వం లాగా అమ్మ సరిగా చూడలేదని కొందరు అనుకుంటున్నారని తెలుసు నాకు. అమ్మ నన్ను సరిగా చూడలేదే అనుకోరాదు. రాజు కంటే రామకృష్ణ కంటే సన్నిహితులుగా ఉన్నవారూ ఉన్నారు. నేను వండి పెడితే తిన్నవారు వండటానికి పదార్థం తెచ్చిన వారూ ఉన్నారు. ఎప్పుడూ ఒకేలాగా ఎలా ఉంటుంది ? తర్వాత మార్పులూ వున్నాయి. మార్పు సహజం. కాసేపు వుండరా ! అనటం నాలో కలిగిన మార్పే. మిమ్మల్ని చూసి మార్పుకాదు. శరీరదారుఢ్యతలో మార్పు. అన్నపూర్ణాలయంలో శేషయ్యగారు వండి వడ్డిస్తుంటే నేను క్రిందకి వెళ్ళి పెడితే ఎంత బాగుంటుంది అని అనిపిస్తుంది. నేనేమి వడ్డిస్తాను ? ఎక్కడానికి, దిగడానికి ఓపిక లేదు. పెట్టలేకపోతున్నానే అని బాధపడుతున్నా. బాగా వంట వడ్డించి కూర, పెరుగు, పాలు వేసి పెట్టుకోవాలనే ఉంటుంది. జన్మ రాహిత్యం లాంటివేమీ నాకు తెలియదు. నా ప్రేమలో మీ పట్ల మార్పు ఉన్నది. కోరిక, మమకారం, ఏవి అయితే వుండకూడదని అంటున్నారో అవి అన్నీ నాకు ఉన్నాయి. అవసరం, ప్రేమ ఇవి తప్ప వేరే ఏమి ఉన్నాయి. ఏదైనా వస్తే దాని పరిణామమే. ఇది యథార్థమే కాని మనకు కాదు అంటారు. భ్రాంతి, భయం పోతేనే తెలిసేదంటారు. వాడెవరో దొరికేదాకా కనపడేదే నిజమని అంటాను. దిండు కనపడుతుంటే ఇది లేదు అనుకోలేను. నేను పోతే నాకు గుర్తులేదు. నేను శాశ్వతం కాదు. సృష్టి శాశ్వతమే ఆత్మను తెలుసుకోటానికి అనాత్మ అని బయల్దేరతాడు. అనాత్మ అని బయల్దేరడానికే గాని అనాత్మ అని వాదించలేరు. అనాత్మ మాత్రం కాదు. బయల్దేరడానికి సాధనా వాక్యమిది. సూదిమోప సందు లేదని ఒక వైపు చెప్తున్నారు. కర్మేంద్రియాలు లేకుండా జ్ఞానేంద్రియాలు ఎక్కడ దాగి ఉన్నాయి. ఆ జ్ఞానేంద్రియమే కర్మేంద్రియాలను వాడుకుంటున్నది. ఒకసారి చూసిన దృశ్యాన్ని మనస్సులో ఊహిస్తూ మనస్సు ద్వారా కంటితో చూస్తున్నావు ఏదో ధ్యాసలో ఉన్నప్పుడు వినపడదు.

అప్పుడూ జ్ఞానేంద్రియం పనిచేస్తూనే ఉన్నది. రెండింటికి భేదం ఉన్నదా? నేను ఇది అశాశ్వతమని అనుకోను. నాకు గుర్తులేక పోవచ్చు. సృష్టి ఎప్పుడూ

ఉంటుంది. అంటూ ఇంకా ఏవేవో చెప్పబోతోంది. అమ్మ ఒక్కొక్కసారి ఒక చిన్న సందేహాన్ని వెలిబుచ్చినా ఎన్నెన్నో విషయాలను వివరిస్తుంటుంది అమ్మ మాటలను వింటున్న మరొక సోదరుడు. మధ్యలో అందుకొని ఆధ్యాత్మిక చింతన రావాలంటే ఏం చెయ్యాలమ్మా అని ప్రశ్నించాడు.

అమ్మ : ఏం చెయ్యాలని కలగడమే చింతన. ఒక సోదరుడు దయ్యం పట్టిందన్న సందేహంతో గాలి సోకిందమ్మా అన్నాడు.

అమ్మ : గాలి లేక నేను ఫ్యాను వేసుకుంటున్నాను. నీ అదృష్టం కొద్దీ నీకు సోకింది అని చమత్కరించింది. అందరు గొల్లున నవ్వాము. సోదరుడు "ఇక్కడ డిసిప్లెన్ లేదమ్మా" అన్నాడు.

అమ్మ : ఆ మాటకు అర్థమేమో ! బొట్టు పెట్టుకొని విభూతి పూసుకుని అందరూ ఒకసారి స్తోత్రం చేయకపోవచ్చు. అన్నపూర్ణాలయంలో శేషయ్యగారు, భాస్కరరావు, సింగుపాలెం తాతయ్య వీరు మనస్సులో (అమ్మను) పెట్టుకుని గదా చేసేది. వీరు మనసులో అర్పించి చేస్తున్నట్లు ఎట్లా తెలుస్తుంది. గజేంద్రమ్మ హోటల్‌లో ఉన్నా మనసిక్కడే. వసుంధర కాఫీ కప్పును కడగటం కనిపిస్తుంది. మనస్సును అర్పణ చేసిందని తెలియదు కదా! సాధారణంగా అందరి దృష్టికి చేసే పనిని బట్టి భావిస్తారు. భక్తి ఉండబట్టే చెయ్యటం. ఇక్కడ ఏమి జరుగుతుంది. అంటే ఏమి చెప్తారు. ఏది చేసేవాడికి అదే సుప్రభాతం. శారదాంబ 24 గంటలు నీళ్ళు కాస్తూనే ఉంటుంది. చూచేవాళ్ళు నీళ్ళు కాచే మనిషి అనుకుంటారు. అదీ భక్తితోనే. ఇది మామూలు ఇల్లు. విధి నిషేధాలు లేవు. ఆశ్రయం కాని ఆశ్రమం కాదు. ఇక్కడున్న వాళ్ళకు నాది అనేది అందరికీ లేకపోవచ్చు. 1962వ సంవత్సరంలో నవంబరులో రామకృష్ణ వచ్చాడు. ఆ క్షణం నుండి ఇది నాది అనుకుని దిగాడు. వాడికి సహజంగానే ఆ భావం ఉన్నది.

మనము ఇది వదలి వెళ్ళకూడదు అని అనిపించడమే మనస్సు అర్పించినట్లు గుర్తు అని అమ్మ పలికిన పలుకులు విని కొంత తడవు నిశ్శబ్దులై భోజనాలకు వెళ్ళారు. మారు మాట లేకుండా.

31. అమ్మ నోటి నుండి వెలువడిన ఆణిముత్యాలు

అమ్మ పుత్రపుత్రికా పరివేష్టితయై, వారిలో ఆనందానుభూతుల్ని అందిస్తున్న తరుణంలో పలికిన ముత్యాలు.

అక్షయపాత్ర : "నాన్నా రావటానికీ వెళ్ళటానికీ ఒకే గేటు ఇక్కడ. అది ఎప్పుడు తెరిచే ఉంటుంది. ఒకళ్ళకి ఒక గేటు ఇంకొకళ్ళకి ఇంకో గేటు లేదు. నీవు వచ్చినప్పుడు నీవు వెళ్ళేటప్పుడు ఒకే భావం నాది. నా అభిప్రాయంలో తేడా లేదు. అన్ని రకాల వాళ్ళని యోగ్యతా యోగ్యతలతో సంబంధం లేకుండ చేరదీస్తా. ఇది అక్షయపాత్రలాంటిది. ఎలాంటి వస్తువును వేసినా భరిస్తుంది. అట్లాగే ఈ పాత్ర అన్నిరకాల వాళ్ళనీ చేరదీస్తుంది. ఎందుకంటే మీ యోగ్యత అయోగ్యతలకు కూడా కారణం నేనే అనుకుంటున్నాను కనుక!

మందలింపు : నేను ఈ మంచం మీద కూర్చున్నానని నాకేమీ తెలియదనుకుంటున్నారు. నాకు గోడ చాటు లేదు. ఎక్కడ ఎవరు ఏంచేస్తున్నదీ, ఎక్కడ ఏమి జరుగుతున్నదీ నాకు తెలుసు. అంతకళ్ళు మూసుకుని కూర్చుని ఉండలేదు. అయినా మిమ్మల్నినేను ఏమీ అనకపోవటానికి కారణం మీదేమి లేదని, ఆ పనులకు మీరు బాధ్యులుకారని అనుకోవటమే.

బాధ్యతే బాధ : బాధ్యతే బాధ. బాధలేని బాధ్యతలు అందరికీ లభ్యపడవు. నేను చేస్తున్నాను. నాది, నాకు అనేది బాధ గల బాధ్యత. అంతకంటే రెట్టింపు పని చేసినా నేను చేస్తున్నాననేది లేకుండా "మనం నిమిత్తమాత్రులం" అనుకుండేది బాధలేని బాధ్యత. బానిసకు బాధలెక్కువ. స్వతంత్రుడికి బాధ్యతలెక్కువ.



32. అమ్మ సమర్త బంతి

మధ్యాహ్న సమయం – హైమ, నేను ఇంకొక నలుగురైదుగురు వున్నారు. ఇవాళ శ్రావణ శుద్ధపంచమి. "ఇవాళ నేను రజస్వల అయిన రోజు. అయిదుగురు ఉన్నారు కదా. వీళ్ళకు బొట్టు పెట్టి తాంబూలమివ్వ"మని అమ్మ చెప్పి కాగితం మీద నా చేత వ్రాయించి పసుపు, కుంకుమ పెట్టింది. అక్కడున్న అయిదుగురికి బొట్టుపెట్టి తాంబూలమిచ్చాను. భాస్కరన్నయ్యకు ఇంకా కొద్దిమందికి నా చేత శుభలేఖలు లాగా కార్డులు వ్రాయించింది. పేరంటానికి కావలసినవి చెప్పి ఎలా చెయ్యాలన్న సూచనలిచ్చింది.

నాకు సిగ్గు అంటూ సిగ్గుబడుతోంది. కొత్త పెళ్ళికూతురిలా తలొంచుకున్నది. హైమ "సిగ్గంటే ఇట్లా చెప్పి చేయించుకుంటావుటమ్మా" అన్నది నవ్వుతూ.

అమ్మ : "నేను సిగ్గుబడితే – మీకు తెలిసేదెట్లా, నేను సిగ్గును మరుగు పరుచుకొని చెప్తేగా మీకు తెలిసేది. నేనుతొలగించుకు మీకు పెడ్తున్నా. నాకే వుంటే ఎట్లా? అన్నీ సిద్ధం చేసుకొని నన్ను పిలిస్తే వచ్చి కూర్చుంటాను" అన్నది.

పేరంటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అమ్మ నన్ను పిలిచి నీళ్ళు పోయించుకున్నది.

అప్పటి కబుర్లు చాలా చెప్పింది. తనతో చింతపిక్కలు ఆడుకోటానికి ఇద్దరు స్నేహితులు వచ్చేవారట. ఆ రోజు అమ్మమ్మ తను "సరిబేసి' ఆడుకుంటుంటే అమ్మమ్మ అన్యాయం చేసిందిట. అన్యాయం చేసి ఆడుతున్నావు అన్నదట అమ్మ అమ్మమ్మని. అమ్మమ్మ మాట్లాడటం మానేసిందట.

శ్రావణ శుద్ధ పంచమి నాడు ఈ శుభవార్త విన్న అమ్మమ్మ పలకకపోయినా చాలా సంతోషపడిందట. అన్నీ కల్పించుకుని పన్లు అన్నీ చేసిందట. ఇంకా ఎన్నో కబుర్లు చెప్పింది అమ్మ.

ఇప్పుడు అలంకార హైమాలయం వరండాలోనే గడ్డిపరిచి, దానిపై దుప్పటివేసి నాలుగువైపుల తాటాకు బొమ్మలు పెట్టటం, కొబ్బరిచిప్పలుంచటం సాంప్రదాయ బద్ధంగా ఏర్పాటు జరిగింది.

అమ్మ ముసిముసిగా నవ్వుకుంటూ తలవంచుకుని సిగ్గులు దొంతరయై మెల్లగా నడిచి వచ్చి దరివెం మీద కూర్చున్నది. అమ్మ తన చిన్ననాటిని తలపింపచేసింది.

సువ్వీ సువ్వాల చిమ్మిరి పాటలతో అమ్మకు చిమ్మిలి తొక్కుతుంటే ఎంతో ఉత్సాహంగానూ, చెప్పలేని ఆనందతోనూ వేడుక బాగా జరిగింది. పులగం పెట్టాలి గదా, అమ్మ మూకుట్లో పెట్టించుకున్నది. ఎవరూ తాకకుండా ఎత్తి పెట్టించుకున్నది. చూడముచ్చటగా వున్నది.

3 రోజులు పేరంటం జరిగింది. నాల్గవరోజు యధావిధిగానే 2 స్నానాలు చేసింది. తెల్లవారుఝాముున అట్లబంతి, అందరికీ అట్లుపోయించి పెట్టింది. క్రిష్ణవేణమ్మ (చాకలిగా)ను బుట్టతెచ్చుకోమని బుట్టలో అన్నం పెట్టి అట్లు వేసి చీర యిచ్చింది.

ఒకరోజు పిల్లలందరం కలిసి చిమ్మిరి ఖర్చు పట్టుచీర పెట్టుకోవాలనుకున్నాము. అమ్మచేతికి ఎవరో డబ్బులిస్తే (150రూ.) అమ్మమ్మ చేతికిచ్చింది.

అమ్మమ్మ - పెళ్ళి అయినవాళ్లు మరి కాస్త వేసుకొని పెళ్ళికాని వాళ్ళు కొద్దిగా వేసుకోండి. తలా కాస్త వేసుకుంటే పట్టుచీర తేవచ్చు అన్నది. అమ్మ మమ్మల్ని చూస్తూ వీళ్ళని పెళ్ళికాని వాళ్లంటావేమిటి పెండ్లి అయిన వాళ్లే వీళ్ళు. వాళ్ళకు నేనేగా. వాళ్ళు నన్ను గాక ఇంకెవర్ని అడుగుతారు. వాళ్ళకు యివ్వవలసిన దాన్ని నేనే. అందుకే యిచ్చానుగా 150 రూ. మా భర్తస్థానాన్ని భర్తీ చేసినందుకు చాలా గర్వంగా వున్నది.


పోయిన సంవత్సరం శ్రావణ మంగళవారం అష్ట భార్యలుగా ఎంచుకుని పేర్లు పెట్టింది సరదాగా. మొన్న మే1వ తేదీన అమ్మ లాకెట్ వేసిన తాడుకట్టింది. అమ్మ అప్పుడే నిర్ణయం తీసుకున్నదన్న విషయం. అమ్మ ఇప్పుడు మట్లాడిన తీరు స్పష్టపరచింది. (నా మనసులో నాకెటూ నిర్ణయం అయింది. అమ్మ తప్ప మరేమీ వద్దని) అందులో - అమ్మ ద్వారా బహిర్గతం కావటం సంతోషదాయకం కదా! నా వరకు.

పట్టుచీర కోసం శాయమ్మ గారిని గుంటూరు పంపటం జరిగింది.

10 రోజులూ సరదాగానే వేడుకలు జరిగాయి. అమ్మకు ఆరోగ్యం బాగాలేకపోయినా మా అందరి కోసం నవ్వుస్తూ కవ్విస్తూ హుషారుగానే గడచింది. 11వ రోజు శ్రావణపూర్ణిమ పెద్ద బంతికి ఏర్పాటు జరిగింది. భాస్కర రావన్నయ్య అరిసెల కావడి తెచ్చాడు సింగుపాలెం నుంచి ఆయనకు బట్టలు పెట్టింది.

జూకాలు పెట్టుకుని సర్వాభరణభూషిత అయిన అమ్మ పట్టుచీర ధరించి చిద్విలాసమూర్తియై ఆలంకరించ బడిన వేదిక పైకి వచ్చి సింహాసనాసీన అయింది. అందరూ కన్యకాపరమేశ్వరిలా వున్నదనుకున్నారు. పేరంటంలో నవ్వుస్తూ, ఆనందంతో మమ్మల్ని అలరింపచేసింది.

(12.8.1964న ప్రారంభించిన ఈ వేడుక నిర్విఘ్నంగా ఇప్పటికీ జరుపుకుంటున్నది. నాలుగురోజులు ఈ వేడుక అమ్మవారికి శాంతిప్రదమైనదని పెద్దలు అనేకమంది చెప్పగా విన్నాను. మనకు తెలియదు కనుక అమ్మే మనకు తెలియచేసింది, తెలియనిది తెలియచెప్పటానికే ఈ రాక అన్న అమ్మ ప్రతిదీ మనకు తెలియచేయాల్సిన బాధ్యత తనదేనని చెప్పింది కదా ! అమ్మ జన్మదినోత్సవం, కళ్యాణోత్సవం ఎలాంటివో ఇదీ అలాంటిదే!)



అమ్మ సమర్త బంతిలో చిమ్మిలి తొక్కుతున్న శ్రీమతి వసుంధర

33. మహోపదేశం

ఆచరణాత్మక ప్రబోధాన్ని అందించే అమ్మ జీవితమే ఒక సందేశం. తోలు నోరు కాదు గదా తాలు మాట రావటానికి అని అమ్మ చెప్పినట్లుగా అమ్మ ప్రతిమాటా మంత్రమై, మహామంత్రమై మహోపదేశమయింది.

అమ్మకు జన్మనిచ్చి మనకు అందించిన పుణ్యమూర్తి రంగమ్మగారు అమ్మకు మూడు సంవత్సరాల వయస్సులోనే పరమపదించింది. అమ్మకు మాటలు వచ్చీరానీ వయస్సు. ఆ వయస్సులోనే అందరూ దుఃఖపడుతుంటే "దైవం పంపిన మనిషి దైవంలోకి పోతే మధ్య మనకు ఏడుపు ఎందుకు తాతయ్యా!" అని చిదంబరరావు తాతగారిని ప్రశ్నించింది. ప్రశ్నరూపేణ ఆ వయస్సులోనే అమ్మ మనకందించిన మహోపదేశమది.

అమ్మకు 5 సంవత్సరాల వయస్సులో పోలీసు మస్తాన్‌తో సంభాషిస్తూ "మాట అంటే ఏమనుకున్నావ్, మారుమాట లేని మాట. ఆ మాటనే మంత్రం అంటారు" అని అమ్మ పలికిన ఆ వాక్యమే అతని జీవితానికి మహామంత్రమై ఎన్నో అనుభవాలను ప్రసాదించింది. అంతేకాదు. ఆనాడే "అందరికీ సుగతే" అని అమ్మ హామీ ఇచ్చింది. ఆ హామీయే అతని జీవితంలో ఎంతో మార్పు తీసుకొచ్చింది.

అమ్మ ప్రబోధం సంభాషణ పూర్వకంగానే ఉంటుంది. ఒకరోజు కొండముది రామకృష్ణఅన్నయ్య అమ్మతో సంభాషిస్తూ "అమ్మా ! నిన్ను నమ్ముకుని నీ సన్నిధికి చేరాం కదా! అందరికీ సులభసాధ్యమయిన సాధన ఏదయినా చెప్పమ్మా ! మాకు ఏఉపదేశమూ చెయ్యక పోతివి. మేము ఏ సాధనా చెయ్యటం లేదు. కాలమేమో గతించిపోతున్నది.

ఎట్లా అమ్మా!" అని అడగటం జరిగింది. అమ్మ ప్రసన్నంగా నవ్వుతూ "అయితే సరే, మీకు నేను పెట్టిందేదో తిని హాయిగా ఉండండి. నేను ఇచ్చిందేదో యిక్కడకు వచ్చిన పదిమందికీ ఆదరణతో పెట్టండి. ఇదే మీకు సాధన". అని చెప్పింది. ఈ సాధనను ఎలా అలవరచుకోవాలో ఒక సన్నివేశం ద్వారా అమ్మ నాకు ప్రబోధించింది.

ఒక రోజు మధ్యాహ్నం 3 గంటల వేళ ఒక సోదరుడు అమ్మ దర్శనార్థం వచ్చినట్లు అమ్మకు విన్నవించాను. "భోంచేశాడేమో కనుక్కున్నావా?" అన్నది అమ్మ. "లేదమ్మా! మూడు గంటలు దాటింది కదా ! తినకుండా వుంటారా అని అడగలేదు" అని అమ్మకు చెప్పి వెంటనే -ఎందుకయినా మంచిదనిపించి ఆ సోదరుని దగ్గరకు వెళ్ళి భోజనం విషయం అడిగితే చెయ్యలేదన్నాడు. అన్నపూర్ణాలయానికి తీసుకెళ్ళి అన్నం పెట్టించాను. ఆ సమయంలో అమ్మ భోజనం సంగతి కబురు చేసినందుకు ఆ సోదరుడు అమ్మ ప్రేమకు ఆనందంతో పొంగిపోయి అమ్మ పాదాలపై వాలిపోయాడు. ఆనాటి నుండి ఎవరు ఏ సమయంలో వచ్చినా భోజనం చేశారా అని పలకరించాలి అన్న అమ్మ మాటలే ఉపదేశంగా భావించాను.

ఇక్కడకు వచ్చిన వాళ్ళు అమ్మ సన్నిధిని చేరాక తృప్తినీ, హాయినీ పొందటం కాదు. అందరింటిలో అడుగుపెట్టిన క్షణమే అమ్మ దగ్గరకు వచ్చిన అనుభూతిని పొందగలగాలి అనీ ఆదరణ, ఆప్యాయతలతో అందరిల్లు నిండి ఉండాలనీ, ఏ సమయంలో వచ్చినా అన్నపూర్ణాలయంలో ఆదరణ అనే అనుపాకం వేసి భోజనం పెట్టాలనీ అమ్మ ఆకాంక్ష. అందుకే ఒక సందర్భంలో ప్రపంచంలో ఆస్తి అంటే ఆదరణేననీ, ఆ ఆస్తి ఎవరు అంటే అమ్మ అనీ, ఆ ఆస్థి తనే అని సుస్పష్టంగా పలికింది.

పూర్వం సంస్థ బాధ్యతలు నిర్వహించిన సోదరులు హరిదాసుగారు అమ్మ దగ్గరకు వచ్చి అమ్మా - రేపటికి బియ్యం లేవు. వడ్లు మరకు పంపిద్దామంటే - మరకు వెళ్ళే మనిషి లేడు. ఇంట్లో విసిరిద్దామంటే - తిరుగలి విసరేవారు లేరు. ఏమి చెయ్యాలో తోచట్లేదని మొర పెట్టుకున్నారు.

అమ్మ వడ్లు తాను విసురుతానని తిరగలి వేయమన్నది. కొన్ని వడ్లు విసిరి, కొంత చెరిగి శుభ్రపరిచింది. అన్ని పనులూ చేస్తూనే "నాకు పనులు రావు. అన్ని పనులు నేర్చుకోవాలి" అని అక్కడే ఉన్న సోదరి గజేంద్రమ్మతో అన్నది.

"నీకు రాని వేముంటయ్యమ్మా" అన్న గజేంద్రమ్మతో - నేను మీతో కలవకపోతే మీరు నాదగ్గరకు రాలేదు. నేను మీతో కలసి మిమ్మల్ని దగ్గరకు తీసుకోవాలి. వడ్లగింజలో బియ్యపు గింజలాగా దాగి ఉన్నాం మనం. మనలో దోషాలు తొలగించుకుని వేరు కావిల. వడ్ల గింజలో ఎన్ని దాగి ఉన్నాయో మనలోనూ అన్ని వున్నాయి. అవి తొలగించుకోలేక పోయినా ప్రస్తుతానికి ఇవి

తొలగించండి" అని పరిహాసం చేసింది కానీ దాని వెనుక ఉన్నది మనలో మాలిన్యాన్ని తొలగించుకోమని ప్రబోధమే కదా !

ఒక సోదరుడు మానవులు దుష్కర్మ చేస్తున్నప్పుడు దుష్కర్మ, సత్కర్మ రెంటికీ కర్తవైన తల్లివి. నీవు ఈ బిడ్డల మనస్సులను మార్చి సన్మార్గంలో పెట్టవచ్చుకదా! –అని అడిగినప్పుడు "నాకు దుష్కర్మ కనపడితేగా" అన్న అమ్మ సమాధానం విన్న ఆ సోదరుడు "మాకు ఆ భేదం కన్పిస్తున్నది. వాటి వల్ల నష్టం అనుభవిస్తున్నాం కదా ! నీవు మా మనసులు తిప్పి అన్నీ సత్కర్మలే చేయిస్తే లోకంలో ఈ సంక్షోభం తప్పుతుంది గదా ! – అని అనగా –

"నాకు అవసరం అనిపించినపుడు తిప్పుతాను" అని అతి నిర్లిప్తంగా అన్నది అమ్మ. కానీ అందులో నిశ్చయమే ధ్వనించింది. ఆ సందర్భంలో మంచి, చెడులను గురించి వివరిస్తూ ఇది మంచిమార్గం, ఇది చెడుమార్గం నిర్ణయించు కోవటం ఎట్లా అంటే – అన్నీ భగవంతుడే చేయిస్తున్నాడు అనుకోవటమే – కష్ట సుఖాలూ రెండూ వాడి అనుగ్రహమే. ఆయా అవసరాల్లో ఆయా పనులు చేయించటమే కరుణ. అంతా వాడి అనుగ్రహమనుకుంటే మనస్సు హాయిగా ఉంటుంది. మనం చేస్తున్నది ఏమీ లేదనీ, మనని నడిపించే శక్తి మరొకటి ఉన్నదనీ, ప్రేరణే దైవమనీ, అసలు భగవంతుడంటే – ఈ సృష్టి సర్వమూ దైవ స్వరూపమే. సృష్టే దైవం. ఎక్కడ ఎవరికి పరిచర్యలు చేసినా, ఏ రూపంలో చేసినా అది దేవతార్చనయే. ఎవరికి సాయం చేసినా మేమే చేస్తున్నాం అనే భావన కాక భగవంతుడిచ్చిన అవకాశంగా భావించాలి.

ఒక సోదరుడు సాధన గురించి ఒక మూర్తిని ఉద్దేశించి ధ్యానం చేస్తుంటే – అనేక రూపాలు ఎదురుగా వచ్చి నిల్చుంటాయి. ఏకాగ్రత కుదరటం లేదు. ఏం చేయాలమ్మా అని బాధపడ్డాడు. 'బాధపడకు నాన్నా! నీవు ధ్యానం చేసే దైవమే అన్ని రూపాలూ తనవే నని నీకు తెలియ చెప్పటం కోసం అన్ని రూపాల్లో సాక్షాత్కరించింది. అంతేకాని నీవు ఒకరిని కొలుస్తుంటే ఇతరులెవరో నీ మార్గానికి అడ్డు రావటంకాదు. వారందరూ ఒక మూర్తి యొక్క విభిన్నమైన రూపాలని భావించటమూ, గుర్తించటమే ఏకాగ్రత. ఏకాగ్రత అంటే పటం ముందు కూర్చోవటమే కాదు ప్రతి వస్తువునూ ఆ స్వరూపంగా చూడటమే ఏక్రాగత అని అతనికి సాధనా మార్గాన్ని నిర్దేశించింది.

మరొక సందర్భంలో – మంత్రం అంటే అక్షర మాలేగా అక్షరాలు ఏర్చి, కూర్చి వాక్యాన్ని రూపొందించి వాటి కొక భావన కల్పించి, చెవిలో చెప్పేసరికి అది మంత్రమవుతున్నది దానికొక పవిత్రత ఏర్పడుతుంది. గాయత్రీ – బ్రహ్మోపదేశం ఎవరికీ వినపడకుండా చెప్పాలంటారు. దేనికి ? ఇతర ధ్యాస లేకుండా, ఇతర శబ్దం వినకుండా వినమని అనటానికి బదులు ఎవరూ వినకుండా అంటున్నారు. తృప్తినీ, శాంతినీ, హాయినీ, ఇచ్చి సందేహ నివృత్తి చేయగలిగింది. ఏదయినా, సందేశమే, – మంత్రమే – మననమే – మంత్రం.

ఎవరయినా ఇక్కడ ఉంటామని అమ్మను అడిగినప్పుడు. ఇక్కడేదో అమ్మ దగ్గర హాయిగా ఉన్నదని అనుకోవద్దు. గులాబీపువ్వు కావాలనుకుంటే – గులాబీ ముళ్ళు గుచ్చుకుంటాయి. ఇక్కడ తేళ్ళు, కాళ్ళ జెర్రులు, మండ్రగబ్బలు, పాములు అనేకం ఉంటాయి. వాటన్నింటితో కలిసిమెలగాలి. ఇక్కడ మెలగ గలిగితే ప్రపంచంలో ఎక్కడయినా మెలగగలరు" అని అమ్మ చెప్పింది. ఇది సమాధానమో, సందేశమో మరి. ఇక్కడ ఉండటమే – పూజ అనీ ఇది కాశీ రామేశ్వరం లాంటి క్షేత్రమనీ అదృశ్యంగా అన్నింటికీ కూడలి అవుతుందనీ" చెప్పింది.

నిగ్రహం కోసమే – విగ్రహారాధన అని చెప్పిన అమ్మ దానిని ఈ విధంగా వివరించింది. రాముని బొమ్మ ఉన్నదనుకోండి దానిని బొమ్మల దగ్గరగా పెడితే బొమ్మగా చూస్తున్నాం. దేవతార్చనలో పెడితే దేవునిగా చూస్తున్నాం. స్థానాన్ని బట్టి పేరు పెడుతున్నాం. ఈ నోములూ, వ్రతాలలో ఒక్కొక్క నోముకు ఒక్కొక్క వస్తువులో దైవత్వాన్ని ఆపాదించి పూజ చెయ్యడం జరుగుతున్నది. విడి సమయంలో ఆ వస్తువును ఇష్టం వచ్చినట్లు వాడుతున్నాం. అదే నోముల్లో దైవత్వాన్ని చూస్తున్నాం. కనుక ప్రతివస్తువులో దైవత్వాన్ని చూడటం కోసమే ఈ నోములూ, వ్రతాలు. కాలవనిండా నీరు ఉన్నా దాహం తీరటానికి రేవు అవసరం.

ఆలయాలు కూడా రేవుల్లాంటివే అని చెప్పిన అమ్మ ఇక్కడ హైమాలయం, అనసూయేశ్వరాలయాలను ఏర్పాటు చేసి తను అనుగ్రహాన్ని వర్షించటానికి అనసూయేశ్వరా లయంలో కొలువై ఉన్నది.

"అమ్మా ! మహిమలు చేసే నీవు మహిమలు ఎందుకు ఒప్పుకోవు" అన్న ప్రశ్నకు –

"మహాత్మ్యాలతో కలిగే విశ్వాసం అవి నిలిచిపోయి నప్పుడు చెదిరిపోతుంది. కనుక ఏది జరిగినా – ఏ పరిస్థితులలోనయినా భగవంతుని మీద చెదరని విశ్వాసం

ప్రసాదించమని కోరుకోవటమే ప్రార్థనకు పరమావధి" అన్నది.

కష్టాలలో ఉన్న అభాగ్యుల బాధలకు స్పందించటమే మానవుని ద్వారా వ్యక్తమయ్యే దివ్యత్వం అని నిర్వచించిన అమ్మ తన బిడ్డలందరూ ఆస్థితిని పొందటానికి ఏమి చెయ్యాలో అనేక సన్నివేశాల ద్వారా వివరించింది.

ఒకసారి బాపట్లలో దారుణమయిన అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ సంఘటన విన్న అమ్మ హృదయం ద్రవించి వారికి ఆహార సదుపాయాలు కలుగచేయమని శ్రీ విశ్వజననీ పరిషత్‌ను ఆదేశించింది. అన్నం పొట్లాలు కట్టటం మొదలైన పనులన్నీ తానే స్వయంగా దగ్గరుండి జరిపిస్తోంది.

ఆ సమయంలో అమ్మ దర్శనార్థం వచ్చిన ఒక సోదరుడు నాకేదయినా సందేశం ప్రసాదించమ్మా అని ప్రార్థించాడు. అమ్మ మౌనంగా అతణ్ణి చూసింది. అతను మళ్ళీ ప్రాధేయపడ్డాడు. ఆ కార్యక్రమంలో పాల్గొనమని అమ్మ సూచించింది. అందులోని సందేశం అర్థంకాక. ఆ సోదరుడు అమ్మ పాదాలవైపు, అమ్మ వైపు చూస్తుండి పోయాడు.

వాళ్ళు ఆకలితో ఎదురు చూస్తుంటారు. నలుగురు కలిస్తే వారికి త్వరగా అందించవచ్చు అన్న అమ్మ మాటల్లో ప్రేమ, సానుభూతి అతనికి ధ్వనించాయి. ఒకరి కొకరు తోడయితే పని తొందరగా అవుతుంది. వారికి త్వరగా అందించటానికి అవకాశం ఉంటుంది. అన్న భావం, ఆంతర్యం అప్పటికి గాని అతనికి అవగతం కాలేదు. తనకి ఆసేవలో పాల్గొనే అవకాశం అమ్మ ఇచ్చినందుకు ఆ రూపంగా సందేశం అందించినందుకు. ఆ సోదరుడు ఎంతో సంతృప్తి పొందాడు.

ఈ విధంగా అమ్మ తన మాటల ద్వారా, చేతల ద్వారా కొన్ని సన్నివేశాల ద్వారా, ఆయా పరిస్థితులకు అనుగుణంగా ప్రబోధించింది. అందుకే "పరిస్థితులే గురు" వన్నది.

అమ్మ ఏం చెప్పినా తన అనుభవంలోనుంచే చెప్పింది. తాను ఆచరించి చూపింది కనుకనే -

"నీ బిడ్డయందు దేనిని చూస్తున్నావో - అందరి యందు దానిని చూడటమే బ్రహ్మస్థితిని పొందటమ"నీ, 'కూతుర్ని, కోడల్ని ఒకటిగా చూడటమే అద్వైతమ'నీ ప్రబోధించింది.

ఉపదేశమంటే దైవసన్నిధికి చేర్చటం అని ప్రవచించిన అమ్మ మనం ఆ సన్నిధికి చేరుకోవటానికి చేసిన మహోపదేశాలు ఎన్నో - ఎన్నెన్నో....

34. అమ్మ కల

అమ్మకు కలేమిటో -

సృష్టిరచనే తానైన అమ్మకు కలలా ?.

మన కోసం మన మధ్య మనవలె మనుగడ సాగించింది కదా ! మీ మధ్యకు వచ్చినందుకు నాకు అన్నీ తప్పవు. ప్రతి అనుభవం అవసరమే అని కనబరచటానికి కష్టసుఖాల కలయికలో జీవితం గడిపింది.

1965వ సంవత్సరంలో ప్రస్తుతం నామసంకీర్తన జరిగే ఇంట్లో ఉండేది. ఈ ఇంటికి అప్పట్లో దక్షిణపు వైపున రెల్లుతో కప్పబడిన మందిరం వుండేది. అమ్మ నాన్నగారయిన సీతాపతిగారు ఆ మందిరంలో పడుకున్నారు. వారు అస్వస్థతగా వుండటం వల్ల వారిని పరామర్శించటానికి వచ్చింది. తాతగారి మంచం పక్కనే కుర్చీలో కూర్చుని తాతగారిని పలకరించి అక్కడే ఉన్న శేషగిరిరావన్నయ్య, రామకృష్ణన్నయ్యలతో మాట్లాడుతూ తనకు ఏడవ సంవత్సరంలో ఓ కల వచ్చిందనీ అదేమంటే సర్వాభరణాలతో అమ్మను అలంకరించినట్లు, ఇదొకటి.


మరొకటి : తను పద్మంలో ఉండి పైకి ఎగిరి ప్రపంచాన్నంతా ఒక్కసారి తను చూసినట్లు తనను అమ్మా అమ్మా అని అందరూ పిలుస్తుంటే తను అదృశ్యమయినట్లు వచ్చింది అని చెప్పి "కలలో వచ్చిన అలంకారం 1959 లో జరిగింది. రెండవది కూడా జరగాలిగా" అన్నది.

1959లో సర్వాలంకారభూషిత అయిన అమ్మను దర్శించే అవకాశం నాకూ ప్రసాదించింది. అమ్మ ఇవి చెప్తుంటే 3 సంవత్సరాల గతంలోకి వెళ్ళింది నా మనస్సు 1962 సంవత్సరం ఫిబ్రవరిలో జరిగిన విషయం స్మృతిలో మెదిలింది.

ఊరంతా మంట లేకుండా పొగతో కుమిలి పోతున్నట్లుగా కనబడిందిట. ఇట్లారాకూడదు వచ్చిందేమిటి అని కలలోనే అమ్మకు అన్పించిందని తన కలను వివరించింది. అమ్మకు కలేమిటో దీని పరిణామం ఎట్లా వుంటుందో అనిపించింది. ఆనాడు ఆ తర్వాత రెండు రోజులకు ప్రతివూళ్ళోనూ కలరా వ్యాధి విపరీతంగా ఉన్నదన్న వార్త తెలిసింది. అమ్మ కల ఈ రూపంగా పరిణమించిందేమో అనుకున్నాను.

12)

అమ్మకల అసత్యం కానేరదు కదా ! నేను మీలో కలవకపోతే మీరు నా దగ్గరకు రాలేరు. మీలో కలిసి నేను మిమ్మల్ని దగ్గరకు తీసుకోవాలి అన్న అమ్మ మన మధ్యకు వచ్చి 7వ సంవత్సరంలో కల వచ్చిన రీతిగా 1965లో ఆ కలను వ్యక్తం చేసింది. 1985లో పార్థివ శరీరాన్ని వదిలి పద్మంలోకి ప్రవేశించి పైకెగిరి ప్రపంచాన్నంతా ఒక్కసారి చూసి అదృశ్యమయ్యే ఉంటుంది. ఆ దృశ్యం మాత్రం మన కగోచరమనీ. అమ్మా, అమ్మా అని మనం ఘోషిస్తుండగా అనంతమయిన అమ్మ అనంతవాయువుల్లో లీనం కావటం మాత్రం దృగ్గోచరమనీ, రెండవది కూడా జరగాలిగా అన్న కలను అమ్మ నిజం చేసిందన్న భావం నాలో కలిగింది.



శ్రీవారి చరణసన్నిధి గ్రంథావిష్కరణ సభ దృశ్యం

35. హైమ ఎంతోమందికి కనిపిస్తూనే ఉన్నది

ఒక రోజు అమ్మ ప్రశాంతంగా కూర్చొని ఉండగా – "అమ్మా భగవంతుడు దుష్టశిక్షణార్థం శిష్టరక్షణార్థం ఎప్పుడవసరమయితే అప్పుడు భూమి మీదకు వస్తానని చెప్పాడు కదా ! తాను చెయ్యదల్చుకున్న దేదో అక్కడే వుండి ఎందుకు చెయ్యకూడదు? ఏదయినా చెయ్యగలిగిన వాడే కదా !" అని నేను అడిగితే అమ్మ "చెయ్యచ్చు కానీ – ఒక నాటకం వ్రాశామనుకో, దాన్ని ప్రదర్శించి చూపెట్టినప్పుడు వుండే ఆనందం వింటే ఏముంటుందీ ? నామరూప రహితుడే కాదు సహితుడూ అని చెప్పటానికి అవకాశం రూపం. అందరికీ అర్థమై ఆనందించటం కోసం రూపం అవసరం. రూపం ఉన్నందువలన శక్తి పెరిగేది లేదు తరిగేదీ లేదు. కాలవనిండా నీళ్ళువున్నా తాగటానికి రేవు అవరమయినట్లు – అంతటా వున్న శక్తిని మనం ఆరాధించ లేము కనుక ప్రత్యేకమయిన ఒక రూపం, నామం అవసరయినాయి. నిగ్రహం కోసమే విగ్రహారాధన" అన్నది.

భగవంతుడు అవతారం ధరించాల్సి వచ్చేటప్పుడు తనతో పాటు తన కనుగుణమైనట్లు, తన కవసరమయిన ఏర్పాట్లతోనే వస్తాడనుకుంటాను.

ఆనాడు దేవాసుర సంగ్రామ సమయాల్లో ఆ శక్తి (అమ్మ) తనలో నుంచి కొన్ని శక్తులను ఉద్భవింప చేసి వాటికి కొన్ని పేర్లను పెట్టి – లోకరక్షణ కోసం ఎలా ఉపయోగపరచుకున్నదో ఈనాటి పరిస్థితుల కనుగుణంగా అమ్మ మనకు దృశ్యమానమయ్యేలా శక్తులను ప్రదర్శింపదు కనుక భౌతిక పరమయిన ఈ నాటకంలో సహజమయిన రీతిలో గర్భిణియై హైమకు జన్మనిచ్చి శిశువుగా లాలించి పెంచి అమ్మ ప్రేమనందించింది. అమ్మ హైమలో భక్తి, ప్రపత్తుల్ని నింపింది. యుక్తవయస్సు రాగానే నాన్నగారు వివాహ ప్రసక్తి తేగా 25 సం॥ దాటనీయండి అన్నదే కాని తాను ఆడబోయే నాటకం గర్భితంగానే వుంచింది.

అమ్మ హైమను మాధవిగా మలచకముందే సోదరుడు రామరాజు క్రిష్ణమూర్తికి 1960 వ సంవత్సరంలోనే ప్రస్తుతం హైమాలయం వున్న చోట ముక్కెర పెట్టుకున్న 20 సంవత్సరాల యువతి భూగర్భంలో నుంచి బయటకు

వస్తూ కనిపించిందట. మరి అమ్మ సంకల్పం ఈనాటిది కాదు ఏనాటిదో అన్న విషయం అర్థం అవుతున్నది.

హైమ రూపమయిన అమ్మ ముందుగానే – ఆ సోదరునికి మహద్భాగ్యాన్నిచ్చి అతన్ని అనుగ్రహించింది.

ఏప్రిల్ 5, 1968లో – హైమను మాధవిగా, చిరంజీవిగా చేసి శక్తిని ప్రసాదించింది.

హైమాలయ స్థాపన చేసింది. హైమే శంకువు అన్నది 1969లో. చైత్రశుద్ధసప్తమి నాడు హైమాలయ శిఖర స్థాపన చేసింది. హైమాలయ గర్భాలయంలో – హైమ శిలామూర్తి ప్రతిష్ఠింప బడక ముందు – హైమను ప్రతిష్ఠింప బోయే పీఠంపై అమ్మ సింహాసనాసీన అయింది.

హైమ అంటే భక్తిప్రపత్తులు కలిగిన ఒక దంపతులు అమ్మకు ఏకాదశ రుద్రాభిషేకం అర్చన చేశారు. అమ్మ కిరీటసహిత త్రిశూల, శంఖ, చక్రధారిణియై నేత్రపర్వంగ దర్శనమిచ్చింది. ఆ అర్చన, ఆ దర్శనం తనలో సంజనిత మయిన హైమ, నేను ఒకటే అన్న అభేద స్థితిని తెలియచేయటానికే అన్నట్లుంది – ఆనాటి శోభ.

1970 ఏప్రిల్ 13న స్పందించే శిలామూర్తి అయిన హైమను ప్రతిష్ఠించింది. ఆ స్థలాన్నే ఒక మహత్తరమైన మహాద్భుతమైన మానవాతీతమయిన శక్తిచే ప్రభావితం చేసింది. ఈ గ్రామాన్నే తన కార్యక్షేత్రంగా ఎన్నుకుని తన నివాసంతో భూమిని, గాలినీ, నీటినీ అణువణువును, పంచభూతాలను పవిత్రంగా రూపొందించింది.

అమ్మ పుట్టిన వూరికీ మెట్టిన వూరికీ కూడ ఎంత ధన్యతను ప్రసాదించిందో – మున్ముందుగాని వాటి ప్రతిభ బయటికి రాదేమో ! ఏ విషయమూ చెయ్యటం తప్ప మాటలతో పనేముంది అనే అమ్మ హైమ తర్వాత ప్రసంగవశాన చెప్పిన మాటలు నా తర్వాత దానికెట్లా? అన్న ఆలోచన వుండేది. నేను చివర అనుకున్నప్పుడు సర్వశక్తులు ప్రసాదిస్తాను. నేను లేను అనిపించకుండ చేసిపోతాను అని చెప్పినా దానికి ధైర్యం చాల్లేదు. దాని సంతృప్తి కోసం చెప్తున్నాననుకున్నది. హైమ ముఖంలో ముఖంపెట్టి చూస్తున్నట్లుంటుందమ్మా" అన్నది.

అమ్మ సూచనప్రాయంగా మాట్లాడవచ్చు, కొన్ని అందీ అందకుండా మాట్లాడిన విషయాలూ వున్నాయి. కొన్ని అందేటట్లుగానూ ఉంటాయి. కానీ ఇంత స్పష్టంగా, ఇంత బహిర్గతంగా అనేవి చాలా అరుదుగా వున్నాయి.

మాటంటే మారుమాట లేని మాట – అనే అమ్మ శరీరంతో వున్న హైమకు మాట ఇచ్చిన అమ్మ, హైమ సిద్ధి పొందిన పిదప, శక్తి ఇచ్చినంత మాత్రాన తరిగేది కాదు అన్న అమ్మ మరల జీవం పోసి సర్వశక్తులనూ హైమకు వరంగా ప్రసాదించి, అభయప్రదాయినిగా లోకానికి అందించింది.

ప్రస్తుతం నామసంకీర్తన చేసే అమ్మ ఇంట్లో హైమకు అలంకారం చేయటం వల్ల ఆ యింటికి అలంకార హైమ ఇల్లుగా పేరుండేది. ఇప్పటికి ఆ పేరు మరువలేని వారెందరో వున్నారు. 1960 నుంచి 1968 దాకా అమ్మ ఆయింట్లోనే వుండేది. హైమ ఆలయంలో చేరిన నాలుగునెలలకు నేను అమ్మ మంచం దగ్గరే వరండాలో పడుకున్నాను తెల్లవారు ఝామున కళ్ళు తెరవబోయే సమయంలో (తిరుమలమ్మక్కయ్య అనే సోదరి హైమకు అలంకారం చేసేది) ఆమె హైమను తీసుకెళ్ళి అన్నపురాశి చూపించమన్నదే అమ్మ ! ఆమె హైమను తీసుకొస్తోంది. కొద్దిదూరం రాగానే హైమే (సజీవంగా) నడిచి వస్తోంది. అందరూ అమ్మ వస్తోందను కుంటున్నారు. రవి, నేను ఒక చోట వున్నాము. హైమ చాలా ఆతృతగా మా దగ్గరకు వస్తోంది. అమ్మకాదర్రా ..... హైమ వస్తోంది అని హైమా అంటూ పడిపోయాను. స్పృహ లోనే వున్నాను. రవి ఏడుస్తున్నాడు. గది వాకిట్లో నుంచున్న సుబ్బారావన్నయ్య ఏడుస్తున్నాడు. హైమ నన్ను లేవతీసి చెయ్యి పుచ్చుకున్నది. ఇద్దరం కలిసి అన్నపురాశి దగ్గరకు వెళ్ళాం. హైమ గుండిగలో వున్న అన్నాన్ని తోడి రాసిపోసిన అన్నాన్ని కలుపుతోంది. హైమా "నువ్వేమన్నా తిన్నావామ్మా" అని అడిగాను.

"అక్కయ్యా! నేను బాలింతను కదా నేను తినకూడదు కదా నాకంటే పెద్దదానివి నువ్వు తినవచ్చుంటే నేను తింటాను నువ్వు చెప్పినట్లు చేస్తా"నన్నది – హైమ బాలింతనని చెప్తూ ఇంత శ్రమపడి అన్నం కలుపుతోంది అందరికోసం అనిపించింది. నేనేం మాట్లాలేదు. తనని అలాగే చూస్తుండిపోయాను. అమ్మ కూడ నేను, బాలింతను, చూలింతను నాకు పథ్యం సరిగా వుండాలి. రొట్టెలో

నెమ్ముండకుండ బాగా కాల్చుమనేది - అలాగే అమ్మ ప్రతిరూపమయిన హైమ పలికిన పలుకులో పథ్యం అన్న భావం ప్రస్ఫుటమవుతోంది.

కళ్ళ నిండా నీళ్ళు కారుతున్నై. అమ్మ ఏమిటని అడిగింది. ఇలా హైమ కన్పించిందని చెప్పాను. ఈ రోజు హైమానంద్‌కు ముద్ద కుడుములు ఇప్పించ్చాలి గదా ఇక్కడే ఇప్పిందాం లే అన్నది. (ఆరోజు అమ్మ అన్నట్లే ఫంక్షన్ జరిగింది)

ఇక్కడ తోట సేవచేస్తున్న సోదరి వరలక్ష్మిగారికి పట్టపగలే తన మంచం తలవైపుగా (పావడా, ఓణీతో శుద్ధశ్వేతవస్త్ర ధారిణియైన హైమ) కూర్చుని తోట గురించిన వివరాలను మాట్లాడిందట. హైమ 69 వసంతాలు నిండి 70వ వసంతంలో అడుగిడబోతున్నది. మనందరి మధ్య మనతో కలసి మెలిసి తిరుగుతూ మనతో పాటే వుండి పరామర్శిస్తోంది.

హైమ ఆనాడు కూడా -పనిచేస్తున్నది మీరు, నేను శ్రమపడుతున్నట్లుగా వుంటుందేంటక్కయ్యా ? -అని ప్రశ్నించేది. నాడు, నేడు మన కష్టసుఖాల్లో పాలుపంచు కుంటున్న హైమకు నమస్సుమాంజలులు.

36. భయాపహా

గుజరాత్‌లో ఉండే అమ్మ భక్తురాలైన ఒక సోదరి కుమారునికి అనారోగ్యంగా ఉన్నదట. ఆ బాబు హైద్రాబాద్‌లో ఉన్నప్పుడు డాక్టర్లకు చూపించారట. వాడి రోగాన్ని తెలియపర్చినారు. ఆపరేషన్ చెయ్యాల్సి వస్తుందేమో అని దిగులు పడ్తుండగా అమ్మ కనిపించిందట. అమ్మ చాలా హుషారుగా స్వప్నంలో ఆనందంగా మహావేగంతో పరుగులు తీస్తూ ఈ ఆరోగ్యం లేని బాబు నీరసంగా ఒక చోట కూర్చునుంటే, ఆ బాబు చెయ్యి పట్టుకుని లేపి "ఇట్లా కూర్చుంటావేమిటి చిన్న పిల్లవాడివి. లే పరుగెత్తు. రా" అని పరుగులు తీయించిందట. అమ్మ అలా పరుగెత్తటమేమిటని ఆ తల్లికి ఆశ్చర్యమేసిందిట.

ఆ తర్వాత ఆబాబుకి మరో టెస్ట్‌లో ఏ రకమైన కంప్లయింట్‌లేదనీ, బాగా పరుగులు పెట్టి ఎక్సర్‌సైజు చెయ్యమన్నారనీ డాక్టర్లు చెప్పారట. అమ్మ తమను వెన్నంటే వున్నదన్న విశ్వాసం మరింత బలపడింది. విశ్వాసం కలిగించటం కోసం కొందరికి అనుభవాలనిస్తే మరి కొందరికి అనుభవాల ద్వారా విశ్వాసాన్ని బలపరుస్తుంది.

మరొక సోదరి అనారోగ్యంతో హాస్పిటల్లో ఉండగ, గదిలో ఎవరూ లేని సమయంలో ఒక స్త్రీ, పసుపు పచ్చని చీర ధరించి పెద్దబొట్టుతో లోపలికి వచ్చి ఒక మూల, ఒక చిన్న ఇరుకు సందులో కూర్చున్నదట. ఎవరో అక్కడ కూర్చున్నారనుకుంటూ, ఎవరూ లోపలి కొచ్చిందని ఆమెనే అడిగిందిట. ఆమె మారు మాటలేక అదృశ్యమయిందిట. ఆ తర్వాత ఆమె ఆరోగ్యం కుదుటపడిందిట. ప్రత్యక్షంగా కలిగిన ఈ అనుభవం ఆమె నెంతో ఆనందపరవశురాల్ని చేసింది. అమ్మే వచ్చి నన్ను కాపాడిందన్నదా సోదరి.

అమ్మ అంటే ఎనలేని భక్తిగల ఒక సోదరి కరెంట్ స్టౌమీద నూనెపెట్టి మరిచి, వేరే పనికి వెళ్ళి వచ్చేసరికి "ఆగు" అన్న అమ్మ కంఠస్వరం విన్పించి లోపలకి అడుగు వేయక అచ్చటే నిలిచిపోయిందట. తర్వాత మరెవరో పక్కవాళ్ళు మెయిన్ తీసి ఆపారట. అమ్మ నన్ను ఆగు అనకపోతే పెద్ద ప్రమాదం జరిగి వుండేదనీ, అమ్మ నన్ను కాపాడిందనీ చెప్పిందా సోదరి. ప్రతి ఒక్క వ్యక్తినీ అమ్మ

నీడలా వెంటాడుతునే వున్నది వుంటుంది.

మరొక సోదరి జ్వరంతో బాధపడుతూ అమ్మ నామస్మరణతోనూ, అమ్మ ధ్యానంతోనే గడుపుతూ (ఇది కల కాదు.) కళ్ళు తెరవలేక ఓపిక లేకుండా వున్నది. ఆమెను చంపటానికి కొందరు వ్యక్తులు మూగారుట. ఒక స్త్రీమూర్తి ఆమె దరికి వారిని చేరనీయక వారిని చంపి ఆ సోదరికి తన స్పర్శనందించి వెళ్ళిందట. కరుణామయి అమ్మే నన్ను కాపాడింది. నాకు ఆరోగ్యం ప్రసా దించిందన్నది. ప్రయాణంలో ఒక సోదరుడు బెజవాడలో - రోడ్డు క్రాస్ చేయాలి చేతిలో బ్యాగు ఉన్నది. ట్రాఫిక్ బాగా వున్నది. కాస్త తగ్గాక వెళ్దాం అని ఆలోచిస్తుండగా 20 సం॥ బాలిక వారిని చూస్తూ మౌనంగా చేతిలో బాగ్ ఇమ్మని సంజ్ఞతో బాగ్ తీసుకుని, ఆ అన్నయ్యను దాటించిందిట. తిరిగి చూస్తుండగానే ఆ బాలిక అదృశ్య మయింది. తనను వెన్నంటి వున్నది అమ్మేనని దృఢ విశ్వాసాన్ని వెలిబుచ్చారు ఆ సోదరుడు.

అమ్మ అంటే అచంచలమైన విశ్వాసం కల ఒక సోదరునికి పలురకాలుగా అమ్మకు సేవలు చేసుకునే భాగ్యాన్ని అమ్మ ఇచ్చింది. సేవా దృక్పథంతో ఏ రకమైన పనులనైనా చేయగల్గుతున్నాడు.

అతని తల్లికి ఆరోగ్యం బాగోలేదు. ఇద్దరు ముగ్గురు పట్టి లేవతీస్తే గాని లేవలేని పరిస్థితి. పూర్తిగా నడకలేదు. ఆమె పరిస్థితి ఎలా వుంటుందో అన్న మనసులో ఆందోళనగా వున్నా అమ్మ సేవకు వెనుకాడలేదు. తన పరిస్థితులు అనుకూలించకపోయినా ఎప్పుడు ఏది అవసరమైతే ఆ బాధ్యతను నిర్వర్తించాడు అమ్మే చూసుకుంటుదన్న ధైర్యమే మరి.

తత్ఫలితంగా - అలాంటి స్థితిలో వున్న ఆ సోదరుని తల్లి స్వయంగా లేచి, భర్త అనారోగ్యంగా ఉన్నారని కాఫీ, టిఫిన్స్‌తో సహా పథ్యం పెట్టాల్సిన ఆహారాన్ని సమకూరుస్తూ లేచి తిరుగుతుంటే, సంభ్రమాశ్చర్యాలకు లోనై ఇదంతా విచిత్రంగా భావిస్తూ అంతా అమ్మ దయే అన్నాడా సోదరుడు. అర్చన ఏ రూపంలో వున్నా అమ్మ స్వీకరిస్తుంది అనుగ్రహిస్తుంది. ఎవరిని ఏ రూపంలో అనుగ్రహిస్తుందో తెలియదు. అమ్మ భయాపహా కదా మరి - నా ఒడి విడిచి ఎవరూ లేరనే అమ్మ అందర్నీ కరుణిస్తుంది.

37. నామ ప్రాశస్త్యం

నామ సంకీర్తనం యస్య సర్వపాప ప్రణాశనం
ప్రణామోదుఃఖశమనం తం నమామి హరమ్ పరమ్ ॥

నాస్తి నాస్తి కలౌ నాస్తి హరి నామ వినాగతిః అన్నట్లు ఈ కలియుగంలో తరించాలంటే నామం ఒక్కటే – తరుణోపాయమని చెప్తున్నారు. వెనుకటి యుగాల్లో కొన్ని వేల సంవత్సరాలు తపస్సు చేసి తపః సిద్ధిని పొందేవారని వింటూంటాం. ప్రస్తుతం అటువంటి పరిస్థితులు కాని, మనస్థితులు కాని ఈ యుగానికి లేనందువలన నామ సంకీర్తన వలన తరిస్తారని బహుశ పెద్దలు చెప్పి యుండవచ్చు. బహుకాలం తపస్సు చేసిన ఫలితమే. నామసంకీర్తన యందు ఆసక్తి కలుగుతుందనీ భగవన్నామం వల్ల వచ్చే అనుభవాలు నియమ నిష్ఠల వల్ల సాధించే యోగసమాధి అనుభవాల కంటే గొప్ప అనుభవాలను ఇస్తుందని పెద్దల నానుడి.

నామయోగి, పరమభాగవతోత్తములు, అమ్మ యందు గాఢమైన భక్తివిశ్వాసాలు కల రఘువరదాసుగారు నామంతో నృత్యం చేస్తూ పరవశులై పోయేవారు. నామం చేస్తూ పరవశించేవాళ్ళు వున్నారు. నామం వింటూ పరవశమయ్యే వారూ ఉన్నారు.

పరమభక్తులైన జ్ఞానదేవుడూ, నామదేవుడూ కలిసి ప్రయాణం చేస్తున్నారు. మధ్యే మార్గంలో వారికి దాహం వేసింది. ఎదురుగా ఒక దిగుడు బావి కనిపించింది. నీళ్ళు చాలా లోతుగా వున్నాయి. దిగటానికి మెట్లు లేవు. జ్ఞానదేవుడు అనేకయోగ సిద్ధులు కలవాడగుట వలన ఒక పక్షిరూపం ధరించినవాడై బావిలోపలికి వెళ్ళి దాహం తీర్చుకుని మామూలు రూపం ధరించిన వాడై నామదేవునితో నిన్ను కూడా మారుస్తాను దాహం తీర్చుకోమనగా "నేను పక్షిగా మారాల్సిన అవసరం లేదు.

నా భగవంతుడు నాకున్నాడు అని ఆర్తితో భగవన్నామం చేశాడట. వెంటనే భగవంతుడు అనుగ్రహించాడు. బావిలోని నీళ్ళు పొర్లి పొంగి అతని దాహాన్ని తీర్చాయి. పక్కన వున్న జ్ఞానదేవుడచ్చెరువొంది సార్థక నామధేయుడివి నామదేవా అన్నాడట.

ఒక భక్తురాలు నామం చేసుకుంటూ గోడకు పిడకలు కొట్టగా పొరుగింటివారు ఇవి మా పిడకలు అని వాదనకు రాగా మధ్యవర్తిగా వచ్చిన ఓ పెద్దమనిషి ఇవి మీ పిడకల గుర్తు ఏమిటని భక్తురాలు నడగగా – నా పిడకలు చెవి వద్ద ఉంచుకుంటే నామం వినిపిస్తుంది అన్నదట. ఆ క్షణమే పిడకలను చెవి వద్ద వుంచుకొనగా భగవన్నాం విన్పించిదట. అచటి వారు నివ్వెర చెందారు.

నామం గొప్పదా – నామి గొప్పదా అనే వివాదంలో నామమే గొప్పదన్నవిషయాన్నీ విన్నాను.

శ్రీ రామాంజనేయ యుద్ధంలో – రామనామం బలంగా కల ఆంజనేయుడిదే గెలుపు కదా – భక్తుని గెలిపించటమే భగవంతుని కర్తవ్యం కదా !

ఒక అనారోగ్యవంతుడు ఎన్నో రకాల వైద్యం చేయించు కున్నప్పటికీ ఆరోగ్యం కుదుట పడనందున విరక్తిగా భజన సమాజంలో చేరాడట. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆరోగ్యం మెరుగైనదని విన్నాను.

నామమహాత్మ్యం విన్నారు కదా ! మరి కొన్ని విషయాలు తెలుసుకుందాం.

అమ్మ భక్తుడైన సోదరుడు ఆదిపూడి నరసింహారావుగారు వారి కుటుంబం నూతలపాటి నుంచి వచ్చేవారు. కొన్ని సంవత్సరములు అమ్మ సన్నిధిలో గడిపే అదృష్టాన్ని అమ్మవారికి ప్రసాదించింది. వారు అమ్మ అనుమతితో నూతలపాటి నుండి 12 సంవత్సరముల లోపు పిల్లలను తీసుకొచ్చి వారి చేత సప్తాహం చేయించారు. ఇదే మొదటి సప్తాహం. 6-1-1967న ప్రారంభం.

నామ పారాయణ ప్రీత, సంకీర్తనా ప్రియ అయిన అమ్మ వారు చేస్తున్న నామం వింటూ చాలా ముచ్చట పడింది దయార్ద్ర కదా అమ్మ.

"వాళ్ళు భజన సరిగా చేస్తున్నారా, లేదా అని చూచే కంటే – వాళ్ళ ఆరోగ్య విషయం గమనిస్తూ, టైం ప్రకారం ఆహారం ఇస్తూ, విశ్రాంతి నిస్తూ బడలిక లేకుండా నామం చేయించమని" సోదరునికి ఆదేశమిచ్చింది. సప్తాహం భోగిరోజుకు పూర్తయింది. అమ్మవారందరికి తలంట్లు పోయించి కొత్త బట్టలు పెట్టి ఆడపిల్లలకు గాజులు వేయించింది. వారందరికీ భోగిపండ్లు పోసి ఆశీర్వదించింది. రవ్వ లడ్లు చేయించి పెట్టి ఇళ్ళకు ప్రసాదాలిచ్చి పంపింది. అమ్మ ప్రేమను పొందిన ఆ చిన్నారులు తమ ఇండ్లకు వెళ్తున్నామనే ఆనందం కంటే తమ దృష్టిని అమ్మపై వుంచిన వారై వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళారు.

1960లో చీరాల నుంచి వచ్చే ఇద్దరు సోదరులు ఒకసారి పుట్టపర్తి వెళ్ళారట. వారికి బాబా దగ్గర ఇంటర్వ్యూ దొరకగా జిల్లెళ్ళమూడి అమ్మ గురించి మీ అభిప్రాయమేమిటని అడిగారట. "సృష్టిస్థితి లయకారిణి, ఆదిపరాశక్తి"గా అభివర్ణించారని ఆ సోదరులు చెప్పారు.

అటువంటి ఆ అమ్మ నామం అఖండంగా వినాలన్నది హైమ కోరిక. హైమ కోరిక ప్రకారం 1968లో హైమసిద్ధి పొందిన పిదప అఖండ జ్యోతిని వెలిగించి, అఖండనామ జ్యోతినీ వెలిగించింది. అది హైమ కోరికగ మనకు కనిపిస్తోంది కాని మనను తరింపచేయటానికే ఈ మహదవకాశాన్ని కల్పించదనిపిస్తుంది.

సోదరుడు రాధాకృష్ణరెడ్డి నాన్నగారు సిద్ధిపొందక మునుపు అనసూయేశ్వరాలయ గర్భాలయంలో కూర్చుని నిరాహారుడై నామం చేసేవాడు. వాడు చేసే నామానికి గుళ్ళో నుంచి హైమ లేచి వస్తుందేమో అనేది అమ్మ. అంత ఆర్తిగా వుండేది. నామానికి ఎంత మహత్తున్నదో చూడండి. మనమూ అలా నామం చెయ్యగా చెయ్యగా అసంకల్పితంగా మనచే ఆ నామం చేయబడుతుంది. అమ్మ చేరువవుతుంది. అమ్మ సన్నిధికి వచ్చి రామనామం చేసే భక్తులు అమ్మా రామనామం చెయ్యమంటావా? అని అడిగారు.

"ఏ నామం అయినా ఒకటే నాన్నా. అన్ని రూపాలు, అన్ని నామాలు ఒకే శక్తివి గదా ! మీ ఇష్టం అన్నది" ఆ అమ్మ సన్నిధిన రామనామ సప్తాహం జరిగింది. (రఘు వరదాసు గారి శిష్యులైన శ్రీశ్రీరామ్ గారి ఆధ్వర్యంలో). ఆ తర్వాత అమ్మ సప్తసప్తాహలు జరిగితే వినిపోవాలని వున్నదనిన మాటా వున్నది. అలాగే జరిగాయి. నామం చెయ్యటానికి ఒక కుటుంబం వుంటే బాగుంటుదన్న అభిప్రాయం వెలిబుచ్చటం శ్రీరామ్‌గారికి కబురు తెలిసి వారి శిష్యబృందంలోని ఒక కుటుంబాన్ని ఇక్కడికి పంపటం జరిగాయి.

అమ్మ ఆలయ ప్రవేశానంతరమూ అమ్మనామ సప్తాహాలు, సప్తసప్తహాలు శ్రీరామ్‌గారి ఆధ్వర్యంలో ఆయన శిష్యబృందంతో జరుగుతున్నది. పిన్ననాటి నుంచి సప్తాహ కార్యక్రమంలో పాల్గొని స్థానికురాలైన నాదెండ్ల భ్రమరాంబ అక్కయ్యకు మన గ్రామంలో వారు నామం నేర్చుకుని చేస్తే ఎంత బాగుంటుదన్న ప్రేరణను, ఉత్సాహాన్ని కల్పించి ఉత్తేజపరిచింది అమ్మ. ఆమె గ్రామస్థులను పిలిచి నామం

చెయ్యటానికి ప్రోత్సహించింది వారికి నామం రుచి చూపించింది. "అమ్మ నామామృతమును గ్రోలండీ" అని యేర్లగడ్డ రాఘవయ్యగారు అన్నట్లు ఆ రుచిని గ్రహించిన గ్రామస్థులు నామం బాగా నేర్చుకుని ప్రావీణ్యులైనారు.

చదువు లేకపోయినా, పొలం పన్లు చేసుకుంటూ అమ్మ నామం, హైమనామం బయట వూళ్ళకైనా వెళ్ళి నామం చెయ్యగల ధైర్యాన్ని అనుభవాలను అమ్మవారికి ప్రసాదించింది. వాళ్ళు తమ అదృష్టంగా భావించి, నమ్ముకొని పెంపొందించుకున్నారు. పిల్లలతో ప్రారంభింప బడిన సప్తాహం లతలా పెనవేసుకు పోతుంది అమ్మ. ఆసారి కాసారి బాగా జరుపుకుంటోంది. అహర్నిశం నామం జరగాలనీ, వాయిద్యాలతో జరగాలనీ, ఎదుటివారిని ఆ నామం కూర్చోబెట్టగలగాలనీ (ఈ చిన్ని చిన్ని కోర్కెలు కోరినట్లుగా) అమ్మ అనేది.

నామం జరిగేటప్పుడు ఎవరూ పిల్చినా లేవకూడదు అన్న దానికి ఒక ఉదాహరణ. మా చెల్లి నామానికి వెళ్ళింది. అమ్మ పిలుస్తున్నదని ఒక కబురు వెళ్ళగా. లేచి అమ్మదగ్గరకు వచ్చింది. "నామం నుంచి లేచి వచ్చావేమిటని" అమ్మే ప్రశ్నించింది. నువ్వు పిల్చావంటే వచ్చానమ్మా అన్నది. "నేను పిల్చినా మధ్యలో లేచి రాకూడదు, లేచిరావద్దు" అని చెప్పింది అమ్మ. మనకు తెలియటం కోసంగా ఒక సంఘటనను కల్పించి అందులో నుండే సరైన సందేశాన్నిస్తుంది.

మనను తన ప్రేమలో ముంచి తరింప చేయటానికే అమ్మ చెప్పే సందేశాలు చేసే నిర్దేశాలూను ఆ ప్రకారం సోదరుడు ధర్మసూరి నామం బాగా జరగాలనే కాంక్షతో గ్రామస్థులను ప్రోత్సహిస్తుంటాడు. అమ్మ కోరిక అమ్మ ఒక్కో పనికి ఒక్కొక్క వ్యక్తికి ప్రేరణ కల్పించి ఆ పనులను నెరవేరుస్తుంటుంది.

అమ్మ కోరినట్లుగా అహర్నిశం నామం జరుపుకుంటుందనే జరుపుకోవాలనే అమ్మనే కోరుకుందాం తను అన్నా, అనుకుంటేనేగా జరిగేది.

౩౮. అమ్మ సన్నిధిలో ఆంగ్ల సంవత్సరాది

అమ్మ సన్నిధిలో ఆంగ్లసంవత్సరాది ప్రత్యేక పూజలు 1963 వ సంవత్సరం నుండి జరుగుతున్నాయి. ఆంగ్ల సంవత్సరానికి కూడ అమ్మ ప్రేమతో పిలుపునందిస్తోంది.

అమ్మ ఎవరికి ఎప్పుడు ఎందుకు ప్రేరణ కల్పిస్తుందో అదెలా మలుపు తిరుగుతుందో తెలియదు. అమ్మ పెద్ద బిడ్డ అయిన బ్రహ్మాండం సుబ్బారావన్నయ్యకు ఆ ప్రేరణ నిచ్చింది. 1962 సంవత్సరము అన్నయ్య అమ్మకు కొత్తచీర, బిస్కట్లు తెచ్చాడు. అప్పుడు వేదికలు లేవు. అలంకారాలు లేవు. ఇంత జనమూ లేరు. ప్రస్తుతం నామసంకీర్తన జరిగే ఆలయంలో హాల్లో మంచం మీదనే. అమ్మ అన్నయ్యా పెట్టిన చీర కట్టుకుని వచ్చి కూర్చున్నది. సుబ్బారావన్నయ్య అమ్మ మెడలో దండవేసి పూలు పాదాలపై వుంచి నమస్కరించి బిస్కెట్లు నివేదన చేశాడు. టీ పెట్టించి ఇచ్చాడు. అక్కడున్న అందరికీ అమ్మ స్వయంగా ప్రసాదం పెట్టింది. ఇలా ఆరంభమైన న్యూఇయర్ ఫంక్షన్ మంచం మీద నుంచి కుర్చీ ఆ తర్వాత ప్రస్తుతం అన్నపూర్ణాలయం దగ్గర వున్న వేదికపైన అలంకృతమైన సింహాసనాసీన అయి చిద్విలాసంగా కరెక్టుగా 12 గంటలకు నూతన సంవత్సరానికి శుభారంభం పలికింది. 12 గంటలకు వేదికపైకి వచ్చిన అమ్మ తెల్లవారి 4 గంటలదాకా పట్టేది భక్తుల సందడి వారి పూజలందుకుంటూ, వారు కొత్త పుస్తకాల మీద అమ్మ చేవ్రాలును వ్రాయించుకుంటూ, కాలం గడిచేది. 4 గంటలకు పైకి వాత్సల్యాలయానికి వచ్చినా, కిటకిటలాడుతూ ఆ రోజంతా సంరంభమే.

1980వ సంవత్సరంలో అమ్మ టైంకి దర్శనానికి రాలేదు. టైమయినా అమ్మ ఇంకా రాలేదేంటని ఆతృతతో అమ్మను దర్శించుటకై నిరీక్షిస్తున్న అమ్మ సంతానం మనస్సులో పరిపరి ఆలోచనలు.

అమ్మ 2 నిమిషాలు ఆలస్యంగా వచ్చింది దర్శనానికి. మర్నాడు ఆంధ్రప్రభలో కొత్త సంవత్సరం లేటుగా వచ్చిందన్న వార్త పడింది. ఆ పేపరు చూసిన రామకృష్ణ అన్నయ్య అమ్మకు చదివి వినిపించాడు. వివిధ నభో మూర్తుల ప్రభావం వలన భూభ్రమణం స్వల్పంగా మందగించిందనీ, అందువల్ల కొత్త

సంవత్సరం లేటుగా వచ్చిందనీ, జాతీయ భౌతిక పరిశోధనాగారం తెలియచేసిందనీ, చదివి అందుకే రాత్రి నువ్వు ఆలస్యం చేసి ఉంటావు అన్నాడు.

అమ్మ చిరునవ్వుతో -

"అదంతా మీ నమ్మకంరా" అని తేల్చేసింది.

ఆ రోజు కాలం మందగిస్తే - అమ్మను ఈ నాటికీ అర్థం చేసుకోలేని మందబుద్ధులం మనం.

మన మాంద్యం తొలగించి తనను గుర్తింప చేయాలన్నా అమ్మదే కదా బాధ్యత పరిమితమైన అమ్మ అపరిమితమైన సంవత్సరం.

1985 చివర సంవత్సరం. ఆ రోజు కరెంటు లేదు. అమ్మకు స్నానానికి నీళ్ళులేవు.

ఆ రోజుల్లో (ఆశ్రమానికి) అందరింటికి జనం రాక పోకల వసతికి ఒక వాన్ వుండేది. ఆ వాన్ లైట్లలో అమ్మదర్శనం జరిగింది. ఈ సంవత్సరం యిలా జరిగిందే ఇది దేనికి సంకేతమో అనిపించింది. ఆ సంవత్సరమే మన కోసం దివినుండి భువికి దిగివచ్చి మనవలె మన మధ్య మెలిగిన అమ్మ అనంతాకాశంలో విలీనమయింది. మనకు కనిపించని తీరాలకు మనను దాటివెళ్ళినా మనను వెన్నంటి కనిపెట్టేవుంటున్నది.

సుబ్బారావన్నయ్యతో ప్రారంభింపచేసిన ఈ న్యూ ఇయర్ ఫంక్షన్ ఆసారి కాసారి వైభవంగా నూత్న వినూత్నంగా జరుపుకుంటోంది.

ఈ ఉత్సవం 2013కి 50 సంవత్సరాలు నిండి 51వ సంవత్సరంలో అడుగుపెట్టబోతోంది. చిద్విలాసంతో కనిపించే ఆ కరుణామయిని దర్శించి అమ్మ ఆశీస్సులందు కుందాం.

39. నాన్నగారితో నా అనుబంధం

దైవం మానుషరూపేణ భువిపై అవతరించ సంకల్పించినప్పుడు తమ పరివారంతోనే వస్తారని కదా నానుడి. అమ్మ దివ్య ప్రణాళికలో నాన్నగారూ ఒక భాగమే. ఆ ప్రణాళిక ననుసరించే అన్నీ జరుగుతుంటాయి. ఆ ప్రణాళిక ఏమిటో చూద్దామా !

అమ్మ బాల్యంలోనే 6 సంవత్సరములు నిండకమునుపే తన నిర్ణయాన్ని తెలియపరిచింది.

అమ్మ చినతాతగారైన చిదంబరరావుగారికి, వారి కుటుంబానికి స్నేహితులు, గురుతుల్యులు అయిన లక్ష్మణాచార్యుల వారు నృసింహోపాసకులు. వీరు తఱచుగా వీరింటికి వచ్చి పోతుంటారు. వీరు అమ్మలో బాలా త్రిపురసుందరినీ, నృసింహస్వామినీ దర్శించిన మహానుభావులు.

వారు అమ్మను వారింటికి తీసుకెళ్ళి దేవతార్చనకు ఎదురుగా ఆసీనురాల్ని చేసి మూడు గంటలు అమ్మతో సంభాషణానంతరం ముగ్ధులై తల్లీ ! నీవెవరవో చెప్పమ్మా అంటే అమ్మ మౌనంగానే ఉన్నది. పోనీ నేనెవరినో చెప్పమ్మా పలుకమ్మా పలుకుగల తల్లీ ! పలుకవేమీ అనగా అమ్మ – "నీవు పలికే – పలుకే నేను నాయనా !" అని అక్షరమే తానయిన అమ్మ జ్ఞాన సరస్వతే తానుగా స్పష్టీకరించింది.

మరొక సందర్భంలో – ఆచార్యులు గారు అమ్మను వారింటికి తీసుకెళ్ళారు. తిరిగి చిదంబరరావు గారింటికి ఇద్దరూ కలిసి వస్తుండగా త్రోవలో ఒక పెద్ద త్రాచు ఇద్దరి మధ్యనా నుంచుని ఉన్నట్లు కనబడుతుంది. ఆచార్యులుగారు ఉలికి పడి అమ్మా ! దూరంగ వెళ్ళు అది త్రాచు పాము, విషం" అంటారు. అమ్మ – ఆ కాటులో ఘాటు లేదు లెండి అంటుంది. ఆ పాము ఆచార్లగారి నిలువెత్తునా లేచి సరాసరి వారి వంకనే – చూస్తూంటే ఆయన నిశ్చేష్టుడై చలనం లేని వారై ఒక అరగంట గడిచాక కళ్ళు తెరవగా – పాము అమ్మను చుట్టుకున్నట్లు దర్శించారు. వెంటనే వారు అమ్మ పాదాలపై వ్రాలి నేను పాము అంటే భయంలేని వాడ్ని. నా కెందుకింత భయం. అయినా నిన్ను చుట్టవేసుకున్న దేమిటమ్మా అనగా

"అది పాము కాదు నాయనా నాగేంద్రుడు. ఆ నాగేంద్రుడే నన్ను చుట్టుకుని ఉన్నాడు. నేను నాగేంద్రుడిని చుట్టించుకున్నాను. ఆ నాగేంద్రుడే. నాగేశ్వరుడై

వస్తాడు. వాడే నాకాధారం. వాడి ఆకారమే నేను" అని ప్రకటితపరిచింది.

పలు విధాల అమ్మను దర్శించిన ఆచార్యులుగారు "ముగురమ్మల మూలపుటమ్మా నీకాధారమేమిటమ్మా నీవే ఆధారమయితే" అనగా

"ముగురమ్మల మూలపుటమ్మ అంటే - ఆది అయి అనాది అయి ఈనాటి కిది అయింది. (ఈ అమ్మగా వచ్చానని తెలియ చెప్పటమేగా) ముగ్గురు మూర్తులకు తల్లి మూలపుటమ్మ మూడు భాగాలై అన్ని అవస్థలు మూడుగా చేసి తను త్రిపుటియై... బాలై, బాలాత్రిపుర సుందరై, మూడు గుణాలు, మూడు కాలాలు, మూడు పూటలు, మూడు అవస్థలు, శరీర భాగాలు మూడు, మూడు మూర్తులై, ఆ మూడు మూర్తులకు భార్యలై, ఆ మూడు సత్వరజస్తమోగుణాలై ప్రపంచమే ఒక భూతంలో నుంచి అనేకంగా మారి పంచబద్దది. అందుకు నాకాధారం కావల్సి వచ్చింది. అని తనకు అంతా వర్తమానమే" అంటూ అమ్మ విపులీకరించింది.

ఒకరోజు చిదంబరరావు గారి ఇంట్లో అందరూ కూర్చుని ఉండగా ఆచార్యులవారు అమ్మ గురించి కొద్ది కొద్దిగా తెలియచేస్తూ, ఇంతకూ ఈ తల్లి ఎవరి భార్య కావలసి ఉన్నదో అయిన సంబంధాలేమైనా వున్నాయా ? అని అడుగగా - ఎవరూ ఏమి మాట్లాడలేదు. అమ్మే కల్పించుకుని "ఆయనే సంబంధం. అయిన సంబంధాలు ఏమున్నై. సంబంధమే ఆయన - బంధమే ఆయన" అంటుంది. తన అనుభవాన్ని విస్మరించిన ఆచార్యుల వారు ఆయన ఎవరని అడుగుతారు. "మీరు కూడా అడుగుతారేం? మొన్న చెప్పాను కదా అని జ్ఞప్తి చేసి నిర్ణయం మారదన్న విషయాన్ని రూఢి చేసింది.

అమ్మ - బాల్యంలోనే అమ్మ వాత్సల్యాన్ని చూరగొన్న పుత్రుడు మౌలాలి. ఆ సోదరుడు ఎన్నో అనుభూతుల్ని పొందిన మహాభక్తుడు. వివాహాత్పూర్వమే - అమ్మ, నాన్నగారు మాట్లాడుతుండగా అమ్మ కొరకు వచ్చిన మౌలాలి దూరంగా నుంచుంటే - అది గమనించిన అమ్మ "దగ్గరకు రాలేదేం నాయనా" అని అడిగింది. "నాన్నగారుంటే రాలేనమ్మా. వారితో పరిచయం లేదు కదా ! భయం. ఇక్కడున్నంత చనువు, ప్రేమ అక్కడ వుండదమ్మా. ముఖంలో ఏదో ముడత, కోపం, ఉద్రేకం కనపడతై" అంటే అమ్మ "అది శివుడు సోమశేఖరునిగా ఉన్నప్పుడు అట్లాగే వుంటాడు నాయనా" సోమశేఖరుని లక్షణం అని అభివర్ణించింది.

వివాహానికి పూర్వము అమ్మ మేనమామ అయిన చంద్రమౌళి సీతారామయ్యగారు నాన్నగారు అమ్మను వివాహం చేసుకోవటానికి ఇష్టపడుతున్న సందర్భంలో అమ్మను ముద్దుచేస్తూ వాడికి (నాన్నగారికి) జీవకళ తక్కువ అని హాస్యం చేస్తే - అమ్మ "పోనీలెండి మీ మాదిరి జీవకళ అఖర్లేదు. జీవంలేని శిలలను చూశారు. వాటికి జీవం కలవారి నందర్ని చైతన్యం లేని రూపం రక్షిస్తున్నది. అట్లాగే వారు మనందర్నీ రక్షిస్తారు. ఏనాటికో ఒకనాటికి మీరు అందరూ వారికి మొక్కేరోజు అంటూ రాకపోదు" అని స్పష్టీకరించింది.

సీతారామయ్యగారు - "ఇంకా నయం వాడికన్నావు నీకే మొక్కుతారనలేదు బతికించావన్నారు ?

అమ్మ - "ఏరోజు ఎటువంటి రోజు వస్తుందో మనకేం తెల్సు ఎవరికి ఎవరు మొక్కవలసి వస్తుందో" అన్నది. అది అక్షరాల కాలక్రమంలో వారు అమ్మను దైవంగా గుర్తించి, ఆరాధించి స్థానికంగా కొంతకాలం అమ్మ సన్నిధిలో ఉండే అదృష్టాన్ని పొందటం కొందరికి విదితమే.

చిత్రాతి చిత్రంగా పలురకాల మలుపులతో మెలికలతో అమ్మ నిర్ణయానుసారం అమ్మ కళ్యాణం నాగేశ్వరునితో (నాన్నగారితో) కడు వైభవంగా భావపురిలోని చిదంబరరావుతాతగారింట్లోనే జరిగింది (1936 - మే - 5న).

పరమేశ్వరులైన నాన్నగారితో ఆత్మీయులు గాను, సన్నిహితులుగాను, ఒక అనుబంధాన్ని మనకు అమ్మ ఏర్పరిచింది. వారి అనుగ్రహానికి పాత్రతనొసగింది.

మా నాన్నగారి కుటుంబం బాపట్లలో ఉండగ మా నాన్నగారు, అందరి నాన్నగారు స్నేహితులని విన్నాను. కళాప్రియులైన అందరి నాన్నగారు, మా నాన్నగారు కలిసి నాటకాలు వేసే వాళ్ళనీ విన్నాను. ఆ రోజుల్లోనే అమ్మ దృష్టి మా నాన్నగారిపై సారించింది. తత్ఫలితం గానే మా కుటుంబం అమ్మకు చేరువకావటం జరిగిందేమో ! మరి.

మా నాన్న గారికి అధ్యాపక వృత్తి కారణంగా. మేము చీరాల వెళ్ళటం జరిగింది. కొంతకాలం తదుపరి అమ్మను గూర్చి పలురకాల విశేషాలను, విషయాలను వినటం జరిగేది. నాన్నగార్ని నాగులు అంటారు మా నాన్నగారు. నాగులు భార్యకు హీస్టీరియాట అని ఒకరకంగానూ, ఆ రాముడే అమ్మ అని రామ భక్తులైన రంగన్నబాబుగారి ద్వారాను విన్న మా నాన్నగారు అమ్మను

దర్శించి ఆపై జిల్లెళ్ళమూడి మమ్మల్ని తీసుకురావటం జరిగాయి.

నాన్నగార్ని మా నాన్నగారు 'నాన్నగారు' అని పిలిస్తే నువ్వు నాన్నగారని పిలవటమేమిట్రా అనేవారు. అయినా అమ్మ ఇచ్చిన స్థానానికే గౌరవం ఇచ్చేవారు.

నాన్నగారికి కొంతకాలం భోజన సదుపాయాలను చేయగలిగే మహదవకాశాన్నీ భాగ్యాన్ని నాకు కల్పించింది. ఈ రోజుకూ వంట చేసేటప్పుడు వారి రుచులను గుర్తు తెచ్చుకుంటూ చేస్తాను.

నాన్నగారికి నేను వంట చేసిపెట్టే రోజుల్లో వంట అయ్యాక అమ్మకు నివేదన ఇవ్వటం అలవాటు. ఒక రోజు నాన్నగారికి, మరో ఇద్దరికీ త్వరగా భోజనం పెట్టాల్సిన అవసరమేర్పడింది. అమ్మకు నివేదన తీసివుంచి నాన్నగారి వాళ్ళకి భోజనం పెట్టాను. నాన్నగారు భోంచేసి అమ్మ ఉన్న గదిలోకి వెళ్ళారు. (ప్రస్తుతం అఖండ నామం జరిగే ఆలయం). నేను పనిచూసుకొని అమ్మ దగ్గర అవకాశం చూసుకుని నివేదన తీసుకెళ్ళిన నన్ను చూసిన నాన్నగారు ఏమిటమ్మా! అది తినటానికేమైన తెచ్చావా అన్నారు. అమ్మకు నివేదన తెచ్చాననగా – నేను భోంచేశాక తెచ్చావేమిటి ? పోనీ నేను తినకముందైనా తీసి అవతల పెట్టావా ? అన్నారు. ఆ ధ్వనిలో తనకంటే ముందే ఇవ్వమన్న ఆదేశమే విన్పించింది. నాన్నగారి దృష్టిలో అమ్మ దేవతయే. అమ్మను ధ్యేయంగా పెట్టుకుని ధ్యానం, జపం కూడా చేశారని విన్నాను.

అమ్మ బామ్మగారు పోయినప్పుడు మూడవ రోజున నిండుకుండలోని అన్నం, పప్పు, కూర తీసుకురమ్మని కబురుచేసింది. అప్పట్లో వంట చేస్తున్న సోదరి తిరుమలమ్మ గారు అన్నీ విస్తట్లో పెట్టుకుని తెస్తే అన్నీ రుచిచూసి పదార్థాలన్ని కలిపి నాన్నగారికి, బాబాయికి పెట్టమ్మా ! ముందు ఇది తిని తర్వాత అన్నం తినమని చెప్పమని కబురు చేస్తే నాన్నగారు వారి తమ్ముడు లోకనాథంగారు అమ్మ ఆదేశాన్ని ఆచరించారు. మరి నాన్నగారి ఆలోచన ఏమిటో మనకు అవగతంకానిది. అమ్మ తీరు మనకు అంతుపట్టనిది. అమ్మ నాన్నగార్ల సంభాషణలో "ఆ! అట్లా ఆశీర్వదించమ్మా ! అనటం విన్న నేను నాన్నగారి చేత ఇలా పలికించిందేమిటబ్బా అని ఆచ్చెరువొందటం నా వంతయినది.

నాన్నగారు పనిమీద గ్రామాంతరం వెళ్ళేటప్పుడు అమ్మకు చెప్పి బొట్టు పెట్టించుకుని వెళ్ళేవారు.

1954లో నాన్నగారు విజయవాడలో ఒక చోట కూర్చుని వెళ్తూ తన సంచి మరిచి పోయి వెళ్తుంటే అమ్మ గొంతు విన్పించిందట. "సంచి మరచి వెళ్తున్నారు తీసుకోండి"అని. వెంటనే నాన్నగారు వెనక్కి వెళ్ళి ఆ సంచీ తెచ్చుకున్నారు. ఆ సంచీలో అతి ముఖ్యమైన కాగితాలు ఉన్నాట.

1963లో నాన్నగారు మొక్కపాడు వెళ్ళారు. జిల్లెళ్ళమూడిలో కళ్ళు మసుకుని పడుకుని వున్న అమ్మ "నులకమంచం" కాళ్ళు ఒత్తుకుంటై దిండు వేసుకోండి" అంటోంది. అమ్మ మంచం పక్కనే కూర్చున్ననేను అమ్మ ఎవరితోనో మాట్లాడుతున్నదే అనుకుంటూ అమ్మనడిగాను ఎవరికమ్మా చెప్తున్నావు అని. అమ్మ ఏం మాట్లాడలేదు. బహుశ నాన్నగారితోనేమో వారు రాగానే అడుగుదా మనిపించి నాన్నగారు రాగానే మీరు ఏ మంచం మీద పడుకున్నారు అని అడిగితే ఎందుకమ్మా నులక మంచం మీద పడుకున్నానన్నారు. కాళ్ళక్రింద దిండు వేసుకున్నారా అంటే లేదన్నారు.

1972లో నాన్నగారికి జె.వి క్రిష్ణారావు గారి ఆసుపత్రిలో ఆపరేషన్ జరగబోతుండగా నాన్నగారు అమ్మకు ఒక ఉత్తరంలో "ఆపరేషన్ తిలకిస్తూ, ఆ సమయంలో నీవు జిల్లెళ్ళమూడిలో ఉండిననూ, నా చెంతనే ఉండగలవని నమ్మిక అని వ్రాశారు. అంతకుముందు ఎన్ని సంఘటనల ఆధారంగా ఆ నమ్మిక ఏర్పడిందో మరి! 1975లో జిల్లెళ్ళమూడిలో అందరింటి పై నక్సలైట్లు దాడిచేసినప్పుడు అంతకు కొద్ది నిముషాల ముందే నాన్నగారిని మామూలుగా పడుకుండే స్థలం నుండి మరోచోటుకి పంపింది. లేనియెడల ఆనాడు నాన్నగారికి ప్రాణ సంకటం ఏర్పడి వుండేది. నిత్య జీవితంలో కూడ అమ్మ నాన్నగారిని అంటిపెట్టుకుని వున్నది. వెన్నంటే వున్నది. నాన్నగారు గ్రామాంతరం వెళ్ళినా అమ్మ అదృశ్యంగా నాన్నగారి వెంటనే వుండేదట. కొన్నిసమయాల్లో అమ్మ కంఠం వినిపిస్తూండేదనీ నాన్నగారే స్వయంగా వెల్లడించేవారు.

బామ్మ గురించి కబుర్లు చెప్తూ – మీ అమ్మగారు నడుంబిగించి కోడలిగా, అమ్మగా కూడ అన్నీ చేసింది అని చెప్పి ఆరోగ్యం బాగలేనప్పుడు అవసరమయితే చొక్కాను చిలకకొయ్యకు తగిలించినట్లు తీసి వెయ్యగలదని నా నమ్మకం అనీ, మీ అమ్మగారిది గూడమంచు ప్రయాణం అనీ కబుర్లు చెప్పేవారు. అమ్మ ఆశీర్వచనంలో అచంచలమైన విశ్వాసం ఉన్నట్లు నాన్నగారి మాటల్లో దృఢంగా అనిపించేది.

1981కి పూర్వం హైమాలయం పక్కన ఒక పూదోట ఉండేది.నేను హైమాలయం నుంచి వస్తుండగా(పెద్దబ్బాయి) సుబ్బారావన్నయ్య కూతురు స్వీటీని ఎత్తుకున్న నాన్నగారు కలిశారు ఆ తోటలో. మంచి సువాసన, అందమైన ఒక పువ్వును కోసి ఎంత బాగుందో చూడవే పువ్వు అంటూనే ఇద్దరం కలిసి వాత్సల్యాలయానికి వచ్చాం. నాన్నగారు అంత మెచ్చుకున్న పువ్వును అమ్మ చేతికివ్వలేదు. వరండాలో పడుకుని వున్న అమ్మ పాదాలపై వుంచారు. (పాదాలపై వుంచాలన్న భావం కలిగింది ఆ మహాత్మునికి). ఆ అపురూపమైన దృశ్యాన్ని ఈ నా చక్షువుల కందించింది అమ్మ. మనసు నిండా ఆనందమే.

జిల్లెళ్ళమూడిలో అందరూ కలిసి ఒకే వంటలో ఒకేచోట భోజనం చేస్తే బాగుంటుందని అమ్మ సంకల్పించింది.

దర్శనార్థం వచ్చే యాత్రికులు, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ఆవరణలో సేవచేసేవారు. విడిగా వంటలు చేసుకునే వారినీ మాన్పించి 1981 జనవరి 16వ తేదీన సామూహిక భోజనాలను ప్రారంభించటం జరిగినది.

అమ్మ సంకల్పించిన ఈ ఏర్పాటుకు నిరాడంబరులైన నాన్నగారు కూడా తానే స్వయంగా కంచం తీసుకుని వచ్చి బంతిలో కూర్చునేవారు. వారిది మహోన్నతమయిన స్థానమయినా అతి సామాన్యులుగా స్నేహశీలిగా, పరామర్శలతో, పలకరింపులుతో కలివిడితో ఆత్మీయులుగా సంచరించే వారు.

వారు వాత్సల్యాలయానికి వచ్చినప్పుడు వంట ఇంట్లో నేను కుర్చీ వేసేదాన్ని. ఆ కుర్చీని తీసివేసి నీవు నాకు మర్యాదలు చెయ్యటమేమిటని చిన్ని వంట గదిలోకి వచ్చి నా పక్కన నుంచుని తినటానికేమైనా వున్నయిటే అంటూ డబ్బాలు వెతుక్కుని కావలసినవి అడిగి చేయించు కునేవారు.

పెద్దబ్బాయి సుబ్బారావు వివాహం అయ్యేటంతవరకు నాన్నగార్ని పూర్తిగా సేవించుకునే అవకాశాన్నిచ్చింది. నేనిలా వుండగలగటానికి నాన్నగారు, అమ్మగారి ఆశీస్సు లనంతంగా వున్నాయి. నేనంటే ఎంతో ప్రేమగా వుండే నాన్నగారు అమ్మతోసహా నాదగ్గర ఆసీనులై వున్నారు.

అమ్మను నీకంటే ముందు నన్ను నీలో కలుపుకోమని అర్థిస్తే నువ్వు నన్ను దాటించటం నీ ధర్మం నీవు అడగటానికి వీల్లేదు అని నన్ను శాసించింది అమ్మ. నాన్నగారు అమ్మకు అనారోగ్యం వున్నప్పుడు నీ తదనంతరం నా పరిస్థితేమిటనగా

నాన్నగారి కోరికను మన్నించి ఆచరణాత్మక ప్రబోధాన్నం దించింది.

నాన్నగారి జన్మనక్షత్రమయిన పునర్వసులో - మానవ దేహాన్ని వదిలి అమ్మ జన్మ నక్షత్రమైన ఆశ్లేషానక్షత్రంలో అనసూయేశ్వరులై ఆవిర్భవించారు.

సకల జీవులకు చైతన్యం ఇచ్చే అమ్మ నాన్నగారికి చైతన్యం ప్రసాదించి ఆయనే మనకు రక్ష అని బాల్యంలో చెప్పినట్లుగా మనకు రక్షకునిగా ఏర్పరిచి ఆలయంలో అమ్మే అఖండ జ్యోతిని వెలిగించింది ఈనాటికీ వెలుగుతున్నదా జ్యోతియే.

మహన్యాస సహిత ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్రనామార్చనలు, లక్షనామార్చనలు ఏర్పరిచి అమ్మ కూడా నిత్య పూజలో పాల్గొని నాలుగు సంవత్సరాలనంతరం అమ్మ కూడా నాన్నగారి సరసన చేరి అర్చనలందుకుంటూ విచక్షణ లేని వీక్షణతో శివశక్తిస్వరూపు లిద్దరూ మనలను ఆశీర్వదిస్తున్నారు. ఆ ఆశీస్సులకై రండి - వేగిర పడండి.

నాన్నగారి ఆలయ ప్రవేశానంతరం "అనసూయేశ్వర నమో నమో ! శ్రీ నాగేశ్వర నమో నమో !" అన్న నామాన్ని భ్రమరాంబక్కయ్యకు ప్రేరణ కల్పించగా అమ్మా నాకిలా ప్రేరణ కల్పించావు ఈ నామం జరిగితే బాగుంటుంది అని అమ్మకు విన్నవించింది. ఆ విన్నపాన్ని ఆలకించిన అమ్మ చేయించు అన్నది. కానీ అమ్మ అన్నట్లు దేనికైనా సమయం రావాలి కదా !

నాన్నగారి శతజయంతి ఉత్సవాల్లో ఆ నామానికి సమయం ఆసన్నమైంది. భ్రమరాంబక్కయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులు నాన్నగారి నామం చేస్తూ పునీతలవుతున్నారు.

40. శ్రావణ శుద్ధ పంచమి

అన్ని మాసాల్లోనూ శ్రావణమాసం మంగళప్రద మయినది. శుభముల నొసగే నోములు, వ్రతాలు ఈ మాసంలో ఎక్కువగా జరుగుతుంటాయి. శ్రావణ శుద్ధ పంచమి నాగపంచమిగా ప్రసిద్ధికెక్కింది. తెలంగాణా ప్రాంతంలో నాగపంచమికి బహు ప్రాముఖ్యత ఉన్నట్లు విన్నాను.

అమ్మ బాల్యంలోనే నాగేశ్వరావృతమైన సంఘటనలు కలవు. అందువల్లనేమో నాగపంచమి రోజున శుభముహూర్తానికి శ్రీకారం చుట్టిందనిపించింది. అటువంటి పవిత్రమైన రోజు నుంచి శ్రావణపూర్ణిమ వరకు ఏకాదశ పర్వములకు ఒక ప్రత్యేకతను సంతరింప చేసింది. అదే అమ్మ రజస్వలోత్సవం.

షుమారు 30 సంవత్సరముల అనంతరం 12.8.1964వ తేదీన ఈ పండుగ సందర్భాన్ని మనకు తెలియపరిచి నాచే శుభలేఖలు వ్రాయించి అమ్మ పసుపు కుంకుమలు దిద్ది అప్పట్లో సన్నిహితులైన సోదరులకు పోష్టు చేయించింది. ఆ సమయంలో సమీపస్థులయిన ముత్తయిదువులు అయిదుగురికి నాచేత తాంబూల మిప్పించింది.

ఆ సాయంత్రం నుంచే - సంప్రదాయేశ్వరి అయిన అమ్మ సంప్రదాయబద్ధంగా పూర్ణిమ వరకు 11 రోజులు సర్వాలంకారభూషితయై చిద్విలాసిని అయి అలంకరించ బడిన వేదికపై సింహాసనాసీన అయి కన్యకాపరమేశ్వరిగా దర్శనమిచ్చిందని సర్వులూ పులకరించి పోయారు. ఏ రూపంలో ఎవరికి దర్శన మొసగినా, లీలావినోదిని అయిన అమ్మ నవ్విస్తూ, కవ్విస్తూ ఆటపాటలతో మమ్మల్ని అలరింపచేసేది.

శ్రావణపూర్ణిమ యొక్క ప్రాముఖ్యతను మన పెద్దలు ఎంతగానో చెప్పగా విన్నాను. అందుకే పంచమితో మొదలై, పూర్ణిమ దాకా ఎంచుకున్నదనుకుంటాను. చిమ్మిరి అమ్మవారికి శాంతి అని విన్నాను. తెలియనది తెలియ చెప్పటానికే నా రాక షన్న అమ్మ మనకు తెలియచేయాల్సిన బాధ్యత అమ్మదే కదా !

అమ్మ మనకు కారణం చెప్పదు. మనకు ఏది అవసరమో అది చేయిస్తుంది. అందుకు ఇది మీరు చేయాలి అని ఆదేశించింది. ఆ ఆదేశంలో ఎన్నో సందేహాలు,

నిగూఢ రహస్యాలు నిక్షిప్తమై ఉంటాయినిపిస్తోంది. 11వ రోజున అరిశెల కావడిని తెమ్మని భాస్కరన్నయ్యకు చెప్పగా సింగుపాలెం నుండి అరిశెలు తెచ్చి ఇక్కడే కావడితో అమ్మకు సమర్పించటం జరిగినది. 11వ రోజున బంతిరోజు వంటసరిగా చెయ్యకపోయినా మందలించేది. అంతా సక్రమంగా అన్నీ చేయించింది. ఇది ఒక అర్చన. ఈ అర్చనలో మనకు అవకాశాన్ని కల్పించింది.

ఆనాటి నుంచి నేటివరకు ఈ ఉత్సవాన్ని కడువైభవంగా జరిపించుకుంటున్నది. ఒకసారి ఒక సోదరుడు తన సందేహాన్ని అమ్మకు విన్నవించి సమాధానం కోసం ఎదురు చూసి చెప్పమ్మా అనగా "మాటలతో పనేముంది నాన్నా చేయించటమేగా" అన్నది.

మరొకసారి మరొకరితో మాట్లాడుతుండగా నేను మరొక సోదరుడు అమ్మ మాట్లాడుతున్నది అమ్మ దగ్గర కెళ్దామని లేచాం. మా మాటలు విన్న అమ్మ మాటలమ్మ కాదు మూటలమ్మే" అన్నది. తన అనుగ్రహాన్ని మూటలు నింపి పంచటమే కాని మాటలలో పనిలేని అమ్మ కారణం చెప్పకుండానే చిమ్మిరి పండుగ ..... కల్పించింది.

ఈ సంవత్సరం స్వర్ణోత్సవ సంవత్సరం. ఇది 50వ సంవత్సరం.ప్రత్యేకమైన అలంకరణలతోనూ, ఆహ్లాదకరంగానూ, ప్రశాంతంగానూ జరుపు కున్నది.

మాతృశ్రీ ఓరియంటల్ పాఠశాల విద్యార్థినులు ఎమ్.సుబ్బలక్ష్మి ఆధ్వర్యములో కోలాట ప్రదర్శన, కళాశాల బి.ఎ.ఫైనల్ సంవత్సరము విద్యార్థిని చి.గౌరి భామా కలాపము, జగదానందకారములను కూచిపూడి నృత్యప్రదర్శనలతోనూ కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది. మరెంతో వైభవంగా జరగాలని కోరుకుంటూ...

తొలిలో ఆశీ: స్సుమాలనే కురిపించి
మదిలో మురిపెంగా ముసిముసి నగవులతో
పలువిధముల దృష్టినీ, కరుణావృష్టినీ
సారించిన నీ కరుణకు జోహార్లమ్మా!
మరుపులేనిదా – సంఘటన
మరుపురానిదా –ఘటన
ఈ గుండె నిండుగా
పరవశింపచేసిన నీకరుణకు జోహార్లమ్మా!

41. అందరి - అమ్మ

విశ్వవాసిని అయిన అమ్మ జిల్లెళ్ళమూడిలో ఆహార వసతి సదుపాయాలు సమకూర్చి అందరిల్లు అని నామకరణం చేసింది. ఆ నామంలోనే మాతృత్వం నిబిడీ కృతమై ఉన్నది. అందరికీ అమ్మను అన్న అమ్మకు కాక మరొకరికి ఆభావం ఎలా స్ఫురిస్తుంది. ఎందుకుంటుంది?

అమ్మ అవతారం ప్రభవించకమునుపే మాతృత్వపు పరిమళాలను గుబాళింపచేస్తూ అవనీతలంపై అవ తరించింది.

తెలియనిది తెలియచెప్పటానికే నారాక అనీ, ఆ అమ్మను తెలియచెయ్యటానికే ఈ అమ్మ అనీ తల్లిధర్మం కోసం వచ్చాననీ ప్రస్ఫుటంగా పలికిన అమ్మ – జననానికి పూర్వమే –

అమ్మ తండ్రిగారయిన సీతాపతి తాతగారికి స్వప్నంలో – ఒక ముత్తైదువ వారింటిలోని సామాను అంతా బయట పడేసినట్టింట కుర్చీవేసుకొని కూర్చున్నది. ఆమె నొసటపెద్ద కుంకుమ బొట్టు ఉన్నది. ఎవరునీవు అని అడిగితే "అమ్మను అని శ్రీకారం చుట్టింది.

అమ్మకు 2 సం॥ల లోపు – అమ్మమ్మ, అమ్మ తెనాలి నుండి మన్నవకు ప్రయాణమై తెనాలి స్టేషన్ బ్రిడ్జిమీద – నడుస్తుండగ అమ్మమ్మ అమ్మ చేయి వదలి నాలుగడుగులు ముందుకు వెళ్ళటం జరిగింది. వెనక నడుస్తున్న అమ్మకు దారిలో ఒ కుంటి అబ్బాయి, గుడ్డి అమ్మాయి, పసిబిడ్డకు పాలిచ్చే తల్లి అడుక్కుంటున్న దృశ్యం అమ్మకంట బడింది. వారిని చూచిన (అమ్మ) ఆ చిట్టితల్లి హృదయం కలచి వేసింది. వెంటన. అమ్మ తన చిన్ని చేతినుండి ఓ గాజును (బంగారపు) తీసి ఆ తల్లి చేతిలో పెట్టిన ఆ పసిమనసు నిండా వూహలే. నే నిక్కడే ఉంటే ఆమె చేతిగాజును చూస్తే.

ఈ అమ్మాయిని కొడ్తారేమో డబ్బులంటే వీరికి ఎంతయినా ఇచ్చేదాన్ని కదా ! అని ఆ దయార్ద్రచిత్త అనుకుంటూ ముందుకు సాగింది. పూర్తిగా ఆలోచనకందని వయసది. ఇది సహజంగా సాధ్యమా. ఎత్తుకునే వయసు కల పసిపిల్లచేయి వదలి ఏ తల్లి అయినా వెళ్ళగలదా ? ఒక తల్లేకాదు మరెవరూ చేయలేనిది. అమ్మ తన ప్రేమను వాళ్ళకు అందించిందిపిదప అప్పుడు అమ్మమ్మకు

అనిపించింది పిల్ల ఏదీ ? అని. కంగారుగా బిడ్డకోసం వెనక్కు తిరిగి అమ్మను అందుకుని అక్కున చేర్చుకున్నది. ఇది అమ్మ కల్పించిన మాయా ఘటనే కదా. ఏ పసిబిడ్డ అలా ప్రవర్తించగలదు - మాతృమూర్తిఅయిన అమ్మ తప్ప.

మాయా మోహితులనుచేసి భగవంతుడు తను చెయ్య దల్చుకున్న పథకాన్ని అమలు చేస్తాడు అంటారు. అమ్మమ్మ, అమ్మ రైలు ఎక్కుతుండా- అమ్మ మేనమామ చంద్రమౌళి సీతారామయ్యగారు పెద్దవాళ్ళ టిక్కెట్లు 2 తెచ్చి అమ్మ చేతికిచ్చారు. ఇదెందుకు సంకల్పించిందో చూద్దామా!

ఆ టిక్కెట్‌లను చూచిన అమ్మమ్మ నువ్వుకూడ పెద్దమనిషివనుకుని టిక్కెట్లు తెచ్చాడమ్మా మామయ్య అని అమ్మతో అంటుండగనే 20 సం॥ గల ఒక స్త్రీ దడదడగ, హడావుడిగా రైలు ఎక్కటం జరిగింది. మన సెరిగిన అమ్మ ఆమె కంగారును చూస్తూ ఆమెకు టిక్కెట్లు ఉన్నదేమో కనుక్కోమని అమ్మమ్మతో అంటూ సీటులో నుండిలేచి అమ్మమ్మ ఒడిలో కూర్చున్నది. అమ్మమ్మ ఆమెను పరామర్శించి రెండవ టిక్కెట్టును ఆమెకు అందించింది. ఆమె దయనీయ మయిన పరస్థితులను విన్న (అమ్మ) చిన్నారి తల్లి మనసు దీవించి అమ్మమ్మ చూడకుండ తనచేతి 2వ గాజును తీసి రైలు దిగేటప్పుడు ఆమె చేతికిచ్చి అవసరాలకు వాడుకోమని దయచూపించిందీ దయామయి. ఇంత దయార్ద్రహృదయం ఎవరికుంటుంది. ఒక అమ్మకు కాక.

ఇంతవరకు అమ్మ చేతిగాజులను గమనించనే లేదు. రైలుదిగాక అమ్మను ఎత్తుకున్న అమ్మమ్మకు పిల్లచేతులకు స్టేషన్‌కి వచ్చిన సీతాపతి తాతగారితో పిల్ల చేతిగాజుల్లేవనగా పోనీలే పిల్ల అయినా ఉన్నదకున్నారు. వాళ్ళకాతృప్తిని కలిగించింది అమ్మేకదా ! అంత నిర్లిప్తంగా ఎవరైనా ఊరుకుంటారా ?

తల్లీకూతుళ్ళిద్దరూ బండిఎక్కి మన్నవ వెళ్తుండగ దారిలో అమ్మ బహిః ప్రదేశానికి వెళ్ళాలన్నది. బండి ఆపారు. ఇక్కడ బాగుంది, ఇక్కడ ఉందామా" అని అమ్మ అమ్మమ్మను అడిగింది. "ఇక్కడిల్లులేదుగ మనం ఎట్ల వుంటాం" అని అమ్మమ్మ ప్రశ్నించగ అమ్మ "మీరు వెళ్ళండి నేనుంటాన్నది" అమ్మకు అక్కడ అంతగా నచ్చి ఉండాలనిపించింది గాబోలు మరి.

అమ్మమ్మ "అమ్మ లేకుండా చిన్నపిల్లలు ఉండచ్చా - అంటే "నేనే అమ్మనై ఉంటాగా" అన్నది.

15)

ఆనాడు ఆగినప్పుడు ఖాళీస్థలం. ఈనాడు -

అమ్మ ఉంటానుఅన్న అభయంమేరకు. ఆ స్థలం వెయ్యి లింగాలాలయం, హనుమదాలయం మరింకెన్నో ప్రశస్థమైన ఆలయాలను సంతరించుకుని అమ్మ శక్తిని నింపుకుని మహా యాత్రాస్థలమై విరాజిల్లుతున్నది.

బాపట్లలో అమ్మ పిన తాతగారయిన చిదంబరరావు గారింట్లో అమ్మ ఉండగా - వారి కూతురు భారతీదేవిగారు బజారుకు వెళ్ళి సూదీ, దారం కొనుక్కురమ్మని అమ్మను పంపింది.

అమ్మ బజారుకు వెళ్తుండగ దారిలో కొందరు కుంటివాళ్ళు, గుడ్డివాళ్ళు కనిపిస్తే - స్పందించే మాతృహృదయంతో - తన చేతిలోని డబ్బులు వారికిచ్చింది.

దారిలో ఉన్న సత్రాన్నీ, దత్తమఠాన్నీ, ఆలయాన్ని చూస్తూ పరిపరివిధాల ఆలోచిస్తున్న అమ్మను గమనిస్తున్న ఒక బాటసారి ఏమిటమ్మా ఎక్కడికివెళ్తున్నావని ప్రశ్నించగా ఏమీలేదు నాయనా ! అంటూనే "సూదీ, దారం కొనుక్కోవాలని షాపుకెళ్తున్నాను. కానీ - "దారిలో కుంటివాళ్ళు, గుడ్డివాళ్ళు కనపడితే ఆ డబ్బులను ఆ బిడ్డలకిచ్చేశాను" అన్నదీ పెద్ద తల్లి. అతను చకితుడై "వాళ్ళు నీ బిడ్డలా" అన్నాడు. అమ్మ "ఔను వాళ్ళూ నాబిడ్డలే" అన్నదాచిన్నారి చిట్టెతల్లి. "ఎలా"? అన్న ప్రశ్నకు

"అందరివలె' అన్న అమ్మ సమాధానం అతన్ని మరింత విస్మితుడ్నిచేసింది.

"అందరూ నీ బిడ్డలు ఎట్లా అవుతారు ? ఈ అందర్నీ నువ్వు కన్నావా "కంటే నేనా అనుకుంటేనూ బిడ్డలే. అట్లా కనగలగాలి అని పసిడి పలుకుల తల్లి ఆ పసిడినోట తన మాతృత్వాన్ని ప్రకటించేసింది.

అమ్మమ్మ - సంవత్సరీకాలకు

ఖాసిం అనే జీతగాడు అమ్మను దొప్పల పూడి మీదుగా మన్నవ తీసుకెళ్తుండగ దారిలో 7 సం॥ పిల్ల 2 సం॥ పిల్లను పొట్టకే కరుచుకుని చీమిడి ముక్కుతో, ఏడుస్తూ కనిపించింది. నిండా ఆరు సం॥ వత్సరాలయినా లేని అమ్మ కరుణ నిండిన హృదయంతో ఖాసిం భుజం మీద నుండి చివాలునదిగి తనవంటిన ఉన్నచొక్కా విప్పి. ఖాసిం జేబులోని పావలా తీసుకుని ఆ పిల్లకిచ్చేసింది. ఆ దృశ్యం చూస్తున్న ఖాసింకు ఏమి చెయ్యాలో పాలుపోక అలావిప్పేస్తే ఎలా ? అంటే సర్వం తెలసిన అమ్మ నాన్నగుడ్డల మూట ఇక్కడే ఎక్కడో అక్కడ పెట్టుంటాడు

"తీసుకురమ్మ"ంటుంది. ఖాసిం అమ్మను అక్కడేదించి గ్రామం లోనికి వెళ్ళి ఎంక్వయిరీ చేసి మూటలో చొక్కా తీసుకుని, అమ్మ తత్వాన్ని గ్రహిస్తున్న వాడగుటవలన లాగుకూ ఇచ్చిందేమో అనిపించి చొక్కా లాగుతీసుకొని వచ్చేసరికి అమ్మ డ్రాయరు కూడ ఇచ్చింది. దిగంబరేశ్వరిగా నుంచున్న అమ్మను చూసినఖాసిం "నేననుకున్నంతా చేశావమ్మా"అంటాడు. "నీవనుకున్నా నేననుకుంటేనే అని భావగర్భితంగా తనసంకల్పమే - ఇతరులకు ప్రేరణ నిస్తుందన్న విషయాన్ని ధృవీకరించింది.

ఒకరోజు అమ్మ సోదరుడైన రాఘవరావు ఘామయ్య అన్నానికి రావటం ఆలస్యమైతే అమ్మ "అందరం అన్నం తిన్నాం అన్నయ్య ఇంకా అన్నానికి రాలేదు. తల్లికి ఒక బిడ్డ రాకపోయినా దిగులే అంటుంది. అమ్మకు తాతమ్మ అయిన మరిడమ్మ గారితో. ఆమె ఆచ్చెరువుతో. "అన్నయ్యను పట్టుకుని బిడ్డ అంటావేమిటి? వాడు అన్నం తినకపోతే బాధపడే తల్లి కాస్తా పోయింది కదా !"

అమ్మ : "వాడు అన్నం తినకపోతే బాధపడే తల్లి కాస్తాపోయింది కానీ ఎవరు అన్నం అనకపోయినా బాధపడే తల్లి ఉన్నది. ఈ మాట చెప్పే అమ్మ అమ్మగా అర్థకాకుండ ఉన్నది"

మరి : అందరికీ అమ్మవైనప్పుడు రప్పించుకుని దారిలో పెట్టుకోవచ్చుకదా!

అమ్మ : చెయ్యటం చేతుల్లోఉన్నప్పుడు బాధ, మాట రెండూ ఉండవు. అన్నీ నిర్ణయించబడే వుంటై. నేను అమ్మగా నిర్ణయించుకున్నాను. అమ్మగా కనుపించకపోయినా ఆ ఏర్పాటు సక్రమంగా. నెఱవేర్చవలసిందే నని ఘటంగా పలికింది. అమ్మ అడుగడుగునా తాను అమ్మ అని ప్రస్ఫుటం చేస్తోంది. నిర్ణయానికి నిర్ణయించిన వాడూ బద్ధుడేనని, చేతలు చేతుల్లో లేవనీ చిన్ననాటినుంచే ప్రవేశించిన ఆణిముత్యాలను మనం ఆచరించగలిగే భాగ్యాన్ని అమ్మ మనకు ప్రసాదించాలి. అవి సూక్తి సుధలై వెలగొందు తున్నాయి.

అమ్మ ఒకసారి ఒంటరిగా మేడమీద కూర్చున్నది 'చిదరంబరరావు తాతగారు "ఏమిటమ్మా ఒంటరిగా ఏంచేస్తున్నావ్" ? అంటే - "నేనెప్పుడూ ఒంటరిదాన్నికాదు. నాలో అందరూ ఉన్నారు. నా ఒక్కమనసే అనేకమయిందని గుర్తిస్తున్నాను. అనేకం అనేక విషయాలు, ప్రపంచం అంతా. అందువల్ల నేనే అన్నీ అయినాననీ ఒంటరిదాన్ని కాననీ అన్నాను. అని అంతా తానే అన్న విషయాన్ని విపులీకరించింది.

అమ్మ చిదంబరరావు గారికి ఎన్నో అనుభవాల నిచ్చింది.

ఓ సందర్భంలో – మాయకప్పుకమ్మా. నీ అసలు రూపం చూపించి తెరవేసుకొమ్మా అనగా.

అమ్మ"తెరలోపల తెర ఎప్పుడూ ఉన్నది. నాకూ తెరవున్నది. నేను వేషం వేసుకోవటానికి ఒక తెర. నావేషం మీకు చూపటానికి ఒకతెర. మాటలతో తొలగనితెరలు. మాటలతో రానివ్వని తెరలు అని అమ్మ స్పష్టీకరిచింది. అమ్మ కృపతో మాత్రమే ఆ తెర తొలిగేది. అసలు నీ ఉద్దేశం చెప్పమన్నా – "నేనందుకు రాలేదు." అన్నది. "అంతా మరుగేనా' అంటే "నాకు మరుపులేదుకాని మరుగున్నది. మరుగేనావిధానమనే" స్పష్టీకరించింది. మరుగున ఉంటూ తన లీలావిభూతుల్ని ఎన్నో రీతుల ప్రదర్శిస్తునే ఉంటుంది.

ఈ జగత్తు తనదేననీ, తనలోని దేనని, ఈ సృష్టినాది అని అనగలిగింది ఒక్క అమ్మ మాత్రమే.

పరిమితమయిన మమకారం మానవత్వమనీ, అపరిమిత మయిన మమకారం మాధవత్వమనీ ప్రవచించి సకల చరాచరాలను వాత్సల్యామృతంలో ముంచెత్తినతీరు చూద్దాం. అందరికీ, అన్నింటికి అమ్మను అన్న అమ్మ ఒకరోజు కాకులకు అన్నం వేద్దామని అన్నపూర్ణాలయం నుండి అన్నం తెప్పించింది. అమ్మ దగ్గరున్న సోదరుడు అన్నం వేడిగా ఉన్నది నీచెయ్యి కాల్తుందమ్మా అంటే – "నాకు వేడి సరేనన్నా ఆ తినేకాకులకు వేడి కదూ చల్లార్చివెయ్యాలి" అన్నది. వాటికి నేతితో పూరీలనీ, గారెలనీ చేయించి అవి కింద బడకుండ నోటితో అందుకునేలా వేసింది. వాటికి నేతితో ఎందుకమ్మా అంటే అవీ ఇష్టంగా తింటాైకదా. వాటికి నేతితో ఎవరు చేసిపెట్తారు అని తమ బిడ్డలకు ఇష్టమైనవి చేసిపెట్టి నట్లుగ ఒక అమ్మ తప్ప ఎవరు అలా భావించగలరు ?

పిల్లి ఎలుకను చంపి రూమ్‌లో గోలచేస్తుంటే వాటిని తరమటానికి ఆలోచిస్తున్నటైంలో మీరు బజారుకెళ్ళి మీ పిల్లలకు ఇష్టమైనవి చూసి కొనుక్కొచ్చి పెట్టినట్లే. వాటి పిల్లల కవి సమకూర్చుకుంటున్నై అన్నది. ఆ భావం ఎవరికుంటుంది? ఒక్క అమ్మకు తప్ప.

ఒక ఆవు యొక్క దూడ చనిపోయింది. చనిపోయిన ఆవుదూడను తీసుకెళ్తుంటె. ఆవు దీనంగా బిడ్డను చూసు కుంటున్న సమయంలో పాలు

పిండుతున్న వ్యక్తిని చూసిన అమ్మ వాడు చూడరా ఎట్లా పాలు తీస్తున్నాడో ! ఒకవైపు బిడ్డపోయి కన్నీరు కారుస్తూ తీసుకోండి మీపాలు మీరు నాకేమిటన్నట్లు కాదనకుండపాలు ఇస్తున్నది అంటూ ఆవు బాధలో తాదాత్మ్యం చెందినదా మాతృహృదయం.

చెరువు నుంచి మంచి నీళ్లబండి లాగే ముసలి ఎద్దు గడ్డి వేయటం ఆలస్యమయిందని అమ్మ కారుణ్యహృదయం కన్నీటితో - తల్లడిల్లిపోయింది. ఉదయంనుండి మధ్యాహ్నం వరకు నీళ్ళు తెచ్చినా చాలక మళ్ళీ కడ్తే - మళ్ళీ బండి కట్టారా అని ఆ తల్లి హృదయం విలవిల్లాడింది. మాంధాత అని నమస్కారం చేసింది.

జడపదార్థంలేదు అంతా చైతన్యమే అనే అమ్మ అందరి గురించీ, అన్నింటి గురించి ఆలోచిస్తుంది. తన శరీర బాధలు కూడ తన సంతానమే నన్నది. అమ్మకు ఒక గడ్డలేచింది. "పరామర్శించిన వారితో గడ్డ కూడ బిడ్డేనాన్నా" అన్నది.

పన్నుపోటుతో బాధపడ్తున్న అమ్మను ఎలా వున్నదమ్మా అంటే - "జనం యొక్క అభిప్రాయం లాగానే నన్ను వదిలి వెళ్ళటానికి ఏడుస్తున్నది". అనేది. శరీర బాధలు అనేకం వచ్చినా - మీకెలాగో - వాటికే ఇదిస్థానం" అనేది మనపై ఎంతటి వాత్సల్యమో - బాధలపైనా అంతే మమకారం చూపేది.

జననానికి పూర్వమే "అమ్మను" అని శ్రీకారం చుట్టిన అమ్మ బాల్యం నుండీ ఒక్కొక్క సంఘటన ద్వారా మాతృత్వాన్ని విస్తరింపచేసింది. "జన్మనిచ్చే జననినైన ఎఱుకలేక ఎరుగలేరు" అని సోదరుడు బుచ్చిరాజు శర్మగారు వ్రాసినట్లు తనని తాను తెలియపరిస్తే తప్పమనం తెల్సుకోలేమని మనను అనుగ్రహింప దివినుండి భువికి దిగి వచ్చి మనకు ఆత్మీయానుబంధాలను పంచి తీపిగుర్తులను మిగిల్చిన అమ్మ 90 వసంతాలు నిండి 91వ వసంతంలో అడుగిడబోతున్నది. ఏప్రియల్ 21 అమ్మ జన్మదిన మహోత్సవం అమ్మ ఆశ్రితుల భక్తివిశ్వాసాలను ఎన్నో రీతుల ప్రతిష్ఠితం చేస్తుంది. అమ్మ అనుగ్రహం మాటలకు అందని అనుభూతుల్ని బిడ్డలకు ప్రసాదిస్తుంది. అమ్మను కనులారా వీక్షించండి. నోరార అమ్మ నామంచేయండి మనసారా అమ్మను ధ్యానించండి.

అమ్మ కృపకు పాత్రులకండి.

42. నన్ను మరువని హైమ

నేను నాన్నగారింట్లో బాధ్యత వహించి సేవ చేసుకునే రోజుల్లో హైమ నా వెనుక వెనుకనే తిరుగుతూ ఉండేది. అలా నాతో కలిసిమెలసి తిరిగే హైమ తన అవసరాలను నాతో చెప్పి కావలసినవి అడిగి చేయించుకుండేది. తను బిడ్డగా ప్రేమించి, లాలించిన భరద్వాజకు కూడా నాతో చేయించి నా చేతలకు తృప్తిపడేది. ఓ పూట నేను లేని పరిస్థితులలో నువ్వు లేకపోతే బాబుకు(భరద్వాజ) కావలసినట్లు ఇష్టమైనట్లు ఎవరు చేస్తారు అనేది..

అలాంటి హైమ ఇన్ని సంవత్సరముల కాలంలోను ఎన్నో అడిగి చేయించుకున్న సంఘటనలు ఉన్నాయి. అవి మరెవ్వరికీ తెలియదు కదా. తనకు ఇష్టమైనవి చేయించుకోవచ్చు. ఇది మరో వ్యక్తికి తెలియదు కదా! క్రితం సంవత్సరం (హైమభక్తుడైన) మనకు పెద్దగా పరిచయం లేని వ్యక్తికి హైమ కనిపించి ఒక అజ్ఞాత భక్తుని ద్వారా పోయిన సంవత్సరంలో వసుంధర అక్కయ్యకు చెప్పి కంది పచ్చడి చేయించమని ఆదేశించింది. ఆ కబురు వినగానే 1968వ సంవత్సరం ఏప్రిల్ ఒకటవ తేదీన జరిగిన సంఘటన కనులముందు కదలాడింది.

ఏప్రిల్ 1వ తేదీ ప్రొద్దుటే సోదరి మన్నవ బాలాత్రిపురసుందరి వచ్చి హడావుడిగా అమ్మ నిన్ను తొందరగా కందిపచ్చడి నూరి వేడివేడిగా అన్నం వండి తెమ్మన్నదని చెప్పి వెళ్ళిపోయింది. అప్పుడు నాన్న గారికి కాఫీ ఇచ్చిన నేను ఏప్రిల్ ఒకటవ తేదీ ఏప్రిల్‌ఫూల్ చెయ్యటానికి చెప్పిందన్న ఆలోచన లేక ఇంత పొద్దుటే అమ్మ నివేదన అడిగిందే అన్న ఆలోచనతో చాలా హడావుడిగా కందిపచ్చడి నూరి, అన్నం వండాను. పరుగులాంటి నడకతో ఆలస్యమవుతుందేమోనన్న ఆతృతతో అమ్మ దగ్గరకు వెళ్లాను. ఇప్పుడు మెయిన్ బిల్డింగ్‌లో ఉత్తర దిక్కుగా ఉన్న చివరి ఫోర్షన్‌లో ఉండేవాళ్ళం. ప్రస్తుతం అలంకార హైమ ఉన్న ఇంట్లో ఉండేది అమ్మ అప్పట్లో.

అప్పటికి అమ్మ స్నానం చేయటానికి బాత్‌రూంలోకి వెళ్ళి స్టూల్ మీద కూర్చుంటూ ప్రొద్దునే గిన్నెలతో వెళ్ళిన నన్ను చూసిన అమ్మ ఏమిటి? ఇవాళ ప్రొద్దున్నే తయారవయినావు' అన్నది. 'నువ్వు అన్నం కందిపచ్చడి తెమ్మన్నావుటగా బాల చెప్పింది' అన్నాను. "నేను అనలేదే తెచ్చావుగా ఇటివ్వు" అన్నది. అప్పటికి

గాని ఏప్రిల్ ఫూల్ కోసం బాల చేసిన పని అని అర్థం కాలేదు.

అమ్మ కందిపచ్చడి అన్నం కలిపి రుచి చూచి చాలా బాగున్నదని నాకు ముద్ద పెట్టి అక్కడున్న అందరికీ పెట్టి అక్కడే కూర్చున్న హైమకు పెడితే అమ్మ పెట్టిన ప్రసాదం తిన్న హైమ ఎంతో తృప్తిగా చాలా బాగున్నదమ్మా అన్నది. హైమకు చివరి భోజనమూ అదే, నా చేతి వంట చివరిగ కందిపచ్చడి అన్నమే అయినది. బహుశ తనకది గుర్తువచ్చి వుంటుందేమో! మరొకరి ద్వారా నాకు చెప్పించి చేయించుకుని తిన్నది. స్వీకరించింది. ఆ రోజుల్లో అప్పుడప్పుడు నా చేత స్నానం కడా చేయించుకుండేది. ఒకసారి మరలా నా చేత స్నానం చేయించుకోవాలన్న కోరిక కలిగినట్లుంది. ఈ నెలలో (డిసెంబరు) వసుంధర అక్కయ్యకు చెప్పి స్నానం చేయించాలనీ, అక్కయ్యకు ఉప్మా, కాఫీ, నేతిగారెలు చేయించి పెట్టమని చెప్పమనీ అక్కయ్య చేస్తే నా కిష్టమనీ అజ్ఞాత భక్తుని ద్వారా ఆదేశమిచ్చింది. గతంలో హైమకు చేసిన సేవలను నెమరు వేసుకుంటూ తాను కోరిన రీతిలో నివేదనలను అందించాను.

ఆ కుటుంబంలోని, నాన్నగారు గానీ, సుబ్బారావు,రవి హైమలకు వారి వారి అవసరాలకు తగిన రీతిలో చప్పిడిగానూ, కారంగాను ఎలా చేసినా చాలా రుచిగా ఉన్నదని ఎంతో తృప్తిపడేవారు. నివేదనగా స్వీకరించే అమ్మ కూడా నువ్వు పేట్టే చారు పెట్టు చాలా బాగుంటుందనేది. ప్రత్యేకంగా వాళ్ళు తృప్తి పడే వాళ్లు. వాళ్ళకు తృప్తిగా చేసి పెట్టగలిగాననే తృప్తీ నాకు ఉండేది.

నా చెంగు పట్టుకుని చిన్న పిల్లలా తిరిగే హైమ వెళ్ళినప్పట్నుంచి నన్ను వదిలేసి నువ్వు వెళ్ళిపోయావా అని అనుక్షణం అనుకొనే స్మరించే నాకు అమ్మతో పాటు నేనూ నీ వెనుకనే తిరుగుతూ వున్నాను కదా అని చెప్తున్నట్లుంది.

43. ఆనాటి ముచ్చట్లు

3-9-1964న అట్లతద్దె. అమ్మను ఉయ్యాల ఊపాలని సింగుపాలెం తాతయ్య రంగుల రాట్నం తయారుచేశాడు. అమ్మను వూపి ఆనందించాలని రెండు వైపులా రెండు కుర్చీలు వేసి అలంకరించాడు.

జేగంట నినాదాలతో, నామం జరుగుతుండగా అమ్మ వచ్చి అలంకరించబడిన కుర్చీలో ఆసీనఅయింది. రెండో కుర్చీలో సుబ్బారావన్నయ్యను కూర్చో బెట్టారు. వుయ్యాల ఊపుతుంటే గుండ్రంగా తిరుగుతున్నది.

అమ్మ కూర్చున్న కుర్చీకి అమర్చిన తాడును పట్టి లాగుతుంటే ఆ వుయ్యాల గిరగిరా తిరుగుతుంటే పైన అలంకరించబడ్డ పూలు రాలుతుంటే పూలవాన కురుస్తున్నట్లున్నది. ఆ దృశ్యం చూడటానికి రెండు కళ్ళూ చాలవనిపిస్తోంది. అమ్మ వుయ్యాల తాడును లాగుతున్నట్లే మా మనసుల్నీ లాగేసినట్లయింది. మేము మరో లోకంలో వున్నట్లైంది. అలా 15 నిమిషాలు గడిచింది.

అమ్మ బిందె అడిగింది. ఇచ్చారు. బిందె చంకన పెట్టుకుంది (వుయ్యాల్లోనే). బిందెలో అందరూ తలా కాసిని పాలు పోస్తున్నారు.

"భూమి మీదకు పంపించేటప్పుడు యిచ్చిన పాలే నా పాలు"

సింగుపాలెం నుండి వచ్చిన సోదరి చంద్రమ్మ: "దేనితో కాచారు ?"

అమ్మ : జ్ఞానాగ్నితో కాచి అహంకారమనే తోడు వేశాను. దాన్ని మజ్జిగ చేశాను.

చంద్రమ్మ : మజ్జిగ చేసేటప్పుడు ఏ తాళ్ళను బంధించావు ?

అమ్మ : మోహపాశములనే తాళ్ళను బంధించాను.

చంద్రమ్మ : వేటితో తిప్పావు.

అమ్మ : వుచ్ఛ్వాస నిశ్వాసాలనే వాటితో తిప్పాను. జ్ఞానమనే వెన్న వచ్చింది. మనస్సనే ముద్ద అయింది.

చంద్రమ్మ : దేనితో కరిగేశారు.

అమ్మ : చిత్తాగ్ని చేత కరిగేస్తే నెయ్యి వచ్చింది. అంతా నేనే. నేను కాదు నేను కాదు అంటూ అంతా నేను అనుకోవటమే. సర్వత్రా తనను తాను చూడటం సర్వమూ తనలో చూడటం.

పాలు పోసేవాళ్ళల్లో ఒకరు కాగీ కాగని పాలు తెచ్చారు.

"కాగీ కాగని పాలు తెచ్చారు అంటూ - అటూ, ఇటూ కాకుండా ఉన్నాయి పాలు. ఎప్పుడూ నా పాల అటూ ఇటూ కానివే పడుతున్నాయి. నిర్ణయానికి నిర్ణయించిన వాడూ బద్ధుడేగా. ఏమీ తెలియనిదాన్ని నాయనా! తినటం తెల్సు. త్రాగటం తెలుసు. ఇంక ఏం చేతకాదు" అంటూ పెద్దగా త్రేన్చింది.

మళ్ళీ కలుసుకుందాం. ఈ రూపంలో కాకపోయినా మరొక రూపంలో. వెళ్ళి మళ్ళీ వస్తాను. ఈ వూరికి వచ్చిన పని సరిపోతుందనుకున్నాను. పనికాలేదు. ఇంకో వూరికి పోవాలి.

చంద్రమ్మ : మళ్ళీ రావాలి అమ్మా !

అమ్మ : వస్తానమ్మా ! వస్తాను.

ఈ తీరున మాట్లాడుతున్న అమ్మను చూస్తుంటే అందరికీ కళ్ళ నీళ్ళు వచ్చినాయి. ప్రతి ఒక్కరు విచలితులైనారు. అమ్మ మళ్ళీ మళ్ళీ చెప్తూ, చర్విత చర్వణం ఏం వుపయోగం ? చెప్పిందే చెప్పటం ఎందుకు మాటలతో పనేముంది ? పాలు పొయ్యండమ్మా పొయ్యండి.

రాఘవన్నయ్య పాలు పొయ్యటానికి అమ్మ దగ్గరకు రాగానే తన చేయినందించి పోయించుకున్నది.

ఎంతమంది పోసినా కుండ (బిందె) నిండలేదే అని అక్కడున్న భాస్కరన్నయ్యను చూస్తూ "భాస్కరా ఒక్క చుక్క వదులు నాయనా. వూళ్ళో పాలన్నీ వచ్చినా కుండ నిండలేదు. తృప్తిలేదు"

అందరూ పొయ్యటమైంది. అమ్మ బిందె చంకన పెట్టుకుని లోపలికొచ్చింది. అప్పుడే 9-45 అయింది. అమ్మ లీలావినోదంతో క్షణంలా గడిచిపోయింది. ఇంత సేపు టైము తెలియలేదు.

16)

అమ్మ లోపలికి వచ్చాక బంగారపు బొట్టు కనిపించలేదు. అమ్మకు చెప్తే "ఎక్కడకు పోతుంది. అక్కడే వుంటుందిలే" అన్నది.

చాలాసేపటికి ఆ బొట్టు అమ్మ మంచం క్రింద దొరికింది. అమ్మతో చెప్తే "నే చెప్పలా ఎక్కడికిపోతుందీ" అన్నది.

స్నానానికి వచ్చి స్నానం చేస్తూ కవ్విస్తూ, నవ్విస్తూ అందరినీ వెక్కిరిస్తూ, నడుమున చెయ్యి పెట్టుకుని కబుర్లు చెప్తూ, "ఇట్లా కల్సుకోం, మళ్ళీ కల్సుకుంటాం. ఈ రూపంగా కాదు"

ఆ ధ్వనిలోనూ, ఆ రూపంలోనూ, ఆ వీక్షణంలోనూ మనం దగ్గర కూర్చుని చనువుగా మాట్లాడే అమ్మగా లేదు.



44. అమ్మ మమకారం

నాలుగురోజుల్నుండి అమ్మ పన్నుపోటుతో ఎక్కువగా బాధపడుతున్నది. పన్నుపోటు ఎట్లా ఉన్నదమ్మా? అని అడిగితే 'జనం యొక్క అభిప్రాయం లాగానే వదిలిపెట్టి వెళ్ళాలంటే ఏడుస్తున్నది' అని అమ్మ యిచ్చిన సమాధానం.

అమ్మ వాత్సల్యాలయంలో ఉన్న రోజులలో ఒకరోజు అమ్మకు ఒంట్లో బాగోలేదు. పూర్తిగా లేవలేదు. హైద్రాబాద్ నుంచి చంద్రమౌళి వెంకటకృష్ణగారు, తంగిరాల శాస్త్రిగారు, వెంకటరత్నం గారు ఇంకా చాలామంది అమ్మదర్శనం కోసం ఎదురుచూస్తున్నారు. అమ్మ నా కోసం బిడ్డలంతా అల్లాడుతుంటే అంటూ అందర్నీ తన దగ్గరకు రమ్మని కబురు చేసింది.

కబురందిన తడవుగా దర్శనం కోసం వేచి వున్న వాళ్ళంతా చాలా అతృతగా అమ్మ దగ్గరక వచ్చారు. ఓపిక లేకపోయినా అమ్మ మెల్లగా లేచి కూర్చున్నది. వెంకట కృష్ణగారు అమ్మకు చాక్లెట్లు ఇచ్చారు. వాళ్ళందర్నీ చూసిన అమ్మ చాలా హుషారుగా చిన్నపిల్లలా అందరి చేతుల్లో పడేలా విసరేసింది. అందరూ వాటినికిందపడకుండ చాక్లెట్లు రూపంలో ఇచ్చిన అమ్మ అనుగ్రహాన్ని అందుకున్నారు.

శాస్త్రి అమ్మ ఆరోగ్యాన్ని గురించి పరామర్శించాడు. 'మిమ్మల్ని పోషించినట్లే దాన్ని పోషించాను (అనారోగ్యాన్ని). ఇంత భారం మీద నిన్న సాయంత్రం తలంటి పోసుకున్నాను.

చల్లని వెన్నెల, సన్నని చినుకులు ఎంత బాగున్నదో! హాయిగా మంచులో తిరిగాను' అంటూ అతి ప్రశాంతంగా అమ్మ చెప్పిన తీరు చూసిన నాకు మనపై ఎంతటి వాత్సల్యమో అంతటి వాత్సల్యం అనారోగ్యంపైన కూడా. సర్వబాధాప్రశమన అయిన సర్వవ్యాధి సంజీవని తన విషయంలో.

45. శక్తి (దేవుడు) కంటే భిన్నంగా ఏదీ లేదు

ఉదయం 7 గంటలకు అమ్మ ఆరు బయటమంచం మీద కూర్చున్నది సూర్యభగవాన్ అమ్మ పాదాలను స్పృశిస్తూ ఉన్న సమయం. చల్లగాలి మెల్ల మెల్లగా వీస్తోంది. అప్పుడొక సోదరుడు అమ్మ దగ్గర కూర్చుని అమ్మా విధి లిఖితం అంటే ఏమిటి ?

అమ్మ : తప్పించుకోవాలన్నా తప్పించుకోలేనిది.

సోద : ఎక్కడ నుంచి వస్తుంది.

అమ్మ : యదార్థం తెలియదు. దేవుడు ఉన్నాడనుకుంటే తృప్తి లేకపోతే అసంతృప్తి. ఎడారి అంటే భయం. ఎడారి అంటే తట్టుకోలేక ఎవరో ఉన్నారనుకుంటే అది ఒక తృప్తి భక్తిరసం అన్నారు. భక్తిలో రసం ఉన్నది. జ్ఞానం కంటే భక్తే హాయి.

సోద : దేవుడు ఉన్నాడో, లేడో తెలియదు. మనం అనుకోవటం తప్పితే ఏమీ కనబడటం లేదు. ఎందుకు జరుగుతున్నదో తెలియదు.

అమ్మ : అనంతమైన శక్తి ఏదో ఉన్నది అనిపిస్తున్నది అదీ రూపంగా కాదు.

సోద : కష్టమనీ, సుఖమనీ, మంచీ, చెడూ, పాపం, పుణ్యం ఇన్ని ఉన్నాయి కదా!

అమ్మ : ఇన్ని లేవు. సుఖంగా ఎవరున్నారు. అన్నీ ఉండి అశాంతితో బాధపడుతున్న వాడు ఉన్నాడు. నిన్న ఒక అమ్మాయి వచ్చింది. చాలా బాధపడుతున్నది. మానసికంగా మందు ఇప్పిస్తే కాస్త తగ్గింది అని అంటున్నది ఎవరూ హాయిగా లేరురా.

సోద : నిత్య కార్యక్రమం దేనిని బట్టి జరుగుతున్నది.

అమ్మ : నేను చెప్పాను కదా! ఇది ఏదో ఒక అనంతమయిన శక్తి అని. అనేక రూపాలు ధరించింది. భిన్నంగా ఇన్ని రకాలుగా ఉన్నది. కాబట్టి ఇది ఒక భాగంగా అనుకుంటున్నారు. శక్తి కంటే భిన్నంగా ఏదీలేదు. అందులో మనమూ ఉన్నాము శక్తి అనేకం

కావచ్చుగానీ, మనం శక్తి కాలేము. అనేక రూపాల్లో అనుభవాలలో తేడా ఏంలేదు నాకు అందినంత వరకు.

సోద : కొంతమంది సర్వజ్ఞత్వం, సర్వవ్యాపకత్వం అంటారు ఎందువల్ల, దేనిని బట్టి ?

అమ్మ : నాకు తెలియదు. కొబ్బరి చెట్లకు కొబ్బరి బొండాము కాస్తున్నది. దానిలో నీరు ఉన్నది. దానికది సహజం.

సోద : ఆశక్తి మాకు అర్థం అయ్యేది ఎట్లా ? కనుపించేది ఎట్లా ? మాకు ఎట్లా సంతృప్తి ?

అమ్మ : ఇందులో సందేహమూ లేదు. సడలింపూ లేదు. అనుమానమూ లేదు. అంతా సహజమే అనిపిస్తుంది. మనస్సుకు తట్టాలి. మాటలు కాదుగా. అనుభవం కావాలి.

సోద : నువ్వు చెప్పటం కాదు. నాకు అనుభవం కావాలి.

అమ్మ : నేనెంత సేపటికి ఏమి చెప్తానంటే అవతలవాడిలో ఏదయినా మంచితనం తీసుకుంటే సుఖపడతాం ఏదయిన అనుభవంలోకి రావాలి నాన్నా!

సోద : అనుభవం ఎట్లా జరుగుతుంది ?

అమ్మ : చెప్పటం చేతకావటం లేదు.

సోద : ఒకరికి ఎందుకు లొంగివుండాలి ?

అమ్మ : మనకు దేనిమీద స్వేచ్ఛ లేదు కనుక.

సోద : మనస్సు వినేటట్లుగా ఎందుకు లేదు ?

అమ్మ : ఆ ఆలోచన చాలు. నువ్వు, మనస్సు వేరు కాదుగా ఏదైతే అక్కరలేదను కుంటావో అదే జరుగుతున్నది. ఏ ప్రమేయం లేకుండా వాటంతట అవే ఆలోచనలు జరుగుతున్నాయి. మనకు ఏదయితే అర్థం కాకుండా జరుగుతుందో అదే దైవము అదే శక్తి.

46.. అమ్మా !

గుళ్ళ కంటే ఇళ్ళే బాగున్నై అన్నావే ! అప్పుడు
ఇళ్ళ కంటే, గుళ్ళే బాగున్నై అనిపించిందా నీకిప్పుడు ?
నీ శక్తి అనంతమైనా, పరిమితమైన నీ రూపం మాక్కావాలి
నీ దివ్య మంగళ విగ్రహం ఏదమ్మా మా యెదుట ?
మనోజ్ఞమైన నీ దరహాసమేది ?
మధురమైన నీ వాగ్ఝరు లేవి ?
పులకరింపచేసే నీ అమృత కరావలంబం ఏది ?
నీ మృదు మంజుల పాదస్పర్శ ఏదమ్మా ?
అడుగడుగునా నీవు పిల్చే పిలుపే దీనాడు ?
కొంత తడవు కన్పించకపోతే కబురుపంపే నీ ప్రేమేదీ ?
నీవు లేకపోతే నేనెట్లా ? అనే నీ మధురవాణి ఏదమ్మా ?
నీవెక్కడి కెళ్ళావని, ఎక్కడున్నావనీ ప్రశ్నించే
నీ అనురాగపు మందలింపు లేవీ యీనాడు ?
నీ కనుసన్నలలో నన్ను నడిపించే నీ కనులేవీ ?
నిశ్శబ్దంగా అడుగులేస్తూ వచ్చి, వెనుక నుంచుని
నన్ను గమనించే నీవు
అంతా శూన్యం చేసి, ఒంటరిగా వదిలి,
నీ దారిన నీవు గుడిదారి పట్టావే !
ఒంటరినై నేనెలా ఉండాలని ?
ఇన్నాళ్ళు నీతో నన్నుంచుకున్నావు.
ఇప్పుడు నాతో నువ్వుండాలి.
ఈ ఆరని చిచ్చులో నన్ను భస్మం చెయ్యవూ !

◆◆◆

47. ఆత్మ - వేద

అది ఒక శుభవేళ
ప్రశాంత ప్రభాత సమయం
సూర్యుడు నిన్ చూచి పరవశించు వేళ
నీదివ్యరోచిస్సులు దిక్కు లెల్లెడల్ గ్రమ్మ
నీ మృదు మధుర భాషణముల వీనుల విందు చేయ
రాయంచ నడకల నడయాడుచు
కన్నుల పండుగ సేసితీవు
నామేను మైమరచి పరవశించె
అదొక పుణ్యదినమ్ము
నా హృదియుప్పొంగి నీదయిన క్షణమ్ము
నీ కృపావీక్షణలో, వ్యాజానురాగ
పాశమ్ముతో నన్ను బందీని చేశావు
నామనసే హరించావు
ఆ క్షణం నుండే నా జీవితం ఒక
నూతనాధ్యాయంగా రూపుదిద్దబడింది
నీతో నా జీవనం ఆరంభమయింది
మార్గం మార్చావు, మలుపు తిప్పావు
ఇద్దరం కలిసి పయనం సాగించాం
సరదాగా కొంతకాలం గడిపాం
ఆ బాటలోనే
మరో వీధికెళ్ళాం, మరోవీధి కెళ్ళాం
రకరకాల మలుపుల్నే తిప్పావు
పలురకాల కథల్నీ గాథల్నీ చూపెట్టావు
మరోమలుపు తిప్పావు
హుషారుగా వున్నావు
ఈ సర్వం నేనే నన్నావ్
నేను నేనైన నేను అన్నావ్

నేను నీవైన నేను అన్నావ్
అన్ని నేనులు నేనైన నేను అన్నావు
నేను మినహా మరేం లేదన్నావ్
ప్రతి పలుకూ స్పష్టీకరించావ్
మరి కొంతదూరం నడిచాక
ఓ చిలిపి చూపుతో ఆగమన్న శాసనం నాకర్థం కాలేదు
బిత్తరచూపులతో నీవైపు చూశాయి నాకళ్ళు
ఏమిటలా చూస్తున్నావు
మరొక బాటకు వెళ్దామన్నానంతే నన్నావ్
మరోమలుపు తిప్పావు
నీవు ఒంటిగా నడవద్దు
నీ కొంటరితనం లేదు అని
నా కలలకు రూపం ఇచ్చావు
నా ఊహలకే జీవం పోశావు
నీ జంటగ నేనుంటానన్నావ్
నీకేలు నాకందించావు
నన్ను వదలనని హామీ ఇచ్చావు
నీ బాధ్యత నాదే నన్నావ్
నీ జీవితం నాదే నన్నావ్
నీవు నాకే నన్నావ్
నీవు నా సొంతం అన్నావ్
నీ సర్వం నేనే నన్నావ్
నీకు నేనున్నానన్నావ్
జగజ్జననీ నీవే, జగత్పితవూ, జగత్పతివీ,
జగదధినేతవూ అయిన నీవు
నా సొంతం నీవై, నాపెన్నిధి నీవై
నా అండదండ నీవయినావు
మరపురాని దాక్షణం మరుపులేనిదా వీక్షణం
ఆక్షణం అలాగే ఉండాలనిపించింది

కానీ కాలం ఆగదుగా మరి
మళ్ళీ నడకసాగించాం
ఈసారి మననడక ఓ విశాలమయిన వీధిలో
విశాలమయిన ప్రదేశాలు చూస్తూ సాగిపోయింది
మరో మలుపు తిప్పావు
ఆ బాటలో సందులూ, గొందులూ
ఇరుకువాకిళ్ళూ, కరకు లోగిళ్ళూ
మనిషదూర సందులేని ద్వారాలు
నిలువచోటు లేని ఇళ్ళూ రకరకాలు
ఇంకా, ఇంకా ఎన్నో ఎన్నో చూపెట్టావు
లోగడ వాటి తీరు వినటమే కాని
ఇప్పుడు వాటిని దృశ్యమానం చేశావు
మహా మహిమాన్వితమయిన నీ మహత్యాలు
నీ చరణాల ద్వారా - ఆచరణలోనే కనబర్చావు
మార్చావు మరోబాటకు - అచట కొంత విశ్రమిద్దామన్నావ్
ఆపై నీవో వీధిలో నేనో వీధిలో వుందామని
నన్ను మార్చావు మరో వీధిలోకి
కొన్నాళ్ళు ఒంటరిగా ఉండే అనుభవాన్నివ్వ దలిచావేమో
మరి నీ సంకల్పమేమిటో ?
నేను ఒంటరినై ఉండగలనా
ఒంటరిగా ఎలా వుండాలి ?
నా మనసు నీకు తెలియనిది కాదు
నన్ను నీవెరుగనిది లేదు
చెరొక వీధిలో - నివాస మెన్నాళ్ళో
ఎన్నెన్నో చూపించావు
నాకు చూపని మరో మజిలీ వున్నది
అది ఎన్నటికో మరెన్నటికో మరి.

17)

48. అదేమి మాయయో

అడుగుల సవ్వడి లేక
వడివడిగ నీవడుగిడు నడకల
వేగ మందు కొన జాల
రెవ్వరీ - భువిని ఆదేమి మాయయో!

అది అందరు గల చోటైనను
నీ మృదు మధుర మంజులవాణి
నీవేరికి విన్పింపగా తలతువో
వారికేగాని అన్యుల చెవి
చొరనీయ వదేమి మాయయో!
నీవెంత చెంతనున్నను
నిన్ గూర్చి ఎంత తపించిననూ
నీవు అన్న తరుణము రానిది
ఏరికీ కన్పింపగా తలపవు
అదేమి మాయయో!

గాఢనిద్రవోలె గుఱకలు పెట్టుచు
నిద్రించువేళ
అతి నిగూఢముగ భాషించు
సంభాషణల మా కెరుక సేతు
వదేమి మాయయో !

చెట్టు నీడ కొఱకు
చెట్టుదరి చేరి
చెట్టుకొమ్మల నరుకు
మూర్ఖుల - మందలింప వదేమి మాయయో!

49. నీ ప్రతి కదలికా

అమ్మా !
నీ మధుర మంజుల మనోజ్ఞవదనమే
మామది - వేదనల్ వెలికి త్రోయు.
నీకృపా కటాక్ష వీక్షణలే - మా హృది నిండుగా వెల్గులు నింపు
నీ ప్రశాంత పరమ పావన పాదసన్నిధియే
మాకు శాంతి గూర్చు
నీతోటి సాహచర్యమే మాకు శాస్త్రాల, పాఠాల మంత్రాల నేర్పు.
గాఢాంధకారాన నీ చల్లని పలుకులే
అమృత సోనలై చిల్కరించు
నీ సుందర చిరుదరహాసములే
మామది వెన్నెలలు కురియు

50. అమ్మా ! కారుణ్యరూపిణీ !

అమ్మా !
నీవు నన్ చూడ
గర్తపురికి వేంచేసినప్పుడు
నేను నా యింటికి రమ్మనగలనా ?
నేను అమ్మను పిలువగలనా ?
అమ్మను నా యింటికి పిల్చే సామర్థ్యం
నాలో లేదే నే నశక్తుడనే అని
చింతించు సోదరుని
గృహము పావన మొనర్చితివా శుభోదయవేళ
ప్రభాకరుడు నీకు స్వాగతము పల్క
నిన్ జూడ కాంక్షితుడయిన రవి
ఆ యింటిలోనికి తొంగి చూచె కొంతతడవు
నీ రాకకు వరుణుడు ఉప్పొంగి

ఆనందాశ్రువుల రాల్చె
సేవాకాంక్షితుడయిన వాయువు
మలయమారుతములు వీచె
అవసరమే - విలువయినదన్న నీ మహావాక్యాన్ని
ఆచరణాత్మకమైన నీ నడవడి నేమని చెప్పను;
నీవు దంత ధావనము చేస్తుండగా
నాలికబద్ద కొఱకు వెతుకున్న సోదరుడు పి.యస్.ఆర్.ని
చూసి అచటనే వంకెకు తగిలించిన చేటను
చూచి అందలి బద్దను అతనిచే తీయించుకుని
అవసరమును గడపితివి గదా! అది మాకు
ప్రత్యక్షానుభవం కొఱకే గదా !
వారింటిలో కాఫీ త్రాగి వారిని తృప్తి పరచి జిల్లెళ్ళమూడికి తిరుగు ముఖం
పట్టినావు కదమ్మా
కారుణ్యరూపిణీ ! కళ్యాణకారిణీ !

51. అమ్మా ! ఎందుకీ జాగు ?

అమ్మా !
నీవేం చేస్తున్నావమ్మా ?
నీ వెంట వుండాలనీ ఉంటుంది
నీ కంటపడాలనీ ఉంటుంది
నీకు కంటకంగా వుండాలని వుండదు
నీ వెంట వుండాలని వున్నా
నిన్ను తంటాలు పెట్టాలని మాత్రం కాదు
ఒంటిగా ఉండలేకనే
ఓ వైపు మనస్సు - మంటలతో
తంటాలు పడుతూ వుంటే
నీ కంటపడటం లేదా
నన్ను వెన్నంటి నీ వున్నా

నీవు ఎదురుగా కన్పించాలని వుంటుందమ్మా
నీ చెంత నన్ను నిలువ నీయక
చింతలో చిక్కించుట నీకు న్యాయమా ?
ఇది నీకు ధర్మమా ?
నిను దాటించుట నా ధర్మమని వాక్రుచ్చితివే
నీకూ మరి ధర్మం లేదా ?
నీ చెంతనే లేనని - నీకే చింతయును
ఆవంతయును లేదా ?
ఒంటరినై నేనెలా వుండగలను చెప్పు ?
ఈ గోళంలో వున్న - నా మనస్సు, శరీరమూ
గందరగోళంగా వున్నది
గిజ గిజ లాడుతూ గజిబిజిగా వున్నది
ఏం చెయ్యనమ్మా - నేనేం చెయ్యను ?
కన్నీటితో పాదాల నభిషేచనము చేసి
హృదయమే - పుష్పగుచ్ఛముగ పాదాలపై నిడి
విన్నపాల మాలనే - గళసీమ నలకంరింపచేసితే
ఎందులకీ జాగు - మరెందులకీ జాగు
నన్ను నీ చెంతకు చేర్చుకోవటానికి

52. నీలో లయమైన నేను

అమ్మా !
పందిట్లో - నీవె; పనులలో - నీవె
పరిగెలో - నీవె; పన్నీట - నీవె
అన్నిటను నీవయి; నిల్చిన నిన్ జూచి
ఒరిగిపోయాను నేను
ఓంకారరూపిగా నిన్గాంచి
ఓంకార నాదాలు ఆలయమందు విన్పించి
లయమయితి నందు.
పూవుగా - నీవయి; పురుగుగా - నీవయి

ఆకుగా - నీవయి; రెమ్మగా - నీవయి
తీవెగా - నీవయి; కాయగా - నీవయి
స్థంభాలు - నీవయి; కట్టడము -నీవయి
విశ్వమే - నీవుగా; విశ్వమంతట -నీవుగా
కన్పించి ఆనాడు
మేలుకొలిపావు నన్ను
భావములో - నీవె; భాషలో -నీవె
బాధలో - నీవె; బోధలో - నీవె
సాధనలో -నీవె; వేదనలో -నీవై
రోదనలో - నీవై
నిలచిన నిన్ జూచి
కరిగిపోయాను నేను.
కనులలో - నీవె; కలలలో -నీవె
కన్నీళ్ళలో - నీవె; కౌగిట్లో -నీవె
అన్నింట నిను జూచి - నేనుగా మిగలలేదే!

53. స్వామీ మాతృమూర్తివై వెలిశావు

స్వామీ! ప్రకృతి పురుషుడవు ఆద్యంతరహితుడవు
సర్వసృష్టిస్థితి లయ కారకుడవు జగదధినేతవు అయిన నీవు
మాతృప్రేమ కరువయి ఆప్యాయతానురాగాలే ఒరిగిపోయి
ప్రేమానుబంధాలే కరిగిపోయిన ఈ వసుధను
రూపరహితుడవయిననీవు రూపసహితుడవయి
గుణరహితుడవవు నీవు గుణసహితుడవయి
నామరహితుడవు నీవు నామసహితుడవయి
క్రియారహితుడవు నీరు క్రియాసహితుడవయి
ఈ విశ్వమందు విశ్వవిఖ్యాతినంద మాతృప్రేమ నందించ
మాతృమూర్తివై వెలసినావు.
నీ సన్నిధి ప్రేమానురాగాల నిలయం చేసి
సోదర సోదరీ ఆత్మీయతను అందించినావు.

54. అమ్మా!

అమ్మా !
ఒంటిచేసి మింటి కెగసిన నిన్నేమని యందును
నిదుర రాని నాకన్నులు, నీకై నిరీక్షించే ఈ కన్నులు,
నీకై వీక్షించే యీ కనుదోయి, కనురెప్పలు వాలనీయవదేమో
నామదిలో మెదిలే నీ తలపులతో
నా హృది తలుపులు మూతపడేవే !
మూడు దశాబ్దాల కాలం ముగింపుకొస్తోంది
మన భౌతికమైన వియోగం
అది మానసికంగా మహత్తర సంయోగం
తెల్లవారి నీ గురించిన వూహలతోనే
ప్రారంభం అనటానికీ లేదు దానికి తుది ఉంటేగా
అన్నిటా నువ్వు - అంతటా నువ్వే నిరంతరం నీ స్మరణే
నా గుండెలోతుల్లో మారుమ్రోగుతోంది
నువ్వు నాకందించిన అందిస్తున్న
అనుభూతులనే ధ్యాసగా అదే ధ్యానంగా
నా వూహలకే అందని రీతిలో నీతో పంచుకున్న అనుభూతులు
నాహృది గదిలో నిక్షిప్తమయినాయి
నామం అనే ఇటుకలతో హృదిలో
గుడికట్టమని ఉద్బోధించావు కదా
అదే నిజమయింది సత్యం
నాయెదలో ఆలయ నిర్మితమయింది
నీ రూపమే ప్రతిష్ఠితమైంది
పూజా సుమాలు లేని అర్చన
నియమ నిబంధనలు లేని అర్చన
ఆవేదన - నివేదన మనసే -హారతిగా మంత్రపుష్పంగా
వెలుగొందుతున్న దామూర్తి
నీ ఆలోచనల చుట్టూ పరిభ్రమించటమే
ప్రదక్షిణలు, షోడశోపచారాలును.

అమ్మతో వసుంధర పాల్గొన్న సన్నివేశాలు



అమ్మ జన్మదినోత్సవంలో వసుంధర–రామకృష్ణ



శ్రీమతి లక్కరాజు విజయశ్రీ బిడ్డను ఎత్తుకున్న వసుంధర



ఓంకార నదిలో ఓలలాడింపు



పూజారిగా అమ్మసన్నిధిలో.....

అమ్మతో వసుంధర పాల్గొన్న సన్నివేశాలు



అమ్మతో డా॥ కోన సత్యం, వసుంధర



డా॥ కోన సత్యనారాయణకు ప్రసాదం తినిపిస్తున్న అమ్మ



వసుంధర పెళ్ళిలో బువ్వపుబంతి



పెళ్ళి తరువాత గడపవద్ద పేర్లు చెప్పడం



శ్రీమతి పన్నాల కాత్యాయనితో వసుంధర



కోన సత్యం కూతురుకు ఆశీస్సులు ఇస్తూ..



అమ్మ పాదపూజలో వసుంధర



అమ్మవద్ద అర్చకత్వం చేస్తున్న వసుంధరక్కయ్య



రచయిత్రి

శ్రీమతి బ్రహ్మాండం వసుంధరాదేవి

జననం	:	1944 జనవరి 11
జననీ జనకులు	:	కీ.శే. కోన వెంకాయమ్మ
		కీ.శే. కోన వెంకట సుబ్బారావు

అమ్మ దివ్య దర్శనం ప్రప్రథమముగా 1958 ఫిబ్రవరి 1వ తేదీన, ఆరోజు నుంచి అమ్మ అంటే అమితమయిన భక్తి, అచంచల విశ్వాసం, అపార గౌరవం.

1962 నుంచీ అమ్మ సేవకు సంపూర్ణంగా అంకితం. అమ్మ కనుసన్నలలో అనురాగ జీవనం; అమ్మ సన్నిధే పరమావధిగా నిబద్ధజీవితం.

అమ్మయే సర్వస్వంగా విశ్వసించిన వసుంధర అక్కయ్యకు అమ్మ 1966 మే 5వ తేదీన మంగళసూత్రం కట్టి అర్ధాంగిగా స్వీకరించటం ఆమె జీవితంలో గొప్ప మలుపు; అది వాత్సల్యరూపిణి అమ్మ ప్రేమాభిమానాలతో తన దగ్గరకు పిలిచిన తీయని పిలుపు.

ఆనాటి నుంచి ఈనాటి వరకు అమ్మ చరణ సన్నిధిని విడవని పుణ్యచరిత; అమ్మ సూక్తులను త్రికరణశుద్ధిగా ఆచరణలో పెడుతున్న ఆదర్శ వనిత .. వసుంధర అక్కయ్య.